# మృదంగం

కొండేపూడి నిర్మల కావ్యం

---

కొండేపూడి నిర్మల

మరణించినా జీవించండి

సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ &
చారిటబుల్ ట్రస్ట్
2018

# మృదంగం

కొండేపూడి నిర్మల కావ్యం

(2006 - 2013)

రచన

కొండేపూడి నిర్మల

ముద్రణ : 2018

ప్రచురణ

**సావిత్రీబాయి ఫూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్**

విశాఖపట్నం

**ప్రతులకు :**

సావిత్రీబాయి ఫూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్

1-225, సుసర్ల కాలనీ, బాజీ జంక్షన్

గోపాలపట్నం, విశాఖపట్నం-530 027

ఫోను : 0891-2716225, సెల్ : 93938 13648

e-mail : spectsita@yahoo.com

**మరియు**

Kondepudi Nirmala

Cell : 9949303626

email : nirmalakondepudi@gmail.com

ఇతర పుస్తక విక్రయ కేంద్రాలు

Printed by Samata Impressions

వెల : రూ. 150/-

# సీతకు అంకితం

దేశమంతా మనది కాకపోవచ్చు, దేహమయినా మనది కాకుండా ఎలా పోతుంది? దేహమొక అద్భుత ప్రజాస్వామ్య వ్యవస్థ కదా/ ఒక్కసారే మూంచెయ్యదు చూడు, నియంత మాదిరి / మెదడు ఆగి, కోమాకు చేరుకున్న కొన్నాళ్లదాకా గుండె బతుకుతుంది / గుండె గడియారం ఆగిన వెంటనే తీసిన కిడ్నీలు, లివరు పనిచేస్తాయి / అన్నిటి చైతన్యమూ ఆగిపోయిన ఆరుగంటలవరకు / కంటి గర్భంలో కనుపాపలు కువ కువలాడతాయి.

ఇల్లు ఖాళీ చేసినప్పుడు ప్రేమగా పెంచుకున్న చెట్టు పాదులోంచి / ఒక మొలక తీసి కుండీలో పాతినట్టు / ఒక దేహం మూగబోయినప్పుడల్లా మనిషి మరొక గొంతులో పురివిప్పుకోవడం ఎంత బావుంటుంది / మట్టినుంచి మట్టికి ప్రయాణిస్తే ఏమొస్తుంది / మనిషి నుంచి మనిషికి ప్రయాణిస్తే / మృత్యువనే మాటకు అర్థమే మారుతుంది. ఏరు దాటిన బెస్త కూడా తెప్పను తగలబెట్టుకోడు కదా. మనదేహం ఆపాటి విలువ చెయ్యదా?

ఇది నేను **2014**లో రాసిన కవిత. దీన్ని ప్రత్యేకంగా అభిమానిస్తూ అనేక సందర్భాల్లో ప్రస్తావించారు గూడూరు సీతామహాలక్ష్మి. అసలు ఈ కవితకి స్ఫూర్తి తన ఉద్యమమే. మొదటి అడుగు ఎప్పుడూ ఒక్కరిదే అవుతుంది. ఆ ఒక్కరే ఒక సమూహమవుతుంది. సమూహం ఒక ప్రపంచమవుతుంది. అది చరిత్ర అనేకసార్లు నిరూపించింది. సీతా మహాలక్ష్మి అటువంటి చరిత్రని నిర్మించింది. అటువంటి మానవతావాదికి నా పుస్తకాన్ని అంకితం ఇవ్వడం కంటే సంతోషం ఇంకేముంటుంది.

కొండేపూడి నిర్మల

# ప్రచురణకర్త మాట

భారతదేశంలో మొట్టమొదటి సాంఘిక విప్లవకారుడు మహాత్మా జోతిరావు పూలే, సహధర్మచారిణి సావిత్రిబాయి పూలే. కులమతబేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి ఆమె. మానవహక్కుల వైతాళికురాలు ఆమె. మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న జన్మించింది. ఎనిమిదేళ్ళ వయసులో జోతిరావు పూలేకి భార్య అయింది. ఆయన ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలయింది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో, ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సాంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి, దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయసు 18 ఏళ్ళు మాత్రమే. ఆధిపత్య కులాల బెదిరింపులకు, ఒత్తిళ్లకు భయపడి జోతిరావు పూలే తండ్రి పూలే దంపతులను ఇంటి నుంచి వెళ్ళగొట్టారు. అయినా వారు తమ వ్యక్తిగత సుఖసౌఖ్యాలను పక్కనబెట్టి పీడితుల విముక్తికి, ప్రత్యామ్నాయ సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ నిర్మాణానికి జీవితాంతం అంకితమై అలుపెరుగని పోరాటం చేశారు. కులవ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కులకోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమిష్టిగా పోరాటం సలిపిన తీరు అమోఘం.

ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటిగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాలవారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించీ స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారతకోసం

ఈ సంస్థ కృషి చేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రీబాయి పూలే. ఆనాటి సాంఘిక దురాచారాలలో ఒకటైన బాల్య వివాహాల కారణంగా, వితంతువులైన మహిళలపట్ల, ఆనాటి సమాజం చాలా నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించేది. నిర్బంధ లైంగిక సంబంధాల వల్ల గర్భవతులయ్యే అమాయక యువతులను సాంఘిక బహిష్కరణకు, అవమానాలకు గురిచేసే హింసాత్మక ఛాందస సాంప్రదాయాలు కొనసాగుతుండేవి. విధిలేని పరిస్థితుల్లో ఎందరో వితంతువులు భ్రూణహత్యలకు పాల్పడి కష్టాలపాలయ్యేవారు. ఈ ప్రమాదాల నుంచి వితంతువులైన తల్లులను రక్షించేందుకు పూలే దంపతులు 1853లో ఒక శరణాలయాన్ని స్థాపించారు. విద్యావ్యాప్తితో పాటుగా ఈ బాధ్యతను కూడా భుజానవేసుకుని నిర్వహించారు. వితంతువులను శిరోముండనలు చేయమంటూ క్షురకుల చేత తిరుగుబాటు చేసేటట్టుగా చైతన్యపరచి 1860లో వారిచేత సమ్మె చేయించింది సావిత్రిబాయి పూలే. బ్రాహ్మణీయ శాసనాల ఆధిపత్యం నుంచి శూద్రులను, అతి శూద్రులను విముక్తి చెయ్యటం వాళ్ళకు మానవ హక్కుల చైతన్యాన్నిచ్చి, మానసిక, మతపరమైన బానిసత్వాల నుంచి స్వేచ్ఛ కల్పించటంకోసం 1873లో సత్యశోధక సమాజ్ స్థాపించారు పూలే దంపతులు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినపుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు.

సావిత్రిబాయి పూలే సంఘ సంస్కర్తగానే కాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లో తన కవితా సంపుటి "కావ్యపూలే" ప్రచురించింది. "పావన్ కాసి సుబోధ్ రత్నాకర్" అనే మరో కవితా సంపుటిని 1891లో ప్రచురించింది. స్త్రీ విముక్తికోసం, మానవ హక్కులకోసం కృషి చేసింది. ఆమె అడుగు జాడల్లో నడుస్తున్న మా సంస్థ అటువంటి విలువలకు అద్దంపట్టే రచనల్ని ఎంతగానో గౌరవిస్తుంది.

అందుకు ఈసారి కొండేపూడి నిర్మల కాలమ్స్ ఎంపిక చేసుకున్నాం. దీనికి కొన్ని ప్రత్యేక కారణాలు వున్నాయి. అవి ఏమిటంటే,

కథ, కవిత్వం, కాలమ్, జర్నలిజం రిపోర్టు - ఇలా ఏ ప్రక్రియ తీసుకున్నా ఒక ప్రత్యేక ముద్ర వేసే వ్యక్తిత్వం ఆమె రచనా శైలిలో కనిపిస్తుంది. దాదాపు మూడు దశాబ్దాల నుంచి ఆమె రచనల్ని చదువుతూ ఉత్తేజితులవుతున్న పాఠకుల స్పందనే ఇందుకు సాక్ష్యం.

ప్రింట్, ఎలక్ట్రానిక్, వెబ్ మీడియాల్లో సుదీర్ఘకాలం పనిచెయ్యడం వల్ల

అబ్బిన వస్తు విస్తృతి, వైవిధ్యం ఆమె రచనల్లో దొరుకుతుంది. నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి చిన్న సంఘటననూ సునిశితమైన దృష్టితో చూడ్డం, క్లిష్టమైన సిద్ధాంతాలని కూడా సులభశైలిలో రాయడం లాంటి లక్షణాల వల్ల పాఠకులకు చేరువయింది. వీటితోబాటు ఈమె చురుకైన హాస్య వ్యంగ్య ధోరణి కూడా ఆకర్షణీయంగా వుంటుంది. వ్యక్తిగతంగా ఆమెతో విభేదించేవారికి కూడా ఔను ఇది నిజమే కదా అనిపిస్తుంది. ఆలోచనల్లోనూ, వ్యక్తీకరణలోను స్ఫటికం లాంటి నిజాయితీ వుంటే తప్ప ఇది సాధ్యంకాదు. ఆరేళ్లపాటు భూమిక పత్రికలో అచ్చయిన ఈ కాలమ్స్‌లో ఒక మానవీయ కోణం వుంది. చైతన్య ప్రవాహముంది. ముఖ్యంగా ఒక కాలానికి అద్దంపట్టిన చరిత్ర వుంది. ఆ చరిత్రలో వున్న రాజకీయ, సామాజిక వాతావరణం వుంది. అది రికార్డు చెయ్యాల్సిన అవసరం వుందని మాకు అనిపించింది.

వ్యవస్థలో వున్న అవ్యవస్థని మార్చడానికి కార్యకర్తలుగా, సాహితీవేత్తలుగా కృషిచేస్తున్న వారందరూ మా దృష్టిలో సావిత్రిబాయి ఫూలేకు వారసులే. కాబట్టి నిర్మల కాలమ్స్ ముద్రించడం మాకెంతో సంతోషంగా వుంది.

ఇది అందరూ చదివి దాచుకోవాల్సిన పుస్తకం మాత్రమే కాదు, చర్చించి ఆలోచించాల్సిన పుస్తకం.

మీ

**గూడూరు సీతామహాలక్ష్మి**

ఛైర్‌పర్సన్

సావిత్రీబాయి ఫూలే ఎడ్యుకేషనల్
& చారిటబుల్ ట్రస్ట్

# ప్రియమైన పాఠకులకు..

కాలమ్ రాయడం అనేది నా వరకూ నాకు పీకలమీద కత్తి. ఈ కత్తిని నేను ప్రేమిస్తాను. ఇది లేకపోతే యిలా మీతో నిరంతర సంభాషణ చేయలేను. ఈ సంభాషణ నాకు చాలా సంతృప్తినిస్తుంది. మీ సూచనలు, విమర్శలు, వాదనలూ నా ఆలోచనల్ని పదునుపెట్టడానికి ఉపయోగపడ్డాయి. కాబట్టి ఉద్యోగ, సద్యోగ రీత్యా మాత్రమే కాకుండా ఉత్సాహం తో కూడా నేను పత్రికల్లో కాలమ్స్ రాయడానికి ఒప్పుకున్నాను.

నాకు తెలిసి కాలమ్స్ రెండు రకాలు. 1. పొలిటికల్ కాలమ్, 2. పర్సనల్ కాలమ్, మొదటిది వార్తాపత్రిక చదివినట్టే వుంటుంది. రెండోది చదివింపచేయడానికి చాలా అర్హతలుండాలి. జీవితంలో ఏదయినా సాధించిన వారు రాసినప్పుడు మాత్రమే అది సక్సెస్ అవుతుంది. ఆఫ్ కోర్స్ దేని ప్రయోజనం దానికుండచ్చు. నేను ఆ రెంటి జోలికీ పోలేదు. నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో మొదలుపెట్టి నాకున్న సామాజిక రాజకీయ సందేహాల్ని మీ ముందు పెట్టాను. అవగాహన పంచుకున్నాను. ఈ వ్యూహం బాగానే పనిచేసింది. వీటితో కనెక్ట్ అయిన పాఠకులే ఇందుకు రుజువు. ఇంత స్పందన వస్తుందని నేను ఎప్పుడూ వూహించనే లేదు.

కవిత్వం, కథలు ఒక ఎత్తు, కాలమ్స్ ఒక ఎత్తు. ఆ ప్రక్రియల్లో భావోద్వేగాలకి చోటుంది. కానీ కాలమ్‌లో ఆ సదుపాయం వుండదు. తీగమీద నడకలాంటి బ్యాలన్సు అవసరమవుతుంది. వేర్వేరు మానస్తత్వాల తో వున్న పాఠకులతో మాట్లాడుతున్నప్పుడు కనీసం వినేలా చెయ్యడానికి కావలసిన వాతావరణం తయారుచేసుకోవాలి. లేకపోతే పేజీ తిప్పేస్తారు. చదవల్సిన అవసరం వాళ్ళకి లేదు.

కాలమ్ రాయడం అనేది ముందు నాకు శ్రవ్య మాధ్యమంలో మొదలయింది. 1980 ప్రాంతాల్లో విజయవాడ ఆకాశవాణి వాళ్ళు హాస్యప్రధానమయిన ప్రసంగాలు రాయమని అడిగారు. హాస్యం అనే ట్యాగ్ పెట్టకండి. నాకు తోచినట్టు రాస్తాను. హాస్యం వుంటే వుంటుంది లేకపోతే నేనేం చెయ్యలేను. అని ముందుగానే చెప్పుకుని జాగ్రత్తపడ్డాను. "మ్యాచింగ్ అంటే మజాకానా, చదువు కొనండి, మైకాసురులు" అంటూ ఏది తోస్తే అది రాశాను. అవి నచ్చి మళ్ళీ ఇంకో కాంట్రాక్టు వేశారు. అలా

దాదాపు ఒక పది వరకూ ప్రసారం అయినట్టు గుర్తు.. తర్వాత 1992 లో ఉదయం ఆదివారం స్పెషల్ కోసం ''హాలీవుడ్ తారల చీకటి కోణాలు'' అని ఒక పేజీ నిడివిలో అనువాద కాలమ్ ప్రతి ఆదివారం వచ్చేలా రాయాల్సివచ్చింది. తర్జుమా నైపుణ్యం అంతంతమాత్రమే వున్న నాకు ఆ పాతకాలం బ్రిటిష్ ఇంగ్లీషు పుస్తకం చదివి, తెలుగులో రాయడానికి చాలా కష్ట పడ్డాను. ఆ కాలమ్స్ దాచుకునేంత గొప్పవిగా నాకేమీ అనిపించలేదు.

1999 నుంచి 2000 వరకూ ఆంధ్ర ప్రభలో రిపోర్టు ఓరియంటెడ్‌గా ''అనుభవం'' అనే కాలం రాశాను. అది నన్ను పాఠకుల దగ్గరకు చేర్చింది. తర్వాత సుప్రభాతం (పక్షపత్రిక ) లో పనిచేసిన అయిదేళ్ళ కాలంలో సంచికకి ఒకటి, రెండు చొప్పున వార్తా కథనాలు రాశాను. అవి అన్నీ జాగ్రత్త చేసుకోలేదు. పోయినవి పోగా, జీర్ణావస్థకు చేరుకున్నవి కొన్ని మాత్రమే వున్నాయి. నాకు బాగా సంతృప్తి ఇచ్చిన రాతలు ఏవయినా వుంటే అవే.

ఆ తర్వాత మా భూమి పత్రికలో పనిచేసినప్పుడు ''మట్టి మనిషి గుండె చప్పుడు'' అని అట్టడుగు మనుషుల కథనాలు వాళ్ళ స్వరంతో, మాడలీకంలో రాశాను. నాలుగు నెలల్లోనే పత్రిక మూతపడటంతో కాలమ్ కూడా గాలి కెగిరిపోయింది. ఈ రాతలన్నిటికి కలిపి 2001 లో రంగవల్లి స్మారక కమిటీ నుంచి బెస్ట్ జర్నలిస్ట్ అవార్డు అందుకోవడం నన్ను కాస్త తల ఎత్తుకునేలా చేసింది.

2006 నుంచి నిండా ఆరేళ్లపాటు భూమిక పత్రికలో మృదంగం కాలమ్ రాశాను. దానికి వచ్చిన స్పందన నన్ను గాలికెగరేసింది. అప్పటికి కాయితాలు పోయి కంప్యూటర్ వచ్చెయ్యడం వల్ల మెయిల్ లో నేను పంపినవన్నీ జాగ్రత్తగా బతికేవున్నాయి. ఇవి రాస్తున్న రోజుల్లోనే లాడ్లీ మీడియా 2011 నాటి బెస్ట్ జండర్ సెన్సిటివ్ కాలమ్ గా ''మృదంగం'' ఎంపికవడం బాగా సంబరపెట్టింది.

నా రాతల వల్ల సామాజికంగా ఎంత గుర్తింపు సంపాయించుకున్నా, కుటుంబ సంబంధాల్లో కొందరి ఆగ్రహానికి గురి కావాల్సివచ్చింది. ఎంత కాదనుకున్నా కొంత బాధపడిన మాట నిజం. ఇప్పుడు వీటిని పుస్తక రూపంలో తెస్తున్నప్పుడు పేజీ పరిమితుల రీత్యా కొంత ఎడిట్ చేయగలను కానీ ఒకసారి రాసిన రాతల్ని, ఆ రాతల్లో నా అనుభవాల్ని, ఆ అనుభవాల వెలుగులో నేను పెంచుకున్న స్పష్టతని ఎవరికోసమో డెలిట్ చేసుకోలేను కదా.

17.7.2015 - **కొండేపూడి నిర్మల**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | నాగరికతకి ఎంత దూరంలో వున్నాం? | 13 |
| 2. | వ్యాపార సృజనాత్మకత చేసే దుర్మార్గం చిన్నది కాదు | 15 |
| 3. | మీ హ్యాండ్ బ్యాగ్‌లో ఏం వుంది? | 18 |
| 4. | చక్రవర్తి గొప్పా? అతని ముక్కు మీద వాలిన ఈగ గొప్పదా? | 21 |
| 5. | నెత్తిన కురవబోయే వాన నీది కాదు | 25 |
| 6. | ఒక రియాలిటీ షో | 28 |
| 7. | నో మోర్ టియర్స్ | 31 |
| 8. | అభివృద్ధి పథకాల్లో భాషా చీకటి | 34 |
| 9. | శరీరంలో సగం చీకటేనా? | 36 |
| 10. | సాంస్కృతిక వికలాంగత | 38 |
| 11. | ప్రతిబింబాల్ని ద్వేషించే భావ దాస్యం | 40 |
| 12. | ఏడనున్నాడో ఎక్కడున్నాడో? | 42 |
| 13. | EMPTY CANVAS | 47 |
| 14. | ఈ దశాబ్దపు అబద్ధం | 49 |
| 15. | ఒక తులం స్పందన కావాలి | 52 |
| 16. | ఆడాళ్ళకో దేవుడు - మగాళ్లకో దేవుడు | 54 |
| 17. | ఉరి తీసుకున్న నటిమీద ఊరించే ఒక సినిమా | 56 |
| 18. | కాళ్ళను కళ్ళలో పెట్టి చూసుకోవాల్సిందే | 59 |
| 19. | కత్తిరించు.. అతికించు... ఇదే మన విజ్ఞానం | 61 |
| 20. | పిల్లలు వద్దు - సెల్‌ఫోన్ ముద్దు | 63 |
| 21. | ఆ దేశం నీకేమిచ్చింది | 67 |
| 22. | మన తల ఎవరి పాదాలమీద వుంది ? | 69 |
| 23. | కంట్లో కలికం పెట్టాల్సిందే! | 73 |
| 24. | మీ చిన్నారికి శత్రుస్పర్శ గుర్తుపట్టడం తెలుసా? | 77 |
| 25. | చెప్పిన కథలో చెప్పనిదేమిటి..? | 81 |
| 26. | సర్వంజిత్తు | 84 |
| 27. | ఎడారి ఓడ కథ | 86 |

| | | |
|---|---|---|
| 28. | రాచబాటమీద దొంగాటని దెబ్బకొట్టాలి | 88 |
| 29. | బాల్యవివాహాల్ని తలపించే మన పెళ్లి తంతు | 90 |
| 30. | గీటురాయికి అటూ ఇటూ | 93 |
| 31. | ఆరడుగుల చోటులేని ఆసియా ఖండంలో.. | 96 |
| 32. | కంటి తుడుపు ఖరీదు ఎంత? | 98 |
| 33. | భలే మంచి చౌక బేరమూ | 103 |
| 34. | మూడు కోతుల కథ | 106 |
| 35. | ప్రభుత్వ సేవలు - రాజకీయ బావలు | 108 |
| 36. | అబ్సెసివ్ ఎక్స్ సిండ్రోమ్ | 111 |
| 37. | కంచుమోగినట్టు కాకి రెట్ట ఇక మోగదా? | 113 |
| 38. | రాజుగారి బొటనవేలు | 115 |
| 39. | గాయం ఒకరిది, ప్రయోజనం ఇంకొరిది | 118 |
| 40. | ఇంటిపేరు రాజకీయం | 121 |
| 41. | రుగ్మతలు మహత్యాలవుతున్నపుడు.. | 126 |
| 42. | దేశంలో ప్రేమ కలక | 128 |
| 43. | ఈ సినిమా ఎన్ని రోజులు ఆడుతుందో? | 131 |
| 44. | పెయింటింగ్సే నా పిల్లలు | 133 |
| 45. | చర్చలకీ చర్యలకీ మధ్య అగాధంలో... | 135 |
| 46. | గాంధారి లోకంలో శ్రీలేఖ పోరాటం | 138 |
| 47. | పతాక సన్నివేశం | 141 |
| 48. | గిరిజనులకి మన నాగరికత అచ్చిరాలేదట | 143 |
| 49. | నా సంతోషం సొరకాయలో లేదు | 145 |
| 50. | నూరు శాతం విజయాల్లో నూటొక్క సందేహాలు | 147 |
| 51. | తాళ్ళు - తలవంపులూ | 149 |
| 52. | ఎడ్జస్టింగ్ మెంటాలిటీ | 151 |
| 53. | దేహాలు -దేవాలయాలు - కొన్ని సందేహాలు | 154 |
| 54. | మాటల్లో కనిపించని మీటలున్నాయి | 157 |

# నాగరికతకి ఎంత దూరంలో వున్నాం?

తుపాకి గుండు శరీరంలోకి దూసుకుపోయినప్పుడు అది వెంటనే తీసేస్తేనే ప్రాణం దక్కుతుంది. ప్రమాదవశాత్తూ కాలికో చేతికో దెబ్బతగిలి గాయం విషమిస్తే, ఆ భాగాన్ని కోతపెట్టడమే వైద్యం అవుతుంది. గర్భంలోనే విచ్ఛిన్నమయిన పిండాన్ని సురక్షితంగా తొలగించి, తల్లి ప్రాణాన్ని రక్షించడానికి ఒక దేశమూ, మతమూ, వైద్యమూ నిరాకరిస్తున్నాయంటే, అక్కడ మహిళలకున్న మానవహక్కుల పరిస్థితి ఏమిటి?

సవిత కేసు చదివాక నేనెంతో వేదనకి గురయ్యాను. వృత్తిరీత్యా ఐర్లండులో వుంటున్న భారతీయ దంత వైద్యురాలు. సవితాహలప్పనవార్ అక్టోబరు ఇరవై ఆరున తీవ్రమయిన వెన్నునొప్పితో గాల్ వే యూనివర్సిటీ ఆస్పత్రిలో చేరింది. అక్కడ ఆమెకు గర్భస్రావమయింది. అబార్షన్ చెయ్యడానికి తమ కేథలిక్ దేశం అనుమతించదని చెప్పి కడుపులో వున్న పిండానికి గుండె కొట్టుకోవడం నిలిచిపోయేవరకు చికిత్స చెయ్యడానికి నిరాకరించారు వైద్యులు. తాను భారతీయురాలినని, తనకు సహజంగానే గర్భస్రావం జరిగిందని, తనది ఐర్లండ్ కాని, కాథలిక్ మతం కాని కాదని ఆమె ఎంతగానో వేడుకుంది. ఎవరూ వినలేదు. మూడు రోజులపాటు నరకయాతన అనుభవింపచేసి, చివరకు పిండం మరణించిందనే నమ్మకం కలిగాక వైద్యులు చికిత్సకు పూనుకున్నారు. జరిగిన ఆలస్యానికి తిరుగులేని పరిహారంగా సవిత మరణించింది. సెప్టిసేమియాతో మరణించినట్టు డెత్ రిపోర్టు కూడా వచ్చింది. అదే దేశంలో వున్న ఆమె భర్త ప్రవీణ్ హలప్పనవార్, బెల్గాంలో వుంటున్న ఆమె తల్లిదండ్రులు ఐరిష్ చట్టాలపై ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. పదిహేడువారాల పిండంకోసం ముప్పయ్యేళ్ళ నిండు ప్రాణాన్ని పొట్టనపెట్టుకున్న ఆ దేశాన్ని ఇప్పుడు అన్ని వర్గాలూ తిట్టిపోస్తున్నాయి.

జరిగిన దారుణానికి గాల్ వే యూనివర్సిటీ గైనకాలజిస్టులు మాత్రమే నిందితులా? మానవత్వం కంటే మత నిబంధనలే ముఖ్యమైపోయిన దేశంలో అంతకంటే విచక్షణ ఆశించడమే వ్యర్థం. వార్త వెలుగులోకి వచ్చేశాక చట్టాన్ని సమర్థించుకోవడానికి మతపెద్దలు కానీ, ప్రభుత్వాలు కాని ఇప్పుడు ఏమని అంటున్నారు? తల్లి కనక మరీ ప్రాణాపాయ స్థితిలో వుంటే గర్భస్రావం చేయవచ్చుట! అప్పుడు అది తల్లికి వుండాల్సిన ప్రాణ రక్షణ హక్కు కాదు. ఒక ఉద్రిక్త చట్టానికి వున్న తాత్కాలిక సడలింపు మాత్రమే. వైద్యులు అలా నిర్ణయించలేకపోతే, రోగి ఎంతగా ఆక్రోశించినా వినరు. ఒకవేళ తల్లికి ప్రాణం పోదనుకుంటే ఆమె శారీరక

మానసిక ఆరోగ్యాలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు ఎంత ధ్వంసమయినా సరే మాట్లాడేందుకు లేదు. స్త్రీలకు సంబంధించిన ఏ చట్టాన్ని అయినా చూడండి. హక్కుల కంటే లోపాలే పటిష్టంగా అమలవుతాయి. ఐర్లండు దేశంలో ఎన్నో వేలమంది స్త్రీలు గర్భస్రావ హక్కుని చట్టబద్ధం చేయాలని కోరుతున్నారు. అయిదు ప్రభుత్వాలు మారినా అది జరగలేదు. పక్క దేశమైన ఇంగ్లండ్‌లో ఆ చట్టం అమలులోకి వచ్చి యాభై ఏళ్లయింది. చట్టాలు మారేవరకూ గర్భాలు ఆగవు కాబట్టి అర్ధశతాబ్ది కాలంనుంచీ స్త్రీలు ఐర్లండ్‌లో వచ్చిన గర్భాల్ని బ్రిటన్‌కెళ్ళి తొలగించుకుంటున్నారు. లేదా నిబంధనల కత్తికి తెగి నిస్సహాయంగా మరణిస్తున్నారు. ఇంకోలా చెప్పాలంటే బతకదల్చుకుంటే బ్రిటన్‌కి, చావదల్చుకుంటే ఐర్లండ్‌లోనూ వుండిపోతున్నారు.

ప్రతి గర్భానికి వాంఛనీయత, అవాంఛనీయత అనే రెండు దశలుంటాయి. ఏ దేశంలో అయినా అత్యాచారం జరక్కుండా ఆపే రక్షణ యంత్రాంగం లేదు. కానీ దాని ఫలితంగా వచ్చిన గర్భాల మీద మాత్రం అంతులేని నిఘా వుంది. శిక్ష వుంది, వెలివేత వుంది. పనికి రాని ఫ్యామిలీ ప్లానింగు విధానాల వల్ల గానీ, బాధ్యత తీసుకోదల్చుకోని దొంగ ప్రియుడి వల్ల గానీ, లేదా భర్తవల్ల గానీ గర్భాలు రావచ్చు. ఇక శాస్త్రీయ, అశాస్త్రీయ తొలగింపుకి కారణాలూ కోకొల్లలే వుంటాయి. కాన్పుకి సిద్ధంగా లేని అనారోగ్యవంతులు, జెనటిక్ వ్యాధులు రాగల అవకాశం వున్న వారు, భర్తల్ని కోల్పోయినవారు. ఇలా అనేకమంది ఈ కోవలోకి వస్తారు. కాగా కాన్పు అయ్యేంతవరకూ వున్న తొమ్మిది నెల్ల వ్యవధిలో ఎప్పుడయినా గర్భవిచ్ఛిత్తి జరిగిపోయే పరిస్థితి కొందరిలో వుంటుంది. కాబట్టే పిండాన్ని పుట్టేవరకూ శిశువు అనరాదనే వాదన కొందరు చేస్తారు. పుట్టిన తర్వాత కూడా కనీసం ఏడాది వరకు బాలారిష్టాలు వుంటాయి. ఈ సమస్యలు తల్లులకి తెలిసినంతగా, విజ్ఞులయిన మత పెద్దలకి తెలిసే అవకాశంలేదు. నిన్నటి పిండాలే నేటి శిశువులు. నేటి శిశువులే రేపటి భావి భారత పౌరులు. అనుకోవడానికి బానే వుంటుంది. అయితే ఆ గర్భాన్ని మోస్తున్న తల్లికిక ఎలాంటి హక్కులు వుండవా? ఆమె పిల్లల్ని కనే తోలుసంచీ మాత్రమేనా?

ఆ సంచీకి సూదులు గిచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయచ్చు. ఆ సంచీ తయారు చేసిన బొడ్డుతాడు లోంచి మూల కణాలు తీసుకోవచ్చు. ఆ సంచీని అద్దెకిచ్చి ఎన్ని దందాలయినా చెయ్యచ్చు. ఆ సంచీలో వున్న పిండం ఏ జెండరులో, ఏ చర్మపు రంగులో పుట్టాలో ప్రయోగాలు చెయ్యచ్చు. ఆ సంచీ కారణంగా ఉత్పత్తిఅయిన పాల కోసం బ్యాంకులు నడుపుకోవచ్చు. ఇవన్నీ అఖండమయిన సాంకేతిక విజ్ఞాన ఫలితాలే. స్త్రీలెవరూ సాంకేతికతని వ్యతిరేకించడం లేదు. ఆ ఫలితాలు, సౌకర్యాలు తమవి కూడా ఎందుకు కావడం లేదు అని వాపోతున్నారు.

(12.1.2012)

# వ్యాపార సృజనాత్మకతచేసే దుర్మార్గం చిన్నది కాదు!

ఈ నెల బెంగుళూరు కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన నార్త్ ఈస్టరన్ అండ్ సౌత్ పొయెట్రీ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి వెళ్ళినప్పుడు విన్న కవితల్లో ఒకటి నన్ను బాగా వెంటాడుతోంది. ప్రముఖ మళయాళ కవి. పి.ఎన్.గోపాల్ క్రిష్ణన్ అనుభవంలోంచి వచ్చిన కవిత అది. కొనుగోలు ప్రపంచం మీద తనకున్న నిరసనను చాలా బాగా వ్యక్తీకరించాడు. మన తెలుగులో కూడా ఈ తరహా కవితలకు తక్కువేమీ లేదు. అయితే నేను ఇప్పుడు రాయదల్చుకున్న దానికి ఆ కవిత ఒక మంచి కూర్పుగా అనిపించి దాని స్వేచ్ఛానువాద సారాంశాన్ని మీతో పంచుకున్నాక అసలు సంగతికి వస్తాను ''ఇడియట్'' అనే శీర్షికతో ఆ కవిత ఇలా మొదలయింది.

''నేనొక చవటని. జీవితం నా అభిరుచుల మేరకు నడుస్తుందనుకున్నాను కానీ మీటల మీద నడుస్తోంది కేవలం కొన్ని మీటలు - నాకే మాత్రం అలవాటు లేని, అభిరుచికి అందని, అంగీకారం లేని మీటలు అరవయ్యో పుట్టిన రోజున ఒక మిత్రుడు లాంటి శత్రువు మీటల డబ్బా నాకు బహూకరించాడు. ఏమిటిది? అని అడిగితే దాని పేరు 'సెల్లుఫోను'ట. ఆ రోజు అందరి చేతుల్లోనూ అవే వున్నాయి. నా చేతుల్లో ఇప్పుడు వేళ్లు లేవు. మీటల మాంత్రికురాలు వుంది. ఇక చూడండి తమాషా..

ఒకరిని పలకరిద్దామనుకుంటే ఇంకొకరికి పోతుంది. మెసేజీ చూసేలోగా ఇంకో నంబరు మోగుతుంది. తెల్లారుజాముకోసం అలారం అమర్చి పెడితే, అర్ధరాత్రి బల్లమీంచి జెర్రిపోతులా జరిగి భయపెడుతుంది. నోరు మూసుకొమ్మంటే గొంతెత్తి ఏదో కొనమని ప్రకటిస్తుంది. దాని చేతిలో నేను రోజు రోజుకి వాజమ్మని అవుతున్నాను. క్రమ క్రమగా అది నేను సాధించుకున్న విజయాలన్నింటి మీదా అసంతృప్త సంతకంలా మారింది. వేలేడంత లేని వెధవ మీటల డబ్బా ముందు నేనొక నిరక్షర కుక్షిగా మారిపోయను. బాగా ఆలోచించి ఒక రోజు ' ఏయ్ నిన్ను చంపుతా' అని, సమాచారం టైపు చేసి అది నాకు బహుకరించిన మిత్రుడికి పంపాను పకడ్బందీగా. అది మంత్రిగారి మీటల పెట్టెలో మెరిసింది. ఉన్న పళాన నన్ను ఈడ్చుకుంటూ జైలులో వేసి తొక్కారు. మానవ హక్కుల సంఘం నా నేరానికి సామాజిక నేపథ్యం కారణమంది. మానసిక నిపుణులు నా జబ్బుకి నోరు తిరగని పేరు ఏదో పెట్టారు. తీవ్ర వాద నిరోధక చట్టం నాకు ఉరిశిక్ష విధించింది. కుటుంబ సభ్యుల కన్నీటితో అది జీవితకాల శిక్షగా మారింది. రాళ్ళు కొట్టడానికి బదులు, మొక్కలు పెంచడానికి బదులు, వంటలు చెయ్యడానికి బదులు, నన్ను అదేపనిగా మీటలు నొక్కుతూ వుండమన్నారు. జీవిత కాలం మీటలు నొక్కే పనిలో నేను నా వేళ్ళను పోగొట్టుకున్నాను. ఎప్పుడు విడుదల అవుతానో తెలీదు. అగ్గిపెట్టెలో తనీగలా కుమిలిపోతున్నాను. నన్ను నేను తెరుచుకునే మీట ఎక్కడ వుందో మీరయినా చెబుతారేమోనని ఇటు వచ్చాను''

ఈ కవిత మీ కోసం రాస్తున్నప్పుడు మొన్న ఘంటసాల నిర్మల తన డ్రైవరుకి చేసిన ఫోను నాకూ, నేను నా భర్తకి పెట్టిన చివాట్లు వాళ్ళ మేనేజరుకీ చేరి సారీలు చెప్పుకోవడం గుర్తొస్తోంది. అంతే కాదు. వారం క్రితం, అమ్మ ఆస్పత్రిలో వుందని మా తమ్ముడు కొట్టిన మెసేజీ మొన్న చెన్నైలో ప్రత్యక్షమై, రోమింగులతో సహా బిల్లు పడ్డమేకాకుండా, నన్ను చాలా ఆందోళనకు గురి చెయ్యడమూ గుర్తొస్తోంది. ఇప్పటికీ నా ఫోను నాకు తెలియని నంబర్లకీ, రాయని మెసేజీలకి, ట్యూన్సుకీ బిల్లులు వేస్తూనే వుంది. మాట్లాడే సమయాన్ని (టాక్ టైమ్) నా కళ్ళ ముందే నంజుకు తింటోంది. చివరకి నేను అపరాధ రుసుము కట్టడంలోను, ప్రాయశ్చిత ఫలితాల్ని అనుభవించడంలోనూ కాకలు తీరిపోయాను. సరే ఇదంతా వినియోగ దారుల బాధ. ఇంత జరిగాక నా ఫోను అవతల పారేస్తానా అంటే ఆ పని చెయ్యను. వస్తు సమూహాన్ని ఇంట్లోను బుర్రలోనూ ఇరికించే పనికి చాలా ప్రేరకం కావాలి. బహుశా వస్తు మాయజాలాన్ని వ్యతిరేకిస్తున్న వారి కంటే బలమైన సృజనాత్మకత కొనిపించడానికి కావాలి.. ఎంత మాయజాలం లేకపోతే మీలాంటి నాలాంటి వాళ్ళం కూడా బుట్టలో పడగలం. చెప్పండి.. ఉదాహరణకు అన్ని రోడ్ల మీదా ఇప్పుడు వేలాడుతున్న ఒక

ప్రముఖ కంపెనీ హోర్డింగును మీరు చూసే వుంటారు. సెల్‌ఫోను సాయంతో విద్యాగంధం లేని ఆదివాసీ పిల్లలు కొండల్లో కోనల్లో కూ చుని, అయిదు నక్షత్రాల కాన్వెంటు పిల్లలతో సమానంగా ఇంగ్లీష్ రైమ్సు చదువుకుని కృతార్థులవుతారట? ఇంతకంటే మోస పూరిత ప్రకటన నేను పుట్టాక చూళ్ళేదు. బిగ్ బి కుమార రత్నం చిరునవ్వులో వున్నంత అందమయిన కుట్ర, కుశాలత ఆ ప్రకటనలోనూ వుంది. అది రాసిన, చిత్రీకరించిన, పంపిణీ చేసిన, ప్రేక్షకులై పోయిన మన అందరిలోనూ వుంది. అట్టడుగున వున్న వాడి జీవితమ్మీద ఇంతకంటే అపహాస్యం ఇంకోటి లేదు. పురిట్లోనే సంధి కొట్టిన ఆరోగ్యశ్రీ పథకంతోనో, పుచ్చు విత్తనాల పంపిణీతోనో, కడుతూ వుండగానే కూలిపోయిన వీధి బడి కట్టడం లాగోనో అంత తేలిగ్గా ఈ దుర్మార్గం అర్థం కాదు. ఏ మాత్రం గాంభీర్యం లేని సరదా సరదా వ్యాపార ప్రకటన అది. ఎంతో సామాజిక స్పృహ వున్నట్టనిపిస్తూ కళ్ళను కట్టి పడేసే ఆ సృజనాత్మకత గమ్యం ఏమిటో కూడా చూడండి. ఎలాగైనా మీటల డబ్బాని కొనుక్కోవాలనిపించే ప్రేరణ కలిగించే సృజనాత్మకత. కొనలేకపోతే దొంగతనానికైనా పురికొలిపే నేరమయ సృజనాత్మకత.. దొరికిపోతామనే భయంతో చూసిన సాక్షి పీక నొక్కాలనిపించే క్రూర భావనల సృజనాత్మకత.. వ్యాపార సృజనాత్మకత చేసే దుర్మార్గం చిన్నది కాదు. మన ఆలోచనల్లో, అభిరుచుల్లో, మాటల్లో, సరదా చేతల్లో, చివరికి హాస్యంలో ఎంత దుర్మార్గం వుంది. మనిషి ఏ వస్తువు కొనడంవల్ల నాగరికుడు అవుతాడో దాన్ని సాధించడం కోసం దేన్నయినా బలి చేస్తాడు. చేస్తున్నాడు. ఇందాకా కవిగారు అడిగినట్టు మనల్ని మనం పురి విప్పుకునే మీటల్ని కనిపెట్టాల్సిందే.

16.10.2008

# మీ హ్యాండ్ బ్యాగ్‌లో ఏం వుంది?

"నీ సెకండ్ స్కిన్ ఇదిగో"

కుర్చీలో వున్న నా హ్యాండ్ బ్యాగ్ తీసి అందిస్తూ అన్నాడు మా కజిన్.

"అంటే నేనేమైనా సర్పాన్నా, చర్మాలూ కుబుసాలు విడవడానికి?" అని నవ్వి, "అయినా, ఆ పేరు మీద పేటెంట్ హక్కులు నీకు లేవులే. ఎందుకంటే ఇప్పటికే ఒక షాపింగ్ కాంప్లెక్స్ వుంది" అన్నాను. అందరూ నవ్వారు.

"అసలు ఏదో ఒక కాంప్లెక్స్ వుండటం వల్లనే ఆడవాళ్ళు షాపింగులు చేస్తారు." ఇంకెవరో బాణం వేశారు. అప్పుడే బజారు నుంచి వచ్చిన వదినలిద్దరూ ఎర్రగా చూశారు. అందరూ కలిస్తే అంతే, వాక్బాణాల వర్షం వద్దన్నా కురుస్తూనే వుంటుంది.

పిన్నీ వాళ్ళింట్లో జరుగుతున్న ఒక ఫంక్షన్ కోసం నేనూ వచ్చాను. రాత్రి భోజనాలయిపోయాయి కనక హాల్లో వాల్చిన పరుపులమీద నడుంవాల్చి అందరి కబుర్లూ వింటున్నాను. ఫోన్ మోగిన చప్పుడు ఎక్కడిదా అని ఆలోచించేలోపల టేబుల్ మీదున్న నా బ్యాగ్ తీసి అందిస్తూ ఈ చలోక్తి విసిరాడు నా కజిన్ మోహన్. వెంటనే ఇద్దరు ముగ్గురు కిసుక్కున నవ్వారు కూడా.

"అవునూ ఎందుకే అంతబరువుంటుంది నీ బ్యాగ్," మా మేనత్త అడిగింది. అప్పటికే ఆవిడ ఒక రెండుసార్లు కుర్చీలోంచి అలమరలోకీ, అక్కడినుంచీ నా దగ్గరికీ దాన్ని మోసి మోసి వుందనుకుంటాను.

"ఆలోచనలమ్మా ఆలోచనలు రచయిత్రా మజాకా?" మా తమ్ముడు తన ధోరణిలో వెక్కిరించాడు. "అమ్మో, రాయకముందే అంత బరువుగా వుంటే మరి రాశాక చదివేవాళ్ళెలా మోస్తారే" మా చిన్న మేనత్త ఆశ్చర్యం.

లాభంలేదు వీళ్ల తిక్క కుదర్చడానికయినా నేను ఈ బ్యాగ్ దులిపి చూపించాలి అనుకున్నాను. వెంటనే బ్యాగ్‌కున్న మూడు జిప్పులూ తీసి అందరి మధ్యా బోర్లించాను. మొదట ఇంటి తాళం చెవి పడింది. ఆ తర్వాత జలుబు ముక్కు తుడుచువటానికి పెట్టుకున్న రుమాలు, ఐ డ్రాప్స్, ఇన్ హేలర్, టైలర్ బిల్లు, సెల్ ఫోను చిప్పు, రెఫరెన్సు కోసం దాచుకున్న ఒక వ్యాసం ముక్క, కొన్ని పదుల విజిటింగ్ కార్డులు,

కిందటిసారి వచ్చినప్పుడు పుట్టింటి పెరటి నుంచి పెల్లగించి తీసి మర్చిపోయిన మామిడి అల్లం ముక్క, లైబ్రరీలో ఇవ్వడం మర్చిపోయిన రెండు బరువయిన పుస్తకాలు, వచ్చే వారం వెళ్ళాల్సిన గరీభ్‌రథ్ రైల్వే రిజర్వేషను టిక్కెట్టు, విరసం వారి కరపత్రం, హ్యాండిల్ విరిగిపోయిన చిన్న అద్దం ముక్కా, కొన్ని పాస్‌పోర్టు ఫోటోలు, దూరాభారానికి రాసిన మూడు కొరియర్ కవర్లు, అడ్రస్ ప్రూఫ్ కాగితాలు, పాస్‌బుక్, సెల్ ఫోను, దాని కవరూ విడివిడిగా, అయిదారు క్యాప్ లేని పెన్నులు, అవి అన్నీ మొండికేస్తే పనికొస్తుందని దాచుకున్న ఒక పొట్టి పెన్సిలు ముక్కా. ఎప్పటిదో కానీ ఒక చిరిగిపోయిన సినిమా టిక్కెట్టు పీలికా, విశాఖ వెళ్ళినప్పుడు మురిపెంతో తెచ్చుకున్న కొన్ని శంఖాలు గవ్వలూ, ఇంకా ఇలా ఇల్లంతా పర్చుకున్న నా సెకండ్ స్కిన్ బరువుని మా వాళ్లంతా మూర్ఛపోయినట్టు చూశారు. అందులో ఏది ముఖ్యం? ఏది కాదు అంటే నేనసలు చెప్పలేను. అదేదో ఋణానుబంధం మాదిరి ఈ బరువుని నేను మోస్తూనే వుంటాను. ఆ తర్వాత నన్ను మానేసి మా అక్కకూతురు శ్రీలతని ర్యాగింగ్ చెయ్యడం మొదలుపెట్టారు. తను కాల్ సెంటర్లో పనిచేస్తోంది. కాబట్టి మ్యాకప్ సామగ్రి వుండచ్చు. శానిటరీ ప్యాడ్స్ వుండచ్చు. ఇంకేవో వుండచ్చు. ఎంత అడిగినా బ్యాగ్ తీసి చూపించలేదు. దటీజ్ నన్ ఆఫ్ యువర్ బిజినెస్ అట. గట్టిగానే చెప్పింది. నా కంటే నయమే. మన షాపింగులమీదా, పక్కింటి వాళ్ళతో చెప్పిన కబుర్లమీదా, హ్యాండ్ బ్యాగ్‌లమీదా పడి కొన్ని దశాబ్దాల పాతకులు, పగలబడి నవ్వుకున్నారు. (లోపల్లోపల ఏడ్చుకున్నారు.) మగాళ్ల జేబుల మీదా, జిప్పుల మీదా మనమెప్పుడూ అంత అనుచితంగా మాట్లాడుకోలేదు. ఇంతకీ ఎవరి సెకండ్ స్కిన్ అయినా వారి జీవన సరళిని సూచిస్తుంది. వారికి కావలసిన, భరించాల్సిన ప్రపంచాన్ని మూటకడుతుంది. ఒకవేళ నేను మెకానిక్‌ని అయితే ఇందాకా గుమ్మరించిన వస్తువులకు బదులు సుత్తీ శానా వుండేవి. వంటలక్కని అయితే బూందీ, కారప్పూసలు దూసే గరిటెలు వుండేవి. చాలామంది ఆడవాళ్ల భుజాల నొప్పికి ఈ బ్యాగులే ప్రధాన కారణమంటున్నారు డాక్టర్లు. కాని ఇల్లు మారినప్పుడల్లా అత్యంత ముఖ్యమనుకున్న ఇంటిల్లిపాది వస్తువులూ చేరిపోయేది ఇంటావిడ మోసే బ్యాగ్‌లోకే.

చాల్రోజుల క్రితం హిందూలోనో ఎక్కడో ఒక వ్యాసం చదివాను. లేడీస్ హ్యాండ్ బ్యాగుల్లో ప్రస్తుతం గన్స్ చోటు చేసుకుంటున్నాయట. ఇది అభివృద్ధా? అరాచకమా? అనే డిబేట్ కూడా జరిగింది. రైతు బజార్‌లో వొంగుని కూరగాయలు కొనుక్కుంటున్న ఆడవాళ్లని సెల్ ఫోనులో ఫోటోలు తీసే వాళ్ళున్నప్పుడు, ఆత్మరక్షణ కోసం ఒక రివాల్వర్ కావాలనిపించడంలో తప్పు వుందా? మగవాడ్ని తాగించి, ఆడదాన్ని ఆమె పిల్లల్నీ ఏడిపించడం ద్వారానే రెవెన్యూ సంపాయించుకోవాల్సిన దిక్కుమాలిన

ప్రభుత్వాలకు ఓటు వేస్తున్న, వెయ్యడమే మానేస్తున్న మనకి ఆయుధం ఆసరా కాదా? అది అరాచకమెలా అవుతుంది? ఈ మాటే అంటున్నారు జాతీయ తుపాకీ హక్కుల సంస్థ అధ్యక్షురాలు రాహుల్ రాయ్. ఆమె చెప్పినదాన్ని బట్టి స్త్రీలకే కాదు వృద్ధులకూ ఈ లైసెన్సు వుండాలి. ఎందుకంటే ఒంటరి తల్లిదండ్రుల్ని ఆస్తికోసం నిస్సిగ్గుగా హత్యలు చేస్తున్న సంతానాన్ని వార్తలుగా మాత్రమే చూస్తున్నాం.

“మేం వార్తలు కాదల్చుకోలేదు మాకు పరిష్కారం కావాలి” అని నినదిస్తున్నారు బొంబేలోని సీనియర్ సిటిజన్ ఫోరమ్ సభ్యులు.

ఈ దేశంలో ఒంటరి మహిళలు, పిల్లలు, వృద్ధులు ఎక్కువ అభద్రతల మధ్య బతుకుతున్నారని ఆ వ్యాసం చెబుతోంది. అందులో చెప్పని విషయమేమిటంటే ఒంటరి మహిళలే కాదు. నిండు కుటుంబాల్లో గృహహింసకు గురవుతున్న మహిళలున్నారు. ఆడవాళ్లని గురించి విమర్శించడానికి వారి వస్త్రధారణా, పబ్బు కల్చరూ జోడిస్తూ వుంటారు కానీ, వాటికున్న సామాజిక, చట్టబద్ధతని ప్రశ్నించడమేలేదు. అసోంలో పదహారేళ్ల పిల్లమీద నిన్న మొన్న జరిగిన దాడి ఆమె స్నేహితురాలి పుట్టినరోజున పబ్బుకి వెళ్ళినందుకే జరిగిందా? కాలేజీ నుంచి గాని, మందు షాపుకి గాని వెళ్ళి వస్తుంటే జరగదా? పబ్బులలో స్త్రీలకు ప్రవేశం లేదు అని బోర్డు ఏమీ పెట్టలేదే, పైగా జంటగానే రావాలని సంస్థాపరమయిన నిబంధన కూడా వుంది. జంటగా వచ్చిన యువతీ యువకులు వినాయక వ్రతకల్పం చదువుకోవడానికి వెళ్లరు కదా. అక్కడ అమర్చిన సౌఖ్యాలు అనుభవించడానికే వెళతారు. ఒక రాజ్యాంగానికీ, చట్టానికీ లేని విజ్ఞత యువతులకి మాత్రమే వుండాలని శాసించగలమా? వారి హ్యాండ్ బ్యాగ్గుల్లోనో, రూమ్సులోనో కండోమ్స్ వున్నందుకు పట్టుకుని కొడతారా? దుపట్టాలు లాగి వీడియోకి మొహాలు చూపిస్తారా? ఈ దేశాన్ని, సమాజాన్నీ ఏది శాశిస్తోంది. చట్టమేనా? ఛ. కాదేమో.. ఆయుధాలు అమాయకులమీద నిరంతరమూ చెలరేగుతూనే వున్నాయి? సెక్యూరిటీ మొత్తం గూండా ఎమ్మెల్యేలకో, నాయకులకో సరిపోతోంది, మా ధన మాన ప్రాణాల్ని రక్షించుకోవడానికి ఆయుధం కావాలి లైసెన్సు ఇప్పించండి” అని ఇవాళ సగటు స్త్రీ అడుగుతోంది. ఆయుధాలు దుర్వినియోగమవుతాయనే భయం ఎంత తొందరగా అందరిలోనూ వ్యక్తమవుతోందో చూశారా? రాజ్యమే తోలు బొమ్మలా వున్నప్పుడు, మన భుజాల మీదున్న తోలు సంచుల్లో ఏ ఆసరా దాచుకుని తిరుగుదాం? మన వేళ్ళు ఈ మురికి విలువల మీద ట్రిగ్గర్ గురిపెట్టాలనుకుంటే లైసెన్సు ఇవ్వరా?

3.10.2012

# చక్రవర్తి గొప్పా? అతని ముక్కుమీద వాలిన ఈగ గొప్పదా?

అనసూయ అని, కాలేజీలో నాకో క్లాస్‌మేట్ వుండేది. పరిచయానికి ఎక్కువగానూ, స్నేహానికి తక్కువగానూ మసలుకునేవాళ్లమని చెప్పుకోవచ్చు. ఇంటర్మీడియట్ రెండేళ్ళూ ఇద్దరం కలిసిఎన్నో మైళ్ళు ప్రయాణం చేశాం. పొరబాట్న కూడా మా అభిప్రాయాలు కలిసేవి కాదు.

"ఎదురు తిరిగితే చెడ్డ పేరొస్తుంది. ఆడవాళ్ళు ఎదురు తిరక్కూడదు" లాంటి విలువలు చెబుతూ వుండేది.

సిలబస్ పూర్తి చెయ్యకుండా పరీక్షలు ప్రకటించినప్పుడు అందరం గొడవచేసి బైటికి వచ్చేసి, చివరికి సున్నాలు తెచ్చుకుంటే తను, బుద్ధిగా గైడు బట్టీకొట్టేసి శభాష్ అనిపించుకుంది.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. తన దస్తూరి అచ్చుప్రింటులా భలే బావుంటుంది. క్లాసులో లెక్చరర్ పాఠం చెబుతుంటే టైపు మిషన్ మాదిరి టకటక రన్నింగు నోట్స్ దింపేసి, ఏ ప్రశ్న వేసినా ఠక్కున జవాబు చెప్పేది.

అదిగో ఆ నోట్సుల కోసమే తనతో నేను మాట్లాడేదాన్ని.

తను కూడా నాతో మాట్లాడేది. ఎందుకంటే కాలేజీకి వాళ్ళింటికి మధ్య మా

ఇల్లు వుండేది. ఆటోలో వెళ్ళే నేను తనకు రోజూ లిఫ్ట్ ఇచ్చేదాన్ని. స్కూటరు మీద సగందూరం వాళ్ల అన్నయ్య దింపెయ్యగానే, మిగతాదూరానికి బస్ కోసం నుంచోకుండా ఈ ఏర్పాటు తనకీ సదుపాయంగా వుండేది. ఇది కేవలం మా అవసరాల కోసం కుదుర్చుకున్న ఒడంబడిక. స్నేహం అనెయ్యడానికి లేదు. వివాదస్పద విషయాలు మాట్లాడుకుంటే ఇద్దరి ప్రయోజనాలు దెబ్బతింటాయి కనక, నిర్వివాద అంశాలు మాట్లాడుకునేవాళ్ళం. అవి ఎలా వుండేవంటే,

"ఇవాళ ఎండ ఎక్కువగా వుంది కదూ."

"మన విజయవాడలో కృష్ణానది వుంది కదూ."

"ఆదివారం తర్వాత సోమవారమే వస్తోంది కదా"

"ఇవాళ కూడా ఆకాశం నీలంగానే వుంది సుమీ.."

"ఈ ఏడాది హాలిడేస్ అన్నీ ఆదివారాల్లో పడ్డాయి చూశావా" అని మాట్లాడుకునేవాళ్ళం.

ఇవి ఇద్దరం అంగీకరించే సార్వత్రిక సత్యాలే కాబట్టి మొహం తిప్పుకోవడానికి, మూతి విరుచుకోవడానికీ ఏమీ లేదు. ప్రయాణం పొడుగూతా వూరికే మరీ శిలావిగ్రహాల్లా కూచోలేక ఏదో అలా గాలి పోగుచేసుకునేవాళ్ళం. ఈ గంటా ఇలా గడిస్తే చాలు అనుకునేట్టు వుండేవాళ్ళం. తర్వాత ఎవరి స్నేహాలు వారికుండేవి.

ఇంతకూ అప్పటి అనసూయ ఇన్నేళ్లకి మళ్ళీ మొన్న నూటపదమూడో నెంబరు డీలక్స్ బస్‌లో కలిసింది.

హాయ్ అంటే, ఓయ్ అనుకుని ఇద్దరం ఎదురెదురుగా కూచున్నాం.

ఏం పనిచేస్తున్నావు, ఎక్కడ వున్నావు, ఎవర్ని కట్టుకున్నావు? లాంటివి పరస్పరం తెలుసుకున్నాక, "పిల్లలెంతమంది" ప్రశ్నించింది.

"ముగ్గురు" అన్నాను.

"ఆడా? మగా?" అడిగింది

ఇద్దరు ఆడ, ఒక మగ చెప్పాను.

"నాకిద్దరూ బోయిస్సే.." అంది అమెరికన్ ఇంగ్లీషు యాసలో. ఆ మాట ఎంత బాగా అందంటే, తను చదివిన కాలేజీలోనే వైస్ ప్రిన్సిపాల్ పోస్టు వచ్చిన దానికంటే గొప్పగా అన్నది.

ముగ్గురు అన్నలు వున్నందుకుగాను, నలుగురు చెల్లెళ్ళు వున్న నాకంటే గొప్పదైపోయినట్టు చిన్నప్పుడూ ఇలాగే ఫోజు కొట్టేది. అయితే ఇప్పటికీ మనిషి

మారలేదన్న మాట అనుకుని చిన్నగా నవ్వుతూ.

"సోశ్యాడ్" అన్నాను.

"ఎందుకు" అంది గంభీరంగా.

"ఆడపిల్లలు లేరంటున్నావు కదా అందుకు.." జవాబు చెప్పాను.

"ఔను ఇద్దరూ ప్లస్సులే" అంది. (దవడ పగలకొట్టాలనిపించింది.)

కాస్సేపటి తర్వాత పుంజుకుని, తన కొడుకులిద్దరు ఎంత హ్యాండ్సంగా వుంటారో, ఎంతో గొప్ప చదువులు చదివి ఇంకెంత గొప్ప పదవుల్లో వున్నారో చెప్పి పూరించే ప్రయత్నం చేసింది.

నేను వూరిపోదల్చుకోలేదు. పైగా ఇంకేవో గొప్పలు వెతుక్కుని చెప్పుకున్నాను.

"పెళ్ళిళ్ళయ్యాయా?" అంది. నా పిల్లల్ని ఉద్దేశించి.

"లేదు చూడాలి." అన్నాను.

"మా పిల్లలకి తెగ వస్తున్నాయబ్బా, జవాబులు చెప్పలేక చస్తున్నాననుకో" అంది. (ఇది మాత్రం అబద్ధమే అయ్యుండాలి. ఇప్పటి పెళ్ళిళ్ళ మార్కెట్ గురించి తెల్సినవాళ్ళెవరూ ఈ మాట చెప్పలేరు.)

"నా పిల్లలకి అస్సలు రావడం లేదు. వాళ్ళే రానివ్వడం లేదు తిరగ్గొడుతున్నారు. ఇంటికెవరైనా వచ్చి అడిగినా కొట్టేలా వున్నారు? చెప్పాను.

అనసూయ అర్థంకానట్టు చూసింది. నాకు మాత్రం అర్థం అయిందా ఏమిటీ? ఎందుకో తిక్కగా మాట్లాడాలనిపించింది మాట్లాడాను.. తన స్టేజి వచ్చినట్టు వుంది. బస్సు దిగడానికి లేచింది.

"ఆడపిల్లలు లేని లోటు నీకు ఎప్పుడూ అనిపించలేదా, అయితే" నేను వదలదల్చుకోలేదు. ఇంకా ఏదో అనెయ్యాలని వుంది.

జీళ్ళపాకం మాదిరి ఆ విషయం దగ్గరే ఆగిపోయిందేమిటా అన్నట్టు నన్ను చూసి, తెల్లబోయి,

"లోటు ఏముంది, కోడళ్ళు వస్తారు కదుటోయ్" అంది. చాలా పెద్దరికంగా ఆ మాటలో నేను వూహించినంత బంపర్ డ్రా, లాట్రీ టిక్కెట్టు ఏమీ లేదు. (అయితే పెళ్ళిళ్ళ మార్కెట్ తెలిసే వుంటుందన్నమాట.)

పెళ్ళికెదిగిన అబ్బాయిలు కిటకిటలాడుతున్నారు గాని అమ్మాయిలు దొరకడంలేదట, మా బంధువుల్లో చాలామంది చెబుతున్నారు. బహుశా ఈ అనసూయ కూడా స్కానింగులో అబ్బాయి అని తెలుసుకున్న తర్వాత అప్పుడు మెల్లిగా

కనివుంటుంది. దేశం సర్వ నాశనం అయిపోవడానికి తనవంతు పాత్ర తను నిర్వహించింది. ఆ మాటకొస్తే, ఇప్పుడు కోడళ్ళ వేటలో మ్యారేజీ బ్యూరోల చుట్టూ తిరిగే ఎందరు తల్లిదండ్రులు ఆడశిశువుల్ని పుట్టకుండా ఆపెయ్యలేదు? గుండెమీద చెయ్యి వేసుకుని ఆలోచించండి.

కోటికి పైగా ఒక నగర జనాభాతో పోల్చదగినంతమంది ఆడపిల్లల్ని చేతులారా చంపుకున్న పరమ వికారమైన చేతులు మనవి. మన పాపానికి నిష్కృతి లేదు.

అయినా ఇంకా దృక్పథం మారలేదు చూశారా. మగపిల్లవాడు పుడితే గుండు కొట్టించుకుంటామని ఇంకా మొక్కుతూనే వున్నారు. అనసూయతో నాకు స్నేహం ఎందుకు కుదరలేదో ఇప్పుడు అర్థమయింది. స్నేహం కొన్ని విలువలకీ, అభిరుచులకీ సంబంధించిన విషయమని నేను నమ్ముతాను.

ఎన్ని ప్రయోజనాలున్నాగానీ, తల్లిని నడిరోడ్డు మీద వదిలిన కొడుకుతో గాని, కోడల్ని సతాయించే అత్తతో గాని, భార్యని అనుమానించే భర్తతో గాని మనం స్నేహంగా వుండగలమా? పోనీ బంధువులుగా చెప్పుకోగలమా? కుడిభుజంగానో, ఎడమ కాలుగానో వుండగలమా. అలా వుండి మళ్ళీ సిద్ధాంతం గురించి మాట్లాడగలమా? సిద్ధాంత స్పృహ వుండి కూడా శివుడి విబూదిని యాంటీరింకిల్ క్రీం మాదిరిగా మొహానికేసి రుద్దుకోగలమా? ఇది భావ దరిద్రం కాదా?

అక్బరు చక్రవర్తి గొప్పవాడా? అతని ముక్కుమీద వాలిన ఈగ గొప్పదా? అని మా సోషలు మాస్టారు ఒక పజిల్ ఇచ్చాడు బాల్యంలో. సహజంగా చక్రవర్తి గొప్పవాడని అందరం మూక ఉమ్మడిగా అరిచేవాళ్లం. అతను ఈ క్షణాన అరేబియా సముద్రంమీద, మరుక్షణాన పెంటదిబ్బ మీద వాలలేడు కదా మరి, అని ఈగ గొప్పదనాన్ని చెప్పి, మాలో సందేహాలు రేపి అప్పుడు చెప్పేవాడు. బలహీనులు చవకగా ఎటయినా చెదిరిపోతారు. బలవంతులు స్థిరంగా ఆలోచిస్తారు. చక్రవర్తికీ ఈగకీ వున్న తేడా అదే. ఈగ అడుగుజాడల్లో చక్రవర్తి నడవడం అనేది ఎంతైనా హాస్యాస్పదం.. అని తేల్చేవాడు. ఆ పిచ్చి పంతులు ఎప్పుడో మట్టిలో కలిసిపోయాడు. కానీ మీ శిష్యురాలికి ఆ పాఠం ఇంకా గుర్తు వుంది మాస్టారూ! భుజంమీద చొక్కా చిరుగు కనబడకుండా కప్పుకున్న మీ కండువా మీద వొట్టు!

2.9.2010

# నెత్తిన కురవబోయే వాన నీది కాదు

హజ్ యాత్ర నిమిత్తం ముస్లిం భక్తుల కోసం ప్రతి ఏటా ఇస్తున్న సబ్సిడీల్ని ఇక ప్రజా ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని సుప్రీంకోర్టు ఈ రోజు ఒక ప్రకటన చేసింది. పనిలో పనిగా హిందూ దేవుళ్ళకు, బాబాలకు చేయించే బంగారు హంసతూలికా తల్పాలకీ, క్షీరాభిషేకాలకీ కేటాయించిన ధనాన్ని నగరంలో పేరుకున్న మురికిని, చెత్తను, మలేరియా దోమల్నీ నిర్మూలించడానికి వాడినట్టయితే, పౌరులు ముక్కునిండా గాలిపీల్చుకుని, బతికే హక్కుని కల కంటారు.

ఆర్టికల్ ఏభై ఒకటి ఎ ప్రకారం పౌరులందరూ శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి. అందుకు మన విద్య, వైద్యం, న్యాయమూ, రాజ్యమూ సహకరించాలి. విషాదం ఏమిటంటే ఈ దేశంలో మూఢనమ్మకమే ఒక వ్యాపారమూ, రాజకీయమూ, దిక్కూ దివాణమూ అయిపోయాయి.. కావాలంటే మూఢ నమ్మకాన్ని కూడా సైన్సు సాయంతోనే నడిపిస్తున్నవారు వున్నారు. సైన్సు అంటేనే నిరూపణకు సిద్ధంగా వున్నదని అర్థం. మూఢనమ్మకాన్ని నమ్మించడం ఒక బలప్రయోగమే. ఎమోషనల్ బ్లాక్ మెయిల్‌కు తరచూ జనాలు లొంగిపోతారు. ప్రభుత్వమే స్వయంగా నిరూపణ కాని భ్రమల కోసం ప్రజాధనం వినియోగించడం నేరం.

ఇప్పుడు చూడండి. క్రీస్తు పూర్వం జరిగిన యాగాల్లో సైన్సు వున్నదని అది మానవాళికి పనికొస్తుందని నంబూద్రి పండితులొచ్చి, భద్రాచలంలోని ఎడపాక గ్రామంలో అతిరాత్రపు హోమం చేసివెళ్ళారు. దీనిగురించి సామాన్యులకి చాలా గందరగోళం వుంది. సాధారణంగా అపరాత్రి పూజలు దేవతలకు కాక దెయ్యాలకు బాగా వర్తిస్తాయని నానుడి. ఈ యాగం కూడా రాత్రిపూటే చెయ్యాలట. కలియుగంలోకి అడుగుపెట్టాక దీన్ని కేరళలో తప్ప ఇంకెక్కడా జరపలేదట. కాబట్టి అక్కడ సిద్ధించిన విశ్వశాంతి, మానవాళి కళ్యాణంతో బాటు వానలు కురిపించడమే ప్రధాన ధ్యేయంగా ఈ యాగం ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది. నిత్యమూ నీటిమీద తేలియాడే కేరళ భౌగోళిక పరిస్థితులు వేరు, అన్ని ఋతువుల్లోనూ నిప్పులు కురిసే భద్రాచలం వాతావరణ పరిస్థితి వేరు. అసలే పిట్టలు రాలిపోయే ఏప్రిల్, మే నెల ఎండల్లో పన్నెండు ఎకరాల మేర దగ్ధ మండలానికి గాను ఈ నేల ఎంపిక చేసుకోవడం వెనక ఏ రాజకీయం వుందో తెలీదు. విశ్వశాంతి కోరుతున్నట్టు చెప్పబడుతున్న ఈ క్రతువు స్థానిక ప్రజల్ని ఎన్ని ఇబ్బందులు పెట్టిందో పట్టించుకునే వాళ్ళెవరూ లేరు. అరలీటరు పాల ప్యాకెట్టు అయిదు వందల రూపాయలకు దొరికిందంటే అక్కడ చెలరేగిన వ్యాపారాత్మని అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు ఆ పన్నెండు రోజుల యజ్ఞం కుమ్మరించిన వేడి సెగలకి, టూరిజం రద్దీకి పిల్లా, తల్లీ, గొడ్డు, గోదా, వాగు వంకా ఎలా సలసల కాగిపోయాయో, ఆస్పత్రుల్లో వున్న రోగులు, వుయ్యాల్లో పసికందులు ఎలా తట్టుకున్నారో ఊహించలేరు. ప్రచార ప్రసార సాధనాలకు కూడా ఉత్సవాలే తప్ప పరిణామ వాస్తవాలు పట్టవు. అట్టడుగు మనిషి బతకడానికి చిన్న బడ్డీకొట్టు పెట్టుకోవాలంటే సవాలక్ష పర్మిషన్లు అడగాల్సినచోట, టన్నుల కొద్దీ ఆవు నేతిని, సోమరసాన్ని (?) కుమ్మరించి, ఇలాంటి మహా మంటలు పెట్టడానికి అక్కడి పౌరుల పర్మిషన్ ఎవరూ అడగరు. అసలు ఇవి ఎవరితో చెప్పుకోవాలో తెలీదు. ప్రపంచ ప్రథమ పౌరుడితోనా? అతను అక్కడే కుటుంబంతో సహా యాగ క్రతువులో వుంటాడు. పోలీసులా? వాళ్ళంతా హోమానికి కాపలాగా వుంటారు. వైద్యులా? న్యాయవాదులా? శాస్త్రజ్ఞులా.. వాళ్ళంతా ఆ పొగలోనే వున్నారు. ఈ రాజ్యాంగంలో ఏ దేవుడి వెంటా, దెయ్యం వెంటా పడనివాడు పరమ పామర పౌరుడే. అతనెప్పుడూ ఒంటరివాడే. కాబట్టి పామరుడ్ని అడిగి పండితులు యాగాలు, రాజులు యుద్ధాలు, మంత్రులు పన్నులు విధించరు. అవి నెత్తిమీదికొచ్చి నప్పుడే భరించాలని తెలుస్తుంది అంతే. ఈ మధ్య ఎవరో అన్నట్టు ప్రభుత్వ లాంఛనాలతో ప్రతిఏటా పెళ్ళి చేసుకుని కలుకుతున్న భద్రాద్రిరాముడు బాజాల ఖర్చుకి సరిపోను నాలుగు దుక్కుల వాన అయినా కురిపించలేక పోయాడు కాని, నాలుగువేల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతతో

పన్నెండోరోజున యాగ వేదికని దగ్ధం చేశాక అప్పుడు ఉద్భవించిన ఆధ్యాత్మిక శక్తితో పాడి పంటలు విలసిల్లుతాయట? ఇది మబ్బుల్లో వున్న నీళ్ళ కోసం ముంత వొలకబోసుకోవడం లాంటిది కూడా కాదు, అంతకంటే పెద్ద పరాజయం. వానలు కురవడానికి ఎలాంటి పర్యావరణ రక్షణ వుండాలో మట్టిలో పుట్టి గిట్టే పేద రైతుకి తెలుసు. గుళ్ళో పూజారికేం తెలుసు? ఏసీలో దొరలకు ఏం తెలుసు?ఇంకా చెప్పాలంటే జంతుబలి జరిగే వుంటుందని నమ్మకంతో ధ్వజ స్థంభంపైన గిరికీలు కొట్టే గరుడ పక్షికి తెలుసు. స్పాన్సరు చేసిన అమెరికన్ రాక్ ఫిల్లర్ సంస్థకు తెలుసు. అవును ఇది మల్టీ నేషనల్ మహా దగ్ధయాగం. లేదా గ్లోబల్ అగ్ని గుండం. ఈ భూమి వివాదంలో వుందని కూడా ఒక భోగట్టా. భూమి నుంచి ఆకాశం దాకా ముసురుకున్న కర్బనపు పొగల మధ్య ఏ పుణ్య పురుషులు ప్రత్యక్షమయి ఏమిచ్చి వెళ్ళారో కనబడలేదు. కేరళలో ఒరిగినదేమిటో అక్కడివాళ్ళే చెబుతారు. అవినీతి అసలు తొలగలేదనీ వివేకపు వెన్నెల కురవడంలేదని వున్నదున్నట్టు చెప్పారో చచ్చామన్న మాటే. జరిగిన యాగంలో అపశృతి దొర్లిందని, ఇంకోసారి మళ్ళీ మొదలు పెడతారు. ముందు నుయ్యి వెనక గొయ్యి!

ఇంకో భయం కూడా నాకుంది. ఇప్పటివరకు సత్యసాయి, తిరుపతి తదితర హుండీల్లో బంగారు కిరీటాలూ, వజ్రాల హారాలూ వేసే అజ్ఞాత భక్తులందరూ, రేపటినుంచీ నల్లడబ్బు తెల్లబరచుకోవడానికి గాను, సరదాగా ఎవరి గల్లీలో వారు మినీయాగాలూ, మనీయాగాలూ మొదలుపెడతారు. ప్రభుత్వ దీవెనలు ఎలాగూ వుంటాయి. అప్పుడు కురిసే ఆ వానచుక్కల్ని "వాన చుక్కలు" అనరాదు. అవి ఆ గ్రామానికి వర్తించవు. అంటే పేటెంట్ హక్కు మారిపోతుందన్నమాట. ఇప్పుడు ఎడపాకలో కురిసిన వానకి సోమవర్షం అని పేరు పెట్టలేదూ అలాగే అప్పారావు గారి వాన చుక్కలు, సుబ్బారావు గారి వానచుక్కలు అనాలి. వంట చెరుకు మండబెట్టి మబ్బుల్ని లాక్కొచ్చింది వాళ్ళే కదా మరి. అప్పుడే ఏమయింది.? త్వరలో కృష్ణా జిల్లాలోని విజయవాడలో వేయిపిడకలు కాల్చి చెయ్యబోయే యాగ క్రతువులోంచి ఆ పట్టణాన్ని రక్షించడానికి కావలసిన అక్షయ పాత్ర అందుకుంటారట. వూరు వదలి ఎక్కడికి పారిపోతే బావుంటుందో సలహా అడుగుతూ నిన్న ఒక స్నేహితుడు ఫోన్ చేశాడు.

5.4.2012

# ఒక రియాలిటీ షో

నిన్నగాక మొన్న, మామూలైన అలవరసలలో విద్యుత్ ప్రసారం ఆగిపోయిన వేళ, టివీ తెరనుంచో, కంప్యూటర్ తెరనుంచో ఠపామని జారిపడి, ఎవరి అపార్టుమెంటల్ తలుపు వారు తీసి, కారిడార్లో కమ్ముకుంటున్న పొగల మధ్యగా నలుగుతున్న మసక వెన్నెల్లో మొహాలు విప్పదీసుకున్నప్పుడు, పక్కింటి త్రీనాట్‌ఫోర్ ఆంటీ నా దగ్గర బాధపడింది. తన మనవరాలు సునీతకి ఫిఫ్త్ క్లాసు చదువుతున్నాగానీ, తెలుగు అసలే రావడం లేదని ముఖ్యంగా వేమన, సుమతీ, దాశరథి పద్యాలు బాగా మిస్సవుతోందని వాపోయింది. మర్నాటినుంచే నా వంతు ప్రయత్నం నేను చెయ్యడం కోసం తెలుగు పేపరులో కొన్ని పదాలు రాయించడం చేశాను. చందమామ తీసి బహుమతిగా ఇవ్వడం కోసం, పుస్తకాల అర వెతుకుతుంటే రోజువారీ దినపత్రికలోనే ఒక పద్యం కనిపించింది. అది సుమతీ శతక కారుడి పద్యం. రోజుకొకటి చొప్పున, నిజంగా నేర్చుకుంటే, ఏడాదికి మూడు వందల యాభై పద్యాలు నోటికొచ్చేస్తాయి. తస్సాదియ్యా మనకింకేం తక్కువ? అని వాళ్ళని ప్రోత్సహించి, రాగయుక్తంగా చదవడానికి గొంతు సరిచేసుకున్నాను. తీరా చదివాక బుర్ర తిరిగిపోయింది. అదేమిటి మొహం అలా పెట్టావు? అని అడుగుతున్నట్టుగా అందరూ నావంకే చూస్తున్నారు.

"ఆలి మాటలు విని యన్నదమ్ముల బాసి వేరు పోవువాడు వెర్రివాడు, కుక్కతోక బట్టి గోదావరీదునా విశ్వదాభిరామ వినురవేమ" ఈ పద్యం నేర్పడం కంటే అర్జెంటుగా ఆ పిల్లలని మళ్ళీ కంప్యూటరు గేమ్స్ ముందు కూచోపెట్టడమే నయమని నాకు అనిపించింది. అజ్ఞానానికి క్షమించాలి. వేమన గారంటే నాకున్న గౌరవం తక్కువది కాదు. అతని గురించి విమర్శించే దుస్సాహసం చెయ్యాలనీ లేదు. కానీ అది ఎక్కుపెట్టిన బాణం ఒక జాతిని కించపరుస్తోంది. ఇటువంటిదే ఇంకో పద్యం మరొక ప్రముఖ పత్రిక నిర్వహించే పిల్లల పేజీలో ప్రచురించారని, వివేకి అయిన భర్త, భార్యతో వాదించడం ఎంత బుద్ధిహీనత గల పనో వివరణతో వుందని నా ఫ్రెండు పి. సత్యవతి చెప్పింది. అ పద్యం చదివి వినిపించిన టూ జీరో ఒన్ అంకుల్ని పట్టుకుని వాళ్లవిడ తనకొచ్చిన మూడు భాషల్లోనూ తిట్టి, చివరికి టీ కూడా ఇవ్వకుండా తను ఒక్కత్తే కలుపుకుని తాగేసిందట. ఆ విషయం ఆయనే మా దగ్గర వాపోయాడు. "పోన్లెండి. టీ కప్పులో తుఫాను అనుకుందాం" అంటూ మా ఆయన, ఆవిడ ఆయన్ని ఓదార్చాడు.

మహాకవి, తాత్త్విక యోగి అయిన వేమనగారికి ఆడవాళ్ళంటే అంత లోకువ ఎందుకో ఒక్క పిసరు కూడా నాకు అర్థం కాలేదు. లేకపోతే ఆయన కూడా టూ జీరోఒన్ అంకుల్ మాదిరి తమాషాగానే అన్నాడా? అసలు ఆ కవి ఆ పద్యం రాసిన కాలం నాటి ఆడవాళ్ళ చైతన్యం ఎలాంటిది? బాల్య వివాహాలతో, సతీ సహగమనాలతో, బాలింత మరణాలతో కన్ను మూస్తున్న అభాగ్య జీవులే కదా. మరి అటువంటి భార్య ఎవర్ని విడదీసిందో, తన కుక్క తోకతో ఎవరిని ఎక్కడికి తీసుకుపోయిందో నాకు తెలీడం లేదు. మహాకవి యోగి వేమనగారికి ఉమ్మడి కుటుంబాలంటే వున్న ఇష్టం మాత్రం అందులో కనిపిస్తోంది. అందులో పదో శాతమైనా నాకూ వుంది. పొత్తులో కనబడే మానవ సంబంధాలూ తెలుసు. కనబడని హింసా, పరాధీనతా తెలుసు. అన్ని కాలాల్లోను కొత్త తరమే ఎదురు తిరిగింది. పాత తరం చాలా వరకూ సమర్థించడానికి చూసింది. ఇప్పుడిప్పుడు పరస్పరం ఒకే ఒడంబడికలో వున్నట్టు సొంతంగా బతకడమే నయమనుకునే దశకు వచ్చేశారు కూడా..ఇది కాలానుగుణమైన మార్పు. ఒక వస్తువు పోయినప్పుడల్లా పనివాళ్లమీదికి తోసేసినంత అన్యాయంగా, అందరి అనౌచిత్యాలకీ కోడల్ని బాధ్యురాల్ని చేస్తుంది లోకం. లోకం అంటే బైట ఎక్కడో లేదు. ఇంట్లో వున్న వాళ్ళనీ అదే పేరుతో పిలవాలి. నా కళ్ళకి చిన్నప్పటినుంచీ ఇప్పటిదాకా అన్నీ వదులుకుని అత్తింటికి అంకితమైపోయే ఆడవాళ్ళే ఎందుకని కనబడుతున్నారు? అమ్మని గురించి చెప్పనా, పిన్ని గురించి చెప్పనా, పక్కింటి అత్తమ్మని గురించి చెప్పనా? ఆరళ్ళని గురించి కలవరించి పోవడమే తప్ప

బాల్య స్మృతులు తలుచుకోవడానికైనా సమయం దక్కించుకోలేని పిచ్చి తల్లులు మీ కళ్ళకి కనబడ్డంలేదా? చావు కబురు పుట్టింటికి చెప్పకుండా పూడ్చి పెట్టిన అత్తింటివాళ్ళను చూడ్డంలేదా? ఎటువంటి కేసులు లేకుండా లాలూచీ అవుతున్న వాళ్ళను చూడ్డంలేదా.. 498-ఎకి ఎసరు పెడుతున్నవాళ్ళనీ చూడ్డంలేదా? వాస్తవానికి భిన్నంగా ఆడవాళ్ళను గురించి అన్ని చమత్కారాలు ఎలా ఆడతారు? అది గుండే? చెరువా? అలిగిన ప్రతి మగవాడూ ఆలిని పుట్టింటికి దూరం చేస్తుంటే ఎవరూ మాట్లాడరు. అభద్రతతో కొట్టుకుంటున్న ప్రతి భర్తా, భార్యకు శీలమే లేదనుకోడాన్ని గురించి ఎవరూ పట్టించుకోరు. ఇటువంటి హింస నుంచి ఉమ్మడి కుటుంబాలూ, ఒంటరి కుటుంబాలూ కూడా రక్షించలేవు కదా. మళ్ళీ అదే ఇళ్ళలో కొడుకుల్ని ఎన్నేళ్ళొచ్చినా గానీ, తల్లి దండ్రులు,అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ అతన్ని పెంచుతూనే వుంటారు. అదనంగా భార్య కూడా వాడిని బాలకృష్ణుడి మాదిరి పెంచడానికే వస్తుంది. ఇందరి గారాబంలో బాగు పడితే సంబరం పడటానికి, చెడిపోతే తూర్పుకి తిరిగి దణ్ణం పెట్టి, దైవ సహాయంతో రిపేరు చేసుకోవడానికి ముందుకొస్తుంది.

అయ్యా! అన్నవస్త్రాలు తృణప్రాయమని భావించిన తాత్త్విక వేత్తా, మహా యోగి వేమన సాబ్, మీరు చెప్పిందే నిజం. ఆలి మాట విని యన్నదమ్ముల బాసి వేరు పోవువాడు వెర్రివాడేనేమో, అయితే అమ్మ కడుపులో వుండగానే అమ్మతో సహా అందరూ పరాయి వాళ్ళనుకోవాల్సిన భావదాస్యానికి బీజం ఎవరు వేశారు సార్., పరమ పాతివ్రత్యం అంటే ఇదే కదా సార్. మీరు మాట్లాడేవి నీతులు, మేం మాట్లాడేవి కుక్క తోకలు. ఇంతేకదా సార్. మా అపార్టుమెంటులో టూ జీరో ఒన్ అంకుల్ చెప్పిందీ అదేనట సార్. అందుకే అన్ని చివాట్లు తిని, టీ చుక్కకి కూడా నోచుకోలేక వాపోయాడు సార్.

2.2.2010

# నో మోర్ టియర్స్

తిరువూరు నుంచి హైదరాబాదు సొంత ఇంటికి వచ్చేశాను. కాఫీ డికాషన్ కోసం నీళ్ల గిన్నె పెట్టి స్టవ్ వెలిగిస్తే బర్నర్స్ ఎర్రగా మండుతున్నాయి. రిపేరు మనిషికోసం కంపెనీకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లాభం లేకపోయింది..చివరికి విసుగొచ్చి నేనే బయల్దేరా.. దూరంగా కూరగాయల మండీ కనిపిస్తోంది.. మండీ కున్న గట్టు మీద చతికిలపడి మోకాళ్ళు నిమురుకుని, మళ్ళీ బరువైన సంచులు మోసుకుంటూ పోతోందొకావిడ.

ఒకవైపుకి వొంగినట్టనిపించే ఆ గూనినడకా, గాలికెగిరే పోనీటెయిలూ, మాపుకి తట్టుకునే ముదురు నీలం చీరా.. ఎవరబ్బా అనుకుని కాస్సేపు ఆలోచించాక గుర్తొచ్చింది. ఆవిడ రమణమ్మ కదూ.. చూసి ఆరేళ్ళయింది. ఏమీ మారలేదు. ఆఖరి కూతురి పెళ్ళికి రమ్మని కార్డు వేసింది చాలారోజులక్రితం. అమెరికా వెళ్ళిపోయిందన్నారు కదా? ఇక్కడే వుందేమిటి? అర్థం కాలేదు.

"రమణమ్మా" పిలిచాను. వినిపించలేదు. నా అరుపు నాకే అనాగరికంగా వినిపించింది. అక్కడున్న మేడల మీంచి నాలుగైదు తలకాయలు తొంగిచూశాయి. వెంటనే గ్యాస్ కంపెనీలోకి దూరిపోయాను. రిపేరు మనిషి వచ్చి గ్యాస్ స్టవ్ బాగుచేసి వెళ్ళాక వంట చేసి అదే సాయంత్రం రమణమ్మ ఇంటికెళ్లా. ఆమె చెప్పిన విషయాలతో మనసు బరువెక్కింది. సమాజంలోని అనేక దగాపడ్డ అమ్మతనాలకు రమణమ్మ ఒక ప్రతినిధి. తండ్రీ కొడుకుల మధ్య నడిచే రాజకీయం తెలుసు. తల్లీ కూతుళ్ల మధ్య వున్న పరాయి తనాల మీద ఎప్పుడూ చర్చ జరగలేదు. ఇద్దరినీ విడదీసి

మోపిన రెండు కుటుంబాల పరువు వొత్తిడి గురించి, అంతస్తు గురించి, వాటిని జీర్ణించుకోవడం కోసం పెంచుకున్న స్వార్థం గురించి మనం ఎప్పుడూ బాధపడలేదు. రమణమ్మ మీకు తెలీదు. మా ఇంటికి ఆమడ దూరంలో రెండు గదుల రేకులింట్లో వుండేది. ముగ్గురాడ పిల్లలు. భర్త మరణించాడో, వదిలేశాడో సరిగా తెలీదు.. జరుగుబాటు కోసం చిన్న క్లాసు పిల్లలకు ట్యూషన్లు చెప్పేది. మిషను కుట్టేది. పచ్చళ్ళు చేసి షాపులకి ఇచ్చేది. ఎప్పుడు చూసినా పని, పని, పని.... కాస్త మంచి చీర కట్టుకుని రికామీగా వున్న రమణమ్మని మా పేటలో ఎవరూ చూసి వుండరు.

"పిల్లలు ముగ్గురినీ పెద్ద ఇంటికి ఇవ్వాలనే" దే ఆమె ధ్యేయం. కాబట్టి వాళ్ళ సరదాలు పట్టించు కునేదికాదు. పుట్టిన్రోజులూ, పండగలూ కూడా జరిపేది కాదు. ఆ సమయంలో ఇంకెవరింట్లోనో వంట చెయ్యడానికి వెళ్ళిపోతుండేది. తండ్రి నుంచి వచ్చిన నాస్తిక నేపథ్యం ఒక కారణమైతే పేదరికంలోంచి వచ్చిన తాపత్రయం ఇంకా పెద్ద కారణం. కొబ్బరినూనె, కుంకుడు కాయల ఖర్చు తగ్గించడం కోసం పిల్లలు ముగ్గురికీ క్రాఫింగు చేయించినప్పుడు "అయ్యో పాపం.. ఎంత చక్కటి జడలో కదా, శుక్రవారం పూటా అలాంటి పని ఎవ రైనా చేస్తారా చీచీ.." అన్నారంతా. పెద్ద కూతురు తనతో చెప్పకుండా ఫ్రెండ్సుతో కలిసి సినిమాకి వెళ్ళినందుకు తిండి లేకుండా రోజంతా ఎండలో నుంచోపెట్టింది.

.. ఆ పిల్ల కళ్ళు తిరిగి పడిపోవడంతో నువ్వూ ఒక తల్లివేనా అని ఆడిపోసుకున్నారు.

హిట్లరు- అని పేరు పెట్టారు. రమణమ్మ సిగ్గుపడింది. పరువు దక్కడం కోసం వాయిదాల మీద ఒక టివి కొనిపడేసింది. దాంతో.. సినిమాలు ఇంట్లోకి వచ్చిపడ్డాయి.

తను కుట్టినవే కాక బజారులో అమ్మిన రెడీమేడ్ చుడీదార్లు కొనిపెట్టింది. చిట్టీలు మానకుండా అన్నీ అమర్చి అందర్నీ సంబర పెట్టడానికి ఎన్ని రాత్రులు నిద్ర కాచి కళ్ళలో సూదులు గుచ్చుకుని పనిచేసిందో మనకి అనవసరం. చీమ గంగా యాత్ర మాదిరి పైసా పైసా పోగుచేసింది. పచ్చళ్ళతో పాటు ఒక కర్రీ పాయింటు సెంటరుకి పర్మినెంటు ఉద్యోగి అయింది. మొత్తానికి అనుకున్న స్థాయిలో సంబంధాలు కుదిర్చి పెళ్లిళ్ళు కూడా చేసింది. తనకంటే ఒక మెట్టు పై నున్న అల్లుళ్ల హంగు కోసం ఇల్లు కూడా మారింది. ఈ మధ్యనే ఆఖరు కూతురు తన రెండో కాన్పుకోసం అమెరికా పిలిపించుకుంటే ఆకాశం కేసి ఎగిరింది. కుట్టు మిషనుమీద కూరుకు పోయిన రమణమ్మకి ఇది కొత్త అనుభవం. ఇంకేముంది. అక్కడే సెటిలవుతుంది అనుకున్నారంతా. అసలు కష్టాలు అక్కడే మొదలయ్యాయి.

కూతురింట్లో వాషింగ్ రూంలో ముడుచుకుని పడుకోవడానికేమీ అనిపించలేదు. చివరికి అది కూడా తన ఇంటి కంటే బావుందనుకుంది.

కూతురికి తల్లిని చూడగానే చిన్నప్పటి అసంతృప్తులు గుర్తొచ్చాయి. కొత్తగా పెరిగిన హోదా ముందు తల్లి చాలా అనాగరికంగా అనిపించింది. రమణమ్మ వంటలు, అలవాట్లు, కడుతున్న చీరలు, మాటతీరు,, అన్నీ అత్తగారి ముందు దిగదుడుపు అనిపించాయి. తల్లి అంటే అత్తగారిలా మెత్తగా నాగరికంగా, పిల్లలు ఏది అడిగినా కాదనకుండా అమర్చే నిరంతర ప్రేమికురాలిగా వుండాలనుకుంది. ఆ అత్తాకోడళ్ళ హితబోధల మధ్య రమణమ్మ ఏమీ చాత కానిదయిపోయింది. కనీసం అప్పుడే పుట్టిన పసిగుడ్డు మొహం చూసి అన్నీమర్చిపోదామన్నా కుదరలేదు. వాళ్ళు అలా మర్చిపోనివ్వలేదు.

‘‘నువు ముట్టుకోకు ‘‘అన్నారు. నీకు పిల్లల్ని పెంచడం రాదన్నారు. నీ పిల్లల్ని పెంచినట్టు కాదన్నారు. నలభై ఏళ్ళుగా రమణమ్మ పడిన శ్రమని గడ్డిపోచలా తీసిపారేసి సంప్రదాయం తెలీదన్నారు. ఒక్కపిల్లకీ సమర్త బంతి పెట్ట లేదన్నారు. నగలు చీరలు కొనలేదన్నారు. పూజలూ, వంటలు నేర్పలేదన్నారు. డబ్బు మనిషివన్నారు. తల్లి ప్రేమలేదన్నారు.

చివరి మాటలు వింటుంటే నాక్కూడా కళ్ళమ్మట నీళ్లొచ్చాయి. పిల్లల గొప్పలు చెప్పుకోవడానికి అలవాటు పడ్డ తల్లికి వాళ్ళు చేస్తున్న అవమానాలు పైకి చెప్పడం ఎంత ప్రాణం పోయినట్టుగా అది రమణమ్మ మొహంలో కనిపించింది.

ఒక నలుసు కడుపులో పడింది మొదలు వాళ్ళనే కలవరిస్తూ కళలు, కన్నవాళ్లు, స్నేహాలు పక్కన పడేసి ఒక ప్రపంచంలో కొట్టుకుపోతాం. అంతా అయ్యాక ఎవరో కాదు మన పిల్లలే మనకి ఏమంత ప్రేమ లేదని కనిపెడతారు. ఏ మార్కెట్టు తెచ్చి మాతృత్వం నిరూపించుకోవాలో తెలీదు. తల్లులవుతున్నప్పుడు మన పురిటి నొప్పులెవరూ పంచుకోలేదు. కడుపులోంచి బైటికొస్తున్న బిడ్డ తప్ప. ఇప్పుడు బిడ్డలూ వుండరు. ఒంటరి తనం తప్ప

అయినా సరే, నో మోర్ టియర్స్.. (ఇది సబ్బుల కంపెనీ ప్రకటన కాదు- - ఒక తల్లి అవమానాన్ని ఉతికి ఆరేసే సబ్బు ఎవరూ కనిపెట్టలేరు)

6/14/09

# అభివృద్ధి పథకాల్లో భాషా చీకటి!

ఆ మధ్య ఒక స్వచ్ఛంద సంస్థ కోరిక మేరకు వారు నిర్వహించిన పంచాయితీ రాజ్ శిక్షణా తరగతుల్ని డాక్యుమెంట్ చేయాల్సి వచ్చింది. మూడు రోజుల పాటు జరిగే ఆ సదస్సు కి హాజరయి, అక్కడి కార్యక్రమం యధా తధంగా రాయడం. నాపని. తెలుగు బాగానూ, ఆగ్లం ఓమాదిరిగానూ, హిందీ అతంత మాత్రం గానూ వచ్చిన నాకు, హిందీ బాగానూ, ఆంగ్లం అంతంత మాత్రంగానూ, తెలుగు ఏ మాత్రం రాని సహాయకుడి ని ఇచ్చారు. కార్యక్రమం మొత్తం తెలుగులోనే జరిగింది. వృత్తి రీత్యా విలేకరిని కాబట్టి నా పని వెంటనే పూర్తయింది, కానీ వేరొక తరగతి గదిలో జరిగిన సదస్సు ని నా రిపోర్ట్‌తో కలిపి ఒకే ప్రతిగా ఇమ్మని అప్పటికప్పుడు అడిగారు.

"ఓస్ అంతే కదా అనుకున్నాను తీరా నా సహాయకుడు జరిగిన మొత్తం సదస్సుని ఆగ్లంలో అర్థం చేసుకుని, హిందీలో రాసిపెట్టి వుంచాడు. అప్పుడు నేను అతని చిట్టా పక్కన పెట్టి ఆ మూడు రోజులూ తరగతికి హాజరయిన శిక్షకుల, శిక్షితుల చిట్టా సేకరించి ఫోనులో పలకరించి వాళ్ళు చెప్పినవి విని అర్థమయినంత రాసుకుని, మిగిలినవి వూహించి నానా తంటాలూ పడి పూర్తి చేశాను. ఈ పని నాతో బాటు నిర్వాహకులకూ అసంతృప్తి (?) కలిగించింది కాబట్టి వారు నా పారితోషికం కోత పెట్టి ఇచ్చారు. ఇప్పటికీ చాలాసార్లు అనుమానం వస్తుంది. మనం తెలుగు వాళ్ళకోసమే పనిచేస్తున్నామా ? అని, అయితే ఎందుకీ భాషా చీకటి? ప్రాజెక్ట్ ప్రపోజల్స్

రాయడానికి, బడ్జెట్ సాధించడానికి కొద్దిమంది అనువాదకుల్ని, ఆంగ్ల భాషా లేఖకుల్ని నియమించుకుంటే చాలదా? పనిచెయ్యడానికి కూడా ఏ మాత్రం అవగాహనా, అనుభవం లేని ఆంగ్ల భాషా చిలకల్ని నియమించడం ఏం న్యాయం? ప్రజల సమస్యల్ని, ప్రజల భాషతో, ప్రజల ఆత్మతో కాక ఎన్ని తర్జుమాలతో అర్థం చేసుకుంటారు? తెలుగు పథకాలకు పరిమితమైన ఈ భావ శూన్యత ఇంకెంత కాలం కొనసాగుతుంది? ఇవాళ మీరు ఏ స్వచ్ఛంద, ప్రభుత్వ సంస్థనయినా తీసుకోండి.. తెలుగులో పనిచేసే వాళ్ళకు చోటే లేదు.. కన్నడ, మలయాళ ప్రాంతం నుంచి వచ్చిన వాళ్ళు ఆ భాషకి ఇక్కడ వ్యవహారికత లేదు కాబట్టి, ఆంగ్లంలో పని చేస్తూ, వారి సౌకర్యం కోసం కావలిసిన సిబ్బందిని సరాసరి కాన్వెంటుల నించి తీసుకుంటున్నారు. ఇది ఇటు లబ్ధిదారుల ప్రయోజనాల్ని, అటు తెలుగు అభ్యర్థుల ఉద్యోగితనీ దెబ్బకొడుతోంది.

దేశానికి షష్టి పూర్తి వయసొచ్చింది. కాని మనం ఇంకా వలస భాషనే పట్టుకుని వేలాడుతున్నాం.

ఇది భాషా దరిద్రానికే కాదు, భావ శూన్యతకి కూడా గుర్తు.

ఏ భాషా ప్రాంతపు నుడికారంలో ఆ సాహిత్యం వుండాలని, అన్ని సంస్కృతుల్నీ ఒకే మాండలీకం ప్రతిబింబించదనీ వాదించుకుంటున్న నేపథ్యంలో, మన పథకాలూ, ప్రయోజనాలూ, తర్జుమాదారులు పంచుకుంటూ వుంటారు.

ఇంకో రాష్ట్రానికి వెళ్ళి అక్కడి ప్రజల భాషతో పనిలేకుండా కేవలం తర్జుమాల సాయంతో కర్రపెత్తనం చేసి వస్తానంటే, ఎవరయినా సహిస్తారా? సహించరు ఆత్మ గౌరవం వున్న వారెవరూ సహించకూడదు. ఆంధ్రప్రదేశ్ లో మాత్రం అన్నీ సాధ్యమే. ఏ ఇద్దరు తెలుగు వాళ్లయినా మాతృకకు దూరమైనచోట పుట్టిన భాషలో అయిదు నిమిషాలు మాట్లాడుకునే పోటీలు నిర్వహించుకునే దరిద్రంలో వున్నాం. ఇంకో మూడు తరాలపాటు ఇది ఇలాగే కొనసాగితే మనకొక సొంత నాలుక (మదర్ టంగ్) లేకుండా పోతుంది. గ్రామాల్లో తప్ప ఇంకెక్కడా తెలుగు వినిపించకపోవడం, దాన్నికూడా చేతులారా చంపేయ్యడంకోసం ఇటు కాన్వెంటులూ అటు పథక నిర్మాతలూ పోటీ పెట్టుకున్నట్టు కనిపిస్తోంది.

3/14/07

# శరీరంలో సగం చీకటేనా?

ఈ మధ్య దినపత్రికలో ''యోని ముద్ర'' అనే వ్యాయామం గర్భవతులకి ఎంత అవసరమో, సుఖప్రసవానికి అది ఎలా తోడ్పడుతుందో చెబుతున్న వివరం చూశాను. రెండు అరచేతులూ విశాలం చేసి చూపుడు, బొటన వేళ్ళు తాకిస్తూ అద్భుతంగా ఆకారాన్ని నిర్మించింది ఆ వ్యాయామ ఉపాధ్యాయిని.

అప్పుడే గుర్తొచ్చింది. స్కూళ్లలో జరిగిన జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్సు) రిపోర్టు చెయ్యడానికి వెళ్ళినప్పుడు, అక్కడి చార్టు మీద తమ శరీర అవయవాలు గియ్యాల్సి వచ్చినపుడు పిల్లలు ఎంత ఇబ్బంది పడ్డారో.. సగం తెలీని తనం, మిగతా సగం సిగ్గు, మరికొంత తెలిసినట్టుగా వుంటే ఏమి అనుకుంటారో అనే సంకోచం, వెరసి అందరూ తెల్లమొహం వేశారు. ఇక అవయవాల పేర్లు రాయాల్సి వచ్చినప్పుడు కేవలం కొన్ని తిట్లు, బూతులు రాశారు. కన్ను, ముక్కు, నోరు, మెడ, భుజాల తరవాత మిగిలిన శరీరమంతా చీకటి, అజ్ఞానం- అందుకు కారణం మనమే.

''తమ్ముడెలా పుడతాడమ్మా?'' అనడిగితే, దేవుడిచ్చాడు అని చెప్పడం ద్వారా, చెడ్డీ లేకుండా ఎప్పుడు కనిపించినా కొంపలు మునిగినట్టు ఖంగారు పడుతూ లాగూ తొడిగెయ్యడం ద్వారా, సందర్భం వచ్చి మాట్లాడుకుంటున్న సమయంలో కూడా''పెద్దవాళ్ళు మాట్లాడుతుంటే నువ్వెందుకు మధ్యలో, వెళ్ళు, చదువుకో'' అంటూ తరిమెయ్యడం ద్వారా వాళ్ళ ఆసక్తులమీద నీళ్ళు చల్లాం. శరీరం అనేది ఎప్పటికీ ఎవరికీ చూపించకూడదని, మాట్లాడుకోకూడదని, ఒక చీకటి పదార్థం అనీ నమ్మబలికాం.

స్నానం చేస్తున్నప్పుడు కూడా తన శరీరం తను చూసుకోవడం పాపం అనే భావజాలం మనకుంది. ఈ కారణంగానే ఆడవాళ్ళు కూచునే స్నానం చేస్తారు. అంతెందుకు వయసులో వున్న కూతురో, కొడుకో కొంచెం ఎక్కువసేపు స్నానాల గదిలో వుంటే, లోపల ఏం చేస్తున్నారో అని భయపడి తలుపులు బాదే తల్లిదండ్రులు నాకు తెలుసు.

ప్రపంచం గురించి, అంతరిక్షం గురించి, ఎంత విజ్ఞానం వుంటే అంత సంతోషిస్తాం. పబ్బుల్లోనూ, రేసు కార్లతోనూ ఎంత చొరవగా వుంటే అంత ఆధునికమని నమ్ముతాం. శరీరం గురించి, జీవన నైపుణ్యాల గురించి ఏ ఇంట్లోనూ సంభాషణ వుండదు.

క్లాసు పుస్తకంలో ప్రత్యుత్పత్తి అవయవాల గురించిన పాఠం వుంటే దాన్ని వాయిదా వేసి, వేసి, అందరం గొడవ చేస్తే అప్పుడు ఒక ముసలి మాస్టార్ని పిలిచి చెప్పించడం ఇప్పటికి నాకు గుర్తుంది, రోజూ వచ్చే లేడీ టీచరు అది చెప్పను పొమ్మంటే, ఆయన వచ్చాడు. ఆయన కూడా అర్థం అయ్యేలా ఏమీ చెప్పలేదు. కేవలం ఆ పేజీలు ఆదరా బాదరా చదివి వెళ్ళిపోయాడంతే.

కాబట్టి అటువంటి ప్రశ్నలకు జవాబులు రాయాల్సి వస్తే చాయిస్‌లో వదిలేసే వాళ్ళం. ఆ సలహా మాకు టీచర్లే ఇచ్చారు. ఇప్పుడు స్కూల్లో మొదలు పెట్టిన జీవన నైపుణ్యాలకు, మహారాష్ట్ర, కేరళ, గుజరాత్, కర్నాటక ప్రభుత్వాల నుంచి తీవ్ర అభ్యంతరం వచ్చింది. ఓ పక్క డేటింగు కల్చరూ, మరో పక్క అధ్యయనానికి కూడా వీల్లేని నిరంకుశత్వం కలిసి, పిల్లల్ని గందరగోళంలో వదిలింది. ఆ గోళంలో పిల్లలకు దుర్మార్గమైన తలుపులు తెరచుకున్నాయి. అవాస్తవ, భీభత్స, హింసల్తో కూడిన శరీరక హింసకు పిల్లలు ఎర అయిపోతున్నారు.

బోస్టన్ నగరంలో "విమెన్ హెల్త్ కలెక్టివ్" అనే కొందరు మహిళలు Our bodies, ourselves "అనే పుస్తకాన్ని 1971 లోనే ప్రచురించారు.. ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండానే అది అప్పట్లో 2,50,000 కాపీలు అమ్ముడు పోయింది. ఇప్పుడు నాలుగు మిలియన్లకు దాటింది. మనం పుట్టినప్పటినుంచి, వృద్ధాప్యంలోపు వచ్చే శారీరక, లైంగిక, మానసిక సమస్యలన్నింటికీ సరళమైన భాషలో సమాధానాలున్నాయి. అది 20 భాషల్లోకి తర్జుమా కూడా అయిందట. అమెరికాలోని జెర్రీ ఫాల్వెల్ అనే సంప్రదాయ పెద్దల బృందం దీనిమీద నిప్పులు కురిపించింది. "కడుపులోపల ఏం జరుగుతోందో కనిపెట్టి నియంత్రిస్తున్న సాంకేతికత అందుబాటులో వున్న చోట, కడుపు పైన ఎలా వుంటుందో తెలీక పోవడం విచిత్రం" అని మాస్కోలోని యువ శాస్త్రవేత్త రూజ్వెల్టు రాచెల్ కామెంటు చేశాడు. అశ్లీలత శరీర అవయవాల్లో లేదు. అది వక్రీకరించే దోపిడీలో వుంది.

('ఇండియా టుగెదర్' వెబ్‌సైటులో కల్పనా శర్మ వ్యాసం చదివి)

9.3.2012

# సాంస్కృతిక వికలాంగత

అది ఒక రాక్షస ప్రపంచం. అక్కడి మనుషులకు అనుగుణంగానే ఇళ్ళు, రోడ్లూ, వాహనాలూ అన్నీ భారీ ఆకారంలో వున్నాయి. ఆ వూరికి దూరంగా ఓ పొట్టి జంట వుండేవారు. అద్దె ఇంటి కోసం చిన్నవాటా కావాలంటూ వూరంతా తిరిగారు. ఏది చూసినా దెయ్యాల మర్రిచెట్టు మాదిరి పెద్ద పెద్ద మండువాలూ, తలుపులూ, తాళాలూ కనిపించి భయపెట్టేశాయి. ఇక లాభంలేదనుకుని సొంతంగా ఒక పొదరిల్లు కట్టుకున్నారు. తమకు అందేటంత ఎత్తులో పూల పందిళ్ళు, కాయగూరల పాదులు, ధాన్యాలు ఒకటేమిటి? సంతోషంగా బతకడానికి కావలసిన హంగులు అన్ని సమకూర్చుకున్నారు. కొంతకాలానికి ఇల్లాలు గర్భవతయింది. తమదే అనుకున్న అతి చిన్న లోకంలోకి ఇంకో బుజ్జి పాపాయి రాబోతున్నదనే ఆలోచన ఇద్దర్నీ సంబరపెట్టింది. ఏం పేరు పెట్టాలో, ఎలాంటి విద్యలు నేర్పించాలో ఆలోచించి పెట్టుకున్నారు. అలసిన నిద్దర్లో కూడా అవేకలలు కనేవారు. కాన్పు దగ్గరపడే సమయానికల్లా చిన్నచిన్న స్వెటర్లూ, మేజోళ్ళు, ఉయ్యాల తొట్టీ తయారు చేశారు. కల నిజమయ్యే రోజు రానే వచ్చింది. ఇల్లాలికి పురిటి నొప్పులు మొదలయ్యాయి.

''హమ్మయ్య గండం గడిచింది. పండంటి మగబిడ్డ పుట్టాడు'' అంది కాన్పు చేసిన దాది. ఉత్కంఠతో ఇద్దరూ ఉయ్యాల తొట్టెలోకి చూశారు. బిడ్డ అక్కడ లేడు. దూరంగా ఇంకొక బొంతమీద నిద్రపోతున్నాడు.

''బిడ్డకి మీ పోలిక రాలేదు, నార్మల్ బేబీ'' సందేహం తీర్చింది దాది.

ఆంత బలంగా పొడుగ్గా వున్న బిడ్డను కాళ్లమీద పడుకోబెట్టి స్నానం ఎలా చేయించాలి. అనుకుంది తల్లి.

వీడు పెద్దవుతుంటే తలుపులూ దర్వాజాలూ పెద్దవిగా మార్చాలా ఆలోచనలో పడ్డాడు తండ్రి.

ఏది ఏమయినా ఈ బిడ్డ మన కలల పంటే కదా, అనుకుని సమాధానపడ్డారు.

అల్లారు ముద్దుగా నార్మల్ బేబీని పెంచుతున్నారు. ఆడింది ఆట, పాడింది పాటగా పెరుగుతున్నాడు వాడు. వాళ్లకింకో ప్రపంచమే లేదు. గారం తలకెక్కిన పిల్లవాడు అమ్మానాన్నల్ని జనం కళ్ళతో చూసి, అవహేళన చేయడం మొదలుపెట్టాడు. మిత్రుల సంతోషంకోసం వాళ్ళిద్దర్నీ ఎత్తయిన బల్లమీద నుంచోపెట్టి, నిచ్చెన తీసేసి ఏడిపించేవాడు. నీళ్ల పీపాలో పడేసి చాలాసేపు ఉక్కిరిబిక్కిరయ్యాక, అప్పుడు బైటికి తీసేవాడు. బిడ్డ ప్రవర్తనతో తల్లిదండ్రులు విసిగిపోయారు. వాడ్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నిస్తే ''భూమికి జానెడు లేరు, మీరా నాకు చెప్పేది..'' అని హేళన చేసేవాడు.

“ఏ జన్మలోనూ ఇలాంటి నార్మల్ బేబీ వద్దు. మాకు మాలాంటి మరుగుజ్జు సంతానాన్నే ప్రసాదించు దేవుడా అని వాళ్ళిద్దరూ ప్రార్థనలు చేశారు..

.... .... ....

సోమర్సెట్ మామ్ రాశాడో ఇంకెవరు రాశారో నాకు గుర్తులేదు. చాలారోజులక్రితం జరిగిన ఒక విభిన్న ప్రతిభావంతుల వర్క్ షాప్ లో ఈ కథ ప్రస్తావనకు వచ్చింది.

ఒక విభిన్న ప్రతిభావంతుడి కళ్ళతో ఈ ప్రపంచాన్ని చూసినప్పుడు అది భరించలేనంత నిర్దయగా, రాక్షసంగానే వుంటుంది. మన చరిత్ర, సంస్కృతి నిండా కిట కిటలాడే నార్మల్ మనుషులు కొన్ని వర్గాల్ని తప్పకుండా కించపరుస్తున్నాయి.

కాళ్ళూ, చేతులూ, చూపూ, మెదడు, లాంటి అవయవాల్లో ఏదో లోపించడమొక్కటే వికలాంగత కాదు. అన్ని అవయవాలు పని చేస్తున్నా కూడా, వ్యక్తిగత అవసరాలకోసం ఇంకొకరిపై ఆధారపడటాన్ని వికలాంగత అనడం సబబు. ఆ మేరకు ఎంత హీనపక్షం లెక్క పెట్టినా, ఇంటికొక వికలాంగుడూ / వికలాంగురాలూ వుంటారు. బాల్యం, వార్ధక్యం, అస్వస్థత లాంటి సమర్ధనీయ వికలాంగులు కొందరు వుంటే సంస్కృతీ పరంగా కొనసాగుతున్న వికలాంగులు ఇంటింటికీ వుంటారు. ఆ కోవలోకి మన ఇంటిలోని ప్రతి సోమరి మగవాడూ వస్తాడు. కాకపోతే ఆ ధోరణి ఒక విలువగా స్థిరపడిపోయి దాన్ని సమర్థించే సాహిత్యం, సంస్కృతి మన కళ్ల ముందు అల్లుకుపోయింది

సహజ వికలాంగతకి, సంస్కృతీ పరమయిన వికలాంగతకీ తేడా ఏమిటంటే మొదటిది శరీరానికి సంబంధించినది అయితే రెండవది దృక్పధానికి సంబంధించినదిగా మనం చెప్పుకోవచ్చు, మనకున్న దృక్పధాల్లో నూటికి నూరు శాతమూ సమాజం ఏర్పరచినవే అయి వుంటాయి.

కడుపులో వున్న బిడ్డ వికలాంగుడు అని తెలిసిన వెంటనే గర్భస్రావం చేయిస్తున్నారు ఇది మా హక్కుల్ని దెబ్బకొట్టడంలేదా అని ఇవాళ విభిన్న ప్రతిభావంతులు అడుగుతున్నారు.

ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టమే. ఎందుకంటే భూమ్మీద వున్న ప్రజలందర్నీ ఒకే మూసలో చూడ్డానికి అలవాటు పడిపోయి, కొత్తగా ఒక్క ఆలోచనా చెయ్యలేకపోతున్నాం. అది మన దృక్పధంలో వున్న వైకల్యమే. ఇటువంటి చోట్ల నార్మల్ బేబీలు చేసే గాయాల్ని కన్నవాళ్లు భరిస్తూనే వుంటారు.

10.8.2006

# ప్రతిబింబాల్ని ద్వేషించే భావ దాస్యం

మీ పిండాన్ని బడిలో ఎప్పుడు జేర్పిస్తున్నారు?

ఇలా అడిగితే ఏదోలా వుంది కదూ, పోనీ మీ గర్భస్థ పిండాన్ని ఏ బడిలో చదివిస్తున్నారు.? ఇదీ బాలేదా? సరే అయితే మీ పుట్టబోయే బిడ్డని ఎక్కడ జేర్పిస్తున్నారు? ఇది కాస్త, అర్థవంతంగా వున్నట్టుంది కదూ.

నెల తప్పి నలభై రోజులయిందా, అయినా గర్భం నిలబడుతుందో లేదో తేలడానికి సాంకేతికంగా ఇంకా కొంత ఎదురుచూపు వుంది? ప్రస్తుతం వాంతులతో, కళ్లుతిరగడాలతో బోలెడంత అలసటగా వుండచ్చు. అంతమాత్రాన ఆగకండి. ముందుకే ఉరకండి. తొండ ముదిరితే ఊసరవెల్లి అయినట్టు, పిండం ముదిరితే వాళ్ల అయ్య్య పోలికలోకో, అమ్మపోలికలోకో దిగిపోవచ్చు. మీ పిల్లలు మీ ఆకారంతోనూ, తెలివి తేటలతో పుట్టేస్తే ఎలా? పేరు తెచ్చుకోవద్దా? ఇందుకు హ్యూమన్ పొటెన్షియల్ నిపుణుల్ని నమ్ముకోండి. వాళ్లే దారి చూపిస్తారు. నెల తప్పినట్టు ఇంట్లో వాళ్లకి చెప్పినా చెప్పకపోయినా ఏం కాదు. వీరికి కబురు చేస్తే చాలుట. ఇరవై కేజీల పుస్తకాలు, సిడీలు- వి.పి.పి లో పంపుతారు. ఆ క్షణం నుంచే మీ కడుపులోని పిండం వారి విద్యార్థుల జాబితాలోకి చేరిపోతుంది. ఎటొచ్చి పిండం బైటి వాతావరణంలో బతకడం కష్టం కాబట్టి పదినెల్లపాటు మీరే గర్భాన్ని మోసుకుంటూ క్లాసులకి వెళ్లాల్సి వుంటుంది. పిల్లతో బాటు తల్లికీ పండగ డిస్కౌంట్ లాంటిది దొరికి పోతుంది. ఇంత గొప్ప సదుపాయాల్ని అందించడానికి ఇవాళ లిటిల్ జెమ్స్, సూపర్ కిడ్స్ కాలనీ వాళ్లు బొంబాయిలో బోర్డులు తగిలించుకున్నారు. త్వరలోనే మీ గల్లీలోనూ బోర్డులు లేవచ్చు. రెండో నెల నుంచీ పదో నెల దాకా పిండానికి అనేక దశలుంటాయి కదా. అన్నిటికంటే మెదడు మొదట నిర్మాణమవుతుందని డాక్టర్లు అంటున్నారు. శరీరంలోని అన్ని అవయవాల్ని మెదడే నియంత్రించాలి. తీరా ఆ మెదడు రూపుదిద్దుకుంటున్న దశలోనే ఈ కంపెనీలు నియంత్రించ బోతున్నాయన్నమాట. రెండో నెల నుంచీ ఈ శిక్షణ మొదలవుతుందంటేనే ఆలోచించండి. రెండో నెల గుడ్డు ఎంత వుంటుంది? మరి దాని మెదడు చింత గింజంత అయినా వుంటుందో లేదో. నోరులేని పిండానికున్న ఆ చిన్నమెదడులో మనకి కావలసిన ప్రోగ్రాం చిప్‌ని తగిలిస్తున్నామన్నమాట. వినడానికి బాధగా లేదూ. చివరికి పోటీ ప్రపంచం మనల్ని ఎలా తయారుచేసిందో చూశారా? పుట్టని పిండాల్ని కూడా పోటీ ఎరీనాలోకి లాగుతున్నాం.

లోగడ మంజులా పద్మనాభం రాసిన హార్వెస్ట్ నాటకం గుర్తుకు వస్తోంది, అందులో ఓం ప్రకాష్ అనే పేద యువకుడి అవయవాల్ని గిన్ని అనే ఐశ్వర్యవంతురాలు కొంటుంది. సర్జరీ అయ్యేలోపు తను కొనుగోలు చేసిన అతని శరీరానికి గొప్పవసతులు ఇచ్చి అతను నచ్చిన తిండి తినకుండా, మనసనేదే లేకుండా, మెదడుతో ఏది ఆలోచించాలన్నా యజమానురాలి అనుమతి కోరుతూ, చివరికి మొత్తం అంతా శూన్యమయిపోతాడు. ఇందులో ఇంకా ఇతర పాత్రలూ వున్నాయి. హైటెక్ రాకెట్‌లో వున్న బాడీ ఆర్గాన్స్ వ్యాపారీకరణను, పూర్తి స్థాయి బ్లాక్ మ్యాజిక్ సాయంతో ఇక్కడ రవీంద్రభారతిలోనే ప్రదర్శించారు

రాజులు పక్కరాజ్యపు ప్రజల మీద అధిపత్యం సాధించడానికి యుద్ధాలు చెయ్యడం పాత పద్ధతి. ఇప్పుడు రాజ్యంలోని సైంటిస్టులు, సైన్సు సాయంతో మెదడుమీద పట్టు సాధించడమెలాగో నేర్పడం కొత్త పద్ధతి. దీని వల్ల అందరూ ఒకే మూసలో తేలుతారు. చక్రవర్తి నీలి కళ్లతోనే పిల్లల్ని కనాలనే నిబంధన మోసిన బార్బేరియన్ బానిస జాతి లాగా గర్భవతులందరూ ఆ సూపర్ కిడ్ కంపెనీలో చేరిపోతారు. ఇటువంటి విపరీత చికిత్సలు డబ్బున్న వారికే సాధ్యమవుతాయి కాబట్టి, ఇక గొప్ప మేధావులందరూ ఒకే వర్గానికి సంబంధించిన వాళ్లయి వుంటారు. అందరి మెదడు మీద ఒకే మార్కెట్ చదువుల రబ్బరు స్టాంపు కొట్టబడుతుంది కాబట్టి, కొత్త విద్యలూ, ప్రతిభలూ చచ్చినా వెలుగులోకి రావు.

ఇప్పటికే ఈ దేశంలోని తల్లులు అనేక వివక్షలు మోస్తున్నారు.

ఓ పక్క కడుపులో వున్న పిండం మగబిడ్డ అవునో కాదో అని ఒక భయం, ఇంకోపక్క నల్లగానో ఛామనచాయగానో పుడుతుందేమో అని భయంతో సంప్రదాయక కుంకుమపువ్వు మరియు ఆధునిక మెలనిన్ మాత్రలు పనిచేస్తాయోలేదో అనేది ఒక భయం. సర్రోగేట్ మదర్స్‌గా గుడ్డు ఒకరిది, జ్యూస్ ఒకరిది కాగా వారి గర్భసంచినీ కూరగాయల సంచిలా నింపడానికి, దులపడానికి కిరాయి బేరం దొరుకుతుందో లేదో అనే భయం, ఇప్పుడు కొత్తగా కడుపులో పిండానికి తీసుకున్న క్లాసులు నిజంగా పనికొస్తాయోలేదో, అలా పనికిరాకపోతే ఆ నిందనీ, ఇంటిల్లిపాది అసంతృప్తినీ భరించడమెలాగో తెలీని భయం.

వెట్టి చాకిరీ తప్పు అని, బాల్యాన్ని కాజేసే హక్కు ఎవరికీ లేదని అంటున్నాం. మరి పుట్టే పిండాన్ని ఎవరికి నచ్చినట్టు వాళ్లు డిజైన్ చేసుకోవచ్చా? తల్లులారా మీ కడుపు ఇప్పుడు ఒక చదరంగం బోర్డుగా మారబోతోంది? ఎవరికి నచ్చినట్టు వాళ్ళు పావులు కదుపుతారు.?

7.2.2012

# ఏడనున్నాడో.. ఎక్కడున్నాడో..?

రావూరి భరద్వాజ తెలుసా మీకు!?

చాలామంచి రచయిత. దృశ్యాన్ని కళ్ళకు కట్టే కధనశిల్పం, చమత్కారం, హాస్యం ఆయన సంభాషణా శైలి. విజయనగర్ కాలనీలో వున్నప్పుడు మార్నింగ్‌వాక్ నుంచి మా ఇంటికి వస్తూ వుండేవారు. కప్పు కాఫీతో ఎన్నో కబుర్లు కలబోసుకునే వాళ్ళం. ఆయన చెప్పే అన్ని ముచ్చట్లూ కాంతమ్మ జ్ఞాపకాల దగ్గర ఆగిపోతుండేవి. గాలి బరువెక్కేది. ప్రతిరోజూ భార్య సమాధి దగ్గర కూచుని రావడం ఆయనకి అదొక మనశ్శాంతి. అదే అలవాటు మా మామగారికి కంటకంగా వుండేది. శ్మశానంనుంచి సరాసరి వంటగదిలోకి వచ్చేస్తాడేమిటి, అనేది ఆయన బాధ. సరే ఆవిషయం పక్కన పెడదాం.

ఒకసారి భరద్వాజ చెప్పిన విషయం తల్చుకుంటే ఇప్పటికీ పొట్ట చెక్కలవుతుంది. పెళ్ళయిన పదేళ్ళకి భార్యను ఒక ప్రశ్న అడిగాట్ట. రచయితగానే కాక, సహృదయుడైన మగవాడిగా తన స్థానం ఆమె దగ్గర పదిలంగా నిలబెట్టకోవాలనే ఆకాంక్ష ఆ ప్రశ్నలో వుందన్నమాట. సంభాషణ యధాతదంగా చెప్పడానికి నేను ప్రయత్నిస్తాను.

"కాంతం, ఇట్రా ఇక్కడ కూచో. అబ్బా పని ఎప్పుడూ వున్నదేగా, నాతో కాసేపు

కబుర్లు చెప్పు" భరద్వాజ

"ఏం చెప్పాలయ్యా" తడి చేతులు కొంగుతో తుడుచుకుంటూ కాంతం వచ్చింది.

"నేను అడిగే ప్రశ్నకి నిజం చెప్పాలి మరి!?"

"ముందరి కాళ్ళకి బంధమా ఏమిటి, అడుగు, అబద్ధం ఎందుకు చెబుతాను."

" నన్ను చూడకముందు నీకెవరైనా నచ్చారా?"

"సరిపోయింది, పొద్దున్నే ఇంకెవరూ దొరకలేదా నీకు, పక్కకి తప్పుకో నాకు పనుంది."

"కాదు కాంతం, కూచో,నన్ను చూడకముందు కూడా పెళ్ళి చూపులు జరిగాయి కదా"

"అయితే!?"

"అదేమరి వాళ్ళలో ఎవరూ నచ్చలేదా?"

"ఎవ్వరూ నచ్చలేదు. నువ్వే నచ్చావు సరేనా, తప్పుకో ముందు, పొయ్యి మీద పాలు పెట్టి వచ్చాను."

"వెధవ పాలు పోతే పోనీ, సరిగ్గా గుర్తుచేసుకుని చెప్పు. నాకంటే ముందు నీకెవరూ నచ్చలేదా?"

"... ... ..."

"నేను రచయితనని నీకు తెలుసు. అర్థం చేసుకుంటాననీ తెలుసు. వూరికే అడుగుతున్నాను. ఫర్వాలేదు చెప్పు. ఎందుకంటే నేనే ఎప్పుడూ ఏవో చెబుతూ వుంటా కదా. నిన్ను వినకపోవడం అన్యాయం. అంచేత అడుగుతున్నాను."

"నేను రచయితనీ కాదు గాడిద గుడ్డునీ కాదు. అంచేత నా దగ్గర అలాంటి కబుర్లేమీ లేవు, సరేనా?"

" అలా అనకు చెప్పు. ప్లీజ్... నాకంటే ముందు నీకు వచ్చిన పెళ్ళి సంబంధాలు గుర్తు చేసుకుని చెప్పు.."

"అమలాపురం నుంచి ఒక సంబంధం వచ్చింది. అది కుదరలేదు కదా. అయినా ఎందుకిప్పుడవన్నీ?"

"అడిగినప్పుడు చెప్పొచ్చుగా?"

"వచ్చిందండీ, సరేనా, అమలాపురం కుర్రాడు"

“వెరిగుడ్, అదీ అలాగస్పోర్టివ్‌గా వుండాలి మరి”

“రెండు బండ్ల మీద వచ్చారు పెళ్ళిచూపులకి, ఇరవై మందిట, అందరూ బీరకాయ పీచు చుట్టాలేనట,”

“ఓహో”

“పగలు టిఫీనీలు తిని, బయల్దేరి మధ్యాహ్న భోజనాలకి దిగారు. మా పిన్నిగారింటో ఏర్పాటు చేశారు మా వాళ్ళు.”

“ ఎందుకలాగ, ఓహో అతికితే కతకదంటార్లే, ఔను.”

“భోజనాలు అయ్యేటప్పటికీ నాలుగయింది. ఎక్కడినుంచి మొదలైందో మబ్బులేని వాన, దడదడలాడించింది. బిలబిల్లాడుతూ అందరూ మా ఇంటి కొచ్చేశారు, గొడుగు లేసుకుని, పిన్నిగారిల్లు బాగా చిన్నది లెండి.”

“పెళ్ళి చూపులు అయ్యాయా లేదా?”

“ఇంకా అప్పటికి లేదు. సాయింత్రం ఆరింటివరకూ వర్జ్యం వుంది.నన్ను చూడకూడదన్నారు.”

“అదొక ఛాదస్తం”

“ఓయబ్బో, మీ వాళ్ళకీ వుంది లెండి ఈ పైత్యం”

“సర్లే సర్లే, చెప్పు”

“నన్ను తీసికెళ్ళి సామాన్ల గదిలో పడేశారు. పెళ్ళోరందరినీ చాపలేసి హాల్లో కూచోపెట్టారు. కరెంట్ లేదు. పెట్రో మాక్సు లైటే దిక్కు.”

“భలే వుందే”

“ఊ.. ఇంకా వుంది, వినండి. పెద్ద వాళ్ళు చెప్పిన ముహూర్తందాకా ఆగలేక పెళ్ళికొడుకును చూపించడానికి మా పిన్ని కూతురు ప్లాన్ చేసింది. ఎలాగోలా కష్టపడి ఒక కిటికీకి రెక్క తెరిచింది. అది ఎప్పటినుంచో మూసివుంది కదా. కిర్రు మంటూ చప్పుడు” పెద్దవాళ్ళొచ్చి తిట్టారు. పాపం... నా కోసం అది తిట్లు తింది”

“చూశ్ళేదా అయితే?”

“చూశాను. ఎవరి కబుర్లలో వాళ్ళు పడిపోయి కిటికీ రెక్క ముయ్యడం మర్చిపోయారు. పిన్ని కూతురు రాజ్యలక్ష్మి నా చెయ్యి పట్టుకుని కిటికీలోంచి చూపించింది.”

“కనిపించాడా?”

“నా బొంద కనిపించాడు. వెనక్కి తిరిగి వున్నాడు కదా, వీపు ఒక్కటే చూశాను.

ఉంగరాల జుట్టు, మెళ్ళో ఏదో తాయత్తు, నీలంగళ్ళ చొక్కా. అంతే యింకేమీ కనిపించలేదు. సరే ముహూర్తానికే చూడొచ్చులే అనుకుని వూరుకున్నాను."

" ఒకె, ఇదీ బానే వుంది"

"ఏమిటి బావుందీ? సాయంత్రానికీ కరెంటు లేదు. నన్ను చూడ్డమే.. ముఖ్యమనుకున్నారో ఏమొ, నా మొహానికి ఎదురుగా పెట్రోమాక్సు లైటొకటి పెట్టారు. ఆ దీపానికి వెనకగా ఒక ఇరవై మొహాలు.

అందులో పెళ్ళికొడుకెవరో, కాని నా కొడుకెవరో ఎవరు చెబుతారు? అదిగో చిట్టీ, ఆ తెల్ల చొక్కా అబ్బాయి పెళ్ళికొడుకు అన్నాడు మా మామయ్య. ఇందాకే కదా గళ్ళ చొక్కా అనుకున్నాను. ఇంతలోనే చొక్కాలెందుకబ్బా మార్చడం అనుకున్నా. చూద్దామా అంటే సిగ్గు, సరే చూశాననుకో బానే వున్నాడు కెంపులాగా అయితే తెల్లచొక్కాధారులు ఇద్దరున్నారు మరి ఇంకోసారి చూద్దామనుకునేలోగా పిల్లను లోపలికి తీస్కెళ్ళండి అన్నారు. అంతే తలొంచుకుని వచ్చేశాను."

"అయ్యో"

"అదేమరి, కానీ అవాళ ఆగిపోయారు?"

"ఎందుకు? నువ్వు చూడ్డం కోసమేనా!?"

"సరేలెండి సంబరం. వానలో ఎక్కడికి పోతారు. కుంభవృష్టిలాగా కురిసింది. పాలో మంటూ రాత్రికి భోజనాలకి పిన్నిగారిల్లు, చలో మంటూ నిద్రపోవడానికి మా ఇల్లు. బళ్ళ మీద, గొడుగుల్లోనూ మా వాళ్ళ మర్యాదలు.."

"పోనీ రాత్రికి మాట్లాడు కోవాల్సింది."

"ఇంకా నయం. మీరైతే అలాగే చేసేవారేమొ. మా ఇంటా వంటా లేదు, నేను అసలే నిప్పులాంటి పిల్లని."

"అబ్బో"

"ఏం కాదా ఏమిటి? అతని బంధువుల మధ్య అతనూ, మా బంధువుల మధ్య నేనూ నోరు మూస్కుని నిద్రపోయాం"

"సరే తర్వాత"

"తర్వాతేముంది. తెల్లారు ఝుమునే అబ్బాయికి ఒక వెండి చెంబు నిండా నీళ్ళిచ్చి, మా తమ్ముడ్ని తోడిచ్చి చెంబటికి పంపారు. అతను బాగా మొహమాటస్తుడిలా వున్నాడు. బావమరిది అవసరం లేదన్నాడు. ఒక్కడే వెళ్ళాడు.

"మార్కులు బానే కొట్టాశాడుగా"

“ఔను. కొట్టేశాడు”

“ఔనా, చెప్పు అతన్ని నువ్వు బాగా ఇష్టపడ్డావా?”

“ఇష్ట పడ్డాను. కాని పెళ్ళికొడుకేడీ? పెళ్ళి కొడుకులేడు వెండి చెంబు లేదు.”

“చూశావా? రూపాన్ని చూసి మోసపోకూడదన్నమాట, అందరూ నాలాంటి సహృదయులుండరు మరి. ఇప్పుడేమనుకుంటావ్ నేనే నయం అనా”.

“హృదయనిదేముందిలెండి, ఆ ఒక్క రోజూ తొందరపడకపోతే పెళ్ళి కుదిరిపోయేది కదా. నేనే అతని దాన్నయితే ఒక్క వెండి చెంబేమిటి? ఇంట్లో వున్న చెంబులన్నీ అతనివి కాదా! మహా దుడుకు మనిషి నన్నడిగితే నే సాయం చెయ్యనా? ఏ మాటకా మాటే అనుకోవాలి. ఆ ఉంగరాల జుట్టు, ఆ కోరమీసం ఎక్కడున్నాడో ఏమిటో? ప్చ్ ఇప్పుడు తల్చుకుని ఏం లాభం లెండి”అని నిట్టూర్చిందిట.

అప్పుడు చూడు నా మొహం ఎలా మాడిపోయిందో, చూసుకోవడానికి అద్దంలేదు కదా..” అన్నాడు నవ్వాపుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ. మా పరిస్థితీ అలానే వుంది.

కాంతం భర్తతోనే కాదు, మీ భర్తతోనో, నా భర్తతోనో అయినా సరే, మరీ అంత దాపరికం లేకుండా అన్ని విషయాలు పంచుకుంటే ఏమయిపోతారు చెప్పండి?

స్త్రీల హృదయం అగాధమని పురుషులే కనిపెట్టారుకదా! అప్పుడింక ఎలాగో అలాగ ఏదో ఒకటి కనిపెట్టడానికి దూకేస్తే ఏమవుతుంది? అంతూదరీ లేకుండా నిట్టనిలువుగా చచ్చిపోతారు! ఈ మాట నాది కాదండోయ్, భరద్వాజే చెప్పారు.

కట్టుకున్న పెళ్ళాం దగ్గర మీసం తిప్పి “అదిగో ఆవిడ నవ్వింది, ఇదిగో ఈవిడ చూసింది” అంటూ గప్పాలు కొట్టే మగలోకంలో ఆడవాళ్ళు ఒక ఝలక్ ఇచ్చినా, నిజం చెప్పినా విద్యుత్ కంపన లాగే వుంటుంది.

ఒకానొక స్త్రీ, భగవంతుడ్ని ఇలా కోరుకుందట, “దేవుడా నా భర్తను అర్థం చేసుకునే వివేకం ఇవ్వు. మూర్ఖత్వాన్ని భరించే సహనం యివ్వు, అజ్ఞానాన్ని క్షమించే దయగుణం ఇవ్వు కానీ చర్యకి ప్రతి చర్య చేసే కొత్త శక్తిని మాత్రం ఇవ్వకు. ఎందుకంటే ఆ బలంతో నేను అతన్ని ఏం చేస్తానో నాకేతెలీదు.”

25.4.2009

# EMPTY CANVAS

ఆడదాన్ని ఆమె శరీరాన్నుంచి విడదీసి చూస్తే ఎంత కష్టంగా వుంటుందో, ఆ శరీరమ్మీద మన వ్యవస్థ, ఆ వ్యవస్థను పాలించే ఒక మగవాడి దృష్టి కోణం ఎన్ని అభూత కల్పనలకు లోనయి వుంటుందో చెప్పడానికి కౌశిక్ గంగూలీ దర్శకత్వంతో తయారయిన EMPTY CANVAS చిత్రం ప్రయత్నించింది. ఇది ఒక బెంగాలీ ప్రేమ కథ. నాయకుడు సామాజిక అవగాహన వున్న ఒక పేరు మోసిన చిత్రకారుడు.

నాయిక చూర్ణి ( నిజజీవితంలో దర్శకుడి భార్య) అందం, అమాయకత్వం కలబోసుకున్న యువతి. ఇద్దరూ కలిసి ప్రేమ యాత్రగా ఖజూరాహో వెడతారు. ఏ శతాబ్దంలోనో చెక్కిన శిల్పరమణీయతకు, ఇద్దరూ ఒకటి కావాలనుకుంటారు. కానీ ఆ రాత్రే ఊహించని దిగ్భ్రాంతితో ఆమెను దూరంగా తోసేస్తాడు. ఎందుకో తెలుసా? ఖజూరాహో శిల్పంలో వున్న అవయవ సౌందర్యం తన భార్యలో కనిపించలేదుట.

''మోసం'' అని అరుస్తాడు.

''నూటికి నూరు పాళ్ళు నేనాడదాన్నే. ఈ శరీరం నేను తయారు చేసుకున్నది కాదు. భగవంతుడే నన్ను ఫ్లాట్ చెస్ట్‌తో పుట్టించాడు'' అంటుంది.

''మరి నువ్వు ప్యాడెడ్ బ్రాసరీలు ఎందుకు వాడుతున్నావు అది మోసం కాదా'' ఇది ఆర్టిస్టు ఎక్కుపెట్టిన ప్రశ్న. ''నువ్వసలు మగాడివే కాదం''టుంది చూర్ణి.

ఇద్దరూ ఒకర్నొకరు దుయ్యబట్టుకుని విడిపోతారు. (తర్వాత ఈ యువతి మరో యువకుడ్ని వివాహమాడి బిడ్డను కంటుంది. అది వేరే విషయం)

ఆర్టిస్టు ఆ ప్రశ్న అడగాల్సింది చూర్ణిని మాత్రమేనా? ఏ శిల్ప సంపదలు కళాదృష్టి పేరుతో ఒక మగవాడి చిత్త చాంచల్యానికి గుర్తుగా తయారయివున్నాయో, ఏ సంస్కృతి బిడ్డకు పాలివ్వాల్సిన స్తనాన్ని కూడా అంగడి సరుకుగా చూపెడుతోందో

ఆ వ్యవస్థ చెప్పాల్సిన జవాబు కదా. ఎవరో నూరిపోసిన విలువలతో బతుకుతున్న ఒక మామూలు ఆడపిల్ల చెప్పగలుగుతుందా? కాబట్టి ఆమె దగ్గర జవాబే లేకుండా పోయింది. బ్రెస్ట్ కాన్సరు వచ్చిన ఆడవాళ్ళను ఒకసారి పలకరించి చూడండి. వ్యాధి కంటే, చికిత్స తాలూకు గుండెకోత కంటే, బ్రెస్ట్ తొలగింపు వల్ల తమ కాపురం ఏమవుతుందో అని క్రుంగిపోతారు. దీనికి మన డాక్టర్లూ, కౌన్సిలర్లూ యిస్తున్న పరిష్కారం ఏమిటీ? ఆర్టిఫీషియల్ ఇంప్లాంట్స్, ప్యాడెడ్ బ్రాసరీలు, సైజు పెంచే లోషన్లు, - 'అందాన్ని పెంచుకోండి, అశాంతిని తగ్గించుకోండి' అనే ప్రకటనలు.

బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ అంటుంది: ''మన శరీరాలు ఎక్కడ కండగా వుండాలో, ఎక్కడ బలహీనంగా వుండాలో ఒక మరుగుజ్జు మగవాడి ఊహ ప్రకారం డిజైను చెయ్యబడుతుంది. ''ఈ ప్రపంచంలో లావుగానో, సన్నగానో, పొడుగ్గానో, పొట్టిగానో వికలాంగులుగానో, సకలాంగులుగానో ఆడా మగా ఇద్దరూ వున్నారు. ఏ కారణంగానూ వారి అస్తిత్వానికి అర్హత లేకుండా పోదు. ఒక్క ఆడవాళ్ళ విషయంలోనే ఫలానా చోట కండ తక్కువగా వున్న కారణంగా ఆమె ఆడతనమే అవమానించబడుతుంది. ఆత్మన్యూనతలోకి నెట్టబడుతుంది. ఇంతాచేసి ఫలానా కొలతల్లో వున్న ఆడవాళ్ళే సత్వరం సంతానవతులు అవడమో, ఏ అనారోగ్యాలూ లేకుండా వుండటమో జరగదు. మనకున్న భ్రమలు, భ్రాంతులూ, విచిత్రాలూ, విషాదాలూ ఏవీ హేతువుకి నిలిచేవి కాదు. ఈ విషయం చెప్పడానికే దర్శకుడు కౌశిక్ గంగూలీ ప్రయత్నించాడు.

ఎక్కడ ఆడబొమ్మ కనిపించినా ఆమె జాకిట్టులోకి తొంగి చూసే జనాభా వున్నచోట స్త్రీలంతా బార్బీ బొమ్మల్లా వుండటానికే కాలాన్ని, ధనాన్ని, వ్యక్తిత్వాన్నీ ఖర్చుపెట్టడంలో ఆశ్చర్యమేముంది?

ఆ EMPTY CANVAS శాన్ ఫ్రాన్సిస్కో నుంచి జపాన్ మీదుగా మన దేశానికి కూడా వస్తుందని ఆశిద్దాం. కళాదృష్టి అనేది వాస్తవంగా ఎందరి మనోభావాల్ని దెబ్బకొడుతోందో తెలుసుకుందాం. ఈ కళాదృష్టి కారణంగా మానవుడు ఒక స్త్రీ నుంచి, మరో స్త్రీ దగ్గరికి చివరికి ఆ ఇద్దర్నీ వదిలించుకోవడానికి ఎన్ని హింసా మార్గాల్ని ఎంచుకుంటున్నాడో మన కళ్ల ఎదుట కనిపిస్తూనే వుంది.

( విమెన్ ఫీచర్ సర్వీస్ సౌజన్యంతో )

# ఈ దశాబ్దపు అబద్ధం

రాజుగారు దిశ మొలతో ఊరేగుతున్నప్పుడు అతన్ని మోస్తున్న బోయీలతో బాటు చుట్టుపక్కల వున్న మనుషులంతా కూడా ఆ వికారాన్ని కళ్ళుపోయేలా చూసి భరించాలి. రాజభక్తి అంటే అదే కదా. లేకపోతే ఇద్దరి తలలూ ఎగిరిపోతాయి. ప్రాణభయంతో బాటు, భక్తి భయం కూడా భృత్యుల్ని గోతిలోకి తోస్తుంది. ప్రజాస్వామ్యంలో అయితే విచక్షణా దరిద్రం కూడా తోడవుతుంది. 2002న, గుజరాత్‌లో ముస్లిం ప్రజల మీద జరిగిన ఊచకోతని, ఆ కోతలో ధన, మాన, ప్రాణాలు పోగొట్టుకున్న బాధితులతోబాటు, ప్రత్యక్షసాక్షులుగా వున్న అన్ని దేశాల ప్రజలూ ఇంకా మర్చిపోకముందే, చేతులకంటిన రక్తపు మరకలు ఆరిపోయినట్టూ, కొమ్ముల్లోనూ, కోరల్లోనూ దాగిన విషవాయువులు కరిగిపోయినట్టూ ఓవర్ యాక్షన్ చేసేసి, అతడు నిర్దోషి అని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ప్రకటిస్తే, ఆ వార్తను సోక్రటీసు తాగిన విషంతో పోల్చుకుని జీర్ణించుకోవాలా?.. ప్రభుత్వాలు, యంత్రాంగమూ ఎంత బాగా వివేకం వదులుకుంటే పాలకులకి అంత బాగా గుడ్ గవర్నెన్స్ కుదురుతుంది కాబోలు. గుడ్ గవర్నెన్స్ అంటే మంచి పాలనట కదా, అవును వాడి పాలనలో ఏకపత్నీ వ్రతుడొచ్చి వేలాది హత్యాచారాలు చేసిపోయాడు, వాడి పాలనలో వ్యాస వాల్మీకులు ఖురాన్ చదువుతూ కాలిపోయారు. ప్రతీ ఏడాదీ సీతారామ కళ్యాణాలు చేసే వాడి పాలనలో షాదీ ముబారక్ అని రాసి వున్న పెళ్ళి పందిరి బూడిద కుప్పగా మారిపోయింది. గుడ్ గవర్నెన్స్ కదా మరి.

దేశమంటే మనుషులు అని చెప్పిన గురజాడ వాక్కు నిజమే అయితే, అప్పుడు నెరూడా, పాటియా, బాపూనగర్, చమన్‌పురా, కనీజ్, తకడ్, లింబాడియా గ్రామాల ఓట్లు దండుకున్న ప్రభుత్వం పుణ్యమా అని మట్టిలో కలిసిపోయాయి. అక్కడ దేశమే లేదు. మట్టే మిగిలింది. ఈ దేశంలో శాంతి యాత్రలు చేసే తీరిక మదర్ థెరీసాకి ఎప్పుడూ వుండదు. తల్లి కడుపు చీల్చి గర్భస్థ పిండాన్ని శూలానికి ఎగరేసిన శిశు పాలుడు చేస్తాడు. ఈ దేశంలో ప్రజలకి యుద్ధం చెయ్యడానికి కాదు, నిశ్శబ్దంగా వుండటానికి వెయ్యి ఏనుగుల శక్తి కావాలి.

గడిచిన పదేళ్ళకాలంలో తను రూపకల్పన చేసిన గుజరాత్ అభివృద్ధి నమూనా మహాత్మాగాంధీ కాలంలో జరిగిన స్వతంత్ర ఉద్యమాన్ని పోలివున్నదట. గుండెలోకి దూసుకుపోయిన తుపాకీ గుండుకి కూడా హేరామ్ అని మాత్రమే స్పందించిన బాపూజీ కనక యిది వింటే, చేతిలో వున్న కర్ర తిరగేసి రెండు కాళ్ళూ విరగ్గొడతాడు. అరవై ఏళ్ళ రాజకీయ జీవితానికి బూజు పట్టేలా ఎల్.కె. అద్వానీ గారు కూడా యింత రాజకీయ మేధావి, సమర్థుడు, న్యాయ పక్షపాతిని తన సుదీర్ఘకాలంలో అసలు చూడనే లేదని ప్రకటించాడు. కాబట్టి ఈ తీర్పు ఆయనకి ఆనంద బాష్పాల్ని మోసుకొచ్చిందట.

ఎటొచ్చీ న్యాయం కోసం పదేళ్ళనుంచీ ఎదురుచూపుల నిప్పుల మీద వున్న వాళ్లకి వచ్చినది ఏమిటి? అరవై పేజీల చారిత్రక అబద్ధమా? ఈ దెబ్బ దేహానికి తగిలిన దెబ్బకాదు. నమ్మకాలకీ, విశ్వాసాలకీ, సర్వ మానవ స్పర్శలకీ, ఒకేసారి అంటించిన సామూహిక చితి. వేలాడదీసిన ఉరి. ప్రధాన న్యాయస్థానం చేసిన ఒక అడ్డగోలు దగా, దివాళాకోరుతనం. ప్రాణభయంతో రాళ్ళ గుట్టల్లోకి పారిపోయి మూత్రం తాగి బతికిన బాధితులకి, బాధని చూసి తల్లడిల్లినవారికి తీవ్రమైన అసహ్యం కలిగి, గొంతులోనే కాండ్రించి ఆ వేదనని ఎక్కడ ఉమ్మాలో తెలీనితనం.

ఈ తీర్పు గాయాన్ని గాయంతో కెలికినట్టయింది. చితికిన జీవితాన్ని ఇంకోసారి కుళ్ళబొడిచినట్టయింది. యూదుల రక్తంతో హోలీ ఆడిన హిట్లరు జాత్యహంకారం కనబడుతోంది. సెక్యులరిజం ఒక సిద్ధాంతంగా స్థిరపడిన చోటే జైరామ్ కత్తులు తల్వార్లు గాలికెగురుతుంటే, కత్తి ఎత్తిన తలకీ, దిగిన తలకీ ఒకే సర్కారు రిమోట్ బటన్ నొక్కుతుంటే ఇది అసలు దేశమా? శ్మశానమా?

అరవై మంది హిందువులు రైలుతో సహా సజీవదహనం అవడమూ, ఆరువందల మంది ముస్లింలని ఎవరింట్లో వాళ్ళే కుప్పకూలిపోవడమూ రెండింటిలో ఏ ఒక్కటైనా సర్కారు సైగ లేకుండానే జరుగుతుందా? జరిగిందే అనుకో అప్పుడు బాధ్యత

వహించాలి కదా. న్యాయమూ చట్టము పనిచెయ్యాలి కదా? తనే ఎదురు తిరిగి ప్రజల్ని కుళ్ల బొడవడమేమిటి? అసలు మతమైనా, కులమైనా రాజకీయ విషమెక్కించినప్పుడే రంగు మారుతున్నాయని అందరికీ తెలిసిపోయింది.. ఎవరు మైనార్టీ? ఎవరు మెజారిటీ? అట్టడుగు వాడికెప్పుడూ అర్థంకాని వివక్షే.. రోటీ, కపడా ఔర్, మకాన్ పంచుకుంటూ, మత ప్రమేయమే లేకుండా ప్రేమించుకుంటూ పెద్దల్నెదిరించి పెళ్ళి చేసుకుంటూ, హే రామ్, హే అల్లా అని కన్నబిడ్డలకి పేర్లు పెట్టి పిలుచుకుంటూ కమ్మటి కౌగిలిలా బతుకుతున్న చోట, హటాత్తుగా పక్కింటి దేవుడు శత్రువెందుకు అయ్యాడో, తన దేవుడి పటాలెందుకు ముక్కలయ్యాయో ఎలా తెలుస్తుంది? రాజుని, అతని అతకని చిరునవ్వునీ మోస్తున్న పల్లకీ బోయీలకి తెలుస్తుంది. ఆ కూలీల్లో ప్రపంచ ప్రధాన న్యాయస్థానమూ వుండొచ్చు. అతని నేరాలన్నీ సాక్ష్యాలు లేనందువల్ల చెరిగిపోయాయట. అవును, సాక్షుల్ని కొనేస్తే చెరిగిపోతాయి. చంపేస్తే చెరిగిపోతాయి. రక్షిస్తాం ఇటువేపు రండి అని చెప్పి లారీల కెక్కించి నిప్పంటిస్తే కాలిపోతాయి. అధికారం చేతిలో ధిక్కారాలే కాదు, నోరెత్తని దీనులూ బతకలేరు. పొగ సాయంతో తందూరీ పొయ్యిలోంచి పారిపోయొచ్చిన పదహారేళ్ల అమ్మాయి వీపు మీద నల్లని మచ్చ ఒక అబద్ధమే అయి వుంటుంది. స్వయంగా చూసివచ్చిన ఇన్ని జతల మా అందరి కళ్ళూ గాజు గోళీలే అయివుంటాయి. రిపోర్టులన్నీ సిరా ముద్దలే అయివుంటాయి. మంత్రిగారు దిశమొలతో వున్నారు. శ్వేత వస్త్రాల్లాంటి అరవై పేజీల అబద్ధాలున్నాయి చుట్టబెట్టండి. మరి సుప్రీంకోర్టు అదే చేసింది..

1.5.2012

# ఒక తులం స్పందన కావాలి

ఆ మధ్య పాత హిందూ పేపరులో 'silly side of the facebook" అనే వ్యాసం చదివాను.

ఒక యువతి తన గర్భస్థ పిండానికి తీసిన అల్ట్రాసౌండు ఫిల్ముని సర్క్యులేషన్ లో పెట్టిందిట. భూమ్మీదకి రాకుండానే, అసలు మానవాకృతి అయినా దిద్దుకోకుండానే "రేట్ దిస్ ఫొటో ఐటెం"గా మారిపోవడం అంటే, అది ఆ పాప (కాబోయే పాప అనాలేమో) పట్ల మనం చేసిన మానవహక్కుల ఉల్లంఘన కాదా అని ఆ వ్యాస రచయిత్రి బాధపడుతూ రాసింది. చదవగానే నాకెందుకో మనసు కెలికి నట్టయింది. మా అమ్మాయి డెలివరీకి రావడానికి ముందు నేను యు ట్యూబులో చూసిన నార్మల్, సిజేరియన్, బ్రీచ్ పొజిషన్ డెలివరి సిడీలన్నీ గుర్తొచ్చాయి. తల్లిగా అది నా ఆందోళనకి చిహ్నం అని ఎంత రివాజయిన జవాబు చెప్పుకున్నాగాని, ఏదో ఒక స్థాయిలో మనమంతా మనకున్న గోప్యతా హక్కుని (రైట్ టు ప్రైవసీ) కాల రాస్తున్నామేమో అని నాకు అనిపిస్తోంది. శాస్త్రీయంగా విషయాలు తెలుసుకోవడం అనే పని అందరం చెయ్యాల్సిందే, కాని అదే సమాచారం మార్కెట్ అవుతుంటే అప్పుడు అది మానవహక్కుల ప్రశ్న అవుతుంది. ఎందుకంటే మనం సీడీలో చూసినవి ఇంకెవరివో శరీరాలో కదా. స్పృహ వున్న శరీరాలా, లేని శరీరాలే అనేది కూడా చర్చనీయాంశమే అవుతుంది.

ఆ మధ్య 2008, మార్చి ఎనిమిది తొమ్మిది గంటల ఉదయం, కలకత్తాలోని మానసిక వికలాంగుల ఆస్పత్రిలో రోగులైన కొందరు మహిళలు వివస్త్రలుగా కనిపించారనే వార్త ఆనంద్ బజార్ పత్రికలోనూ వచ్చింది. కొంచెం ఆలస్యంగా ఇక్కడి పత్రికల్లోను వచ్చింది. జబ్బుగా వున్న తల్లిని చూడడానికి ఒక కూతురు కన్సల్ట్ డాక్టరుతో కలిసి వార్డులోకి వెళ్ళినప్పుడు ఇది బైట పడింది. తల్లితో బాటు ఇంకా కొందరు మహిళలు అలా నగ్నంగా నేలమీద కూచుని వుండటం చూసిన ఆమెకు తీవ్రమైన దుఃఖం వచ్చిందిట. సహజమే కదా. ఆ దృశ్యాన్ని చూసిన డాక్టరు కూడా స్పందించి సిబ్బందిని అడిగాడు.

"పేషెంట్లు కట్టుకున్న బట్టలు ఉతకడానికి తీసుకున్నాం. అంతే", అని జవాబు చెప్పారట. ఒక జత విప్పినప్పుడు మరో జత తొడగాలి కదా అనే ప్రశ్నకు సరయిన సమాధానం లేదు. అంటే మతి స్తిమితం లేనివారికి సిగ్గు, గౌరవం ఏమిటనేది వారి ఆలోచన కావచ్చు.

"వాళ్ళసలు కట్టుకున్న బట్టలు కూడా వుంచుకోరు సార్, చించుకుంటారు," అనేది ఇంకో జవాబు. కాబట్టి మతిలేని రోగులతో సమానంగా, మతి వున్న సిబ్బంది కూడా ప్రవర్తిస్తారన్నమాట. మానసిక సాంత్వన, చికిత్స పొందడానికే గదా ఆస్పత్రులు

వున్నది, వున్న బట్టలు ఊడ దియ్యడానికి కాదు కదా అని అడిగేవారు ఎవరు? అసలది నేరమని ఒప్పుకోవడానికి ఎవరూ అక్కడ లేరే. జరిగిన నేరానికి జవాబు రాబట్టాలని మీడియా చాలా ప్రయత్నించింది కానీ అసెంబ్లీ కార్యక్రమాల తీవ్రతలో ఆరోగ్యశాఖ మంత్రి దొరకలేదు.

"చిన్న విషయాన్ని పెద్దది చేయడం మీడియాకి అలవాటేకదా" అని ఆస్పత్రి అధికారులు బెదరలేదు. మతి ఉన్నప్పుడే మన శరీరాలు, వాటికి కావలసిన గోప్యతా హక్కులు ప్రమాదంలో వున్నప్పుడు, ఇక ఇటువంటి కేసులకి ఎలా స్పందించాలో తెలీడంలేదు.

మొదటి కేసులో ఒక తల్లి గొప్పకోసమో మరి దేనికోసమో పుట్టని గర్భస్థ పిండాన్ని ప్రదర్శనకి పెట్టింది. రెండో కేసులో మతిలేని మహిళల శరీరాల్ని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది గాలికొదిలేసింది.

ఐరనీ ఏమిటంటే, ఇప్పుడు ఇక్కడ నాకెదురుగా ఒక ప్రముఖ ఛానల్లో ఇదే విషయం మీద చర్చ జరుగుతోంది. ఇది మతి వున్న స్త్రీల మీద ఇంకోరకమయిన బ్లాక్ మెయిల్. ఇప్పుడు జరుగుతున్న అవమానాలకి అత్యాచారాలకి కారణం స్త్రీలు కట్టుకుంటున్న కురుచ దుస్తులేనట. ఔను అని డెబ్బై శాతం, కాదు అని ముప్పై శాతం మొబైల్ జవాబులు వస్తున్నాయి.

ఆహా! మనది ఎంత నాగరిక దేశం. మతిలేని ఆడవాళ్ళకి బట్టలే అవసరం లేదనుకోవచ్చు. మతి వున్న ఆడవాళ్ళు కురచ బట్టలు కట్టుకోవడం వలన అత్యాచారాలకి అనువుగా వుండటమే కాక, ఇలాంటి చర్చలు పెట్టుకుని టివి రేటింగ్సు పెంచుకోవచ్చు. సెల్యులర్ ఫోనులు అమ్ముకోవచ్చు. మతి వున్నా, లేకపోయినా సరే ఎక్కువ గజాల వస్త్రం చుట్టుకోవడం వలన నేరాలు ఘోరాలు ఆగకపోయినా, సంప్రదాయాన్ని మాత్రం బాగా నిలబెట్టమని కోరవచ్చు. ఈ మాటలన్నీ ఎవరు చెబుతారంటే లాల్చి పైజమాల్లోనో, లుంగీ కండువాల్లోనో భారతీయతని ఉట్టిపడేవాళ్ళు కాదు, బ్రిటిష్ వస్త్రధారణ వదలని పురుషులే ఎంతో చక్కగా మనకి చెబుతారు.

చర్చలో పాల్గొన్న సంధ్య ఇదే అడిగింది. ఇంకొక యాక్టివిస్టు ఇంకా బాగా అడిగింది. వొలిచిన అరటిపండు ఎగబడి అందుకోవడం అనే పని కోతి చేస్తుంది. ఎవరూ చూడకుండా గిన్నెలు దొర్లించి పెరుగు పాలు తాగడం అనే పని పిల్లి చేస్తుంది. ఎంత విశాలమైన రోడ్డు ఉన్నాగానీ బురదలోనే దొర్లడం అనే పని పంది చేస్తుంది. ప్రతి జంతువుకి జాతి సహజమైన క్రీడలు కొన్ని వుంటాయి.

మనిషి నాగరికుడు కదా! పొరుగు సొమ్ముకి ఆశపడటం, పరాయి మనిషిని ఆక్రమించడం ఎలా చేస్తాడు? అది జంతు ప్రవృత్తి కదా అని భలే హేతుబద్ధంగా వ్యాఖ్యానించింది. ఈ ప్రశ్నకి స్పందించే రోజు రావాలి కదా!

1.2.2012

# ఆడాళ్ళకో దేవుడు - మగాళ్లకో దేవుడు

మీరొక స్కూలు పెట్టారనుకోండి. మీ విద్యార్థులందరూ పాఠశాల నిబంధనలకు అనుగుణంగా యూనిఫామ్‌లో రావాలనుకుంటారా? భవానీ వేషంలో కొందరు, అయ్యప్ప వేషంలో కొందరు, బాలబాబా అవతారంలో గోచీ పెట్టుకుని కొందరూ, దుర్గామాత, జిల్లేళ్ళమూడి అమ్మల వేషధారణలో జుట్టు విరబోసుకుని కొందరూ వస్తే చూస్తూ చెంపలు వాయించుకుంటూ, వాళ్ళ కాళ్ళు కళ్లకద్దుకుంటూ, చూడండి స్వామీజీ! అని పిల్లల్ని సంభోదిస్తూ పాఠం చెప్పాలనుకుంటారా? అసలది తరగతి గది లాగా వుంటుందా? పిచ్చాసుపత్రి లాగా వుంటుందా? ఇక్కడి పిల్లల్లో దేశభక్తి పెరుగుతుందా? సమ సమానత్వ భావనలు వికసిస్తాయా? అలాంటి చోట పాఠాలు చెప్పే పంతులమ్మ అనబడు బడుగుజీవిని ఎవరైనా గౌరవిస్తారా? ఆ సమయంలో ఆమె చరిత్రని బోధిస్తున్నట్టయితే, మన భారతావని మత ప్రమేయంలేని లౌకిక రాజ్యం అని చెప్పడానికి నోరు వస్తుందా? రాజకీయ శాస్త్రం అయితే మత నిర్భందం ఎంత తప్పో అది మానవహక్కులకి ఎంత వ్యతిరేకమో చెప్పగలదా? హాజరు వేస్తున్నప్పుడు ప్రెజెంట్ సార్ అనడానికి బదులు, జైమాతా అనో, శంభోశంకరా అనో, అరిస్తే వినడానికి ఎలా వుంటుంది? ఒకవేళ అదే సమయంలో ఇన్ స్పెక్షన్ కనక జరిగితే, అప్పుడు ఎవరి ఉద్యోగం గాలి కెగురుతుంది?

ఇవన్నీ నిన్న ఈ పాటికి మా పక్కింటి సుధా టీచరు నన్ను అడిగిన ప్రశ్నలు. జవాబు నాదగ్గర లేదు. నిజమే కదా, డాక్టర్లకి తెల్లకోటు లాగా, లాయర్లకి నల్ల కోటులాగా, పోలీసు వ్యవస్థకి ఖాకీ యూనిఫామ్‌లాగా, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థకి ఒక యూనిఫామ్ వుంది. అసలు ఈ యూనిఫామ్ తెచ్చుకోవడానికే మనం చాలా రోజులు ఎదురుచూశాం. ధనిక, బీద వర్గాలకి మధ్యవున్న తేడా తెలీకుండా, విద్యముందు అందరూ సమానులే అని చెప్పడానికి ఉద్దేశించిన యూనిఫారాన్నీ, దాని ఉద్దేశాన్నీ తల్లిదండ్రులే చేతులారా నీరు కారుస్తున్నప్పుడు టీచర్ల పాత్ర ఏమిటి? పాఠశాలలో మత చొరబాటు అవసరమా? పోనీ స్కూలు కంటే మతమే ముఖ్యమని ఆ పిల్లల తల్లిదండ్రులు నిర్ణయించుకున్నట్టయితే, అనుకోనివ్వండి. తప్పులేదు. అప్పుడు వాళ్ళ వంశాంకురాల్ని నిజాయితీగా నలభై రెండు రోజులూ స్కూలుకి సెలవుపెట్టి ఆరాధనలో ముంచి తేల్చమనండి మనకభ్యంతరం లేదు. ఎందుకంటే అర్ధరాత్రి వరకూ భక్తి పారవశ్య కార్యక్రమాలవల్ల, వీళ్ళంతా ఎలాగూ హెూంవర్కు చెయ్యకపోవచ్చు. పవిత్ర స్వామి సేవ పుణ్యమా అని, పరీక్షలు రాయలేకపోవచ్చు. కానీ సమస్య అక్కడితో ఆగుతుందా ఆగదు. ఇవాళ వస్త్రధారణకి స్కూలు యాజమాన్యపు మద్ధతు లభించిన పిల్లలు, రేపు

కాలేజీలోకి వచ్చేసరికల్లా త్రిశూలాలతోనూ, కత్తులతోనూ రారని గ్యారంటీ ఏమిటి? అప్పుడు పంతులు బోర్డు వైపు తిరిగి, ప్రాణభయం లేకుండా ఇవాల్టి తేదీ అయినా వెయ్యగలడా? ఇక్కడ స్కూలు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నదెవరు? తల్లిదండ్రులు కాదా?

తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాల టీచరూ అదే భయపడి వుంటుంది. కాబట్టి ఎనిమిదో క్లాసు చదువుతున్న తన విద్యార్థుల్ని నల్ల దుస్తులు వదిలి స్కూలు యూనిఫామ్‌లో రావాలని గట్టిగా చెప్పింది. వినకపోయేసరికి గల్లా పట్టుకుని అడిగింది.. అది తప్పా? ఇంటికెడుతూనే ఆ విద్యార్థులు వారి తల్లిదండ్రులకి చెప్పారు. వారు కొందరు అయ్యప్ప భక్తులతో కలిసి ఆమె ఇంటి మీద దాడిచేసి నానా యాగీ చేశార్ట. నలభై అయిదు మంది భక్తులు అరెస్టయినట్టు వార్త వచ్చింది. కొన్ని భక్తి దినపత్రికలు ఆ టీచరుదే నేరం అన్నట్టు కూడా రాశాయి. ప్రస్తుతం ఊటీలోని పోలీసు స్టేషనులో ఆమెమీద కేసు నమోదయింది. ఆదివారాలు విద్యార్థుల్ని పిలిచి బైబిలు పాఠాలు చెబుతోందని అభియోగం చేశార్ట.

ఈ సంఘటన వెలుగుచూసిన నెలరోజుల లోపే, మళ్ళీ ఇవాళ ఇంకొక వార్త వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే పరమ పవిత్రమైన శబరిమలై ఆలయాన్ని, ఒక ముప్పై అయిదేళ్ళ సరస్వతి అనే మహిళ దర్శనం చేసుకోవడం ద్వారా అపవిత్రం చేసిందట. కాబట్టి ఆమె ఎక్కి వచ్చిన పద్దెనిమిది మెట్లతో బాటు ప్రధాన ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసుకున్నామని ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు అధికారులు వివరిస్తున్నారు. సరస్వతీ దేవి పూజ చేసుకుని, మల్లికాపురంలోని ఉపాలయానికి వెడుతుండగా టాస్క్ ఫోర్స్ గుర్తించి ఆమె దుశ్చర్యని ఖండించార్ట. మూడేళ్ల క్రితం జయమాల అనే కన్నడ నటి కూడా స్వామి అయ్యప్పని చూడ్డానికి వచ్చి, పాపం మూటకట్టుకుని వెళ్ళిందట. దాన్ని శుద్ధి చేసుకోవడానికి కూడా దేవస్థానం చాలా ప్రయాస పడిందిట..

ఇవి రెండు రకాల వార్తలు. మొదటి వార్తలో బాలల హక్కులమీద, రెండవ వార్తలో స్త్రీల హక్కులమీద దాడి జరిగింది. దీన్నిబట్టి ఏమి తెలుస్తోందంటే, గ్రామాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న రెండు గ్లాసుల పద్ధతిలాగా, మగాళ్ళకి మాత్రమే పనికొచ్చే దేవుళ్ళూ, ఆడాళ్ళకి మాత్రమే పనికొచ్చే దేవుళ్ళు వున్నారన్నమాట. ఎవర్ని తల్చుకుని గంట వాయించాలో గుర్తుంచుకోవాలి. లేకపోతే మీ పుణ్యం కాస్తా ప్రత్యర్థి హుండీలోకి చేరిపోతుంది.. మరి భారతీయ మహిళగా మీరిప్పుడు మీకోసం కాకుండా, భర్త క్షేమం కోసంగాని వ్రతాలు చేస్తున్నవారయితే, అప్పుడు అవి ఏదేవుడి పద్దులోకి చేరుతాయో ఏమిటో లెక్క చూసుకోవడం మంచిదేమో!

4.1.2011

# ఉరి తీసుకున్న నటిమీద ఊరించే ఒక సినిమా

హిందీ హీరో జితేంద్ర ముద్దు బిడ్డ ఏక్తాకపూర్ ''డర్టీపిక్చర్'' తీసినట్టు తెలుసు కదా..ఎవరిమీద తీసిందో కూడా తెలిసే వుంటుంది. నిరంతర రక్తిలో మునిగిన స్వామీ నిత్యానందమీద కాదు. రాజ భవన్‌లో రాసలీలలు నడిపిన గవర్నరు తివారీ మీద కాదు. అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిన మంత్రులమీద కాదు. కొన్ని దశాబ్దాలపాటు ప్రజల మనోభావాల్ని పక్కదారి పట్టించిన పుట్టపర్తి సాయిబాబా మీద కాదు. అలా తీస్తే అప్పుడవి ఖచ్చితంగా కల్తీలేని సినిమాలయ్యేవి. అప్పుడు ఆమె కలేజాకి అందరం మెచ్చుకునేవాళ్ళంకూడా.. ఆ పనిలో మజా ఏముంది అనుకుందేమో..

ఎలాంటి సంకోచం లేకుండా సిల్క్ స్మిత జీవితం మీద ఒక ఏకపక్ష వ్యాఖ్యాన చిత్ర రాజాన్ని తీసిపడేసింది. ముక్కు చీదినంత తేలిగ్గా సినిమాలు, సీరియల్స్ తీసే ప్రతిభ ఆమెకుండొచ్చుగాక, అయితే చనిపోయిన ఒక నటీమణి జీవితం తీస్తున్నప్పుడు విశ్వసనీయ సమాచారం తీసుకోవాల్సిన బాధ్యత అయినా వుండాలా వద్దా? ఆవిడ సెక్సు బాంబు అయినా, మానవ బాంబు అయినా తోడబుట్టినవాళ్ళో, కలిసి బతికినవాళ్ళో వుంటారు కదా. ఆమె పరోక్షంలో జరుగుతున్న ఈ సరదా సరదా రచ్చబండ లేక, పోస్టుమార్టం కార్యక్రమాలకి అయినవాళ్ళ అనుమతి వుండాలి. వాళ్ళ మనోభావాల్ని పట్టించుకోవాలి. స్క్రిప్టు తయారీలో కూడా తమని ఏమీ అడగలేదని, తమ అక్క జీవితాన్ని గురించి వున్నవీ, లేనివీ తీసి అపఖ్యాతి పాలు చేస్తున్నారని ఆమె తమ్ముడు నాగవర ప్రసాదు, మిత్రుడు రాధకృష్ణలు కోర్టుకెక్కారు. తంతే బూర్లగంపలో పడ్డట్టు, తప్పులు కోర్టుకెక్కినప్పుడల్లా ఇంకా కీర్తి, డబ్బు వచ్చిపడతాయిగా. ఇప్పుడు అదే జరిగింది. అస్సలు సెన్సార్‌కట్స్ లేవని కొన్ని గ్యాసిప్ పత్రికలు వూరించేస్తున్నాయి. ప్రధాన థియేటర్లన్నీ బుక్కయిపోయాయి. జనాలు గేట్లముందు పడిగాపులు కాస్తున్నారు. (ఉరి తీసుకుని చనిపోయిన నటి గురించి ఊరించే సినిమా తియ్యడం గొప్ప ఐరనీ కదా!)

కాగా ఆమె తరపున తమ్ముడు, మిత్రుడు కూడా డబ్బుకోసమే కోర్టుకెక్కారని, సినిమాల్లో క్లబ్బు డాన్సరు పాత్రలు వేసే వాళ్ళకి, కొత్తగా ఇప్పుడొచ్చి పడ్డ అపఖ్యాతి ఏమిటని మా కొలీగ్ ఒకడు నాతో వాదించి విసిగించబోయాడు.. మనం ఎంతగా బండబారిపోయామో ఇలాంటి వాదనలు చెబుతాయి. ఎంత చిన్న బడ్జెట్ క్లీన్ సర్టిఫికెట్ సినిమా అయినా వాంప్ పాత్ర తప్పనిసరి అయినపుడు ఆ పాత్ర ఆమె

రూపొందించుకున్నది కాదు. రాసేవాడు, తీసేవాడు, కూసేవాడు, కొనుక్కునేవాడు, అమ్ముకునేవాడు, సెన్సారు కత్తెర వేసేవాడు.. ఇలా అనేకమంది వుంటారు. ఏసుప్రభువు పాత్ర లానే, సెక్సుబాంబు పాత్ర కూడా తెర పరిధిలోనే నటిస్తుంది. రామరాజ్యం సినిమాలో సీతగా నటించిన నయనతారకొచ్చిన ఆనందభాష్పాలు స్మితకు ఎప్పుడూ రాకపోవచ్చు.. ఆ మాటకొస్తే ఆనంద బాష్పాలిచ్చే పాత్ర ఒక్కటీ రాకపోవడం వల్లనే ఆమె, దర్శకుడు ఏ పాత్ర ఇస్తే దానిలో సర్దుకుంది. తెరవెనుక జీవితమే చిత్రించదలుచుకుంటే అది వాస్తవానికి దగ్గరగా వుంచడం కనీస మర్యాద. లేకపోతే అది మానవహక్కుల ఉల్లంఘన అవుతుంది. ఆమెకున్న గోప్యతా హక్కు (రైట్ టు ప్రైవసీ)ని భంగపరచినట్టు అవుతుంది. స్మిత అసలు వూరు ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి అని, మాతృభాష తెలుగు అని, నిరుపేద కమ్మకులంలో పుట్టిందని, అమ్మానాన్నలు పెట్టినపేరు విజయలక్ష్మి అని, నాలుగో క్లాసు వరకు చదువుకుందని, ఒక సోదరుడు మాత్రం వున్నాడని, సినిమాలంటే చాలా ఇష్టమని, డొమెస్టిక్ వర్కర్‌గా, టచ్ అప్ గర్ల్ గా సెట్స్ మీద పనిచేసిందని అరకొర సమాచారం తప్ప, నటి కాక ముందు ఆమె జీవితం గురించి ఎలాంటి వివరాలూ బయటికి రాలేదు. 200 సినిమాల్లో నటించి ఒక ఇమేజ్ సంపాదించి నాట్యతారగా అగ్రస్థానానికి చేరుకున్న ఆమె 1996 లో చెన్నైలోని ఒక చిన్న అపార్ట్ మెంట్‌లో ఆత్మహత్య చేసుకోవడానికి కారణమేమిటో తెలీదు. అసలది హత్యా, ఆత్మాహత్యా అనే విషయం కూడా ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఆమె బాల్యమూ, వ్యక్తిగతమూ, ఆర్తీ, ఆవేదనా, పూర్తి అప్రధాన విషయాలుగా మిగిలిపోయాయి. నట జీవితానికి త్వరలోనే స్వస్తి చెప్పి దర్శకత్వ బాధ్యత చేపట్టాలని వుందని చనిపోవడానికి ఏడాది ముందు ఇచ్చిన ఇంటర్వ్యూని, ఆమె ఉరివేసుకున్న రోజున మాత్రం పదే పదే చూపించారు. "చిత్ర పరిశ్రమలో క్యారెక్టర్ అనే మాటకి అర్ధమే లేదని..." ఆమె ఒక స్టేట్‌మెంట్ ఇచ్చింది. బతికి వుంటే బహుశ ఈ డర్టీ ఇండస్ట్రీ గురించి ఆమె ఒక సినిమా తీసేదేమో!

సిల్కుస్మిత మీద డర్టీపిక్చర్ పేరుతో సినిమాతియ్యడం గురించి వచ్చిన వివాదాలకి ఏక్తాకపూర్, విద్యాబాలన్ కలిసి సిఎన్ఎన్ ఛానల్‌కి కొన్ని ఆసక్తికర జవాబులు చెప్పారు.

"డర్టీ" అనే మాట రెచ్చగొట్టడానికి వాడలేదు. అప్పటి చెన్నై ఫిల్మ్ ఇండ్రస్టీలో వున్న డ్రాకులాల్ని తట్టుకోవడానికి నటీమణులు ఎలాంటి పని అయినా చేసేవారు. సిల్కుస్మిత జీవితమే వివాదాలమయం. ఆమె ఎలా కావాలనుకుందో అలా బతికింది. ఎవరేం అనుకుంటారో అని అవి ఎప్పుడూ పట్టించుకోలేదు. ఎక్కువ డబ్బులొస్తాయని నీలి సినిమాల్లో నటించింది. అయినా దాచుకున్నది తక్కువ. స్వతహాగా మంచివ్యక్తి.

అసలు విజయలక్ష్మి లాంటి మామూలు అమ్మాయి సిల్కుస్మితగా పేరు మార్చుకోవడంలోనే ఒక ఉద్దేశ్యం వుంది. అందులో ఇండ్రస్ట్రీ ప్రోద్బలం ఉండచ్చు. అయినా ఒప్పుకుంది కదా. సిల్కుస్మిత పేరులోనే ఒక సెక్స్ అప్పీలు వుంది? సిల్కుస్మిత, నైలాన్ నళిని, పాలిస్టర్ పద్మినిలాంటి పేర్లు దేన్ని సూచిస్తాయి? వారి జీవితాల్ని తెరకెక్కించినప్పుడు ఇంకెలాంటి పేరు పెట్టాలి చెప్పండి? జనం వాళ్ళని ఏ కళ్లతో చూస్తారో నా సినిమాకి ఆ పేరే పెట్టాను. సినిమా పిచ్చిలో పడి ఇల్లు వదిలి వచ్చిన మహిళల పరిస్థితికి ఇది అద్దం పడుతుంది. ఆమె అభినేత్రి సావిత్రి కావాలనుకుంది. కాలేదు. మరోలా మార్గం ఏర్పరుచుకుంది. జీవితాల్ని తెరకెక్కించమంటే కమర్షియల్‌గా కొంత కల్పన తప్పదు. మసాలా తప్పనిసరి. అసలది సిల్కు స్మిత జీవితం కాదు. అలాంటి అందరిది.'' అనేశారు.

‘‘ఈ పాత్రకోసం అనేక గొప్ప పాత్రలు వదులుకున్నాను. ఇది నా కమిట్‌మెంట్..సిల్కుస్మిత పాత్రని రక్తి కట్టించే ఒక సన్నివేశం దగ్గర ఏకధాటిగా ఏడు సిగరెట్లు తాగి మరీ ప్రాక్టీసు చేశాను. అసలు, ఈ పాత్ర ఏమి చెబుతుంది? ఎలాంటి నదురూ బెదురూ లేని జీవితం చెబుతుంది. బాడీ సెలబ్రేషన్ అంటే ఫెమినిజమే కదా'' అంది విద్యాబాలన్.

కపూర్ ప్రసంగంలో బోలెడంత లౌక్యం వుంది. ఓ పక్క బైట హోర్డింగుల్లో సిల్కుస్మిత శరీరం వుంది. విడుదలకి ఆమె పుట్టినరోజునే ప్రత్యేకంగా ఎంచుకోవడం జరిగింది..విద్యాబాలన్ శరీరం స్మిత శరీరానికి మ్యాచ్ అవలేదని కొందరూ, అయిందని కొందరూ చేసిన చర్చ కళ్ళముందే వుంది. తీరా కోర్టుకి వెళ్ళేసరికి అసలా కథ సిల్కుది కాదు. అందరిదీ అంటున్నారు.

విద్యాబాలన్ స్టేట్‌మెంట్ అయితే పూర్తిగా వివాదాస్పదం. ఫెమినిస్టులే కాదు ఏ మానవ హక్కులు తెలిసిన వారయినా ఏం చెబుతారు ?. చాలా హక్కులతో బాటు లైంగిక హక్కు కూడా వుంటుంది. మనుషులకయినా జంతువులకయినా అని కదా. మరి ఈ వక్రీకరణ ఏమిటి?

ఒక విశాలమైన కాన్వాసుని ఇలా ఎవరికి నచ్చిన చట్రంలో వారు ఇరికించి మాట్లాడడం తరచూ చూస్తూనే వుంటాం.

8.12.2011

# కాళ్ళను కళ్ళలో పెట్టి చూసుకోవాల్సిందే

నిజాం ఆస్పత్రిలో ఒ.పి కార్డు కోసం క్యూలో నుంచున్నాను. అందరికంటే ముందు నుంచున్న అదృష్టవంతుడు బిల్లు చెల్లించి అభిమన్యుడిలా దూసుకెళ్ళాడు. స్ట్రెచర్ మీద రెండు కళ్ళు నా కోసం ఎదురు చూస్తున్నాయి.

గాయల వార్డు లిఫ్ట్ ముందు గుంపులో నుంచున్నాను. అందరికంటే ముందు కాళ్ళు అతికిన వాళ్ళ తాలుకు అదృష్టవంతురాలు కాఫీ ఫ్లాస్కుతో ఎదురొచ్చింది. నా చూపులు స్ట్రెచర్ మీదున్న మనిషిమీదా, జారుతున్న సూట్కేసుమీదా వున్నాయి.

బెడ్ నంబరు పదకొండు పక్కన బి.పి, చూస్తూ నుంచున్నాను. అందర్నీ దాటుకుంటూ నన్ను అదృష్టవంతురాల్ని చెయ్యడానికి వచ్చిన కుర్ర డాక్టరు చాంతాడంత మందుల చీటి చేతికిచ్చి తరిమి కొట్టింది. యాభై తొమ్మిది కిలోల బాధని ఒడిసి పట్టడానికి వేలాడుతున్న ఇనపరాయి మీంచి చూపు తిప్పి క్యూలో కలవడానికి పరిగెత్తాను.

గది నుంచి మందుల దుకాణానికి మధ్య వున్న నాలుగంతస్తుల దూరాన్ని పడూతూ లేస్తూ కొలుస్తూ వుంటే, అందరికంటే ముందు తొందరపడి మెట్లు దిగిన దురదృష్టవంతురాలు ఏదో మర్చిపోయి ఆయాసపడుతూ మళ్ళీ వెనక్కి వస్తోంది.

అంత దురాన క్యాంటీన్ పక్కన, చెట్టు కింద ఆరోగ్య శ్రీ అభాగ్యులు కదులుతున్న మా క్యూ వంక అసూయగా చూస్తున్నారు. మంత్రిగారి వాగ్దానం విని భూతవైద్యాన్ని వదులు కున్నందుకు, ముసలవ్వలు సంతానాన్ని చివాట్లు పెడుతున్నారు. పెద్దల మాట చద్ది మూట కదా. వారం రోజులుగా వాళ్ళు చద్ది లేక శుష్కించిపోతున్నారు.

నిరుద్యోగుల సంఖ్య నింగికి ఎగురుతున్నా, ఆస్పత్రిలో సిబ్బంది లేరు. అందరికంటే ఆఖర్న వచ్చి కూడా అదృష్టవంతుడై పోయిన రాజకీయ గూండా ఒకడు

గానా బజానాతో నాలుగు కార్లతో వచ్చి మిలీనియం గదుల్ని ఆక్రమించాడు. ఆస్పత్రి అంతటా ఖద్దరు రక్షణ కోసం తుపాకీ గుండ్లు క్యూలో వున్నాయి.

బతుకులు క్యూలో వున్నాయి. చావులు క్యూలో వున్నాయి. ప్రశ్నించే ఆగ్రహాన్ని, నిస్సహాయమైన కడుపుమంటల్ని తొక్కి పెట్టి చిన్న సూది కోసం, గుళిక కోసం ఎదురు చూపులు క్యూలో వున్నాయి. క్యూలు చెదిరిపోకుండా శాంతి భద్రతలు క్యూలో వున్నాయి. క్యూ లు పూర్తవకుండానే కౌంటర్లు మూసుకుంటున్నాయి. వైద్యుడి కొలువులోనే కొనవూపిరి ఆగిపోతోంది.

కాశీ యత్ర చేసి వచ్చిన కూలి చీమలాగా కాళ్ళు నిమురుకుంటూ క్యూలో పడ్డ కష్టాలు భర్తకి చెబుతున్నాను.

"అదృష్టవంతురాలివి. క్యూలో నిలబడ్డానికి నీకు కాళ్ళయినా వున్నాయి. మరి నా సంగతేమిటి?" అన్నాడు. గుండె నీరయి నట్టనిపించింది. పెద్ద గీత ముందు చిన్న గీత వెలా వెలా పోయింది. కాలు విరిగి మంచాన వున్న వాడికి కదులుతున్న క్యూలు చైతన్య రధాల్లానే కనిపిస్తాయి కదా.

"చూడు చిట్టి తండ్రీ, నుంచున్న వాళ్ళు మాత్రమే క్యూలో వున్నట్టు కాదు. ఒ.పి వార్డు ముందు బల్లల మీద కూలబడ్డ క్యూ వుంది. గుండె కోతలు పూర్తయి మగత లోంచి మెలకువలోకి రావడానికి రెప రెపలాడే కంటిరెప్పల క్యూ వుంది" అని చెప్పాను.

తను నవ్వాడు.

అప్పటిదాకా ముఖంలో వున్న ఆందోళననీ, భయాన్ని, ఒంటరితనాన్ని, వైరాగ్యాన్ని దాటుకుంటూ, క్యూ చివర వున్న చిర్నవ్వు వెలిగిందన్నమాట.. ఫర్లేదు. నాకు చాతనైన మానసిక చికిత్స నేనూ మొదలు పెట్టాను అనిపించింది.

"అమ్మా నేను వచ్చెయ్యనా? కంగారేం లేదు కదా? డబ్బులు పంపనా?" పరదేశీ లాంటి కొడుకు గొంతు చెవిలో గింగురు మంటోంది. కంగారు వుంటే మటుకు వున్నది వున్నట్టు నేను వాడికి చెప్పగలనా? ఏ పరిచయం లేకుండా అక్కడున్న ఆ నీలం చీర పిల్లతో పంచుకున్నంత బాధ కూడా కన్న కొడుక్కి నేను వినిపించలేను. బహుశా వాడూ అంతేకావచ్చు. కన్నవాళ్ళకీ పిల్లలకీ మధ్య ఎంతో ప్రేమగా దించుకున్న డాలరు తెర, ఒక సామూహిక ఒంటరి దు:ఖం. మనిషి నిప్పును కనిపెట్టడానికి చేసిన ప్రయత్నం, నేలమీద నిలబడ్డానికి కూడా చెయ్యలేమో.

26.2.2009

# కత్తిరించు - అతికించు.. ఇదే మన విజ్ఞానం

మనిషికి తోక జారిపోయిందెన్నడు? నాలుగు కాళ్ళమీద గెంతినవాడు కాస్తా రెండుకాళ్ళమీద నిలబడి నప్పుడు కదా! దీన్ని కాస్మిక్ రేడియేషన్ థియరీ అంటారని చిన్నప్పుడెప్పుడో చదివాను. అంటే, మనకి ఉపయోగపడని ప్రతి అవయవం మాయమవుతున్న కొద్దీ, మిగిలిన అవయవాలే మరింత బలంగా పనిచేయాలి. కానీ, జీవన వేగంలో శరీరం బలహీనమవుతూ వచ్చింది. మెదడు ఒక్కటయినా అభివృద్ధి చెందుతోందనీ దానిసాయంతో చుక్కల్లోకి ఎగర గలుగు తున్నామనీ ఎంతో సంబరపడుతున్నాం.

మెదడు స్థానంలో మీటలు మొలిస్తే అప్పుడెలా వుంటుంది? మన ఆలోచనలు ఇంకేవో అరలూ మరలూ చేస్తుంటే, మన రాగద్వేషాలు బ్యాటరీ సాయంతో కదులుతుంటే దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కొలంబియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసరు బెస్టిస్పారో అనే మానసిక శాస్త్రవేత్త ఏమన్నాడంటే, ఇక ముందు మన చేతివేళ్ళకి తప్ప మరిదేనికీ పని మిగలకపోవచ్చుట, నమ్మలేకపోతున్నారా? “నేను నిజమే చెబుతున్నాను. గూగుల్, యాహూ, ఆల్టావిస్టా వగైరా వగైరా” సెర్చ్ ఇంజన్స్ ఇందుకు ఉదాహరణగా ఆయన చెబుతున్నాడు. ఒకరకంగా ఇవి మానవాళికి ఎంతో సేవ చేస్తున్న మాట నిజమే. కానీ ఈ క్రమంలోనే మనలో అన్వేషణకు చోటులేకుండా చేస్తున్నాయి. నీకు ఏ సమాచారం కావాలో చిటికెలో ఇస్తానని ప్రకటించిన సాఫ్ట్ వేర్ తనదగ్గర వున్న కుప్పలోంచి మాత్రమే ఏరుకొమ్మంటుంది. ఎందుకంటే ఏం కావాలో దాని స్పష్టతగానీ, తయారీ దినుసులు గానీ నీదగ్గర లేనప్పుడు, ఇక ఖాళీతనమే శాశ్వతమనే భావన కలుగుతుంది. వెతుకులాటలో మొదట పోగొట్టుకునేది వివేకాన్నే. నిండు సముద్రంలో కొట్టుకుపోతూ అమెరికా ఖండాన్ని కనిపెట్టిన కొలంబస్‌లకి ఇక్కడ పనిలేదు. కావాలంటే ఇప్పుడు రీసెర్చి చేస్తున్న కొందరు విద్యార్థుల్ని అడగండి. జస్ట్ కట్ అండ్ పేస్ట్ విధానంలో తయారీ అవుతున్న పేపర్లు దేనికి చిహ్నం? పేపర్లే కాదు, కవిత్వమూ, అనువాదము, గ్రాఫిక్సూ గట్రా గట్రా ఎన్నో ఎన్నెన్నో ఈ విధానంలోనే తయారవుతున్నాయని ఆ ప్రొఫెసరు మొత్తుకుంటున్నాడు. కిరాణా దుకాణానికి వెళ్ళేవాడు తనకి ఏంకావాలో చిట్టా రాసుకుంటాడు. ఎగ్జిబిషన్‌కి వెళ్ళేవాడికి చిట్టా అక్కర్లేదు, అక్కడ వున్నవాటిలోనే ఏది ఆకర్షణీయంగా కనబడితే అది కొనుగోలు చేస్తాడు. ఆకర్షణ చాలాసార్లు ప్యాకింగ్‌తోనే వస్తుంది. వస్తువు ఎలాంటిదో వాడుకలో తప్ప తెలీదు. అంటే, కుప్పపోసినది సమాచారమైనా వస్తువులైనా, మనిషి ఆలోచనా, నాణ్యతా, ఎంపికలస్వేచ్ఛ తగ్గిపోతుంది. ఈ బానిసత్వం టీవీలను చూస్తున్న ప్రేక్షకులకి కూడా వర్తిస్తుంది. క్రియాశీలత లేకుండా సెర్చ్ ఇంజన్‌లో కుప్పపోసిన దానిలో ఏదో ఒకటి కత్తిరించుకుని అతికించుకునే రీమిక్స్

విజ్ఞానంలో భావశూన్యత తప్ప ఇంకేమీ లేదు. ఈకంప్యూటర్లు మనల్ని మీటనొక్కి తనలోకి ఈడ్చుకు పోతున్నాయని లీసా ఎమ్ క్రిజర్, శాన్ జోస్ నుంచి వెలువడే మెర్క్యూరీ అనే న్యూస్‌పేపరులో రాసాడు. ఒక కొత్త విషయాన్ని గురుముఖంతో నేర్చుకోవడంలో అటు నేర్పేవాడికీ, నేర్చుకునేవాడికీ మధ్య ప్రశ్నలు జవాబులూ వుంటాయి. సజీవత్వం వుంటుంది.

ఇప్పుడు మీ చిన్నారి పిల్లలు కూడా కంప్యూటర్ క్లాస్ రూంలో కూచుని కళ్ళమీద పడుతున్న గ్రాఫిక్ బాణాల్ని తమాయించుకుంటూ గణితాన్ని నేర్చుకోబోతున్నారు. తను పాఠం చెబుతున్నప్పుడు పిల్లవాడు వింటున్నాడో, కడుపునొప్పితో ఏడుస్తున్నాడో, రేడియేషన్ పొర్లుతున్న స్క్రీన్‌గారు చేతులు చాచి చూడరు. అంటే ఇస్తున్న సర్వీస్‌కి స్పందన తెలుసుకోవడం జరగదు. ఆరుబైట మైదానంలో గాలికెగిరి ఎవరైనా బంతి ఆడుతున్నప్పుడు ఆటగాడితో బాటు, అక్కడ అది చూస్తున్న అందరం ఉద్వేగానికి గురవుతాం. ఉద్వేగానికి ఆట పూర్వాపరాలు తెలియనక్కర్లేదు కూడా. కంప్యూటర్ తెరమీద వేళ్ళు కదిలిస్తూ మన చిన్నారి గుర్రపుస్వారీ చేస్తుంటే ఆ మజా వస్తుందా? బెస్టిస్పారో అనే శాస్త్రకారుడు చెబుతున్నది అదే. సమాచారం మొత్తం మేమే ఇస్తాం, ఒకచోట కత్తిరించండి "ఇంకోచోట అతికించండి" అంటూ వెంటబడుతున్న ఉద్యోగసంస్థలు కూడా వున్నాయి. ఒకటి ప్లస్ ఒకటి, కూడిక చెయ్యడానికి బుర్ర అక్కర్లేదు. జేబులో వున్న కాలిక్యులేటర్లో వెతుకుతున్నాం. అక్షరదోషం దొర్లినప్పుడు దిద్దుకోవాల్సిన పనిలేదు. స్పెల్‌చెక్స్ ఎలానూ వున్నాయి. ఒక విద్యార్థి పరీక్ష పాసవడానికి ఏవి అర్హతలు అనుకుంటున్నామో, అవి ఇప్పుడు అనవసర భ్రమలు. పరమబోరు నాస్టాల్జియా "సృజనాత్మక రచనల విషయంలో అయితే ఈ కత్తిరించు ప్లస్ అతికించు విధానం పరమ దుర్మార్గమైన చోరకళని పోషిస్తోంది. మూల రచయిత గుండెకి గండికొడుతోంది. అచ్చయిన లేదా ప్రసారమైన తేదీని బట్టి ఒకప్పుడు మూల రచనని గుర్తించడం సాధ్యమయేది. అంతర్జాలం (ఇంటర్నెట్)లో అలాంటి సౌలభ్యం వుందో లేదో, వుండకపోతే దాని భద్రతకు సంబంధించిన మృదు అస్థి (సాఫ్ట్‌వేర్) ఎవరు కనిపెడతారో తెలీదు. తెలిసేలోపు చాలా అనర్థాలు జరిగిపోవచ్చు. మనిషిని మింగే టెక్నాలజీని గురించి తెలుసుకోవాలంటే ఒంటే- గుడారం కథ గుర్తుచేసుకోవాలి. తలదాచుకోవడానికి చిన్నచోటు ఇమ్మని ఒంటె మనిషిని అడుగుతుంది. తలతో బాటు మెడ, వీపూ లోపల పెట్టేస్తుంది. పోనీలే పాపం అని మనిషి పక్కకి జరుగుతాడు. కొంతసేపటికి అదే గుడారం అంతా ఆక్రమించి మనిషిని బైటికి నెట్టేస్తుంది. టెక్నాలజీ అయినా అంతే. అది మన చూపుడువేళ్లమీద నిలవాలి కానీ మనం దాని ఎలక (మౌస్) బోనులో ఇరుక్కోకూడదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే.

16.8.2011

# పిల్లలు వద్దు - సెల్‌ఫోన్ ముద్దు

బ్రాండ్ అంబాసిడర్ అభిషేక్ బచ్చన్, తన మేమ్ సాబ్ ఐశ్వర్యారాయ్ గర్భవతి అయిన శుభ సందర్భంలో దేశ జనాభాని అదుపు చేయడం కోసం ఐడియా సెల్యులర్ వాడకం ఒక మార్గంగా ప్రమోట్ చేసే పనికి కుదురుకున్నాడు. ఏమిటా ఐడియా ప్రకటన అంటే, ఒన్ డే క్రికెట్ మ్యాచ్ చూస్తున్నారనుకోండి. బాల్ ఎగిరి ఎక్కడ పడిందో తెలుసుకునేలోపు కరెంట్ పోతుంది. లేదా మధ్యలో వచ్చే కమ్మర్షియల్ బ్రేక్‌లో ఒక అందాల తార సబ్బు రుద్దుకుని దిశమొలతో నీళ్ల తొట్టిలోకి దిగిన వెంటనే ఇల్లు అంధకారంలో మునిగిపోతుంది. ఏం చేస్తాం చెప్పండి? జీవితమే శూన్యమైపోయినట్టుగా వుంటుంది. కాదా మరి? అయినా ఎలాగోలా గుండె దిటవు చేసుకుని, సరేలే పోనీలే, మనకంతే భాగ్యం అనుకుని భార్యాపిల్లలతో/భర్తా పిల్లలతో సరదాగా గడుపుతారేమో జాగ్రత్త, అలాంటి తప్పుడు పన్లు ఎప్పుడూ చెయ్యకూడదు. అప్పుడు జేబులో వున్న ఐడియా సెల్యులర్ బైటికి తియ్యండి. మొబైల్ టివి, గేమ్స్, వీడియో కాలింగ్స్ లాంటి రకరకాల ఆప్షన్స్ వున్నాయి చూశారా. హమ్మయ్య! ఇంక, ఎవరు పలకరించినా పట్టించుకోండి. ఐడియాతో పడి కొట్టుకుపోండి. నిరవధిక సంతోషంతో ఉప్పొంగి పోండి. దీనివల్ల వేరే పిచ్చి ఆలోచనలేవీ రావు. సంతానం ఉత్పత్తి కాకుండా వుంటుంది. దేశ జనాభాని చక్కగా అదుపు చేసుకోవచ్చు. ఈ

ఆలోచనకు అన్ని శాఖల మంత్రివర్యుల హర్షధ్వానాలు దక్కాయి.

ఆలిండియా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అయిన గులాం నబీ ఆజాద్ గారు కూడా అపరిమితంగా పెరిగిపోతున్న దేశ జనాభాని తల్చుకుని ఎంతో బాధపడుతూ దాన్ని అరికట్టడానికి ఇంకో సంచలనాత్మకమైన వ్యాఖ్య చేశారు, అదేమిటంటే,

“చిన్న పెద్ద అనే తేడా లేకుండా అన్ని గ్రామాలకీ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలి. దానివల్ల, అందరూ టివి సెట్లు కొనుక్కుని అర్ధరాత్రి వరకూ కూచుండిపోతారు. పగలంతా పని, రాత్రంతా టివి, అలసిన శరీరానికి దుష్ట ఆలోచనలేవీ రావు కదా, అప్పుడు గమ్మున నిద్రపోతారు. దీనివల్ల జనాభా పెరిగే ప్రమాదం తప్పుతుంది. అర్థమయిందా? మనం ఇంత కాలంపాటు విద్యుత్ కొరత వల్ల పొలంలో మోటార్లుతిరగడం లేదని, పిల్లల చదువులు కుంటుపడుతున్నాయని, గ్రామాలు చీకటిలో మునిగిపోయి వున్నాయని, నేరాలు పెరిగిపోతున్నాయని, జీవన ప్రమాణాలు అడుగంటిపోతున్నాయని ఏమిటేమిటో అనుకున్నాం, కానీ అసలు నష్టం అది కాదు. టివి లేని చీకటి కారణంగా మనలో వివిధ రసాయనిక మార్పులు జరిగిపోయి తగుదునమ్మా అని సంతానోత్పత్తికి కారణమైపోయి, తద్వారా దేశానికి తీరని ద్రోహం చేస్తున్నాం. అది కూడా ఒక ప్రతిష్ఠాత్మక రాజకీయ ప్రతినిధి చెప్పేదాకా తెలిసి చావలేదు, అబ్బచా సిగ్గేస్తోంది కదూ?

ఇంత లావు విషయం విన్నాక మరి తప్పుతుందా? ఎట్టి పరిస్థితిలోనూ టివిని, సెల్‌ఫోన్ని వదిలే పని లేదు. అన్నట్టు సెల్‌ఫోన్ తాలూకు రేడియేషన్ వల్ల దానికోసం కట్టిన టవర్ల వల్ల బ్రెయిన్ కాన్సరు వస్తుందంటున్నారు కదా, పిచ్చుకలు, పావురాలు పిట్టల్లాగా రాలిపోయాయి కదా మళ్ళీ ఇదేమిటి అని తిక్కతిక్కగా ప్రశ్నించకండి. రాజకీయాలకీ వ్యాపారానికీ గొప్ప వేవ్ లెన్త్ వుంది. అయినా గానీ, గులాం నబీ గారి ఆలోచన బానే వుంది. తొమ్మిది నెల్లూ మోసి బిడ్డని కనడం కంటే, టివి ముందు కూచుని జీళ్ళపాకం సీరియళ్లు చూడ్డం అలుపు లేని పని కదా. కానీ ఈ సీరియళ్ళు పగలే వస్తాయి, రాత్రిళ్ళు మిడ్ నైట్ మసాలా వస్తుందేమో. అప్పుడు ఎలా తట్టుకోవాలి. ఇవి సంతానాన్ని పెంచుతాయా తగ్గిస్తాయా, హనుమాన్ చాలీసా చదువుకోవాలా? నలభైరోజులకి బదులు ఏటికేడాదీ అయ్యప్పని శరణు వేడుకోవాలా?

పోనీ జనాభా అరికట్టడానికి భక్తి, జీవన విరక్తి అని కొన్ని కార్యక్రమాలు టెలికాస్ట్ చేస్తే నయమేమో, మరి భక్తిలోనూ రెండు రకాలున్నాయి కదా. అన్నమయ్య సినిమా చూసి రుద్రాక్ష మాలని తిప్పుదామా అంటే పాత సినిమాలు రావు, కొత్తదానిలో నాగార్జున గారు ఇద్దరు భార్యలతో ప్రదర్శించిన రతివాద భంగిమలు మతిపోగొడుతున్నాయి.. యోగి వేమనని తెరకి ఎక్కించినా గాని అతని తత్వాలకంటే

గోచీ ప్రదర్శనే ఎక్కువ ఆకర్షణీయంగా వుంటుంది.

దానాదీనా జనాభాని అరికట్టడానికి ఇంత మృదువైన మార్గాలు వుండగా, రోడ్ల మీద యాచక బాలల సంఖ్య అంతగా కనబడుతోందేమిటబ్బా, వాళ్ళకి కూడా తలకొక ఐడియా సెల్యులర్ ఫోను, ఫుట్ పాత్ కొకటి చొప్పున టివి సెట్లు ఇస్తే తెలుసుకుంటారేమో, అసలే మూర్ఖులు కదా పాపం.

మొన్నటి విజన్ ట్వంటీ ట్వంటీ ముఖ్యమంత్రి కంప్యూటర్లో కూరగాయలు ఎలా పండించి అమ్ముకోవాలో రైతులకి, ఎలా కొనుక్కోవాలో వినియోగదారులకి తెగ బోధన చేసినంత బావుంది కదా ఇది కూడా.

ఈ సందర్భంలో ఇంకోటి కూడా మాట్లాడుకుందాం. మామూలుగా జనాభా గురించి మాట్లాడ్డం మొదలు పెట్టగానే మన ధ్యాస నిరుపేదల మీదికి పోతుంది. లేదా మైనారిటి వర్గాలమీదికి పోతుంది. తినడానికే లేదు వీళ్లకెందుకేమిటి ఇంత మంది పిల్లలు? అనేస్తాం. వాళ్ళే అన్ని అనర్థాలకీ కారణమని నిస్సిగ్గు ప్రకటనలు, అభిప్రాయాలు కూడా ఇస్తూ వుంటాం. ఎన్నికల్లో పోటీ చెయ్యడానికి పరిమిత సంతానం వుండాలన్న నిబంధన పెద్దగా పట్టించుకోని అభ్యర్థులకి ఓటేసే చేతుల్తోనే, భార్యల సంఖ్యే లెక్కలేనివారికి పిల్లల అంకె గుర్తు వుంటుందా? అనుకుని సరదాగా కార్టూన్లు చదువుకునే కళ్లతోనే పేదల జీవితాలు మన చేతిలోనే వున్నట్టు నచ్చిన వ్యాఖ్యానాలు చేస్తాం. వాళ్లకి ఎంత తక్కువమంది సంతానం వుంటే మన కార్లకి అడ్డంపడి అడుక్కోకుండా వుంటారో అది కావాలి. ఇళ్ళు వాకిళ్ళు లేక ఫుట్‌పాతుల మీద కూచోవడం వల్ల, పోలీసు దెబ్బ తగలదనుకున్నచోట వాళ్ళు చేస్తున్న రోడ్డువార సంసారాల వల్ల తద్వారా ఉద్భవించే సంతానం వల్ల ఎంత ఆహార సమస్య, వనరుల సమస్య, పర్యావరణ సమస్యలు చుట్టుముడుతూ వున్నాయో కూడా బాగానే చెబుతాం.

మనసు పెట్టి ఆలోచన చేస్తే అసలు ఆహార సమస్య ఎలా వచ్చిందో మనకి తెలీదా? రైతుకి రుణాలివ్వక, ఇచ్చిన రుణం తీర్చుకునే మార్గం కనబడక, పుచ్చులేని విత్తనం దొరక్క, పంటకి గిట్టుబాటు ధరలివ్వక, భూముల్ని బతకనియ్యక రియల్ ఎస్టేట్లకు తరలించడం వల్లనూ, ఇంకా అనేకానేక ప్రభుత్వ, పెట్టుబడిదారీ దొంగల దుర్మార్గాల వల్లనూ వస్తుంది. పేదలు కంటున్న జనాభా వల్లనే వచ్చిందనడం న్యాయమేనా?

పర్యావరణ సమస్య ఎలా వచ్చింది? ఫ్యాక్టరీ కాలుష్యాల వల్లనూ, యంత్ర భూతాలు విడిచే పొగల వల్లనూ వస్తోంది. అక్రమంగా నరుక్కున్న కలప తరలింపుల

వల్ల వస్తోంది. చెట్లు కొట్టి వేయడం వల్ల వస్తోంది. కేవలం గ్రామస్తులు విసర్జించే మల మూత్రాల వల్లనే వస్తుందంటున్నారే, ఇది నమ్మాలా?

నీటి కరువు ఎందుకు వస్తోంది? డబ్బున్న బాబుల అంతస్తుల్లో పొర్లుతున్న బాత్ టబ్స్ కారణంగానో, అక్రమ లీకేజీల కనెక్షన్ల వల్లనూ వస్తుంది. కబ్జాకు గురి అవుతున్న చేపల చెరువుల వల్లనూ వస్తోంది. సినిమాల్లో వానపాటల పేరిట ట్యాంకర్ల కొద్దీ కుమ్మరించే నీటి వృథా వల్ల కూడా వస్తుంది.

మీ ఇంట్లో పెట్టుకున్న ఎసి వల్ల పక్కనే వున్న చిన్న ఇంటికి ఆక్సిజన్ కరువు అవుతోందని తెలుసా?

సామాజికంగా మనం చాలానే నేరాలు చేస్తూ వుంటాం.

అనంత పద్మనాభస్వామి ఆలయం ఆరో గదిలో ఏం వుందో, పుట్టపర్తి పుట్టలో ఎన్ని పాములూ, పురుగులూ వున్నాయో తెలుసుకోవాలనే తీరిక, కోరిక వున్నదెవరికి? సామాన్యుడికి కాదు కదా.. రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపు నిండని వాడికి ఇవి పడతాయా, పట్టవు! కాబట్టి వాళ్లకయినా మానవ సంబంధాలు మిగలనిద్దాం. ఈ భూమి మనదే కాదు, వాళ్ళది కూడా. పని చెయ్యడానికి గాని, అది దొరక్కపోతే అడుక్కుని తినడానికి గాని, వారసుల్ని కని చూసుకోవాలని వాళ్లకుండచ్చు కదా. మనలాగానే వాళ్లకీ వార్ధక్యం ఒకటి వుంటుంది కదా, అప్పుడెవరు ముద్ద పట్టుకొచ్చి పెడతారు. మనమా? వాళ్ల సంతానమా? చనిపోతే తల్చుకుని ఎవరు ఏడుస్తారు? మనమా, వాళ్ల సంతానమా? ఇవి కూడా వారి జీవితాలకి అందకూడని విషయాలేనని మనం తీర్పు ఇద్దామా? సమయం వచ్చినప్పుడల్లా జంతువుల్ని స్టెరిలైజ్ చేసినట్టు, బలవంతపు ఆపరేషన్లు చేసేస్తూ వున్నారే.. వాళ్ల గర్భసంచుల్ని కడిగేస్తూ వున్నారే. గినీ పిగ్‌ల మాదిరి నానా చెత్త పరిశోధనలు చేస్తూ వున్నారే. బుద్ధుడు పుట్టిన దేశమంటే ఇదేనా?

జనాభా విషయంలోనే కాదు, అవినీతి విషయంలో కూడా మన దేశం రెండవ స్థానం దక్కించుకుంది. అసలు అవినీతి తగ్గితే, జనాభాకి కావలసిన వనరులు ఒక సమస్య కాదు.

2.9.2011

# ఆ దేశం నీకేమిచ్చింది?

లూసియానాలో చదువుకుంటున్న అల్లం రాజయ్య కంటిదీపం కిరణ్‌కుమార్ హత్య వార్త విన్నప్పటినుంచీ మనసు మనసులో లేదు. అంతకు ముందు ఎ.బి.కె. ప్రసాద్ మనవడి మరణం ఇలాంటిదేనని గుర్తొచ్చింది.

ఈ రెండింటికీ మధ్య కూడా ఇంకా చాలా చదివాను. ఆ తల్లిదండ్రుల గుండె కోత నన్ను కోత పెడుతోంది. కారణం నా కొడుకూ అక్కడే ఉన్నాడు. వాడు ఒక్కడే కాదు.

ఇవాళ మాయా అద్దంలోంచి మాత్రమే పిల్లల్ని చూసుకుంటూ, రాత్రింబవళ్ళను తలక్రిందులు చేసుకున్న ప్రతి ఇల్లూ గతుక్కుమని వుంటుంది. మావాడు ఇల్లినాయిస్ వర్సిటీలో చేరిన కొత్తలో అక్కడంతా హైద్రాబాద్ లానే వుందని చెప్పినప్పుడు ఎంత తెరిపిగా అనిపించిందో! మళ్ళీ నెల్లాళ్ళకే తన పక్క రూం విద్యార్థి పెట్రోలు బంకులో నిప్పంటించుకుని ప్రాణం తీసుకున్నాడని, అందుకు నల్ల వాళ్ళ బెదిరింపులే కారణమని చెప్పినప్పుడు వాచీ చూస్తే అది మిట్ట మధ్యాహ్నం. అంటే వాడికి నిద్ర పట్టని అర్థరాత్రి అని తెలిసి నా కళ్ళముందు హఠాత్తుగా చీకటిపడింది.

గాఢంగా వుండాల్సిన బంధాలే వొదులొదులుగా వున్నాయని బాధపడుతున్న చోట, కనీసపు హక్కులు మరీ ప్రమాదంలో వున్నాయి. మనవాడ్ని పట్టభద్రుడ్ని చేసి నిలబెట్టిన దేశం చుట్టిరావడానికి బదులు, దేహాన్ని చూడ్డానికి పరిగెత్తాల్సి రావడం ఎలాంటి శాపం?

విశ్వాసాలు నిట్టనిలువునా కూలి పోతున్నాయి. ఏది ఆశిస్తున్నామో, రాస్తున్నామో, మాట్లాడుతున్నామో అందుకు భిన్నమై పోయిన జీవితాల్లో సారం వెతుక్కోవడం చాలా కష్టంగా ఉంది. బతుకు మనది కాదు సరే, చావూ మనది కాదని తెలుస్తోంది. అది ఎవరి ఎజెండాలోనో చేరిపోయింది.

ఇలాంటప్పుడు నేను నా కొడుకుతో రహస్యంగా చెవిలో అయినా, ''నల్లవాడితో జాగ్రత్త'' అనో ''తెల్లవాడితో బావుండు'' అనో, ఒక రచయిత్రి మొహం పెట్టుకుని చెప్పలేను. రాసిన రాతలముందు దోషిలా నిలబడలేను. తల్లిగా నా బేలతనమూ దాచుకోలేను. జీవితం భయం పిడికిట్లో నలిగిపోతోంది.

ఓ పక్క ఎదుగు బొదుగు లేని జీవితాల్లోంచి పిల్లలు పారిపోతోంటే వాళ్ళని

ఇంటికేసి ఆకర్షించడమేలాగో అర్థం కాకుండా వుంది. మన దేశమెప్పుడో అనాకర్షణీయమై పోయింది. ఎంప్లాయిమెంటు రిజిస్ట్రేషను ద్వారా ఉద్యోగం సంపాయించుకున్న వాడ్ని కంటితో చూసి ఎంతకాలమై పోయిందో!

చాతనైతే పందేనికి పెంచే కోడిలా నీ పిల్లల్ని పెంచు. నచ్చిన సీటు కొనడానికి అందినంత దోపిడి చెయ్యి. చిన్న సమస్యకు కూడా పెద్ద మంత్రి కాళ్ళో, గల్లీ రౌడీ గడ్డాన్నో పట్టుకో. ఏదీ చాతకాదా? అయితే బతకడం దండగ. ప్రేమ తప్ప ఇంకేమీ ఇవ్వలేనప్పుడు, అది కూడా ప్రచారాకర్షణ ముందు ఓడిపోయినప్పుడు ఏ నైతిక హక్కుతో నీ బిడ్డని ఈ మట్టిమీద కట్టి పడేస్తావు?

డాలరు ఒక్కటే కారణం కాదు. నీ పిల్లలు మెచ్చే ఎన్నో కారణాలు అక్కడ వున్నాయి. ఖచ్చితంగా అవి కన్నవాళ్ళని మరిపించే శక్తిని ఇస్తున్నాయి. బళ్ళో చేరింది మొదలు మనవాడిలో ఎలాంటి ప్రతిభ వుందో, ఇక్కడి పంతుళ్ళు కనిపెట్టలేక పోతున్నారు. మరి అక్కడి వాళ్ళు నిగ్గు తీస్తున్నారు. కాబట్టి, పెట్రోలు పంపులో కూడా మనవాడు సంతోషంగా పనిచేస్తున్నాడు.

చదువు తప్ప ఇంకో స్వప్నం తెలీని ఒక విద్యార్థి జీవితాన్ని కూడా రెండు దేశాల మధ్య వైరుధ్యం దెబ్బ తీసినప్పుడు, ఇక యూనివర్సిటీలు శ్మశానాలు కాక ఇంకేమవుతాయి? మనం ఇప్పుడు రాజకీయ స్పృహ లేదనో, ఉద్యమ నేపథ్యం తెలీదనో బెంగ పడగలమా? పవిత్ర యుద్ధం పేరుతో, పవిత్ర ప్రేమ పేరుతో, పవిత్ర కుర్చీ పేరుతో కాలిపోతున్నది మానవత్వమే అవుతున్న దాఖలాలో మనం లేమా?

హింస డిజావూ అయిపోయింది. చరిత్ర పునరావృతమవుతోంది.

కొన్నివేల సంవత్సరాల కింద ఈ దేశాన్ని ఎవరి దేవుడు రాజ్యమేలాడో ఇప్పుడు అప్రస్తుతం. శిథిలాల కింద నలిగిన మనుషులు ఎందరో?

ఎవరెవరి ముఖాల్లో మన పోలికలున్నాయో గుర్తు పట్టడం అవసరం.

ఇంత జరిగాక ఇంకా ఎవరినైనా ఏ దేశాన్నయినా ప్రేమించమని చెప్పకండి. పిల్లల్ని ప్రేమించడానికి వనరులు సరిపోక ఏడుస్తున్న వాళ్ళం.

ఈ దేశం నీకేమిచ్చింది? ఒక వలసనిచ్చింది.

ఆ దేశం నీకేమిచ్చింది? కన్న బిడ్డ దేహాన్నిచ్చింది.

వలసకి, జీవితానికి మధ్య మిగిలినదేమిటి? అనంతమైన ఎదురుచూపు.

4.1.2008

# మన తల ఎవరి పాదాల మీద వుంది?

అనగా అనగా ఒక ఇరవై ఏళ్ళ అమ్మాయి.. అప్పుడే డిగ్రీ పరీక్ష రాసి, ఎప్పటినుంచో కలలు కంటున్న విలేకరి ఉద్యోగం కోసం పత్రికలో చేరింది. చేరిన కొత్తలోనే ఉగాది ప్రత్యేక సంచిక కోసం బాపు బొమ్మకి ప్రేమ కథ రాయమన్నారు. తెల్లవార్లూ నిద్రకాచి మనసంతా వొలకబోసి ముఖ చిత్ర కథ రాసి భయం భయంగా సంపాదకుడికి సమర్పించింది.

"ఓహో.. అబ్బో బావుంది. చాలా చాలా బావుంది, ఇదిగో చూశారా, మొన్న చేరిన ఈ బక్క పిల్ల ఎంత గొప్పగా రాసిందో.." అంటూ అందరికీ ఫోన్లు చేశాడాయన. ఇద్దరు సీనియరు సంపాదకులు అది జిరాక్సు తీసి, ఇంటికెళ్ళి మరీ చదువుకున్నారు. ఆ రోజంతా ఆ పిల్ల నేల మీద నడవలేదు, గాల్లో తేలిపోయింది.

కానీ మర్నాడే వాళ్ళకు సందేహం వచ్చింది. అన్నట్టు, బాపూ బొమ్మకి, వూరూ పేరు లేని అనామకురాలితో రాయించడమేమిటి? ఫలానా ప్రముఖుడితో రాయిద్దాం. అనుకున్నారు. సదరు ప్రముఖుడు చక చక టీ తాగినంత చులాగ్గా అక్కడిక్కడే కథ రాసి పడేశాడు.

"దిగులు పడకు, నీది వచ్చే సంచికలో వస్తుంది." అన్నారు సహ ఉద్యోగులు. అన్న ప్రకారం వచ్చే సంచికలో ఆమె కథ వచ్చింది, కానీ ఎలా? ఫలానా ప్రముఖ

రచయిత కథ చదివిన స్ఫూర్తితో వచ్చిన స్పందనల పరంపరలో ఒకటిగా వచ్చింది. అమ్మాయికి ఏడుపొచ్చింది. కానీ ఏం చేస్తుంది? ఎవరు రాసినా పత్రిక కోసమే కదా, పత్రిక బావుంటే తను బావున్నట్టే, అనుకుని ఓదార్చుకుంది. పత్రికల్లో రాతలకి సిరా తప్ప, అనవసరంగా హృదయం ఖర్చు చెయ్యక్కర్లేదని అలా తెలిసింది.

నాలుగేళ్ళ పాటు మూసుకున్న ఉదయం పత్రిక గేట్లు అవాళే తెరుచుకున్నాయి. జీతాలిస్తారన్న వార్తకి ఊరంతుకున్నంత ప్రచారంతో అంతా వచ్చారు., రామ్ నగర్ మలుపు నుంచి ఆఫీసు గేటులోపలికంటా క్యూ కట్టిన సిబ్బందిలో ఆ అమ్మాయి కూడా వుంది. తొమ్మిదింటికి రావాల్సిన యజమాని రెండయినా దిక్కు లేదు. చివరికి మూడున్నర దాటాక జీతాలిచ్చే గుమాస్తా చల్లటి కారులో వచ్చాడు. భయభక్తులతో దారి ఇచ్చారు రాత గుమాస్తాలు. లోపలికెళ్ళి వొళ్ళు విరుచుకుని, విశ్రాంతి తీసుకుని, టిఫిను తెప్పించుకుని, ముఖ్యులతో మంతనాలాడి, ఇక అప్పుడు, గది కిటికీ తీసి సినిమా టిక్కెట్ల మాదిరి జీతం కవర్లు ఇవ్వడం మొదలుపెట్టాడు. కాగితాలు లెక్కపెట్టుకున్న వాళ్ళెవరి మొహాలు వెలగడం లేదు.కారణం అది ఒక్క నెల జీతం. బకాయీ పడ్డ ఏడు నెలలలో పదో వంతు కూడా లేదు. అవి కూడా నలభై మందికి ఇచ్చి "హౌస్‌ఫుల్" బోర్డు పెట్టాడు.

మళ్ళీ తర్వాత షో ఎప్పుడో ఎవరూ జవాబు చెప్పలేక పోయారు. మొత్తం అంతా శవ జాగారణ.. చచ్చిన కొలువుల్ని పాడె ఎక్కించి కూచున్నారు. చిల్లర డబ్బులు కూడా రాలడం లేదు.

"డౌన్ డౌన్," అందరితో బాటు ఆ అమ్మాయి కూడా అరిచింది. బరువైన కవర్లు అందుకున్న కొందరు అందరినీ కంట్రోలు చేస్తున్నారు.

"అన్నేళ్ళు పనిచేసిన మాకే జీతం లేదు, మీరంత తొందర పడితే ఎలా?" అన్నాడొకడు ఆమెని చూసి, ఆ అమ్మాయి తెల్లమొహం పెట్టుకుని వెళ్ళిపోయింది. నిజమే కదా! పత్రిక మూసేద్దామని ఆలోచన రాగానే అమ్మేసిన ఫర్నిచరుతో బాటు, తగ్గించిన కలరు పేజీల్తో బాటు, "కుదింపు" పేరిట రోడ్డు మీదికి గెంటేసిన ఆడవాళ్ళలో ఆ పిల్ల కూడా వుంది. అందువల్ల హక్కులు లేవు, ఆందోళనల్లేవు.

మూడు కాళ్ళ పందెం (త్రీ లెగ్ రేస్- మినరలు వాటరు కంపెనీ) వారు నడిపిన "వర్తమానం" అనే పత్రికలో రాజీనామా రాస్తోంది ఆ అమ్మాయి. ప్రకటనల రూపంలో ఆదాయం తెచ్చి అందులోనే జీతం అందుకోవడానికి ఎప్పుడో అలవాటు పడింది. ముఖం విలువ (ఫేసు వాల్యూ) చూపించి తెచ్చి కంపోజు చేసిన సీరియళ్ళు ఎప్పుడొస్తాయో రచయితలకి చెప్పలేక తప్పించుకుని తిరుగుతోంది. ప్రకటన ఇచ్చిన

కబ్జా గాళ్ళను గురించి అద్భుత కథనాలు రాయడానికి అసహ్యం వేస్తోంది. ఎడిటోరియల్లేదు, కవితల్లేవు, కథల్లేవు, వ్యాసాలు అసలే లేవు. ఈ మధ్య అసెంబ్లీ కోసం పది కాపీలు మాత్రమే వెయ్యడం మొదలు పెట్టింది. అసలది కేవలం న్యూసు ప్రింటు కోటా కోసం నడుస్తున్న చద్ది వార్తల పత్రిక.. వేళ్ళు అక్షరాలకు ఎదరు తిరుగుతున్నాయి. జర్నలిజం వ్యభిచారం కంటే ఏ విషయంలో తక్కువ? అనిపించింది. ఉన్న ఫళాన ఇంటికి వచ్చేసింది.

ప్రింటు మీడియా "నాకు అచ్చి రాలేదు"అనుకుంది. ఆశాజీవి అయిన ఆ పిల్ల. అందుకని ప్రసార మాధ్యమానికి వచ్చింది. అక్కడంతా సినిమా వాతావరణమే.. ముందు లేచిన పక్షి, ముందే అందర్నీ నమిలేస్తుంది. (ఎర్లీ బర్డ్ కెన్ గెట్ ఎర్లీ ఫుడ్) అనే సిద్ధాంతం అమలులో వుండేది. కాబట్టి టూత్ బ్రష్ నోట్లో వేసుకుని తెల్లారకుండానే కొందరు వచ్చేవారు. వాళ్ళతో పోటీ పడ్డం కష్టంగా వుండేది. రేపు జరిగే ధర్నా ఇవాళే డూప్స్ తో లాగించి వార్త ప్రసారం చేయడం లగాయితు, చేసిన క్యాసెట్టు చిన్న ఛానల్సుకి అమ్ముకోవడం నుంచి, కథనం మార్చేసి సందర్భాలకి రీ మిక్సు చెయ్యడం, బెదిరించి ఇవాళ ప్రతికూలంగా రాసిన వార్త, కవరు అందాక రేపు అనుకూలంగా ప్రసారం చెయ్యడం దాకా అంతా అదొక గ్యాంబ్లింగుగా, "కాయ్ రాజా కాయ్, చూస్తే లేదు చేస్తే వుంది"గా వుంటే, తట్టుకోలేక, కనీసం తనకు కేటాయించిన బీట్స్ అయినా సవ్యంగా చేద్దామంటే వాహనాలు, కెమెరా, ఎడిటింగూ ఎవరూ సహకరించక పకడ్బందీగా పెట్టిన పొగ అల్లుకుపోయి, ఊపిరాడక కొట్టుకున్నా నెట్టుకొద్దామనే అనుకుంది. కానీ వాళ్ళే రిసెప్షనిస్టుల్ని, యాంకర్లలనీ తప్ప వార్త విభాగంలో వున్న ప్రతి మహిళా జర్నలిస్టునీ ప్రత్యేక శ్రద్ధతో ఏరి ఉమ్మడి వీడ్కోలు ఇచ్చారు. పది మందితో చావు పెళ్ళి లాంటిదంటారు కదా. అన్ని నేరాలూ రాసేదానికంటే చాతకాని, మూగ ప్రాణి ఇంకోటి లేదని భలే బాగా అర్థం అయ్యింది.

వెబ్ సైట్ బూం నడుస్తోంది. పాశ్చాత్య దేశాలకి తెలుగు సంస్కృతిని పరిచయం చేసే కార్యక్రమం మొదటి ఉద్దేశ్యం.కానీ అది అచిరకాలం లోనే సినిమా తారల వెకిలి డైరీగా మారిపోయింది. ఏ తారకి ఎక్కడ పుట్టు మచ్చ వుండటంవల్ల అంత కలిసి వచ్చిందో, ఏ నటుడు కొత్తగా ఎవరితో డేటింగు మొదలుపెట్టాడో కనిపెట్టడం యాతనగా వుండేది. ఎలాగోలా తెలుసుకునే లోపు వివరాలు మారిపోతూ వుండేవి. అప్పుడు అక్కడ ఇలాంటి వివరాల్లో తల పండిన జర్నలిస్టు కూడా వుండేవాడు కాబట్టి ఆమె చెవులకే తప్ప చేతి వేళ్లకి పెద్దగా పని వుండేది కాదు. అయితే ఒకానొక శుభ ముహూర్తాన యాజమాన్యానికి, ఈ పత్రిక కంటే, రియల్ ఎస్టేట్ సైటు పెడితే లాభం కదా అని జ్ఞానోదయం కలిగింది. అప్పుడింక పుట్టుమచ్చల జర్నలిస్టూ,ఎక్కడా

పనికి రాని ఆ అమ్మాయిూ నోరు మూసుకుని బైటికి ఒచ్చేశారు.

ఎంత చెడ్డా పత్రిక ఆమె పాలిట ఒక బోధి వృక్షం. పరిచయమైన ప్రతి యాజమాన్యానికి గుళ్ళు, మసీదులు, చర్చిలు కట్టించాలని ఆమె ఎప్పుడూ అనుకుంటూ వుంటుంది.

కబ్జా పత్రిక, గుండా పత్రిక, పిల్లి, బల్లి, జాతక, వాస్తు, ప్రయోగాత్మక పత్రిక, రాజకీయ ముఠా పత్రిక, కీచక పత్రిక, వెకిలి ఎకసెక్కాల పత్రిక, వాని బామ్మరుదుల్లాంటి ప్రసార మాధ్యమం ఎవరైతే మటుకు ఏమిటి? పోషించేవాడి కోసం ప్రాణం విడవడం, పెట్టుబడి దారులూ, మనం వేరు కాదనడం సతీసహగమనాన్ని గుర్తు తెస్తోంది.

కలాలు అమ్ముడు పోయాయని మందకృష్ణమాదిగ చెప్పడం ఏమిటి? మనమే ఇంకా ఎపుడూ గుస గుసగా కూడా అనుకోలేదు. ధోరణిలో ఎంత బానిసత్వం వున్నాగాని, జర్నలిస్టుల్లో సగం మందికి ఉద్యోగ భద్రత లేకపోయినాగాని, ప్రకటించిన జీతానికీ ఇస్తున్న జీతానికి పొంతన లేకపోయినాగాని, అక్రిడేషను కార్డులు, ఇంటి స్థలాలు కొందరికే దక్కినాగాని, రాలిపోయిన జర్నలిస్టు కుటుంబాలకి మొండి చెయ్యి చూపినాగాని, నిన్న గాక మొన్న జరిగిన దాడిలో కూడా, దాడికి గురయిన స్త్రీల గొంతును రికార్డు చెయ్యకపోయినా గాని, సభ్యత్వం కట్టినా సరే జీవితకాలంలో ఎప్పుడూ ఓటు వెయ్యమని ఎవరూ అడక్కపోయినాగాని కనీసం గోచిలేని సినిమా గంతుల నుంచి, వ్యాపార మాయలనుంచీ మొదటి పేజీ శీర్షిక చోటుని కూడా రక్షించుకోలేని భావదాస్యంలో సంపాదకులు వున్నాగాని, మన తల ఎవరి పాదాల మీద వుందో చెప్పే హక్కు ఎవరికీ లేదు. లేదు గాక, లేదు! ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి! పత్రికలు ప్రజ్వలించాలి. ఒకే ఒక్క సిరా చుక్క, వేయి మెదళ్ళ కదలిక!

23.7.2008

# కంట్లో కలికం పెట్టాల్సిందే!

మాతాశిశు మరణాలూ, పోషకాహారం, సాంస్కృతిక కారణాలు అనే విషయం మీద ఒక వేదికపై మాట్లాడుతున్నాను

"కానీ జన్యుపరంగా మీ ఆడవాళ్ళకే ఆయుర్దాయం ఎక్కువ కదండీ" సభికుల్లో ఒక పెద్ద మనిషి అడిగాడు. మొదట అర్థంకాలేదు. అది ప్రశంసా? విమర్శా? లేక అదనపు సమాచారమా? -- అడిగాను.

"అహ ఏం లేదు. మీరు ఆడవాళ్ళ అకాల మరణాల గురించి మాట్లాడుతున్నారు కదా మరి ?" అన్నాడు.

అవును. సకాలంలో, సకారణంగా అయితే ఆడవాళ్ళే ఎక్కువకాలం బతుకుతారు. కానీ మనం సదుపాయాల లోపంతో, అజ్ఞానంతో జరుగుతున్న అకాల మరణాల్ని గురించి చర్చించుకుంటున్నాం, చెప్పాను.

ఇంటికొస్తుంటే ప్రయాణం పొడుగుతా ఇదే ఆలోచన పురుగులా బుర్రలో పాకింది.

నాకు తెలిసిన బంధుమిత్రుల్లో డెబ్బై దాటిన వాళ్ళని లెక్కపెట్టాను. ఆడామగా సమానంగానే వున్నారు. ఎనభై దాటిన వాళ్ళని లెక్కపెట్టాను. ఆడవాళ్ళే ఎక్కువ

వున్నారు. మా ఇంట్లోనే మా బామ్మని, ఆవిడ అమ్మనీ, అమ్మమ్మని చూశాను.. నాకు ఆరేడేళ్ళ వయసులో మా స్కూలు వెనక రెండు గదుల పెంకుటింట్లో మా తాతమ్మ, వాళ్ళ అమ్మ వుండేవారు. ఎవరి మీదా ఆధారపడ్డం వాళ్ళకిష్టం వుండేది కాదు. కొడుకు పట్టించుకోకపోవడం, చదువు లేకపోవడం, వృద్ధాప్యం ఏవీ ఆవిడ్ని కృంగదీయలేదు. పదెకరాల పొలం కౌలుకిచ్చి పండించేది. వారానికి రెండుసార్లు ఎంతో పవిత్రంగా మల్లుచీరకట్టి రాట్నం వడికేది. దేవుళ్ళ పటాలకి బదులు ఆ రెండ్రోజులూ గాంధీగారి పటం వంక చూస్తూ మౌనంగా వుండేది. ఆస్తంతా కొడుక్కి రాసేసి, వున్న గొలుసులూ మురుగులూ అయినా కూతురయిన మాబామ్మకివ్వకుండా "తనే సిగారించుకోవడం" వల్ల అటు మా బామ్మకీ, ఇటు మా నాన్న తరానికీ ఆవిడంటే చాలా కిట్టని తనం వుండేది. చైనాభూతం అని పేరు పెట్టి కసి తీర్చుకున్నారు. అప్పట్లో భారత్‌కీ, చైనాకీ మధ్య ఎటువంటి రాజకీయం వుందో నేను చెప్పలేను కానీ శత్రువు పేరు పెట్టి నవ్వుకోడానికి మా తాతమ్మ బాగా దొరికి పోయింది. నేను ఎవరికీ తెలీకుండా తాతమ్మని కలవాలంటే అరగంట ముందయినా స్కూలుకి బయలుదేరాలి. అరగంట ఆలస్యంగా అయినా ఇంటికి రావాలి. చివరికి ఈ కుట్ర కూడా ఇంట్లో తెలిసిపోయి దెబ్బలు తిన్నాను.

తాతమ్మ కందిసున్ని విసురుతూ వుంటే ఆ కమ్మటివాసన మా స్కూలంతా అల్లుకుపోయేది.

"వుండు నీకు తిరగమోత పెడతా.." అంటూ అష్టాచమ్మా ఆటలో గవ్వలు గిలకరించి విసిరిందంటే సోలాలు, బారాలు పడాల్సిందే. ఆవిడకున్న రాజకీయ పరిజ్ఞానం మీసాలు తిప్పే మానాన్నకి గాని, తాతకి గాని లేవని ఘంటాపథంగా నేను చెప్పగలను. ఒకసారి మా ఆఖరి బాబాయి ఏదోపనిమీద ఆ వీధిలో నడుస్తున్నాడు.

"ఒరే ఆగు" అంటూ వెనకనుంచి చొక్కా పట్టుకుని ఆపేసింది.

చచ్చాంరా దేవుడా - అంటూ ఆగిపోయాడు.

"అక్కకెలా వుందిరా?" ఆదుర్దాగా అడిగింది.

"బానేవుంది" అన్నాడు గింజు కుంటూ.

"అల్పాచమానం బాగా అవుతోందిట్రా?" అని ప్రశ్నించింది.

అప్పటికి మా మేనత్త పురిటికోసం ఇంటికి వచ్చి వుంది. తనకేదో యూరిన్ ఇన్‌ఫెక్షన్ కూడా వచ్చి తగ్గినట్టుంది.

అల్పాచమానం అంటే ఏమిటో మా బాబాయికి అర్థంకాలేదు. సున్నా మార్కులు వచ్చే ఇంగ్లీషు పుస్తకానికి నామం పెట్టి గణపతి పూజలో పెట్టడం, మధ్య మధ్య

పానీయం, ఆచమనం లాంటి మంత్రాలు ఏవో గుర్తొచ్చాయి.

“ఓహో అదా, లేదు బామ్మా, అక్క అలాంటివి చేస్తుంటే నే చూళ్ళేదు”

“అదేమిట్రా సూలింతలు రోజుకు నాలుగైదుసార్లన్నా చెయ్యాలి. మొన్ననే కదా అంత సుస్తీ పడి లేచింది.” అంది

“అందుకే కదా, అందరి బదులూ మా పెద్ద వదిన చేస్తుంది. గంట వాయిస్తూ రెండుపూటలా పెద్ద మరచెంబు నిండా చేసి, తులసి ఆకులూ అవీ వేసి అందరికీ తీర్థం ఇస్తుంది. అక్కకి కూడా తనే ఇస్తుంది” అర్థమయ్యేలా చెప్పాననుకున్నాడు.

ఆవిడకి మతిపోయింది. దిక్కులు చూస్తూ నిలుచుండగానే బాబాయి వచ్చేశాడు. వస్తూనే అమ్మదగ్గర మండిపడ్డాడు.

“ఆ చైనా భూతం ఏమిటి వదినా! రోడ్డు మీద చొక్కా పట్టుకుని నిలదీసేస్తుంది. నా ఫ్రెండ్స్ చూస్తే ఏమనుకుంటారు? “

మర్నాడే తాతమ్మ మా నాన్నని బజార్లో నూనె గానుగ దగ్గర దొరకబుచ్చుకుని నిలదీసింది.

“అంత తింగర మనిషేమిట్రా నీ ఆఖరి తమ్ముడు? ఆచమనంకీ, అల్పాచమానంకీ తేడా తెలీకుండా ఏం చదువుతున్నాడు వాడు? అందుకే ఆ ఘోర్తుఘారం అలా డింకీలు కొడుతున్నాడు. ఏడీ వాడికి తెలుగు నేర్పే పంతుల్ని ఇలా పిలు. ఇంగువ నూనె కాచి చెవిలో తిరగమోత పెడతా” అంది.

“చాల్లే అమ్మమ్మా, నీ సంస్కృతం నువ్వూనూ, వాడికేం అర్థమవుతుంది కుర్రకుంక, తెలుగులో మాట్లాడచ్చుకదా, “అంటూ తమ్ముడ్ని వెనకేసుకొచ్చాడు మానాన్న.

స్వభావంలో అంత సింహనాదం, భాషాపరిజ్ఞానంలో అంత సంపదా వున్న మా తాతమ్మ ఇప్పుడు లేదు. నాంపల్లి, మల్లేపల్లి, పాతబస్తీ లాంటి చోట్ల తిరుగుతుంటే అక్కడున్ని బోర్డులు చూసినప్పుడల్లా ఆవిడ గుర్తొస్తుంది.

మెడకింద వాటా అద్దెకివ్వబడును....సారీ సెంటర్.. ...మీ శిరోజములు అందముగా నరకబడును......మీ తాళం బుర్రలకు మా చెవులు నష్లి చేయబడును.....ఇచ్చట సుఖమగు బెడ్ వర్క్సు దొరకును....కీళ్ళు విరిగినవా? మా వద్ద మీ బోన్స్ సెట్టింగు చేయబడును....” ఈ తరహా బోర్డులు మీరెప్పుడయినా చూసారా?

మా తాతమ్మ గనక చూసిందంటే ఎన్ని తిరగమోతలు పెట్టేదో చెప్పలేను.

ఆవిడ నుంచి నాలుగు తరాలు గిర్రున తిరిగి నాకూ, నా పిల్లలకీ వచ్చే సరికి మాతృభాష రక్తహీన అయిపోయింది. ఇప్పుడు తెలిసిన ఆంగ్లపదాలకు తెలియని తెలుగు అర్థాలు వెతుక్కుంటున్నాం.

ఎవరికి ఏ సుస్తీ చేసినా కంట్లో కలికం పెట్టి నయం చేసే మా తాతమ్మ ఆకుపసరు వైద్యం, భాషకి ద్రోహం చేస్తున్న వాళ్ళకు కూడా జరగాలేమో!

దొడ్లో మునగ చెట్టుకి పట్టిన గొంగళి పురుగుల్ని దులిపితే వూరుకునేది కాదు తాతమ్మ..

"కంటికి బావుండనివన్నీ చంపెయ్యడమేనా? అదే రేపు సీతాకోక చిలక అవుతుందర్రా,ఆహా ఓహో అంటూ అప్పుడు మనమే దాని వెంట పడతాం" అనేది. దజీజ్ ది గ్రేట్ అరుంధతీ తాతమ్మ ఉరఫ్ చైనా భూతం ప్లస్ బ్రహ్మరాక్షసి!!! ఒకానొక అర్థరాత్రి ఎవరితోనూ ఏమీ చెప్పకుండా యమధర్మరాజుతో లేచి పోయింది.

లేచిపోవడం అనే మాట చుట్టూ వున్న అవహేళన, భయం, దిగ్భ్రాంతి ఆవిడ ఛలోక్తుల మధ్య ఎగిరిపోయేవి.

"ఒక్కదానివీ ఎలా వుంటావు తాతమ్మా? చీకట్లో భయం వెయ్యదూ?" అని అడిగితే-

"ఒక్కదాన్నీ ఎక్కడున్నాను పక్కనే వున్నాడుగా యముడు! వృషభవాహనం అదిగో, అంత దూరాన వుంది. వాడు సైగ చేయడం ఆలస్యం, చెప్పా పెట్టకుండా లేచిపోవాల్సిందే కదా" అనేది.

మూసిన తలుపుల వెనకనుంచి బారులుకట్టిన చీమలద్వారా, ఆవిడ మరణవార్త పక్కింటికి తెలిసింది.

ఎనభై ఎనిమిదేళ్ళు బతికింది. ముని మనవల్ని ఎత్తుకుంది. ఇంకా ఏం కావాలి? అదృష్టవంతురాలు, అన్నారు అంతా. యమ ధర్మ రాజుతోనే లేచిపోయిందా అయితే, ఇది నిజమేనా ? అనే సందేహం తీరనేలేదు నాకు.. ఇప్పటికీ తెలుగులో ఎవరు తప్పులు మాట్లాడినా, రాసినా, పిలక పట్టుకుని ఆపేసే తాతమ్మ గుర్తొస్తుంది. కలికం పెట్టడానికి, కంటిలోకి గురిపెట్టిన ఆవిడ చూపుడువేలు గుర్తొస్తుంది.

30.5.2009

# మీ చిన్నారికి శత్రుస్పర్శ గుర్తుపట్టడం తెలుసా?

మీకు మీ పిల్లలంటే ఇష్టం. పిల్లలకి చాక్లెట్స్ అంటే ఇష్టం.

చాక్లెట్ అంటే పాలు చక్కెర, కోక్ లాంటి దినుసులే కాదు కదా, అందులో మీ ప్రేమ కూడా కలుస్తుంది, కాబట్టి తియ్యగా రోజంతా చప్పరిస్తారు. పళ్ళు పాడయిపోతాయని చెప్పినా సరే, వినరు. చెప్పినమాట వినకపోవడమూ, అదే కావాలని మారాం చేయడమూ, వీటిపట్లా మనకి బోలెడంత మురిపెం వుంటుంది. కాదంటారా? పెద్దయిపోయాక దేనికోసమూ ఇంక మారాం చేసే చాన్సు వుండదు కదా?

పెంకితనం బాల్యానందానికి చిహ్నం.

మీ పిల్లల బాల్యం ఎలా వుంది? వాళ్ళు ఎప్పుడూ మీరు ఇచ్చిన తియ్యటి చాక్లెట్లే తింటున్నారా? తెలియకుండా ఇంకెవరైనా చేదు చాక్లెట్లు పెడుతున్నారా? ఈ మాట అడగ్గానే మీకు ఏమి గుర్తు వచ్చిందో నాకు తెలుసు. పిల్లల్ని ఎత్తుకుపోయి, వాళ్ల చెవులకున్న లోలకులు తెంచుకుంటూన్న వాళ్ల గురించి నేను మాట్లాడ్డం లేదు. అవి చాలా పాత కబుర్లు. లోలకులు, బొమ్మలు, రిబ్బన్లు కావలసినన్ని మీ పిల్లల వొళ్ళోనే కుమ్మరించి కథలు, కబుర్లు చెబుతున్నట్టు నటిస్తూ ఆ పసి శరీరాలమీద దాడిచేసి ఆ తర్వాత "ఎవరికీ చెప్పొద్ద"ని బెదిరించే అంకుల్స్, సార్లు వగయిరా, వగయిరా గురించి ఆలోచించమంటున్నాను.

ముక్కు పచ్చలారని పసిపిల్లల మీద జరుగుతున్న దుర్మార్గపు దండయాత్రల గురించి మీకూ ఆగ్రహమే వుండి వుంటుంది. ఇవాళ్టి రోజున, ఇటువంటి వార్తలేని దినపత్రిక లేదంటే అతిశయోక్తి లేదు. గౌతమబుద్ధుడు పుట్టిన ఈ నేలమీద, నేను ఈ వాక్యం రాస్తున్న నిమిషంలో కూడా కొందరు పసిపాపలు శత్రుస్పర్శతో నిస్సహాయంగా రోదిస్తూ వుండచ్చు.

2007లో అచ్చయిన సంచలన కెరటం పేరు "బిట్టర్ చాక్లెట్" నవల. పింకీ విరానీ అనే రచయిత్రి తన బాల్యంలో ఎదురయిన చేదు అనుభవంతో మొదలుపెట్టి, అనేకమంది పసిపిల్లల పీడకలల్ని రికార్డు చేసిన నవల అది. 500 పేజీలున్న ఈ బరువైన నవల్లో వున్నవి అక్షరాలు కాదు పాలబుగ్గలమీంచి జాలువారిన కన్నీళ్ళు! అది చదివి ఎంతమంది ఉలిక్కిపడ్డారంటే, "అయ్యో నాకూ ఇలాగే జరిగింది అని కొందరు, నేనూ ఈ తప్పే చేశాను" అని కొందరూ మారుపేర్లతో తమ కన్ఫెషన్‌ను పత్రికలకి తెలియజేశారు. కనీసం తమ అంతరాత్మకు అయినా దొరికిపోయారు.

కానీ నేరాలు చేసే దొరల సంగతి ఏమిటి? వీరి గురించి ఫిర్యాదు చేసే సమర్థత ఆ చిన్నారి చిట్టి తల్లులకి వుందా? వీరి తరఫున ఎవరు వాదిస్తారు లాంటివి అంతులేని ప్రశ్నలు! ప్రతి వందమంది బాలబాలికల్లో కనీసం అరవైమంది అయినా తమ జీవితంలో ఎప్పుడో అప్పుడు అత్యాచారంతో సమానమైన వేదనకి గురయ్యారని రిపోర్టులు చెబుతున్నాయి. ఇప్పుడు మనం ఒకసారి మన బాల్యంలోకి తొంగి చూసుకుందాం. మన బంధువుల్లోనే, స్నేహితుల్లోనే మనకు నచ్చని ధోరణి ప్రదర్శించేవాళ్లెంతమంది వున్నారు? ఎక్సరే కళ్లతో చూసేవాళ్ళు, ఏదో వంకతో భుజం తట్టేవాళ్ళు, పిచ్చి చలోక్తులు విసిరి పగలబడి నవ్వేవాళ్ళు, అవకాశం కోసమే ఎదురుచూస్తున్నవాళ్ళు ఏం చెయ్యగలిగాం వాళ్లని?

తప్పించుకు తిరుగుతామే గాని, ఈడ్చిపెట్టి కొట్టామా ఎవరినైనా? ఎందుకిలా ప్రవర్తిస్తున్నావురా ఒరే అని చొక్కా పట్టుకుని అడిగామా? అలా చేస్తే మొత్తం మనకున్న మానవసంబంధాలన్నీ గంగలో కలిసిపోతాయని భయం కదూ? అవును, మన భయమే నేరస్థుడి బలం. అఘాయిత్యాలు బైట ఎక్కడో తెలియని పరిసరాల మధ్య, మనుషుల మధ్య జరుగుతాయనుకుంటే అది అమాయకత్వమే అవుతుంది. మన సొంత ఇంట్లోనే, నమ్మకంగా నిద్రపోయేచోటో, అ ఆ లు రాసుకున్న నల్లబల్ల సాక్షిగా కూడా జరుగుతున్నాయి. కొన్నిసార్లు కన్న తండ్రులు, అన్నదమ్ములు కూడా ఈ నీచానికి ఒడిగడుతున్నారు.

1995 లో నేను సుప్రభాతం అనే పత్రికలో పనిచేస్తున్నప్పుడు గుంటూరు జిల్లా ముప్పాళ మండలం పలుదేవర్లపాడు గ్రామంలో ఇరవైఏడు మంది స్కూలు విద్యార్థినులు, సాక్షాత్తూ హెడ్‌మాస్టర్ చేతిలోనే అత్యాచారానికి గురయ్యారనే వార్త మా జిల్లా రిపోర్టర్లు పంపారు. నిజానికి మేమది నమ్మలేదు, అది అచ్చు వెయ్యడంవల్ల అనవసరంగా కేసుల్లో ఇరుక్కుంటామేమో అని కూడా ఆలోచించిన మాట వాస్తవం. కానీ ఎందుకైనా మంచిదని మా టీంలో కొందరు అక్కడి పిల్లల్ని చూడ్డానికి వెళ్ళినప్పుడు వాళ్ళు చెప్పిన వివరాలు విని కళ్ళు తిరిగాయి. ఇటువంటి వార్తలు వెలుగులోకి వచ్చినప్పుడల్లా, ఇది పాశ్చాత్య దేశాల ప్రభావమనో, సినిమా సంస్కృతి అనో ఓ సమర్థింపుఎప్పుడూ సిద్ధంగా వుంటుంది. కానీ ఆ నేరం జరిగిన ప్రదేశం, ఇలాంటి ప్రభావాలన్నిటికీ దూరంగా వున్న ఒక ప్రశాంతమైన పల్లెపట్టు. అప్పటికి అక్కడ ఒక సినిమా హాలయినా లేదు. నేరస్తుడు పిల్లలకి కన్నతండ్రిలాగా విద్యాబుద్ధులు నేర్పుతున్న ఏభై రెండేళ్ల పెద్దమనిషి, మంచివాడు, నెమ్మదస్తుడు అని పేరు తెచ్చుకున్నవాడు. కాగా నవంబరు ఒకటవ తేదీన ఇద్దరు స్కూలు పిల్లలు తీవ్రమైన రక్తస్రావంతో నడవలేక నడవలేక వొంటినిండా గాయాలతో ఇంటికి చేరుకున్నారు, ఎంత అడిగినా తల్లిదండ్రులకి చెప్పలేదు. ఎవరితో అయినా చెబితే చంపేస్తానని

బెదిరించిన సార్ గొంతు వాళ్ళు మర్చిపోలేరు. ఆటల్లో కిందపడ్డామని అందుకే గాయాలయ్యాయని చెప్పారు. అనుమానం తోచిన తల్లిదండ్రులు బుజ్జగించి అడిగేసరికి బావురుమన్నారు. ఒకటి నుంచి అయిదవ తరగతి దాకా వున్న అరవై ఆరుమంది బాలికల్లో అత్యధికులు అత్యాచారానికి గురయ్యారనే వార్త నాగరిక ప్రపంచాన్ని తల్లకిందులు చేసింది. వ్యక్తిగతంగా అతని కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న కొందరు కాదని వారించినప్పటికీ వైద్యపరీక్షల్లో తేలిన నిజాలు చూసి నోరెత్తలేదు. సంఘటన ఎలా జరిగిందన్న ప్రశ్నకు పిల్లలందరూ మూకుమ్మడిగా ఒకే జవాబు చెప్పారు.

స్కూలు వదిలిపెట్టే సమయానికి నలుగురు పిల్లల్ని ఎంపిక చేసుకుని "కథలు చెప్పుకుందాం" అనే సాకుతో వుండిపొమ్మనేవాడట. ఇద్దరిని మూసిన కిటికీల దగ్గర, ఒకరిని గుమ్మం దగ్గరా కాపలాపెట్టి మిగిలిన బాలికపై అఘాయిత్యం చేసేవాడు. ఈ తతంగం ప్రతిరోజూ జరిగేదని ఆ బాలికలే చెప్పారు. ఇంత జరుగుతున్నా బైటికి పొక్కలేదంటే అతడు ఆ పిల్లల్ని ఎంతగా భయపెట్టాడో మనమే ఊహించాలి. అత్యాచారానికి గురయినవారిలో అత్యధికులు దళితులు, పేదలు, వైద్యపరీక్షకు కూడా ఆర్థిక స్థోమత లేనివారే అవడం విచిత్రం కాదు. చాలా కేసుల్లానే అది కూడా బుట్టదాఖలు అయిందో, శిక్ష పడిందో నాకిప్పుడు తెలీదు. ఇప్పుడా పిల్లలందరూ పాతికేళ్ళు దాటిన తల్లులయి వుండచ్చు. బాల్యం ఒక పీడకలగా, చదువొక పీడనగా మార్చిన ఆ మనిషిని వాళ్ళెన్ని శాపాలు పెడుతున్నారో ఏమో.

చిన్నపిల్లల మీద ఈ విధమైన నేరాలకు పాల్పడే మానసిక స్థితిని పీడోఫీలియా అంటారు. కొందరు నిజంగానే తీవ్రమైన వ్యక్తిత్వ వైపరీత్యంతో వుండచ్చు. కానీ ఎక్కువమంది ఈ వంకతో శిక్ష తప్పించుకోవాలని చూస్తారు.

మన పిల్లల్ని ఇలాంటివారినుంచి కాపాడుకోవాలంటే ఏం చెయ్యాలి? పాలనీ, నీళ్లని వేరుచూసి చూడగల నీర క్షీర న్యాయం నేర్పాలి. నీరమూ, క్షీరమూ అంటే ఏమిటి?

మంచి స్పర్శ, చెడ్డ స్పర్శ లాంటివి గుర్తుపట్టడం ఎలాగో చెప్పాలి. నిజానికి అయిదేళ్ళుదాటిన పిల్లలు కూడా ఇది గుర్తుపట్టగలుగుతారు. ఎటొచ్చీ, వ్యక్తీకరణ వుండకపోవడంతో వారి మనసులో ఏముందో మనకి తెలీదు.

స్పర్శ మనిషి ఉద్దేశ్యాన్ని తెలియజేస్తుంది. కరచాలనం చేసినప్పుడు, తల నిమిరినప్పుడు రాని ఇబ్బంది, వీపు గోకినప్పుడు, నడుంమీద చెయ్యి వేసినప్పుడు ఎందుకు వస్తుందో పిల్లలకి చెప్పాలి. చేతులు, పాదాలు తల ముట్టుకున్నప్పుడు రాని అయిష్టత, చాతీ, పొట్టలాంటి గోప్య శరీర భాగాల్ని ముట్టుకున్నప్పుడు వస్తుంది. దాన్ని వ్యతిరేకించమని చెప్పాలి. భద్రతతో కూడిన స్పర్శ సంతోషాన్ని ఇస్తుంది. మృదువుగా వుంటుంది.

అభద్రతతో కూడుకున్న స్పర్శ నొప్పిని, విచారాన్ని, భయాన్ని కలిగిస్తుంది. ఎవరైనా గాని "మీ ఇంట్లో ఎప్పుడూ చెప్పొద్దు" అంటే అది మానవ హక్కుకి భంగం కలిగించే నేరమని అర్థం చేయించాలి.

ప్రతి మనిషికి కొంత వ్యక్తిగత ఎరీనా వుంటుంది. బ్రీతింగ్ స్పేస్ అంటాం కదా. ఆరడుగుల దూరాన్నించి ఎవరైనా మాట్లాడుతుంటే, శబ్దాలు మాత్రమే వినబడతాయి. శబ్దాల్ని అర్థాలుగా మార్చుకునే ప్రయత్నంలో హావభావాల గమనిక కూడా అవసరమవుతుంది కాబట్టి, కొంచెం దగ్గరికి వెళ్లి గాని, చెవులు రిక్కించి గాని వినాలనుకుంటాం. కానీ అపరిచిత వ్యక్తి అయిదు అంగుళాల కంటె దగ్గరికి జరిగేసరికి, పిల్లలకి అసౌకర్యం మొదలవుతుంది. తెలియకుండానే ముడుచుకుపోతారు. అది అసంకల్పిత ప్రతీకార చర్య. తెరిచి వున్న కంటిలోకి దుమ్ము ఏదయినా పడబోతుంటే రెప్పలు వాలతాయి చూశారా, అలాంటిదే. ఉద్దేశ్యపూర్వకంగా అటువంటి అసౌకర్యం స్కూలులో పునరావృతం అవుతుంటే, స్కూలు మానేస్తారు. ఇంట్లోనే పునరావృతం అవుతుంటే తలుపులు వేసుకుని ఒంటరిగా వుండిపోతారు. నిద్రలో మూత్రవిసర్జన, వేలు చీకడం అంతకు ముందు లేకపోయినా గాని ఇప్పుడు కొత్తగా మొదలుపెడతారు. ఆగ్రహంగా, దుఃఖంగా వుంటారు. ఎదుగుతున్న తన శరీరాన్ని తామే ద్వేషిస్తారు. ఈ శరీరం మూలంగానే ఇన్ని కష్టాలు వచ్చిపడ్డాయి కదా అనుకునే ఆత్మన్యూనతకు గురవుతారు. కిటకిటలాడే బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఊపిరాడని మాట నిజమే అయినా, అది వత్తిడికి సంబంధించిన సమస్యే తప్ప హింస ఏమీ వుండదు. పని కట్టుకుని వెర్రివేషాలు వేస్తేనే, అది హింస అవుతుంది. కాబట్టి కొందరు డబాయించినట్టు చేతులూ కాళ్ళు తగలడానికి ఇరుకైన బస్సు కారణం కాదు. ఉద్దేశ్యమే అసలు కారణం. ఈ తేడా పిల్లలకి బాగానే తెలుస్తుంది. అసలు ఒక మనిషి అంతదూరాన వుండి కూడా చూపులద్వారాగాని, మాటలద్వారాగాని, ప్రేరేపిత చిత్రాల ద్వారా గాని పిల్లల్ని ఇబ్బందిపెడితే, అది తీవ్ర నేరమే అవుతుంది. భారత రాజ్యాంగం ప్రకారం హింసని వ్యతిరేకించే హక్కు, బాలబాలికలందరికీ వుంది.

వందేమాతరం నేర్పినంత గర్వంగా మన పిల్లలకి హింసని వ్యతిరేకించే హక్కుని బోధించాలి. పిల్లలూ మనలాంటి మనుషులే, పిట్టలు కాదు కదా, చేదు చిగుళ్ళు తిని కూడా తియ్యగా పాటలు పాడటానికి!

పనికిరాని గుట్టలు కాదు కదా, నరికిన కొద్దీ గరికపచ్చ మొలవడానికి!

మన పిల్లల్ని మనం ప్రేమించే మాట నిజమే అయితే వాళ్ళు చప్పరిస్తున్న బాల్యానందాల చాక్లెట్ చేదువిషం కాకుండా చూసుకుందాం. అది మన కనీస బాధ్యత కూడా.

# చెప్పిన కథలో చెప్పనిదేమిటి?

అత్తాపూర్‌లో వుండగా మా పక్కవాటాలో ముసలి దంపతులు వుండేవారు. ఆయనకి మధుమేహం, రెండు గంటలకొకసారి ఏదో ఒకటి తింటూ వుండాల్ట. అంచేత ఆ ఇల్లాలు వంటయిపోయింతర్వాత కూడా రోజంతా పొయ్యిమీద దోసెలు పోస్తూనో, ఉప్మా కలియబెడుతూనో చెమటలు కక్కుతూ వుండేది. ఆయన మాత్రం ఎంచక్కా అన్నీ తినేసి, అది బావుండలేదు, ఇది బావుండలేదు అని నానారకాలుగా తిట్టేవాడు (''వొండి పెట్టే ఇల్లాలు-వోంద్రపెట్టే మొగుడూ'' అని ఎవరేనా సినిమా తీస్తే బావుంటుందని నేను అనుకునేదాన్ని).

ఇక్కడ మా వాటాలో డైనింగ్ టేబుల్ మీదున్న ప్లాస్టిక్ సంచుల్లో వున్న ఫాస్టు ఫుడ్ చేగోడీలు అవీ తింటూ మా మామగారు నిట్టూరుస్తూ వుండేవాడు. ఎందుకంటే నేను ఆఫీసుకు వెడుతూ పొద్దున్నెప్పుడో ఫ్లాస్కులో పోసిన టీ కూడా చల్లారిపోయి వుండేదేమో. ఓ పక్క వంటరితనం, ఇంకో పక్క వేడివేడిగా వండి వడ్డించే ఆడది లేని తనంలోంచి ఆయన తేరుకోలేక పొయేవాడు.

పైగా పుండు మీద కారం జల్లినట్టు పక్కింటి ఆయన ఈయన్ని ఉద్దేశించి ''మీకేమండీ అదృష్టవంతులు ఒక సుగరు లేదు బిపిలేదు, తిన్నది తిన్నట్టు అరుగుతుంది అనేవాడు.'' ఈయన వూరుకుంటాడా, కడుపు మండిపోదూ, ''సుగరుదేముంది లేండి, జరిగితే జ్వరమంత భోగంలేదని అంటారు. వొండిపెట్టే ఇల్లాలు లేకపోవడం కంటే దురదృష్టం ఇంకోటి లేదు'' అనేవాడు. వారిద్దరి అదృష్ట దురదృష్ట విశ్లేషణ అయ్యాక అప్పుడు, ఎవరిదెంత గొప్ప వంశమో అది చెప్పుకునేవారు. మా పక్కింటి ఆయన తరచూ చెప్పే కథ ఒకటి ఆయన మాటల్లోనే మీ ముందు పెడతాను, వినండి. మేడ మీద చల్లగాలికి పిట్టగోడ మీద కూచుంటే ఇవి వినిపిస్తూ వుంటాయి కదా, తలబొప్పి కట్టేసింది.

''మా తాతగారు, సూరంపూడి సుబ్బారావుగారనీ, మహా గొప్ప వకీలండీ, ఆ మండలంలోనే అంత గొప్ప వకీలు లేడు, నీతి మంతుడు. న్యాయం విషయంలో తనపర తేడా లేదు. ఒకసారి కట్టుకున్న ఇల్లాలి మీద కూడా కేసు పెట్టాడు.(నవ్వు) కేసు పెట్టి ఏంచేశాడనుకున్నారు. జడ్జీగారి తీర్పు ప్రకారం నష్టపరిహారం కూడా కట్టాడు.''

''అబ్బో ఏమి ఔదార్యం'' మా మామగారు.

''ఆ కేసేమిటో చెప్పమంటారా'' వూరించాడు.

"నిన్ననేగా చెప్పింది.." అనే మాట ఈయన అనడు. ఎందుకంటే ఈయన తాత నేతి కథలు ఆయన వినాలికదా మరి. కాబట్టి, చెప్పండి అన్నట్టు చూస్తాడు. "కత్తి తిప్పి సాముగరిడీకి దిగాడంటే అదిరి పోవాల్సిందే.. కన్నెర్రజేశాడంటే తోక ముడుచుకుని పరిగెత్తాలి. మా అమ్మమ్మ మాత్రం ఎంత దొడ్డ ఇల్లాలనుకున్నారు. సాక్షాత్తూ అన్నపూర్ణే. తలెత్తి ఎవరివంకా చూసేది కాదు. ఎప్పుడు లేచి మడి కట్టుకునేదో ఎంత మందికి వడ్డించేదో గాని మనిషి కనబడేదేకాదు. ఆ ఇంటికి నాలుగు సందుల అవతల వీళ్ల దాయాదులుండేవారు. రెండు ఇళ్ళకీ పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఒక రోజు చెప్పా పెట్టకుండా మా అమ్మమ్మ వాళ్ళింటికి బయల్దేరింది. అంత ధైర్యం ఎలా వచ్చిందో గాని, మొగుడి మొహం చూడకుండానే చెప్పేసిందండీ అన్నపూర్ణమ్మ. ఏమని చెప్పిందనుకున్నారూ" పసుపు కుంకాల కోసం పేరంటానికి వెడుతున్నాను. నన్ను ఆపకండి" అని.

వినలేదు మా తాత, ఠాట్ వీల్లేదన్నాడు.

ఏం చేస్తుంది పాపం, భర్తకి ఎదురు తిరిగే కలికాలం రోజులుకావు కదా అవి. అంచేత గుడ్ల నీరు కుక్కుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. అటువంటి మహా ఇల్లాలు మా తాత పరువు ఎలా తీసిందో తెలుసా? తెల్లారుఝామునే అన్నీ భర్తకి అమర్చి పెట్టి వెళ్ళిపోయింది.

తాత చూసుకోలేదు. కోర్టుకి చకచక నడిచి వెడుతూ వుంటే సరిగ్గా ఆ దాయాదుల ఇంటి గోడ నుంచి ఎంగిలి విస్తళ్ళ కట్ట నెత్తిన పడింది. ఎవర్రా అది అని, కళ్ళెర్రజేశాడు. గోడ వెనకగా బిత్తరపోతూ తన భార్య అన్నపూర్ణమ్మ..

మాట్లాడకుండా ఇంటికొచ్చాడు. పరువు నష్టం దావా వేశాడు. బోనులో నుంచుని వుంది అన్నపూర్ణమ్మ.

"ఏమ్మా అతని మీద విస్తళ్ళ కట్ట వేసింది నిజమేనా"అడిగాడు జడ్జి.

తలూపింది నేరస్తురాలు అన్నపూర్ణమ్మ.

"సాక్షాత్తూ కట్టుకున్న భర్తను అవమానించే నిమత్తమే దాయాదుల ఇంటికి వెళ్ళటమే కాక, ఎంగిలి విస్తళ్ళ కట్ట వేసింది. కాబట్టి ఒక రోజు జైలు శిక్షగాని, రెండు రూపాయల నష్టపరిహారం కానీ చెల్లించాల్సింది" గా కోర్టు తీర్పు చెప్పింది.

అన్నపూర్ణమ్మ తలెత్తలేదు. అప్పటి రోజులు కదా అవి మరి, అదే ఇప్పుడయితేనా?(మధ్యలో వ్యాఖ్యానం)

మా తాత నష్టపరిహారం కట్టేశాడు. భార్యను ఇంటికి తేవడంకోసం గుర్రపు బండి పంపించాడు.

అన్నపూర్ణమ్మ అది ఎక్కింది. ఇంటికొచ్చింది. తెల్లారేసరికి వూరి చివర దిగుడు బావిలో తేలింది.

మా తాత దిక్కులేనివాడయ్యాడంటే నమ్మండి. ఎలాంటి మనిషి ఎలా అయిపోయాడో. అంత అన్యాయం మా అమ్మమ్మ ఎలా చేసిందో, తన పర తేడా లేని మా వకీలు తాత, అసలు న్యాయానికి రోజులు లేవంటే నమ్మండి, ఆయన వాగ్ధాటి కొనసాగుతోంది. ఈ కథ వెనుక వున్న కథ ఏమిటో తర్వాత ఆంటీని అడిగి తెలుసుకున్నాను.

"ఏమీ లేదమ్మా.. వాళ్ళకీ వీళ్ళకీ పచ్చగడ్డివేసినా గాని భగ్గుమనేది గానీ, ఈ అన్నపూర్ణమ్మా ఆ ఇంటి ఇల్లాలు సువర్చలమ్మా వేలు విడిచిన అక్క చెల్లెళ్ళు. మొగుళ్లకి భయపడి చెరువు దగ్గర రహస్యంగా కలుసుకునే వారు. ఆవిడ కూతురు పెళ్ళికే ఈవిడ వెళ్ళింది. పరాయిచోటుకి ఏమీ కాదు. వెడుతూనే పనిలో జొరబడి కలివిడిగా వంటలు చేసింది. వియ్యాలవారికి వడ్డనలు చేసింది. విస్తళ్ల కట్ట ఎత్తి గోడవతల పారేస్తుంటే ఖర్మకాలి భర్తగారు అటు రావడమూ ఆయన నెత్తినపడటమూ జరిగిపోయాయి. పొరబాటు ఎవరికైనా సహజమేకదా. తన పర్మిషను లేకుండా శత్రువు ఇంటికి వెళ్లడమే కాకుండా, అక్కడ నుంచి ఎంగిలి విస్తళ్ళ కట్ట పడేస్తుందా? వాళ్ళ పిల్ల పరువు వాళ్ళ కళ్ళముందే తియ్యాలనుకున్నాడు. అంతే. తగుదునమ్మా అని కట్టుకున్న భార్య మీద పరువు నష్టం కేసు పెట్టి ఆవిడ ఆయువు తీశాడు. కోర్టుకి ఎక్కాక ఇంక బతకడం ఎందుకనుకుందో, ఏమిటోపిచ్చి ఇల్లాలు. జరిగిన నష్టం ఏదయినా వుంటే ఆవిడకే గాని ఆయనకి ఏమీకాదు ఆ తర్వాత ఎవర్నో చేరదీశాడనుకో అది చెబుతాడేమో చూడు ఈ మహానుభావుడు. ఆ తాత పేరే కదా ఈయనది అంచేత ఇంత జరిగినా సరే ఈయనగారు మా తాత ఎంత గొప్పవకీలో అని గప్పాలు కొడతాడు. నానమ్మ వైపు ఎందుకని ఆలోచించడో" అంది కొంగుతో కళ్ళొత్తుకుంటూ..

ప్రతి కథ వెనకా కనపించని వ్యథ వుంటుందన్నమాట.. మగ వాళ్ళు అహంకార పోషణలోనూ, ఆడవాళ్ళు మానవ సంబంధాల పోషణలోనూ సిద్ధహస్తులు. రామాయణమంతా రాముణ్ణి హీరో చెయ్యడానికి రాసినట్టు కనబడుతుంది. భారతం కృష్ణుడు చెప్పినట్టు నడిచింది. పాదాభివందనాలు చేయించుకోవడానికి మగవాళ్ళు నుంచున్నట్టుగా, ఆడవాళ్ళు నుంచోవడం ఎక్కడయినా చూశారా.. అంటున్నానని కాదు. ఆలోచించండి. సాదా సీదా మనుషులైన మా పక్కింటి అంకుల్ నుంచి, ప్రపంచ రాజకీయ చరిత్రదాకా కథలన్నీ మీసాలు గడ్డాలు పెట్టుకుని కనబడుతున్నాయాలేదా?

1.6.2011

# సర్వంజిత్తు

బాణామతి చేశాడనే నేపంతో ఒక నిరుపేద వృద్ధుడ్ని గ్రామస్థులంతా కలిసి నిట్టనిలువుగా తగలబెడితే జిల్లా ఎడిషన్‌లో ఒక అప్రధాన వార్త అవుతుంది అక్కడికసలు న్యాయమూ, చట్టమూ, ప్రభుత్వమూ తొంగి చూడవు. అదే మరి డబ్బున్న స్వామిజీ జుట్టులోంచి విబూది రాల్చడమూ, నోట్లోంచి శివలింగాన్ని తియ్యడం కొన్నాళ్ళ పాటు వాయిదా వేసి, కేవలం మూత్రం సాఫీగా అవడం కోసం ఆస్పత్రిలో జేరితే దేశమంతా అట్టుడికిపోతుంది.

న్యాయమూ, చట్టమూ అంతర్జాతీయ వైద్యమూ అక్కడే సాగిలపడతాయి. మంత్రులందరూ తమ క్యాబినెట్స్ వదిలేసి ఎప్పుడెప్పుడూ పేషంటు బాబా కళ్ళు తెరుస్తారా, హారతి ఇద్దామా, అని బానిసల్లా ఎదురు చూస్తూ వుంటారు.

ఈ మాటలు నిన్న నేను అంటూ వుండగానే మా పక్కింటి ఆవిడ టప టపా చెంపలు వేసుకుని "మీరు మరీనండీ, వూరి చివరి మంత్రగత్తెతో వీరిని ఎలా పోల్చుతారు. వీరు ప్రజల బాగుకోసం ఎన్ని సేవలు చేశారో, నూట నలభై దేశాల్లో వారికున్న పరపతి ఎంతో" నా మట్టి బుర్రకి అర్ధమయ్యేలా చెప్పాననుకుంది.

నిజానికి నాకేమీ అర్థం కాలేదు.

ఏ మనిషికయినా విపరీత సంపద ఎలా సిద్దిస్తుంది? దొంగనోట్లు అచ్చేస్తే వస్తుంది. కష్టపడి గోడలు దూకితే వస్తుంది. శ్రుతి మించి వ్యాపారంచేస్తే వస్తుంది. అక్రమ షరతుల ఒప్పందంతో నిధులు సేకరిస్తే వస్తుంది. ఆదాయ ఖర్చుల మీద న్యాయసంబంధమయిన ఆడిట్ వుంటే, అది అక్రమ ఆస్తిగా మారే వీలే లేదు. మరి ఒకటి పాయింట్ ముప్పై లక్షల కోట్లు ఎలా పోగుపడ్డాయి. ఇందుకుగాను చేసిన వ్యాపారమేమిటి? ప్రజల బలహీనతలేనా? వేలాది మంది టికెట్లు కొంటే ఎవడికి లాట్రీ తగులుతుందో వాడికి, బంపర్ డ్రా తీసినవాడు భాగ్యప్రదాతలాగానే కనిపిస్తాడు. ఇలాగైతే ఓటు వేసినవాడికల్లా నానో కారు బహూకరిస్తానని ప్రకటించిన తమిళనాడు అభ్యర్థి పరందాముడే కదా. నిత్యానందస్వామీజీ మీద రాని కోపం, ప్రపంచ కప్పు గెలిస్తే నగ్నంగా ప్రదర్శనలిస్తానని చెప్పిన పూనమ్‌పాండే మీద ఎందుకు రావాలి. ఒకరిది రస సిద్ధి అయినప్పుడు, ఇంకొరికి దేహశుద్ధి చేస్తామని చెప్పడానికి భజరంగ్ దళ్ ఎవరు?

నాకు తెలిసి మన బుర్రలో మూడే గదులున్నాయి. ఒకటి వున్న డబ్బు పోతుందనే భయంతో ఏర్పడిన భక్తితోనూ, రెండు డబ్బు రావడం కోసం తెచ్చుకున్న భక్తితోను, మూడు డబ్బుని అనుభవించడానికి ఏర్పాటు చేసుకున్న రక్తితోనూ నిండిపోయాయి.

ప్రజలు అమాయకులే, క్యాన్సరు తగ్గుతుందనుకుని వస్తారు. పిల్లలు పుట్టనందుకు వస్తారు.. పరీక్ష తప్పినందుకు వస్తారు. ఒక సన్యాసి కాళ్ళతో తంతాడు. ఇంకోడు నాలుకతో నాకుతాడు, ఇంకోడు ఇంకేదో చేస్తాడు. ఏది చేసినా దైవకార్యాలే అని నమ్మాలి. నమ్మకానికే కాదు, దురాశకీ, ఆశకీ కూడా హేతువు లేదు.

డబ్బు పరపతీ కనుక వుంటే, బాణామతి ముసలయ్యని ఎవరూ చెట్టుకి కట్టి నిప్పంటించరు. ఎలాగోలా ప్రభుత్వాన్ని పట్టుకుని బాణామతి కోర్సుకి అనుమతి తీసుకుంటారు. దేశవ్యాప్తంగా వారసులు సిండికేట్ బ్రాంచీలు పెడతారు. రాజకీయ నాయకులంతా అసెంబ్లీలో మైకులు విరుచుకోవడాలు మానేసి, మంత్రించిన నిమ్మకాయలు తీసుకుని శ్మశానాలకి బయలేర్దుతారు.

అప్పుడు బాణామతి ముసలయ్యని ఒక పట్టాన మరణించనివ్వరు.. పోనీ బతకనిస్తారా అంటే అదీ లేదు. ఉత్తి పుణ్యాన తొందర ఎందు కంటారు? ఇంకో అవతారం కర్నాటకలోనా, కేరళలోనా అని ప్లాన్ చేసుకోవాలి కదా. ఈ సంపదలు ద్రవించకుండా గుడి కట్టడానికి ఏ అవతారం నమ్మకంగా వుంటుందో, సదరు ఆవతారానికి ఏ పోలికలు, హెయిర్ స్టయిల్ బావుంటుందో బొమ్మ గీసుకోవాలి కదా. వీలయితే రాబోయే కొత్త హీరో సినిమా మాదిరి ఇప్పటినుంచే ప్రచారం చేసుకోవాలి కదా. అవతారమంటే మాటలా ఎందరు వారసులు నటించాలి. ఎందర్ని రేవు దాటించాలి అబ్బ.. ఎంత సృజనాత్మకతో కదాఏ హాలీవుడ్ సినిమాకి అయినా ఇన్ని ట్విస్టులుంటాయంటారా?

ఇందాకటి మా పక్కింటావిడ మళ్ళీ లిఫ్టులో ఎదురయింది. మొహం అంత సీరియస్‌గా వుందేమిటో? వుంటే వుండనీ, నా అభిప్రాయం నేను చెప్పాను.

మన కళ్ళు చూడటానికి కాకుండా, మూసుకోవడానికే వాడుకుంటే, మన చెవులు వినడానికి కాకుండా, పూలు పెట్టుకోవడానికి ఉపయోగించుకుంటే, మన నోరు ప్రశ్నించడానికి కాకుండా భజన చెయ్యడానికే మోగుతూ వుంటే, బహుశా ప్రపంచం ఏ మార్పూ లేకుండా ఇలాగే వుంటుంది.

4.5.2011

# ఎడారి ఓడ కథ

రెండేళ్ల క్రితం వరంగల్‌లో ఒక స్వచ్ఛంద సంస్థలో కన్సల్టెంటుగా వున్నప్పుడు హెచ్.ఐ.వి. ప్రాజెక్టు తాలూకు డాక్యుమెంట్స్ తిరగేస్తుంటే, ఆసక్తికరమైన కథ ఒకటి దొరికింది. అదేమిటంటే,

ఒక రిపోర్టరు తన ఎడిటరు సూచన మేరకు, చేపలు పట్టే బెస్తవాళ్ల జీవితం గురించి రాయడానికి బయల్దేరుతుందిట. సముద్రంలో పడవల వాళ్ళెవరూ ఇంకా ఇంటికి తిరిగొస్తూ కనబడరు. ఒడ్డున సముద్ర కెరటాల మీద సూర్యబింబం మాత్రం ఈతలు కొడుతూ కనిపిస్తుంది. మన రిపోర్టరు కెమేరా ఎక్కుపెట్టి కావలసినన్ని ఫోటోలు తీసుకుంటుంది. అసలు చేపలు పట్టేవాడిదేముంది సూర్యుడి కార్యక్రమాల గురించి రాయాలి గానీ అనుకుంది. ఈలోగా పాదాల కింద కితకితలు పెడుతూ ఇసకలోంచి పీత ఒకటి బైటికొచ్చింది. ఉలిక్కిపడి కిందకి వొంగిన రిపోర్టరుకి ఒకదాని వెనక ఒకటిగా అయిదారు పీతలు పారిపోతూ కనిపించాయి. ఇందులో ఏది మగ, ఏది ఆడ అని పరిశీలించడానికి ప్రయత్నించి విఫలమై, బెస్తవాడూ వద్దు, సూర్యుడూ వద్దు, రాస్తే పీతల కథ రాయాలి అనుకుని నడుచుకుంటూ, దగ్గరలోనే వున్న గుట్ట ఎక్కి చిరుచీకట్లో చుక్కల్ని లెక్కపెడుతూ కూర్చుంది. ఆకాశం వంక చూస్తూ పరధ్యానంలో వున్న రిపోర్టరు చేతిలోని కెమేరా జారి గుట్ట కింద పడుతుంది. కెవ్వుమని అరుపూ వినిపిస్తుంది. ఎవరా అని కిందికి తొంగిచూస్తే, అక్కడ ఒకడు చెంబు పట్టుకుని మల విసర్జన చేస్తూ వుంటాడు.. చీ అని ముక్కు మూసుకుని, తన కెమేరా దెబ్బకి వాడి తల గనక బద్దలయితే, అప్పుడు కోర్టులో ఎలా వాదించుకోవాలా అని కాస్సేపు తీవ్రంగా ఆలోచించి, కాయితంమీద ఏదో రాస్తుంది. మర్నాడు రిపోర్టు ఏదీ అనీ అడిగిన ఎడిటరుగారి ముందు అప్రయత్నంగా రాత్రి రాసిన కాయితం పెడుతుంది.

''చెంబు పట్టుకుని వెళ్ళేటప్పుడు గుట్టమీద వున్నవాళ్లకి కనబడేలా కూచోవాలి. లేకపోతే బుర్ర పగిలిపోతుంది.'' అని వుంటుంది అందులో.

జరిగిందేమిటో అర్థంకాని ఆ ఎడిటరు గారు ఎంత జుట్టు పీక్కున్నాడో మనకి తెలీదు.

మనం ఏ పని మొదలుపెట్టామో దానిమీదే ధ్యాస పెట్టాలి గానీ, వేరే విషయాలవైపు మనసు చంచలమై ఎగిరిపోకూడదని చెప్పడానికి స్కూలు పిల్లల ట్రైనింగు క్లాసులో ఈ కథ చెప్పుకోవచ్చు. కానీ చాలాసార్లు మన ఏకాగ్రత చెదరగొట్టడానికి దైహిక బాధలే గుర్తొస్తాయి. అవి మనల్ని అన్ని విధాలా లొంగదీసుకుంటాయి కూడా.

ఒకసారి రైల్లో కూచుని మీటింగులో మాట్లాడవలసింది ఆలోచిస్తూ వెడుతున్నాను. నిర్వాహకులు నాకిచ్చిన సబ్జెక్టు బాగా కొత్తది, న్యాయం చెయ్యలేనేమో అని కూడా అనుమానంగా వుంది. మధ్యలో బాత్రూంకి వెళ్ళాల్సివచ్చింది. దగ్గరలో వున్న టాయ్‌లెట్ రోతగా వుండటంతో, పక్కనున్న పెట్టెలోకి కదిలే లింకు దాటి వెళ్ళాను. అక్కడా

భీభత్సంగానే వుంది. పైగా లోపల గడియ సరిగా లేదు. అలాంటప్పుడు ఒక చెయ్యి తలుపు మీద ఆన్చి ఎవరేనా వస్తారేమోనని బెదురుగా అటే చూస్తూ ఎలాగోలా నుంచుని పని ముగించుకోవచ్చు. లేకపోతే మూలనున్న మురికి బక్కెట్టు నిండా నీళ్లు పట్టి తలుపుకి అడ్డం పెట్టచ్చు. కానీ గౌరవనీయమైన రైల్వేశాఖవారు బక్కెట్టుని గొలుసులతో కట్టేసి, (చెంబు వుండనే వుండదు.) తలుపుని టాయిలెట్ సీటుకి దూరంగా పెడతారు కదా. అప్పుడేం చెయ్యాలి? ఆలోచించాను. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఆలోచనలుంటాయిట కదా. వాష్ బేసిన్ దగ్గర ఎవరో మర్చిపోయిన అయిదు లీటర్ల నీళ్ల డబ్బా తీసుకున్నాను ఎలాగోలా తలుపుని నొక్కి పట్టి, కింద అడ్డంగా డబ్బా పెట్టాను. ఆ సమయంలో అదే నేను నమ్మిన దైవం. అస్తమానూ గుళ్లనీ, భక్తుల్నీ విమర్శించి, అవసరానికి ఆదుకోమంటే దేవుడు ఆదుకుంటాడా ఏమిటి? చచ్చినా ఆదుకోడు అని మా ఆయన అదే పనిగా శపిస్తాడు కదా, కాబట్టి ఒక పెద్ద మనిషి తలుపు తీసుకుని రాబోయి (రైళ్ళల్లో జెండరు సూచించే గుర్తులుండవు. వారికి లింగవివక్ష లేదన్న మాట) లోపలున్న నేను ఫెడీమని దాన్ని వేసేసరికి తలబొప్పికట్టి కెవ్వున అరిచాడు. ఆ అరుపు వినేసరికి నా గుండె ఆగినట్టయింది. గబాల్నలేచి తప్పు చేసినట్టుగా తల వంచుకుని నా సీటులోకి వచ్చి కూచున్నాను. లోపలెవరేనా వున్నారేమో అని చూసుకోకుండా దూసుకువచ్చినందుకు, లెక్కప్రకారం ఆయన మీద నాకు కోపం రావాలి కదా, కానీ అది మరచిపోయాను. గిల్లార్చుకుపోయినట్టు అరిచిన ఆ అరుపుకి, నీళ్లడబ్బా అడ్డంపెట్టిందెవరు? అంటూ ఆయన భార్య చేసిన యాగీకి నేరం మొత్తం నాదే అయిపోయింది. ఎవర్నీ ఏమీ అనలేక ఆ రాత్రి చాలాసేపు గొణుక్కుంటూ వుండిపోయాను. నిద్ర పట్టలేదు. అంతకుముందు వరకూ కష్టపడి పూస గుచ్చుకున్న ఆలోచనలన్నీ చెల్లాచెదురయ్యాయి. తెల్లారి సభలో నేను మాట్లాడవలసిన విషయంకంటే,  దీన్ని గురించే ఎక్కువ చెప్పాను.ఇందాకటి కథలో బెస్తవాళ్ల మీద రిపోర్టు రాద్దామని వెళ్ళిన రిపోర్టరు దగ్గర్నించీ, సందర్భశుద్ధి లేకుండా సభలో మాట్లాడేసిన నాదాకా, అన్నీ వ్యక్తిగత వైఫల్యాలుగానే మీకు కనిపించవచ్చు.నేను చెప్పదల్చుకున్నది ఏమిటంటే, కనీస సదుపాయాలు కల్పించలేని ప్రభుత్వాలకి ఓటు వెయ్యడానికి క్యూలో నుంచున్నప్పుడల్లా భూకబ్జా, గూండా, ధనస్వామ్య, అవినీతి అభ్యర్థుల్లో ఎవరికో ఒకరికి ఓటేసి వచ్చినంత నిర్లిప్తంగా, గడియపడని, నీళ్ళులేని, ఇరుకు, మురికికూపాల్లో మూత్ర విసర్జన చేసి రావడానికి, ఆ క్రమంలో సిగ్గూ ఎగ్గూ వదులుకోవడానికి ఇంకా ఎన్నాళ్ళన్ని మనం సిద్ధంగా వుండాలి? అవి హక్కులుగా ఎప్పటికీ మారవా? ఎన్నికలు బహిష్కరించిన గ్రామాలు వున్నాయిగానీ, చెరువుమీద అలిగి ఏదో మానేసిన గ్రామాలు వుండవు కదా. కాబట్టి మన బలహీనతలన్నీ పాలనా యంత్రాంగపు బలాలవుతాయి.

(1.4.2011)

# రాచబాటమీది దొంగాటని దెబ్బకొట్టాలి

ఆ మధ్య పూనాలో జరిగిన అంతర్జాతీయ రచయితల సదస్సులో తెలుగునుంచి రచయిత్రుల్లేరు. వేదికమీద చేతులు కలుపుకుని జేకొట్టిన తెలంగాణా ఉద్యమ రథసారధుల్లో ఆడవాళ్ళు లేరు. బెంగుళూరులో జరిగిన జాతీయ సమ్మేళనంలో తెలుగు కవయిత్రుల్లేరు. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ విలేఖరుల గోష్టిలో తెలుగునుంచి కె. సత్యవతి తప్ప మరే మహిళా జర్నలిస్టు లేదు.

-ఇది చాలా చిన్న చిట్టా. తల్చుకుంటే ఇంతకంటే పెద్ద చాంతాడు ఇప్పటికిప్పుడు మీకూ గుర్తొస్తుంది.

ఒక మనిషి లేక సంస్థ ఒకసారి, పదిసార్లు వందసార్లు చేసిన తప్పును కూడా పొరబాటు అని సమర్థించుకోవచ్చు. కానీ పదిమందీ పదిసంస్థల ద్వారా పది వందల సార్లు చేసిన తప్పు ఒక సంస్కృతి అవుతుంది. కుట్రపూరిత రాజకీయం అవుతుంది. అంధత్వమూ, బధిరత్వమూ ఒక నాగరికత అయిపోతే, దాన్ని గురించి మాట్లాడినపుడు భరించడానికి ప్రధాన స్రవంతి దూరం జరిగితే, మరి వేదిక ఎక్కడ కట్టుకోవాలి?

ప్రపంచాన్ని మొదటినుంచీ ప్రత్యామ్నాయ పత్రికలూ, వేదికలూ, సాహిత్యమూ, మనుషులూ, దారులూ నడిపిస్తుంటే ప్రజాస్వామ్య బద్ధంగా రాజబాటమీద జరుగుతున్న దొంగాటని ఎవరు దెబ్బ కొట్టాలి?

తెలుగు సాహిత్యంలో వున్నన్ని సాహిత్యేతర శక్తులు ఇతర భాషల్లో లేవు. సాహిత్య వేదికలు నిర్వహించే వారి భూమిక ఏమిటి? జరగబోయే కార్యక్రమాలకు ఆహ్వానించడానికి ఎవర్ని సంప్రదిస్తారు? ఆయా పేర్లను సూచిస్తున్న వారి

అర్హతలేమిటి? ఏ నిబద్ధతతో అతడు లేక ఆమె నిర్ణయాలు చేస్తారు? స్థానిక పత్రికల్లో కూడా కనిపించని రచయితలు/ కవులు అంతర్జాతీయ బహుమతులు ఎలా అందుకుంటున్నారు? ఏ ప్రయోజనాలు ఎవర్ని శాశిస్తున్నాయి? ఏ బలహీనతలు ఎందర్ని మౌనంగా వుంచుతున్నాయి? పరిశోధన చెయ్యదల్చుకుంటే ఇంతకంటే రసవత్తరమైన ఘట్టం ఇంకోటి లేదు.

ఈ నేపథ్యంలో అందరితో బాటు కొంత, అందరి కంటే ఎక్కువగా మరికొంత పక్కకి నెట్టబడుతున్నది స్త్రీలే. రచయిత్రులుగా, పాత్రికేయులుగా, కళాకారులుగా మనం కలుసుకున్న ప్రతిసారీ ఎన్నో సమస్యల మీద మాట్లాడుకుంటున్నాం. ఎన్నో ప్రతిపాదనలు చేసుకుంటున్నాం. కొత్త ఆలోచనలు కలబోసుకుంటున్నాం. మళ్ళీ కొన్ని నెల్లపాటు కమ్యూనికేషన్ గ్యాప్. కలిసిన చేతులు విడిపోతాయి. ఎవరి ప్రపంచంలో వారు కూరుకుపోతున్నాం. మన శక్తిసామర్థ్యాలు, ప్రతిభ అన్నింటిలోనూ ఒంటరివాళ్ళమైపోతున్నాం. వాటికి సామూహిక స్పందన లేకుండా పోతోంది.

ఓ పక్క ప్రపంచీకరణ మనల్ని ఎడాపెడా వాయిస్తోంది. సమాచారాన్ని సూపర్ బజార్ చేసి చూపెడుతోంది. తెలుగునుంచి ఇతర భాషల్లోకి తక్షణమే తర్జుమా కావాల్సిన యుద్ధ ప్రాతిపదికమీద, అంతర్జాతీయ అవసరం మీద మన రచనలు వున్నాయి. జరగాల్సిన ప్రయత్నం జరక్కపోగా, ఏ మాత్రమూ ప్రాతినిధ్యానికి అర్హతలేని నాసిరకం రచనలు తెలుగు వారసత్వం పేరిట ఇతర భాషల్లోకి వెళుతున్నాయి. ఇవి ఇటు తెలుగువారినీ, అటు ప్రపంచ సాహిత్య అంచనాల్నీ మోసం చేస్తున్నాయి.

ఇవాళ మనం నిలబడ్డ ఈ భూమిక ఇన్ని సమస్యల్లో ఇరుక్కుపోయింది. నిజమే. తల్చుకుంటే అనాసక్తిగానే వుంటుంది. ఏ ప్రోత్సాహమూ లేని వాతావరణంలో రాయడం, అచ్చెయ్యడం, చేసిన పాపం మాదిరి నెత్తిని పెట్టుకుని అమ్ముకోలేకపోవడం- ఇదంతా దుఃఖంగానే వుంటుంది. ఈ నేపథ్యంలో రచన ఒక బాధ్యతగా కాక బాధగానూ, స్పందన ఒక సృజనగా కాక సలపరంగానో కూడా వుండొచ్చు.

అయినప్పటికీ మనం కలవాలి. మాట్లాడుకోవాలి. మన కోసం మనమే అయినా రాసుకోవాలి. ఏ అణచివేత వర్గాన్ని చూసినా మంచి రచన ఇలాగే పుడుతుంది. కొత్త సంకలనం వెయ్యడానికి మీ సూచనలు చెప్పండి. గతంలో చేసుకున్న నిర్ణయాలు గుర్తు చేసుకుందాం. అనువాదాల్ని వేసే ప్రయత్నం చేద్దాం. అన్నిటినీ మించి మనం ఒంటరివాళ్ళం కాదు అనే విషయాన్ని పదే పదే తల్చుకుందాం.

జనవరి 1, 2007

# బాల్య వివాహాల్ని తలపిస్తున్న మన పెళ్ళితంతు

మీ అమ్మమ్మనో, బామ్మనో వాళ్ళ పెళ్ళి సంబరాల్ని గురించి చెప్పమనండి! అర్ధరాత్రి భాజాలు వాయించి నిద్ర లేపి, బెల్లం ముక్క తినిపిస్తూ తాళి కట్టించారనో, పల్లకీలో వూరేగడం తప్ప ఇంకేమీ గుర్తు లేదనో చెబుతారు.

ఎందుకంటే అష్టవర్షా కన్యాఅనుకుంటూ చేసిన ఆనాటి వివాహాల్లో అంతకు మించి ఆశించేందుకేమీ లేదు.

కానీ జీవితంలో స్థిరపడి శారీరకంగా, మానసికంగా పరిణతి చెందిన యువతీ యువకులు చేసుకుంటున్న పెళ్ళిలోనూ అదే తతంగం వుంటే, దానికి మరమ్మత్తు అవసరం లేదా?

ఎప్పటినుంచో నాలో వున్న ఈ ఆలోచన, మా సబిత పెళ్ళితో ఇంకా గట్టి పడింది. సబిత వామపక్ష భావాలున్న నా మిత్రుడి కూతురు. తనతో పని చేస్తున్న సాఫ్టువేరు ఇంజనీరుని ఈ మధ్యనే చేసుకుంది. ప్రేమ సంగతి ఒప్పుకుంటాం గానీ పెళ్ళి మాత్రం పీటల మీదనే జరగాలని మగ పెళ్ళివారు పట్టు పట్టారు. వాగ్వివాదాలు తెగని ఒక దశలో నా మిత్రుడు ఇది రద్దు చేసుకోవాలనుకుని కూడా, కూతురి మొహం చూసి కాదనలేక పోయాడు.

సబితకు పూలజడ వేసి గౌరీ పూజకు కూచోపెట్టారు. పూలజడ సంబరం కనిపిస్తోంది కాని పూజ చేయించడం కష్టమయింది. విగ్రహారాధన వ్యతిరేకించే కుటుంబంలో ఆమె పుట్టింది.

“మొహం అలా పెట్టకు. ఆ డబ్బాలో వున్న ఎర్రపొడి, ఈ డబ్బాలో వున్న పచ్చపొడి అక్కడున్న పసుపు ముద్ద మీద, తడవకు యింత చొప్పున చల్లుతూ వుండు. అదే పసుపు కుంకాల పూజ. ఇక ముందు ఏ విషయం తెలీదని చెప్పకు.” వివరం తెలిసిన ఆమె పెద్దమ్మ కూతురు సబిత చెవిలో గొణిగింది.

ఇంకోచోట పెళ్ళికొడుకుని వెళ్ళదలచుకోని కాశీ యాత్రకు, వెడుతున్నట్టే ముస్తాబు చేసి గడ్డం కింద బెల్లం ముక్క పెట్టి వెనక్కి తీసుకొచ్చారు. చెప్పులకు బదులు పాంకోళ్ళు తొడుక్కుని కసరత్తు చేస్తూ అతడు నడిచాడు.

కొన్ని పిడికిళ్ళ పూజ తరువాత సబితను బుట్టలో కూచోమన్నారు. నా వల్ల కాదంది. ముగ్గురు ఆడవాళ్ళు ఆమెను బలవంతాన బుట్టలోకి దించారు. బక్కగా వున్న ఒక మేనమామ బలంగా వున్న మరో నలుగురుతో కలిసి చెమటలు కక్కుకుంటూ పీటల మీద దించారు.

అసలే బొద్దుగా వున్న సబిత బుట్టలోంచి లేచి నుంచుని పడకుండా పీట మీద కూచునే దశలో పడిన యాతన ఆ కళ్ళలో స్పష్టంగా కనిపించింది. వెంటనే ఇద్దరి మధ్యా తెర కట్టారు. ఈ లోగా సెల్ ఫోను మోగింది. తెర పైకెత్తి పట్టుకుని ఒకరి తర్వాత ఒకరు తమ మిత్రుడితో కాస్సేపు మాట్లాడారు. పురోహితుడు వాళ్ళను అప్పుడే పరిచయం అయినట్టు తడి కళ్ళతో చూసుకోమన్నాడు(?) ఆ మాటకి అందరూ నవ్వారు. ఆ తర్వాత ఒక చెక్క లాంటి దాన్ని తెచ్చి వధువు తలపై పట్టుకుని వరుడితో మంత్ర జలం చల్లించారు. ఆ తంతుకి అర్ధమేమిటని ఎవరో అడిగారు.

“కన్యగా వున్న ప్రతీ వధువునూ ఒక భూతం ఆవహించి వుంటుందట. మంత్ర జలం ద్వారా ఆమెను పవిత్రం చేస్తూ సాక్షాత్తూ విష్ణుమూర్తి లాంటి వరుడు అర్ధాంగిగా స్వీకరించుతాడట.” పురోహితుడు అర్ధం వివరించాడు. (కొన్ని అర్ధాలు తెలుసుకోక పోతేనే నయమని నాకు అనిపించింది)

ఆ వివరణ విని పెళ్ళి కొడుకు స్నేహితులు బాగా గోల చేశారు. పెళ్ళి కూతురి స్నేహితులు కొరకొరా చూశారు.

జీలకర్రా బెల్లం సీను అయిన తర్వాత, పూలదండలు వేసుకోమన్నారు. ఇద్దరికీ ఇది నచ్చింది. అయితే అమ్మాయి లేచి నుంచుని అబ్బాయి మెడలో వేసిందిగాని అబ్బాయి లేవడానికి సిద్ధం అయ్యేలోగా పురోహితుడు వారించాడు.

“అయ్యా, మీరు నుంచోనవసం లేదు కూచునే వెయ్యండి.” సబిత మొహం చూడాలంటే నాకు భయం వేసింది.. వెంటనే అబ్బాయి పాదాలకు నమస్కారం చెయ్యమని అమ్మాయితో చెప్పారు. చచ్చినా చెయ్యనంది సబిత. అందరూ ఖంగారు పడ్డారు.

“నేను ముందే చెప్పాను. నాకిలాంటివి నచ్చవని..” అబ్బాయి వంక చూస్తూ ఆటంబాంబులా అరిచింది. ఆ అబ్బాయి ఏదో నచ్చజెప్పబోయాడు. గొడవ వినిపించకుండా బాజాలు వాయించమన్నారు.

అగ్ని చుట్టూ ఇద్దరూ ప్రదక్షిణం చెయ్యమన్నారు. అమ్మాయి అనుకోకుండా ఒక అడుగు ముందుకు నడిచింది. “అమ్మా మీరు వరుడి వెనకాలే నడవాలి, ముందుకాదు...” సబిత ఏదీ అనకుండానే, ఇంకోసారి బాజాలు మోగాయి.

స్థాళీపాకం పేరుతో అక్కడ వెలిగించిన అగ్ని హోత్రం వేడికి ఇద్దరూ కళ్ళద్దాలు తీసి ముక్కు చీదుకుంటూనే వున్నారు. పైగా ఆ మంట మీద చిట్టి గిన్నెడు అన్నాన్ని తమ్ముడి సాయంతో వధువు వొండి వరుడికి తిని పించాలిట. ఉడక్కుండానే మంటల్లో మాడిన ఆ మెతుకుల్ని తిని తీరాలని సబిత గొడవ చేసింది కాని తినకుండానే బాజాలు మోగాయి.

భోరున కురిసే వానలో అరుంధతీ నక్షత్రం కనిపించిదనే చెప్పాలని ముందుగానే నూరి పొయ్యడంవల్ల, ఇద్దరు తలలూపారు. కన్యాదానం, అప్పగింతలు లాంటివి మానెయ్యమని పురోహితుడికి ఎంతగా చెప్పినా, అందుకు ప్రత్యామ్నాయంగా ఇంకే తతంగం లేక అతను ముక్తసరిగా జరిపించాడు.

ఎన్నోసార్లు పెళ్ళిళ్ళకు అలవాటుగా హాజరవుతూ, నిట్టూర్చుతూ వుండే నేను, ఆ పెళ్ళిని సబిత కళ్ళతో, ప్రశ్నలతో చూశాను. ఎవరికీ అర్థం కాని వినాలనుకోని మంత్రాల మధ్య, జరిగే ఈ ఆటలో సమానత్వం గాని, సమాచారం గాని ఏమయినా వుందా? అసలు ఈ తతంగంతో సంబంధం లేకుండానే, అనేకమంది తమ జీవితాలకు నిర్వచనం చెప్పుకుని వున్నారే?

బాల్యవివాహాల నాటి పద్ధతులతో, మన జీవితాలకు మనల్నే ప్రేక్షకులను చేస్తున్న ఈ బొమ్మలాటలు ఇంకా కొనసాగాల్సిందేనా? సంప్రదాయ శాస్త్రీయ రీతుల్లో వున్న కూచిపూడి, భరతనాట్యం, కథాకళీ లాంటి వాటిలో ఆధునిక సామాజిక అంశాల్ని జోడించగలిగినపుడు ప్రతి ఒక్కరి జీవితం లోనూ వెన్నెల వెలిగించే వివాహం, కాలాను గుణంగా తీర్చిదిద్దుకోలేమా? వేద మంత్రాల్ని గాని, వాటిని నమ్ముతున్న అనేక మంది భావావేశాల్ని గాని వ్యతిరేకించడం నా ఉద్దేశం కాదు. పీటల మీద కూచున్న ఈ తరం సబితల ఆత్మగౌరవం మీద బాజాలు వాయించడం ఎలా సబబు అవుతుందని? మాత్రమే అడగదలుచుకున్నాను.

6. 8.2007

# గీటురాయికి అటూ ఇటూ

పనిలేని క్షురకుడు పిల్లితల క్షవరం చేశాడనే సామెతలో ఎంత దుర్మార్గమైన అపవాదు వుందో తెలుసా?

క్షురకవృత్తి చేసే కార్మికుడు పిల్లి తల జోలికి ఎప్పుడు వస్తాడో చెప్పండి. సానపెట్టిన కత్తికి ఒక్క తలకాయా దొరక్కపోవడం వల్ల వస్తాడు. బస్తీలో అందరూ గడ్డాలూ మీసాలూ పెంచేసుకుని గల్లీకొక బాబా చొప్పున జనాల్ని మోసం చేయడంలో బిజీగా వున్నప్పుడు, గుంపులు గుంపులుగా జనమంతా మెడమీద వాటాలన్నీ (తలలు) వడ్డీకాసులవాడికి మొక్కుకుని కల్యాణకట్టలో వాలిపోయినప్పుడు, మన వూరి కార్మికుడికి దక్కాల్సిన కనీస ఆదాయం ఏదీ కనుచూపుమేరలో లేకుండా పోయినప్పుడు. అప్పుడు కేవలం తన వృత్తిని మర్చిపోకుండా వుండేందుకు నిరుపేద అయిన ఆ క్షురకుడు ఒక పిల్లిని దొరకబుచ్చుకోవచ్చు. నోరులేని ఆ జీవాన్ని మనిషిమాదిరి నాగరికుడ్ని చేసే ప్రయత్నంలో గడ్డాలూ మీసాలూ తీసే పని పెట్టుకోవచ్చు. ఇది రాజద్రోహం కాదు, పస్తులున్న అతని కుటుంబానికి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా వదిలేసిన ఈ సమాజమో, రాజ్యమో చేస్తున్న హింస అని నేను అంటాను. అయితే దీనివల్ల పిల్లితో సహా ఎవరికీ ఎటువంటి ప్రయోజనం లేదు కదా అనే లా పాయింటు మీరు నన్ను అడగచ్చు. ప్రయోజనంలేని పన్లతో దేశమంతా కిటకిటలాడ్డంలేదా. నిండు నూరేళ్ళపాటు నిద్రపోవడానికే పదవి పుచ్చుకున్న మాజీమంత్రివర్యులు దేవెగౌడ వల్లగానీ, డబ్బుచేసిన ఒక సినిమా సుపుత్రుడు ఇటీవల చేసుకున్న అయిదురోజుల పెళ్ళివల్లగానీ, ఇంకా ఇంకా అనేకానేక పనికిరాని పన్ల వల్లగానీ దేశానికేమిటి ప్రయోజనం అని నేను అడగను.

ఎందుకంటే కొన్ని వార్తలు వినడం మూలంగా, ఎలా బతకడం దేశానికి అనర్థమో తెలుస్తుంది. గీటురాయికి మంచి నకళ్ళే కాదు, చెడ్డ నకళ్ళు కూడా కావాలి. ఆ మాటకొస్తే ఒక మంత్రిగారు తన పదవీకాలంలో వున్న అయిదేళ్ళూ ప్రశాంతంగా నిద్రపోవడంవల్ల, మెలకువగా వున్న మంత్రులకంటే తక్కువ అవినీతిపనులు మాత్రమే చెయ్యగలిగారనీ, దరిమిలా అందరికీ నిద్రమాత్రలు వేసి సీటులో కూచోపెట్టడంవల్ల భూమి కుంభకోణాలు నుంచి సెక్సు కుంభకోణాలదాకా తగ్గే వీలు వుందని "ఓండ్రింతలు" అనే పుస్తకంలో నా అభిమాన రచయిత కలువకొలను సదానంద ఎప్పుడో చెప్పారు.

ఈ నేపథ్యంలో పిల్లికి గడ్డం చేయడంకంటే సృజనాత్మక మరియు మానవీయ దృశ్యం మరొకటి లేదని నా అభిప్రాయం.

అసలు పిల్లికి గడ్డం చేయడమంటే ఎంత కష్టమో ఒకసారి ఊహించండి. మొదట భయపడి పారిపోతున్న దానిని ప్రేమతో బుజ్జగించాలి. చిన్నగిన్నెలో పాలు తాగించాలి. పాలు తాగుతున్నంతసేపు దాన్ని వెన్నుమీద నిమురుతూ మన ఉనికివల్ల ప్రమాదమేమీ లేదని దానికి భరోసా కలిగించాలి. ఇంతచేసినా సరే సాన మీద కత్తిని తిప్పగానే అది గుర్రున అరిచి గుడ్లు పీకేయవచ్చు. నువ్వు కత్తి పట్టుకున్న కారణం దానికి తెలియదు కదా. ఆ సందర్భంలో కూడా నిలదొక్కుకొని, సహనంగా పసిబిడ్డ మాదిరి దానిని ఒడిలో కూర్చోపెట్టుకొని క్షవరకార్యం పూర్తిచేయాలి. కాబట్టి అది పనిలేనివాడు చేసే పని కాదు, పనిలో ఆరితేరినవాడు మాత్రమే చేయగల పనియని విన్నవించదలుచుకున్నాను. ఎందుకంటే, దీనివల్ల ఎలాంటి పారితోషికమూ ఉండదు. తట్ట పట్టుకొని కెమెరాకి ఫోజులిచ్చే జన్మభూమి అధికారుల మాదిరి కాకుండా, జీవకారుణ్యంతో, నిజాయితీతో కత్తి నడపాలి. ఎక్కడా తెగకుండా, రక్తం చిందకుండా, కాచిన జున్నుగడ్డ మీద హత్తుకున్న మిరియాలపొడి పక్కకి జరిపినంత నైపుణ్యంతో, మార్జాలనీలాల్ని తీసేయాలి. కాబట్టి ఈ పనికి వంకలు పెట్టేవాళ్ళు నిజంగా పనిలేనివాళ్ళుగా మనం గుర్తించాలి.

మా బాబాయి ఒకడు నిద్రలేచిన వెంటనే "సూర్యుణ్ణి చూసి ఓరి నీ మొహం మండ, అప్పుడే జొరబడి చచ్చావా". అనేవాడు. వానాకాలం అనుకోండి అప్పుడు మబ్బులు పట్టిన ఆకాశాన్ని ఉద్దేశించి "ఓరి నిన్ను తగలెయ్య ఇప్పటిదాకా ఎక్కడికి పోయావురా" అని అరిచేవాడు. అది మొదలు రోజంతా అన్నిటికీ తిట్లవర్షమే కురిసేది, ఒక్కసారి కూడా లేచిపోకుండా, అతనితో అరవయ్యేళ్ళు కాపురం చేసిన మా పిన్నికంటే భూదేవి ఇంకెక్కడయినా వుంటుందంటే నేను నమ్మను.

ఆయన కంకణం కట్టుకున్న కార్యక్రమాలు తెలుసుకుంటే మీకు మతిపోతుంది.

వాటి ప్లానింగ్‌లో, నిర్వహణలో అమాంబాపతు పొట్టి శ్రీరాములు లాంటి వాడిని అనుకొని మీసం తిప్పేవాడు. ఉదాహరణకు అతని కమ్యూనిస్టు మిత్రుడి తల్లి చనిపోయినప్పుడు అందరితోబాటు పరామర్శించి రాకుండా వాళ్ళ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పురోహితుడితో మాట్లాడి ఎలాగోలా ఉత్తరకర్మలు జరిపించి తద్వారా పుణ్యగతులు మంజూరు చేసి వచ్చాననేవాడు.

క్రైస్తవమతం పుచ్చుకున్న మరదలు నుదుట బొట్టు పెట్టుకునేదాకా సతాయించి, సాధించి బొట్టుదిద్దుకుంటేనే, నీ అక్కతో మాట్లాడ్డానికి అనుమతిస్తానని షరతు పెట్టడం ద్వారా, వాళ్ళిద్దరి భావోద్వేగాల మీద దెబ్బకొట్టి సన్మార్గంలోకి నడిపించానంటాడు.

పెళ్ళి చేసుకోనని మొత్తుకున్న పక్కింటి మార్క్సిస్టు కుర్రవాడి నోరునొక్కి, నందికేశవ నోము తప్ప ఇంకేమీ తెలియని భక్తురాలినిచ్చి తాళి కట్టించడం ద్వారా చేసిన పాపాలన్నీ పోయాయని ప్రకటించాడు. అంతెందుకు, ఐశ్వర్యారాయ్ తనకంటే ఆరేళ్ళు చిన్నవాడైన అభిషేక్‌బచ్చన్‌ని చేసుకొని వరహీనం అనబడు పాపం చేయడంవల్ల, దిగులుపడి ఆ రాత్రంతా నిద్రపోలేదుట. ఈ రకంగా దేశంలో ఎవరి జీవితాన్నైనా తన చేతిలోకి తీసుకొని, వాడి మెదడులోని గుజ్జంతా తినేసి, ఆ తరువాత అత్యంత ప్రేమతో కోతికొమ్మొచ్చి ఆడించేవాడు.

“టూ మచ్ పొసెసివ్‌నెస్” అనబడు ఈ జబ్బుకి తెలుగు నిఘంటువులో “తీవ్రాతితీవ్రంగా జొరబడి ఏలుకునే గుణం” అని రాసి ఉంది. స్త్రీలను ఇంకొకరు ఉద్ధరించేవాదం ఉండవచ్చుట గానీ ఎవరిని వారే ఉద్ధరించుకునే వాదం అంటూ ఎక్కడా ఉండదట.

ఫెమినిజం మీద కూడా సంచలనాత్మక అభిప్రాయాలు ఆయనకున్నాయి.. ఫెమినిజానికి ఫెమినిజం అని పేరు కాకుండా కాళీమాత వ్రతమనో, ఇంకేదో ఉంటే అందరూ బాగా ఆదరిస్తారుట. బావుంది కదూ. ఈ జ్ఞానం కూడా అవసరమే. చుక్కలు పదునెక్కాలంటే అమావాస్య రావాలి. నాలో ఫెమినిజ భావజాలానికి మా బాబాయే కారణం. సతీ సక్కుబాయిని అత్తగారు ఎంత బాగా కాల్చుకు తినకపోతే, అంత చప్పున మధురానగరం పరిగెడుతుంది చెప్పండి. మనం నెమ్మదిగా చేసే పనులు చురుకుగా మరింత సమర్ధవంతంగా చేయాలంటే, బలమైన ప్రత్యర్థి ఒకడు వుండే తీరాలి.

7.7.2011

# ఆరడుగుల చోటులేని ఆసియా ఖండంలో..

ఆ రోజు ఏదో పని మీద వైజాగ్ వెళ్ళాల్సి వచ్చింది. నా టిక్కెట్ వెయిటింగ్ లిస్టులో వుంది. సీటు దొరకడమే కనా కష్టం. బెర్తు ఆశించడం ఇంకా దురాశ. నా ముందే ఇద్దరు ముగ్గురు పచ్చ కాయితాలు చూపించినా గాని టి.సి. కరుణించినట్టు కనబడలేదు. అప్పుడు నేను వెళ్ళి, లంచంతో బాటు, నా జెండర్ పేరు చెప్పి ప్రాధేయ పడి వాడి షివల్రీ గాని, తిరస్కారం గాని ఎదుర్కోవడం ఇష్టంలేక బాత్రూం పక్కన వుండే సింగిల్ సీటులో కూలబడ్డాను. చర్మాన్ని కోత పెట్టే చలి, ఆపుకోలేనంత నిద్ర, గాల్లోంచి తేలి వచ్చే దుర్గంధం, జానా బెత్తెడున్న సీటులో అయిదడుగుల రెండంగుళాల దేహాన్ని ఎలా మడతపెట్టి వుంచాలో తెలీని నిస్సహాయత. బ్యాగ్‌లోంచి దుప్పటితీసి కింద అయినా పరిచి ఎలాగోలా నడుంవాల్చాలని తీవ్రంగా అనిపించింది. కళ్ళతోనే చోటు కోసం వెతుకుతున్నాను. అప్పుడొచ్చిందొక ముసలమ్మ. “నడిరేయి ఏ జాములో..” పాట పాడి, ఎవరో ఇచ్చిన పులిహోర తినేసి, సరిగ్గా అక్కడ నేను ఎంపిక చేసుకున్న ఆ జాగాలో గోనె పరచుకుని వెంటనే నిద్రపోయింది. టి.సి కంటపడితే ఎలానూ లేపేస్తాడు. కాబట్టి అతను వచ్చే లోపుగా గబగబా కునుకు తీసి లేవాలనే ఆత్రం కావచ్చు. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టక కూచోవడానికి అలవాటుపడ్డ జీవితాలకి, ఎవరో తరిమికొడతారనే భయంతో గబగబ నిద్ర తియ్యడం, గబగబ ముద్ద తినడం, గబగబ కోరిక తీర్చుకోవడం, గబగబ పురిటి నొప్పులు పడి బిడ్డను కనడం, దూసుకుపోయే వాహనాల మధ్యలోంచి గబ గబ నడుచుకుంటూ చావుకి తెగించి ఆ పసిగుడ్డును చూపించి, విసిరిన చిల్లర ఏరుకోవడంలోని విషాదం అర్థం చేసుకోవడం కష్టం. అది ఎటువంటి వెలుగూ ప్రసరించని ఇంకొక ప్రపంచం, జానెడు చోటు కోసం కూడా హత్యలు జరిగిపోతాయక్కడ. జీవితం మొత్తం చోటు కోసం వెతకడమే సరిపోతుంది వారికి. వ్యక్తిగత సంపద సమాజ పేదరికానికి కారణమనే కారల్ మార్క్సు మాట నిజమే అయితే ఆ హత్యలన్నిటికీ పరోక్షంగా మనమే కారణమేమో అనిపిస్తుంది. సంపదా దానివల్ల వచ్చే సుఖాలూ, ఆ సుఖాల మెత్తదనాలవల్ల అబ్బిన విలువలు, రుచులూ, అభిరుచులు మనవైనప్పుడు మన నిర్లక్ష్యంలోని కరుకుదనాన్నీ, మురికినీ వాళ్ళే మోయ్యాలి కదా. అలాగే మోస్తున్నారు మరి.

ఎందుకంటే స్వతంత్రం వచ్చిన తర్వాత మనం సాధించినదేంటి? డెబ్భై లక్షల కోట్ల రూపాయలు కుంభకోణాల్లో గల్లంతైనట్టు అంచనా. ప్రభుత్వ శాఖలో జరుగుతున్న

అవినీతి కోటి కోట్ల పై మాటే. ఈ సొమ్ముతో మన దేశానికి సంబంధించిన మొత్తం బాకీని వడ్డీతో సహా తీర్చి పారేయవచ్చు. ప్రతి ఊరికి మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అన్ని సౌకర్యాలతో నెలకొల్పవచ్చు. దేశంలో ప్రతి భారతీయుడికీ ఏభై ఆరు వేల రూపాయలు జీవన భృతి కింద ఇవ్వచ్చు. మన దేశ స్థూల జాతీయ ఆదాయంకంటే స్కాముల్లో పోయినదే ఎక్కువట. వీళ్ళెవర్నీ జైల్లో పెట్టిన వాళ్ళు లేరు. సోయి లేక పడి వున్న బిచ్చగాడిని పెడరెక్కలు విరిచి జైల్లో పడెయ్యడంద్వారా పార్లమెంటు అందం, మందం రక్షించబడతాయి. బంజారాల్ని తరిమికొట్టి, బంజారాహిల్స్ కట్టుకున్నంత గొప్పగా, కొంపలు ముంచే కల్తీ పోయించి, లాక్కున్న ఆదాయంతో సంక్షేమ పథకాలు రచించినంత నిస్సిగ్గుగా ఈ దేశంలో అభివృద్ధి పెరుగుతున్న కొద్దీ, బిచ్చగాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డువార జీవితాలెన్ని? అని ప్రభుత్వం మొక్కుబడి లెక్క ఒకటి తీసి, రెండు మిలియన్లు అని ప్రకటించింది. ఒక స్వచ్ఛంద సంస్థ వెంటనే దాన్ని ఖండిస్తూ అది నిజం కానే కాదు, ఇరవై రెండు మిలియన్లు వున్నారని చెప్పింది.. అంటే షాపు అరుగుల మీదా, పార్కుల్లోనూ, నెక్లెసు రోడ్ల కిందా వున్న వాళ్ళంతా హౌస్ ఓనర్లేనని ఏలినవారి అభిప్రాయం కావచ్చు. అసలు వీళ్ళకి ఎక్కడో అక్కడ ఇళ్లు వుండే వుంటాయని, స్విస్ బ్యాంకుల్లో ఖాతాలున్నాయని, వడ్డీ వ్యాపారాలు చేస్తారని వాదించే పెద్ద మనుషుల్ని కూడా నేను చూశాను.

ఆసియా ఖండం ఎంత విశాలమైనదైనా, ఆరడుగుల జాగాకి నోచుకోని భావిభారత పౌరులు అనేకం వున్నారు. వాళ్ళంతా కూచున్నందుకు, నుంచున్నందుకు, ఉమ్మినందుకు కూడా పోలీసు జీపులెక్కి, వారికే తెలీని కేసుల్లో ఇరుక్కుపోయి, అలమటిస్తారు. ఎత్తుకెళ్ళిన యాచకుల్ని అమ్ముకోవచ్చు. రక్తాలు తీసుకోవచ్చు. కళ్ళూ, కిడ్నీలు మాయం చేసి పంపచ్చు. ఆడవాళ్ళ బాధలు అసలు చెప్పేందుకు లేదు. ఏ మంత్రిగారో వచ్చినప్పుడు గరీబీ హఠావో అన్నట్టుగా ఈ గరీబుల్ని తొక్కి తుంగల్లోకి తోస్తారు. నా ఆలోచన పరి పరి విధాల పోతోంది.

ముసలమ్మ నిద్రలోనే ఇటు నుంచి అటు దొర్లింది. ఉలిక్కి పడినట్టుగా లేచింది. ఏదయినా పురుగు కుట్టిందేమో అనుకున్నాను. కాదు, బూట్ల చప్పుడు వినిపించినట్టుంది. టి.సి. కంటబడకుండా చివాల్న బాత్రూంలోకి దూరింది. తర్వాత వెంటనే ఏదో స్టేషన్లో దిగిపోయింది. "నడిరేయి ఏ జాములో" పాట వినిపించలేదు. చక్రాల చప్పుడులో కలిసిపోయి వుంటుంది.

3.2.2011

# కంటితుడుపు ఖరీదు ఎంత?

ప్రతి స్త్రీ తన జీవితకాలం మొత్తమ్మీద ఎన్ని సంవత్సరాల కాలం రుతుస్రావంతో బాధపడుతుందో చాలామందికి తెలీదు. కనీసం ముప్పై అయిదు నుంచి నలభయ్యేళ్ళ పాటు ప్రతినెలా అయిదేసి, లేక అంతకంటే ఎక్కువ రోజుల పాటు రక్తాన్ని పోగొట్టుకుంటుంది. (కాన్పుల లెక్క వేరే ) దీని చుట్టూతా ఎన్ని భయ భ్రాంతులున్నాయో, అపవిత్రతా భావనలున్నాయో మనకి తెలుసు. ఎటువంటి నాగరికతా తెలీని ఆది మానవుల కాలంలో స్త్రీ పట్ల, ఆమె పునరుత్పత్తి శక్తి పట్ల వున్న భయమే, పురుషునిలో పెరిగిపోయి, ప్రకృతి మీద ఆధిపత్యం సాధించాలనే తాపత్రయానికి కారణమయింది. ప్రకృతి అంటే స్త్రీ అనే అర్థం వుంది. రక్తస్రావము అంటేనే అండం విడుదల లేక విచ్ఛిత్తి కాబట్టి, అది పాపమనే భావన అలా మొదలయి వుండచ్చు. ఆ ధోరణి ఎన్నో వెర్రితలలు వేసి, ఒక జాతినే అస్పృశ్యతకు గురిచేసి, అవమానిస్తోంది. సాంకేతికంగా మనం ఎంత ప్రగతిని సాధించినా గాని, స్త్రీల విషయంలో ఒక్క అంగుళమైనా ముందుకు కదల్లేదని ఇలాంటప్పుడే అర్థమవుతుంది. ఎక్కడ అస్పృశ్యత వుంటుందో అక్కడ హింస వుంటుంది. ఒకరు చేసే హింస, పదిమంది చేస్తే అలవాటుగా, వందమంది చేస్తే ఆచారంగా బలపడుతుంది.

ఇప్పటికీ కొన్ని మారుమూల గ్రామాల్లో వున్న తెగలు, ఆదివాసీలు ఆ అయిదు రోజులు ఏం చేస్తారో తెలుసుకుంటే గుండె నీరవుతుంది. షియోపూర్ గ్రామంలోని సహారియా తెగవారు రుతుస్రావం మొదలయిన ఆడవారిని ఇంటి నుంచి

బహిష్కరించి పశువుల పాకలో వుంచుతారు. మూడు నుంచి అయిదు రోజులపాటు తిండీ, నిద్రా, కాలకృత్యాలు అన్నీ ఆ పశువుల పక్కనే జరుపుకోవాలి. అన్నిటికంటే రుతుస్రావాన్ని తట్టుకోవడమే వారికెక్కువ సమస్య. పశువుల పాకలో ఏం దొరుకుతాయి? గోనెసంచులు, బూడిద, పేడ, గడ్డి, గాదం అంతేకదా. అభాగ్యులైన ఆ ఆడవాళ్ళు వాటితోనే రుతుస్రావాన్ని అరికట్టడానికి ప్రయత్నిస్తారు. చాలాసార్లు అవి కూడా కావలసినన్ని దొరకవు. అప్పుడు ఒకరు వాడిన వాటిని మళ్ళీ మళ్ళీ గాలికి, ఎండకి ఆరబెట్టి మరొకరు వాడతారు. ఈ పన్లన్నీ రహస్యంగా ఎవరికీ కనబడకుండా జరిగిపోవాలి. దీన్ని గురించి వూళ్ళో ఎవరికయినా సానుభూతి వున్నాగాని, మిగిలినవాళ్ళు వెలేస్తారనే భయంతో మౌనంగా వుండిపోతారు. రుతుస్రావమే ఒక అపవిత్ర పరిణామం కాబట్టి, స్త్రీలు ఆ సమయంలో వాడిన గోనెసంచీ ముక్కల్ని బయటికి కనబడకుండా గడ్డిలోనో, చూరులోనో దాచిపెడతారు. అందులోకి సూక్ష్మక్రిములే కాదు పెద్ద పురుగులు కూడా చేరతాయి. అవి శరీరంలోనికి ప్రవేశిస్తాయి కూడా. వూరికి దూరంగా వుండటం వల్ల, పురుగు కుట్టిన వార్త ఇంట్లో వారికి, అక్కడ్నించి వైద్యునికి ఆలస్యంగా చేరుతుంది. ఒకవేళ దొరికిన వైద్యుల చైతన్యస్థాయి కూడా అలానే వుంటే, ఆ స్త్రీలను ముట్టుకుని ఏం జరిగిందో చూసేవారు వుండరు. మధ్యప్రదేశ్‌లోని డింగరీ జిల్లాకి చెందిన ఒక పదహారేళ్ళ బాలిక వాడటానికి తీసుకున్న గోనెసంచీలో వున్న పురుగు కుట్టి, ఆ వార్త ఇంటికి చేరేలోపే నురగలు కక్కి చనిపోయింది. శరీరంలోకి చొచ్చుకుపోయిన ఆ పురుగు ఏమిటో ఎలాంటిదో పోస్టుమార్టంలో తప్ప మామూలుగా తెలీదు. గిరిజన, ఆదివాసీ సంస్కృతి పోస్టుమార్టం విధానాన్ని కూడా అనుమతించదు. అందువల్ల అక్కడ పుట్టి పెరిగి నడివయసుకి చేరుకున్న స్త్రీలలో ఎక్కువ మంది మూత్రకోశ కాన్సరుతోనో, గర్భసంచీ తొలగింపుతోనో చనిపోవడం రివాజు.

కాస్మోపాలిటన్ నగరాలను మినహాయిస్తే, మిగిలిన అన్ని గ్రామాల్లోనూ వున్న సగటు మహిళల్లో మూడూ శాతం మందికి కూడా ఆ సమయంలో పాటించాల్సిన వ్యక్తిగత శుభ్రత గురించి దాదాపు తెలీదు. శానిటరీ నాప్‌కీన్స్ గురించి ఒక్కసారి కూడా విననివారు, చూడనివారూ చాలా శాతం వున్నారు. తెలిసిన కొద్దిమందికీ కొనే స్థోమత లేదు.

శానిటరీ నాప్‌కీన్స్ కొనుగోలు అనేది మన ఆర్థిక స్థోమత మీద ఆధారపడి వుంటుంది.

మంచి జీతం, ఆస్తిపాస్తులు బాగా వుంటే శానిటరీ నాప్‌కీన్స్ కొనుక్కోవచ్చు. ఆశ్చర్యంగా వుందా?

తమిళనాడుకు చెందిన కోయంబత్తూరులో కూచున్న మురుగానందం కూడా మీలాగే ఆశ్చర్యపోయాడు. కొన్నేళ్ల క్రిందట అతడూ అందరిలాగే ఒకరోజు తన భార్యతో

"ఎందుకంత చెత్తగుడ్డలు వాడతావు. మళ్ళీ ఓవర్ డిశ్చార్జ్ అంటావు, బజార్లో దొరికే నాప్‌కీన్స్ కొనుక్కోలేవా?" అని విసుక్కున్నాడట.

"అలాగే కొంటాను, కానీ దానికోసం మన పిల్లల పాల బడ్జెట్ గానీ, మీ రోజువారి ప్రయాణ ఛార్జీలు గాని తగ్గించమంటారా మరి" అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలోని తీవ్రత అతన్ని బజారుకి తరిమికొట్టింది. దగ్గరలోవున్న దుకాణానికి వెళ్ళాడు. శానిటరీ నాప్‌కీన్స్ కావాలని అడిగాడు. కౌంటరు దగ్గర కూచున్నవాడెవరో తల పక్కకి తిప్పి హేళనగా దగ్గాడు. మగవాడు ఆడవాళ్ల అవసరాల్ని గుర్తించడం ఎంత నవ్వులాటగా మారుతుందో అప్పుడు అతనికి తెల్సింది. ఈలోగా ఒక యువతి షాపులోకి వచ్చింది. ఏం కావాలో చెప్పలేదు. అటూ ఇటూ తచ్చాడింది. కళ్లతోనే దేనికోసమో వెతికింది. షాపువాడు అది కనిపెట్టి ఒక ప్యాకెట్ లాంటిదాన్ని హడావిడిగా నల్ల ప్లాస్టిక్ కవరులో చుట్టి ఆవిడ చేతికిచ్చాడు. ఆవిడ తలవంచుకుని తక్షణమే బయటికి వెళ్ళిపోయింది. తను కూడా అదే వస్తువు కోసం రాకపోయివుంటే తప్పకుండా అక్కడ ఏ బ్రౌన్ షుగర్ ముఠాలాంటిదో పనిచేస్తోందని అనుకునేవాడట. అంతేకాదు ఆ యువతి బైట ఏ దేవాలయంలోనో, చర్చిలోనో, మసీదులోనో కనబడినా సరే అనుమానంగానే చూసేవాడేమో. పదినిమిషాల్లో ఇంటికొచ్చిన అతన్ని, అతని చేతిలోని ప్యాకెట్‌నీ, దాని మీదున్న ధరని చూసి తిక్క కుదిరిందా అన్నట్టు నవ్వుకుని వుంటుంది మురుగానందం గారి భార్య.

ఆ రోజు ఆమె ఇచ్చిన ఝలక్‌తో మురుగానందం విమెన్ ఫ్రెండ్లీ కార్యకర్తగా మారిపోయాడు. అట్టడుగు మహిళకి సైతం లభ్యం కాగల ధరలో నాప్‌కీన్స్ ఉత్పత్తి చేయడం ఒక్కటే అతని వృత్తి ప్లస్ వ్యావృత్తిగా మారిపోయింది. గంటకి రెండువేలు ప్యాడ్స్ ఉత్పత్తి చేసే యంత్రం అతని దగ్గరుంది. అతను తయారుచేసిన నాప్‌కీన్ ధర ఎంతో తెలుసా? మొత్తం ప్యాకెట్ రెండు రూపాయలు. అంత తక్కువ ధరకి ఇప్పుడు బండిమీద ఒక జామకాయ రావడం లేదు. ఆ కోవలోనే ఇప్పుడు ఢిల్లీ నుంచి గూంజ్ అనే సంస్థ పనిచేస్తోంది. ధర తక్కువ కాబట్టి నాణ్యతలో రాజీ పడతారనుకుంటున్నారేమో, అదేమీ లేదు. కావాల్సిన బట్టను, ఉతికించి, ఇస్త్రీచేసి, అవసరమైన కొలతకు కత్తిరించి ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్‌లాంటి పద్దెనిమిది రాష్ట్రాలకు పంపిణీ చేస్తోంది. పొదుపు బృందాలకు ఇది ఉపాధిగా కూడా పనికొస్తుంది. అక్కడున్న విద్యాసంస్థలకు, కార్యాలయాలకు వీరు అమ్ముతారు. కాశ్మీర్ ప్రాంతాల్లో వున్న గ్రామీణ స్త్రీలు కూడా ఈ పని చేపట్టారు. ఛత్తీస్‌ఘడ్‌లోని మహాలక్ష్మి పొదుపు

గ్రూపువారు వాటర్ ఎయిడ్ సహకారంతో తయారుచేస్తున్న శానిటరీ ప్యాడ్స్ నవపూర్ లాంటి కుగ్రామంలో వున్న స్త్రీలని, ఆ చుట్టుప్రక్కల వున్న మరో అరవై గ్రామాల వాసుల్ని ఆకర్షించింది. ప్రాథమిక హెల్త్ సెంటర్లు కూడా లేని చోట్ల సురక్షితమైన న్యాప్‌కీన్స్ వాడ్డం వల్ల మహిళల ఆరోగ్యం బాగా మెరుగుపడిందని వారు చెబుతున్నారు. అట్టడుగు మహిళకు అందుబాటులో వుండేట్టుగా ఇవి అత్యంత చవకగా వుండటమే కాకుండా, వాడకం తర్వాత వాటిని సక్రమంగా డిస్పోజ్ చెయ్యడంలోనూ శిక్షణ దొరికింది. "నాట్ జస్ట్ ఎ పీస్ ఆఫ్ క్లాత్" కాంపెయిన్ ద్వారా మొదలయిన ఈ ఉద్యమం బీహార్‌లో గ్రామీణ మహిళలకు బాగా చేరువయింది. చీర లోపల లంగా కట్టడం కూడా అలవాటులేని గ్రామీణ ఆదివాసీ స్త్రీలకు రక్తస్రావాన్ని పీల్చుకునే పరిశుభ్రమైన బట్టను పరిచయం చెయ్యడం, వాడిన వెంటనే దాన్ని కంపోస్టు చేయడమెలాగో చెప్పడం సామాన్యమైన విషయం కాదు. మైండ్‌సెట్ మార్చితేనే అది సాధ్యమవుతుంది.

అసలు స్త్రీల ఆరోగ్యం చుట్టూ అనేక సామాజిక కోణాలుంటాయి. తనకి తను తక్కువ ప్రాధాన్యత ఇచ్చుకుంటూ కుటుంబానికి, అతిథి, అభ్యాగతులకి ఎక్కువ సమయాన్ని, శక్తిని, ధనాన్ని ఖర్చుపెట్టడం ఎంత ఉదాత్తత గల విషయమో మన సంస్కృతి చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతుంది. అటువంటప్పుడు నెలనెలా వచ్చి పడే అవస్థని పట్టించుకోవాలని, ఆహారమూ, విశ్రాంతి తీసుకోవాలని, తన శరీరాన్ని తనే గౌరవించుకోకపోతే ఇంకెవరూ గౌరవించరనీ ఎవరు చెబుతారు? మురుగానందం ఈ విషయాలన్నీ స్త్రీలతో మాట్లాడాలని చూసేవాడు. కానీ ఎవరూ స్పందించేవారు కాదు. రక్తస్రావ స్వభావానికి సంబంధించి సమగ్ర సమాచారం సేకరించడానికి నానాయాతనలూ పడ్డాడు. ఒక సాధారణ బట్ట ఎన్ని ఔన్సుల రక్తాన్ని పీల్చుకుంటుందో తెలుసుకోవడానికి మాంసం దుకాణానికి వెళ్ళి మేక రక్తంతో ప్రయోగం చేశాడు. క్లాత్ మీద నీరు ఎండటానికి, రక్తం ఎండటానికి ఎంత తేడా వుందో తెలియాలనుకునేవాడు. అతని ఆర్తీ, అవస్థా ఎవరూ అర్థం చేసుకోకపోగా, ఎక్కడ కనబడితే ఏమి అడుగుతాడో అనుకుని చుట్టుపక్కల ఆడవాళ్ళు తప్పించుకుని తిరిగేవారట. అతను చెప్పిన ప్రయోగాలు ఫలితాలు సాధించాక ఇప్పుడు అందరికీ ఆప్తమిత్రుడయ్యాడు. ఈ నాప్‌కీన్స్ అందుతున్న గ్రామ పంచాయితీ బళ్లలో బాలికల హాజరు శాతం బాగా పెరిగింది.

కాస్మోపాలిటన్ సిటీల్లో కూడా అన్ని తరగతుల మహిళలూ వుంటారు. ఈ ఉత్పత్తులు వారిదాకా వస్తే ఇంకా బావుంటుంది. లేదా, ఇక్కడ చాలామంది వాటిని ఉత్పత్తి అయినా చెయ్యాలి. మార్కెట్‌ని మనకు అనుకూలంగా మలచుకోవడమే

నిజమైన సాధికారత. ఇప్పటి వరకూ మనం ఏం చేస్తున్నాం? హై బ్రాండు పేరుతో విదేశీ కంపెనీలు మన మీద మోపుతున్న వస్తు ఇంద్రజాలంలో కూరుకుపోయి వున్నాం. ఇక్కడ అత్యధికంగా అమ్ముడుపోయే ఒక సరుకు మన రక్తస్రావాన్ని పీల్చుకునే బట్ట. అఫ్‌కోర్స్ దానిపేరు నాప్‌కీన్. దాని ఖరీదు వందకి పైమాటే. కావాలంటే ఎక్స్‌ట్రా లార్జ్, స్కిన్ ఫ్రెండ్లీలు కూడా దొరుకుతాయి. కాకపోతే మీ పర్సుబరువు కూడా ఎక్స్‌ట్రా లార్జిగా వుండి తీరాలి. ధర ఒక్కటే సమస్య కాదు. చైతన్యాన్ని కూడా ఒకసారి అంచనా వేసుకుందాం. శానిటరీ ప్యాకెట్ ఎక్కడయితే కొన్నామో అక్కడే నుంచుని పొట్లం విప్పదీసి అందులో నిజంగా పదిహేను క్లాతులు వున్నాయో లేదో, బెల్ట్ జత చేసి వుందో లేదో, బట్ట నాణ్యత బావుందో లేదో, బజారులో దొరికే దానికన్నా ఇది ఎందుకు ఇంత ఎక్కువ ధర వుందో, ఈ దోపిడీకి కారణమేమిటో ప్రశ్నించగలమా? చాలామంది అలా చెయ్యలేరు. అదే కూరగాయల బజారులోనో, చీరల షాపులోనో ఎంత తెలివైన వినియోగదారిణిగా వుంటామో. ఈ సందర్భంగా గుర్తు చేసుకోండి. ఏమిటి తేడా? మన అనారోగ్యాలు, కాన్పులు, రక్తస్రావాలు మనకే చూపించి, దడిపించి, ఎవడో మార్కెట్ చేసుకుని బాగుపడతాడు. స్రావాన్ని అరికట్టే సమాచారం లేక మనం బాధపడుతూ వుంటాం. ఇప్పుడిక్కడ నాప్‌కీన్ కాదు రక్తస్రావమే గొప్ప మార్కెట్ ఎంత విషాదమో చూశారా? ఇంక లాభంలేదు. మార్కెట్ కొమ్ములు వంచడానికయినా మనం స్వతంత్ర ఉత్పత్తులు చేపట్టాలి. బీహార్‌లో మొదలుపెట్టిన ఉద్యమం పేరేమిటి? నాట్ జస్ట్ ఫర్ ఎ పీస్ ఆఫ్ క్లాత్ అని కదా? ఔను ఈ ఉద్యమం బట్ట కోసమే కాదు, ఉనికి కోసం కూడా.

(ఈ ఏడాది నాతో బాటు లాడ్లీ మీడియా బహుమతి అందుకున్న కన్నడ భాషా విలేకరి ఆర్తీ మోహన్ వెబ్ ఆర్టికల్ ''ది రియల్ ఐ ప్యాడ్'' చదివిన స్ఫూర్తితో.)

11.1.2011

# భలే మంచి చౌకబేరమూ

హమ్మయ్య! ఎలాగైతేనేం పంట పొలాల్లో చీడ పీడల్ని వదిలించుకోవడానికి సులభమైన మార్గం దొరికింది. రైతక్కలారా, అన్నలారా! మీరింక, ఎరువుల బస్తాల కోసం ఎదురుచూడక్కర్లేదు. బ్లాక్ మార్కెట్టు ముందు ధర్నాకు దిగక్కర్లేదు. శాంతి భద్రతల సమస్య కింద లాఠీ దెబ్బలు తినక్కర్లేదు.

అసలేమీ అక్కర్లేదు. వినాయక లడ్డూ ఒకటి కొనుక్కోండి. మీ పొలాల్లో చల్లుకోండి. కరెంటు బావుల్లో చల్లుకోండి. దీనివల్ల మీ కుటుంబమే కాదు. గ్రామం, రాష్ట్రం, దేశం కూడా బాగుపడతాయిట. ఏడాదికి నాలుగు పంటలు పండుతాయట. లడ్డూలే కదా అని సెనగపిండి, పంచదార పాకంపట్టి ఇంట్లోనే వుండకట్టి తయారు చేసుకునేరు. అదేం కుదర్దు. అందుకే మీరసలు బాగు పడ్డం మానేశారు. హైదరాబాదు వెళ్ళి, అక్కడ బాలానగర్లో వేలంపాట పాడుకోవాలి. లేదా గుంటూరు జిల్లా నకిరేకల్లు గాని ఇంకెక్కడికైనా గానీ వెళ్ళండి. వేలంపాటల్లో దొరికిన దాన్నే లడ్డూ అంటారు. ఇంట్లో ఇల్లాలు చేసినది గాడిద గుడ్డు అన్న మాట.

ఎంతకి పాడాలీ అంటారా? అబ్బే, ఎంతో కాదండి ఆఫ్ట్రాల్ అయిదున్నర లక్షలు. అదేమిటలా మొహం పెట్టారు? అంత డబ్బుల్లేవా, అప్పుడు ఇల్లూ వాకిలీ అమ్మేయ్యండి, అప్పు చేయండి. పావలా వడ్డీ అయితే ప్రభుత్వం దగ్గరే దొరుకుతుంది. ఫ్యాక్టరీలకోసమో, ఫ్లై ఓవర్ల కోసమో, కారు షెడ్ల కోసమో, గుండాల శిలా విగ్రహాల కోసమో ఎన్ని సార్లు మీ జాగాలు వదులుకోలేదు? ఇప్పుడు తిరుపతి, సారీ వినాయక లడ్డూ కోసం వదులుకోండి (అన్నట్టు తిరుపతి లడ్డుకి వినాయక లడ్డూకి పోటీ పెడితే ఏది గెలుస్తుందంటారు. కోడి పందేలాట ఏర్పాటు చేద్దామా? తిరుపతి లడ్డుకి పరపతి తగ్గినట్టుగా విన్నాను. నిజమేనంటారా?) ఈ లడ్డు మహత్యంతో మీ జాతకం గిర గిర తిరిగిపోతుంది. ఒట్టు.

అదిగదిగో అయన్ని చూడండి. ఎవరో చాలా పెద్ద వ్యాపారిట. లడ్డూను దక్కించుకున్నందుకు తన జీవితాశయం నెరవేరిపోయిందిట, జనాల భుజాల మీద ఊరేగుతూ ఎంత తన్మయంగా చెబుతున్నాడో చూశారా, అసలు ఆయన నెత్తి మీద, అంతకంటే పెద్దదిగా లగ్జరీ ప్యాక్‌లో వున్న లడ్డూను దర్శించండి. దాన్ని చూసినా, తాకినా, గాలి తగిలినా, వాసన పీల్చినా చాలని ఎంత మంది తోసుకుంటున్నారో కదా. బక్కవాళ్ళని, బలం గల వాళ్ళు ఎలా తొక్కేస్తున్నారో చూడండి. పోతే పోయింది వెధవ ప్రాణం, లడ్డు కంటే ఎక్కువా ఏమిటి అనుకుంటున్నట్టుగా వున్నారంతా. నిమజ్జనంలో జరిగిన అపశ్రుతులు నెమ్మదిగా రేపు తెలుస్తాయి లెండి. గుంపులో గొలుసులు పోయిన వాళ్ళు, ప్రాణాలు పోయినవాళ్ళూ, సగం మానం పోయిన వాళ్ళూ, గుంపులకి దూరంగా

సొంత పని మీద ఎక్కడికీ వెళ్ళలేక నిస్సహాయంగా నిలబడిపోయిన వాళ్ళు, అంబులెన్సులో ఆగిపోయి కొనవూపిరి వదులుకున్నవాళ్ళు తెల్లారేసరికల్లా వార్తలయిపోతారు. ఇవాళంతా భక్తే భక్తి. భక్తంటే తొడ తొక్కిడి, భక్తంటే వ్యాపారం, భక్తంటే డబ్బు. అవును కదా, డబ్బు చేసిన వాళ్ళకి భక్తి కుదురుతుంది. రామదాసు లాంటి పేద భక్తుడు కూడా జైలుకెళ్ళాకగానీ, తను ఓవర్ యాక్షన్ చేసినట్టు తెలుసుకోలేకపోతాడు "ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు రామచంద్రా" అని పాడతాడు. ఆ దేవుడు అప్పుడూ పలకడు. ఇప్పుడూ పలకడు.

తన పేరిట వున్న మాన్యాలు దోపిడీ చేస్తున్న దేవాదాయ శాఖని చూళ్ళేక, కళ్ళకి అడ్డంగా నామాలు దిద్దుకుని కూచున్నాడు.

అదిగో.. అక్కడ మొత్తం లడ్డు దక్కించుకున్నంత ఎ క్లాసు అదృష్ట జాతకులు కాకపోయినా, రాలిన విబూదినీ, కుంకుమనీ దక్కించుకున్న బి క్లాసు జాతకులు మాట్లాడుతున్నారు వినండి, ఒకరికి వెన్ను నొప్పి తగ్గిపోయిందిట, ఒకరికి చర్మరోగం మాయమై పోయిందట. ఇంకొకరు అనుకోకుండా గర్భవతి అయ్యారట. గర్భవతులు కాని వాళ్ళకు ఇన్నాళ్ళుపాటు స్వామీజీలు, బాబాలు తోడ్పడ్డారు. ఇప్పుడు, విబూది ఫర్టిలిటీ క్రీమ్‌గానూ, కుంకుమ పెయిన్ బామ్‌గా పనికొస్తుందని తెలిసొచ్చింది. వైద్యులూ వింటున్నారా? సారీ, మీరు కూడా ఇదే గుంపులో వుంటే నేను డిస్టర్బ్ చెయ్యను. క్రిందటిసారి బాలానగర్ వేలం పాటల్లో లడ్డూ దక్కించుకుని ఒక మహిళ అదృష్టవంతురాలయ్యింది. ఆవిడ్ని అభినందిస్తూ ఒక ఛానల్ వాళ్ళు చేసిన ఇంటర్వ్యూ వల్లనే నాకింత జ్ఞానోదయం అయింది. లడ్డూ దక్కించుకోవడంద్వారా తను మహిళా సాధికారత సాధించినట్టు సగర్వంగా ఒప్పుకుంది. ఆ లడ్డూని చిదిమి చల్లడంవల్ల తన పంట పొలాల్లో ఎలకలు ఎలా పారిపోయాయో, కష్టాలన్నీ ఎలా తొలగిపోయాయో చెప్పింది. అదేమిటి ఎలక వినాయక వాహనం కదా, తన స్వామి ప్రసాదం దెబ్బకి తనే పారిపోవడమేమిటి అని లీగల్ పాయింట్లు తియ్యకండి. ప్రశ్నించేవాడికి మంత్రం పనిచెయ్యదుట.

అసలు ఈ సారి కూడా ఆవిడే గెలవాల్సి వుండగా మోసంతో ఇంకెవరో పురుషుడు తక్కువకి వేలం పాడి కూడా గెలిచిపోయాట్ట. అది మహిళా లోకానికి జరిగిన అన్యాయంగా భావించి దేశ వ్యాప్తంగా ఆందోళన చేస్తానని ఆవిడ శపథం చేసింది. పనిలో పనిగా ఈ సారి ఆ లడ్డూ దక్కించుకున్న వారికి దాన్ని దక్కించుకున్న ప్రయోజనం లేకుండా పోతుందని శాపం కూడా పెట్టేసింది..సో.. ఔత్సాహిక నిర్మాతలు ఎవరైనా దీన్ని సినిమా తీసుకోవచ్చు. అసలు వినాయకుడు లాంటి పర్సనాలిటీ ఎలక మీదెక్కి కూచోవడమే ఒక హింస కాదా అని లోపల్లోపల నాకో సందేహం. బ్లూక్రాస్ అమల ఎందుకనో ఈ విషయం పట్టించుకున్నట్టు లేదు.

భూమి గుండ్రంగా వుందని మొదట కనిపెట్టిన వాడెవరో, కాన్సరుకి మందు

కనిపెట్టినవారెవరో, ఆకాశంలో పిట్ట మాదిరి. రెక్కల సాయంతో ఎగరడం కనిపెట్టినవాడెవరో, ఎవరెస్టు ఎక్కిన వాడెవరో మనకి అక్కర్లేదు.

లడ్డూ సాధించిన వాళ్ళ చరిత్ర, వీర చరిత్రలాగా స్క్రోలింగులో వస్తోంది. రేపు గ్రూపు వన్‌లో అడుగుతారేమో గుర్తుంచుకోండి.. సారా పర్మిట్టు దక్కించుకోవాలన్నా, సిమెంటు కుంభకోణాన్ని దాచిపెట్టాలన్నా, భూ కబ్జా లెక్కలు మాయం చెయ్యాలన్నా సొంత ప్రభుత్వం వుండాలి. అప్పుడు పుణ్యపు లడ్డూ సాధించినంత గొప్పగా బతకచ్చు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం సొంతదెలా అవుతుంది అని పిచ్చి ప్రశ్నలు వేయకండి. కావాలంటే వినాయక వ్రత కథ చదవండి. తల్లిదండ్రులు న్యాయ నిర్ణేతలుగా వున్నారు కాబట్టి, తమ్ముడైన వెర్రిబాగుల కుమారస్వామిని ముల్లోకాల్లోనూ వున్న నదులన్నిటా మునిగి రమ్మని అటు పంపించి, తను ఎటువంటి శ్రమా పడకుండా హాయిగా కుర్చీ కొట్టేసిన వాడు వి- నాయకుడు.

అంటే పాఠం చెప్పిన పంతుల్ని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి పరీక్ష రాయకుండానే మార్కులు వేయించుకున్నట్టు వుందా, లేదా?

భార్యని శాంతింప చేయడానికి ఉత్తర దిక్కున నిద్రించే ఏనుగు తల నరికి, తెచ్చి కొడుకు మెడ మీద అతికిన పరమ శివుడి చర్య ఎలా వుంది?

గుట్టు చప్పుడు కాకుండా జనరల్ వార్డు పేషంటు కిడ్నీ తీసేసి అస్మదీయుడి పొట్టలో పెట్టి కుట్టేసినట్టుగా వుందా, లేదా?

చవితి నాడు చంద్రుడ్ని చూసిన వాళ్లంతా నీలాపనిందల పాలవుతారని జగన్మాత పెట్టిన శాపం ఎలా వుంది?

ఎదురు తిరిగిన వాడి తలకి వెలకట్టి గ్రామాలకు గ్రామాల్నే నిద్రాహారాలు లేకుండా చేసిన పోలీసు వ్యవస్థలా వుందా, లేదా?

తండ్రిని చంపి అతని కూతుర్నీ, శమంతకమణిని ఎత్తుకు పోవడంలో కృష్ణ పరమాత్మకి వున్న దేమిటి? మోహమా? సంపదల దాహమా?

అన్నిటికీ కూడా ఏదో ధర్మ పన్నాగం వుందంటరా? నాది మరీ చిన్న బుర్ర కాబట్టి అసలే సూక్ష్మం బోధపడ్డం లేదా?

ఏమోనండీ మరి, నాకు తెలిసినంత వరకు ఎంత గొప్ప లడ్డూ అయినా అయిదో రోజుకి బూజు పడుతుంది. నిలవ వుండడం కోసం ఏ రసాయనమో కలిపితే అది వ్యాపారం అవుతుంది. నీ వ్యాపారం నా శారీరక మానసిక ఆరోగ్యాల్ని పాడు చేస్తుంటే అది కేసవుతుంది. కేసుని కేసు అనకుండా మహత్యం అనో, ఆ మహత్యమే మన పరువు ప్రతిష్ట అనో, జాతి సంస్కృతి అనో ఎవరు చెప్పినా గాని తక్షణమే అనుమానించాలనిపిస్తుంది.

(6.10.2010)

# మూడు కోతుల కథ

ప్రపంచ వాణిజ్య సంస్థ కుప్పకూలిన రోజు గుర్తుందా? పేకమేడల్లా రాలుతున్న ఆకాశహర్మ్యాలు మాత్రమే ప్రముఖంగా కనిపించాయి. శిథిలాల్లో ఇరుక్కుపోయిన మనుషుల సంగతేమిటీ అని మనం ఆందోళనపడేలోగానే ఒక ఆంగ్ల దినపత్రిక సంపాదకీయం రాసేసింది.

"ఎంతయినా ఫారిన్ మీడియాకి డీసెన్సీ తెలుసు. మన కెమేరాల మాదిరి వారి కెమేరాలు శవాలచుట్టూ తిరగవు." అగ్రదేశానికీ, ఉగ్ర దేశానికి ఇదే తేడా. అందుకే ఇండియా చూడండి. బొత్తిగా డీసెన్సీ లేదు. సెన్సిటీవిటీ అంతకంటే లేదు. కాబట్టి రోజులతరబడి కంకర కింద నలిగిన కూలీలే వార్తలవుతారు.

మా మామగారు చెప్పినట్టు "పండక్కీ పబ్బానికీ కూడా అవే చావు వార్తలు, పైగా ఆ విషాద సంగీతం ఒకటి" ఆయన బాధ కూడా అర్థం చేసుకోవడానికి నేను ప్రయత్నిస్తాను. సుఖంగా నిద్రలేచి వార్తల కోసం ఒక బ్రాండు టీవి ముందు కూచోగానే ఇంత రక్తం పాలరాతి గచ్చు మీద ఒలికితే విసుగ్గా వుండదూ, వుంటుంది! పొద్దుటి కాఫీ వార్తలు కమ్మగా కర్ణాటక సంగీతంతోనూ, మధ్యాహ్నపు వినోదం పిస్తా, బాదం,జీడి పప్పు రుబ్బి తయారుచేసుకునే వంటలతోనూ, సాయంత్రపు కాలక్షేపం రుద్రాక్ష మహిమాలతోనూ వుండాలనుకోవడం ఒక వర్గానికి సహజమే కదా. అదే పనిగా దేశంలో వున్న కష్టాలు చదివినా, చూసినా మనోభావాలు దెబ్బతినేస్తాయి. ఇలాంటి వాళ్ళనే కేంద్రంగా తీసుకుని మొత్తం సమాచార వ్యవస్థ పనిచేస్తుంది,

ఇంతకీ అసలు ఈ డీసెన్సీ, సెన్సిటివిటి, సెంటిమెంట్, గట్రా అంటే ఏమిటి? కొంతమందిలో మాత్రమే ఇవి వుండటానికి ఎన్ని సుకుమార వ్యవస్థలు పనిచెయ్యాలి?

ఉదాహరణకి, మొన్న మా పిన్ని కూతురు శిరీష పురిటికోసం పుట్టింటికి వచ్చింది. డెలివరీ రోజు ఆపరేషన్ థియేటరులోకి ఆమె భర్త రావాల్సివుంది. కానీ రాలేదు. తలాపున వుండి మత్తులోకి జారుకునేదాకా భార్యకు మానసిక ధైర్యం ఇవ్వడం ఎంత అవసరమో శాస్త్రీయంగా గుర్తించిన కొన్ని ఆస్పత్రులు ఇటువంటి ప్రయత్నం చేస్తున్నాయి. లోగడ ఈ సౌకర్యం లేదు. దీనివల్ల అయినా ఆడవాళ్ల ప్రసవ వేదన పట్ల మగవాడికి సెన్సిటివిటీ పెరుగుతుందని నేనూ ఆశించాను. కానీ తీరా అతనికి సెన్సిటివిటీ ఎక్కువ అవడం కారణంగానే రాలేక ఆగిపోయాడట. కావాలంటే రోజంతా ఉపోషం వుండి నూటొక్క కొబ్బరికాయలు కొడతాడేమో! ఆ రోజు థియేటర్‌లోకి వెళ్ళని పిరికి భర్తలు కొందరు, బెంచీలమీద బారులు తీరి కూచోవడం నేను చూశాను. ఇద్దరి దాంపత్యానికి గుర్తుగా కడుపులోంచి బైటికి వచ్చిన బిడ్డని ఈ భూమ్మీద తనే మొట్టమొదట ఎత్తుకునే ఆ

అనుభూతిని, ఆ అనుభూతి ఇచ్చిన భార్యని పక్కనపెట్టి, పొట్టమీద ఆపరేషను కత్తి ఎంత శుభ ఘడియల్లో దిగాలో నర్సుకి గుర్తుచేస్తూ, ఏ జెండరు పుట్టాలో దేవుడికి విన్నవిస్తూ వుండిపోయిన ఇటువంటి భర్తల కంటే ఎనస్తీషియా సూది చాలా చాలా నయమని ఏ ఇల్లాలైనా అనుకోదా? ఎదురుచూపులకే అలసిపోయిన ముప్పయ్యేళ్ళ కొడుకు తల నిమురుతూ, నేతిలో ముంచిన ఇడ్లీ ముక్కల్ని టిఫిను బాక్సులోంచి తినిపించే తల్లులు కూడా అక్కడే కనిపించారు. మూడు దశాబ్దాల క్రితం ఈ సదుపాయాలేవీ లేనిచోట, ఇదే కొడుకుని తను ఎలా కన్నదో చెప్పే అవకాశాన్ని కూడా ఆ తల్లులు ఈ సెన్సిటివిటీ పోషణలో పడి జారవిడుచుకున్నారు. నేను మాట్లాడుతున్నది ఏమిటంటే, కాలికి నేల తగలకుండా పెంచిన పెంపకాల గురించే. అనుభవం ఒక చెట్టులాంటిదైతే, అది ఎవరికో నీడ ఇస్తోందని కొమ్మ నరుక్కునేవాళ్ళ గురించే.

చాలారోజుల క్రితం నా భర్తకి లంగ్ ఇన్ ఫెక్షన్ వచ్చి ఆస్పత్రిలో జేరాల్సివచ్చింది. పదిరోజులపాటు ఎమర్జెన్సీ వార్డులో వుండిపోయాను.. బయటికి వెళ్ళి రిపోర్టింగు చెయ్యడం కుదరదు కనక నా పేజీ నింపడానికి ఎడిటర్ అడిగిన అనువాదాలు రాత్రంతా కూచుని చేసేదాన్ని. ఒకరోజు తెల్లారుతూనే పరామర్శ కోసం హడావిడి పడుతూ మా ఆడపడుచు వచ్చింది. కాస్సేపు మీ అన్నయ్య దగ్గర కూచుంటే ఒక కప్పు టీ తాగి వస్తానని రిక్వెస్టు చేశాను. ఆమె ఒప్పుకోలేదు. ఎందుకంటే తను చాలా సెన్సిటివ్ ట, ఆక్సిజన్ ట్యూబ్‌తో వున్న అన్నగార్ని చూసి అసలు తట్టుకోలేదట. అందుకని, ‘‘ఆ కప్పు టీ ఏదో క్యాంటిన్ నుంచి నేనే తెచ్చిస్తాను,, నీకెలాగూ ఇలాంటివి అలవాటే కదా,’’ అంది. నాకు చాలా కోపం వచ్చి కూడా తమాయించుకున్నాను. ఆవిడలాంటి వాళ్ళ సెన్సిటివిటీ కంటే, నాలాంటి మొండి ఘటాలే ఎదుటివారి ప్రాణాల్ని నిలబెడతాయని నాకప్పుడు తెలియదు.

పైన చెప్పిన వేర్వేరు సంఘటనల్లో డీసెన్సీ, సెన్సిటివిటీ, సెంటిమెంట్స్ అనే మాటల దగ్గర జరుగుబాటుతనం, పరమ స్వార్థం, పలాయనవాదం అని వేసుకుంటే మీకేమైనా అభ్యంతరమా? చెడు వినకు, కనకు, మాట్లాడకు అని చెప్పే మూడు కోతుల కథ మూడో క్లాసులో విన్నప్పుడే నాకు నచ్చలేదు. ఏదీ కనకుండా, వినకుండా, చూడకుండా వున్న మనిషి అసలు సమస్య నివారణ ఎలా చేస్తాడనేది నా ప్రశ్న. ఒకవేళ అది నచ్చిన వాళ్లందరూ సోకాల్డ్ సెన్సిటివిటీ, డీసెన్సీ, సెంటిమెంట్స్ ని సుబ్బరంగా పోషించుకోవచ్చు. అయితే సమాజానికి గాని కుటుంబానికి గాని వీళ్ల వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు. మనకి గట్టి మనుషులు కావాలి. బురదలో పడిన పసి మొలకను రెండు చేతులతోనూ ఎత్తుకుని గుండెకు హత్తుకునేవాళ్ళు కావాలి. ఎక్కడ మట్టిరేణువు కనబడినా డెట్టాల్‌తో చేతులు కడుక్కునేవాళ్ళు డెట్టాల్ ఉత్పత్తుల కోసమే బతుకుతారు. (1. 7.2010)

# ప్రభుత్వ సేవలు - రాజకీయ బావలు

ప్రైవేటీకరణని వ్యతిరేకించినప్పుడల్లా నాలో ఒక గొంతు తిరగబడుతూ వుంటుంది. నేను కొంత కాలమే ప్రభుత్వ బడిలో చదివాను. బెంచీలు లేని క్లాసులో వాన కురిసినప్పుడల్లా, స్కూలు సంచిలోకి కప్పలూ, వానపాములూ దూరిపోవడంతో మా నాన్న ప్రైవేటు బడికి మార్చేశారు. ప్రాణం పోయినా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లను.. ఒకసారి టైఫాయిడ్ వస్తే మలేరియా గోళీలు మింగించి, స్వర్గానికి కొద్ది దూరంలో వదిలారు. ఉరికొయ్య బిగించినా సరే, రేషను కార్డు తో వచ్చిన బియ్యపు రాళ్ళు తినలేను. తప్పనిసరయి ఇలా ప్రభుత్వ సేవలు అందుకున్నప్పుడల్లా, చెంపలు వాయించు కుంటూనే వున్నాను. ఔను. ప్రవేటీకరణని వ్యతిరేకించే నోటితోనే నేను ఇది చెబు తున్నాను. ఇవి చాలా చిన్న సంఘటనలే కావచ్చు. కానీ పడుతున్న రాజీ నిరవధికంగా వుంటోంది.

ప్రభుత్వ దూరవాణి అందిస్తున్న బ్రాడ్ బ్యాండ్ సేవల్ని వినియోగించుకునే అనేక మంది భావిభారత పౌరుల్లో నేను ఒకదాన్ని. పరిమిత సేవా ప్యాకేజీలో వుండి అపరిమితంగా బ్రాడ్ బ్యాండ్ వాడినందుకు అపరాధ రుసుముతో కలిపి రూప్యములు ఆరువేలు ప్లస్, మూడు వేలు ప్లస్, అయిదు వేలు ఆనందంగా చెల్లించాను. సెర్చ్ ఇంజన్లో ఫ్రీ డౌన్లోడ్ చేసుకున్న ఫోటోషాప్ ట్యుటోరియల్స్ అన్నీ ఫ్రీ కాదని తెలియకపోవడం వల్ల ఈ బిల్లు చెల్లింపు ఒక ప్రాయశ్చిత్తం అనుకుందాం. నాలాంటి వినియోగదారిణికి అజ్ఞాన మినహాయింపు అనబడు కంటితుడుపు సదుపాయం

(కస్టమర్ ఇగ్నోరెన్స్ కన్సిడరేషన్) కూడా వుందని దానివల్ల కొంత బరువు తగ్గుతుందని ఒక మిత్రురాలు సలహా ఇచ్చింది కానీ, నాకెందుకో ఆ మాటతో రోషం పుట్టుకొచ్చి ప్రయత్నించలేదు. అయితే అపరిమిత సేవల ప్యాకేజీ అమలవుతున్న రెండో రోజునే, వూరు విడిచి వెళ్ళాల్సి వచ్చింది. అయినా ఆ నెలలో కూడా అదే స్థాయి బిల్లులు ఎందుకు వచ్చాయో తెలుసుకోవడం కోసం వరంగల్, హన్మకొండ కార్యాలయాల చుట్టూ తిరిగాను. దూరవాణి వారు దూరవాణి ద్వారా స్పందించరు కదా కర్ర పట్టుకుని వెళ్ళి నెత్తిమీద కూచోవాల్సిందే. మూసిన తలుపు సందులో సర్వీసు నిలుపుదల నోటీసు గుచ్చింది కూడా వాళ్ళే. అది కూడా చూపించాను. మరి ఆ తర్వాత కూడా బిల్లు ఎందుకు పడిందో చెప్పలేక వాళ్ళు నాకంటే అయోమయంగా మోహాలు పెట్టారు. కనెక్షన్ తీసేసినా గానీ ఫోను గోడౌన్లో ఇవ్వడం ఆలస్యం చేశారు కదా, అందుకే ఈ బిల్లు పడింది, అంటూ గొప్ప కారణాన్ని కనిపెట్టింది ఒక ఉద్యోగిని. ప్రస్తుతం మేం బదిలీ అయిన వూరు, మా కార్యాలయం, ఇంటి చిరునామా ఇచ్చి వెడితే వీలువెంట(?) తమ సేవల సరఫరా, సేవల నిలుపుదల, అపరాధ రుసుము వడ్డింపు శాఖ వారంతా కూచుని ఆలోచించి, చెబుతామన్నారు. వినియోగదారుల శాఖకి అప్పీలు చేస్తానని, ధూం ధాం అని, ఆ కార్యాలయం ముందు నేను కాసేపు కుప్పిగంతులు కూడా వేశాను. అక్కడ వున్న వారికి, అదొక ఉచిత మధ్యాహ్న వినోద ప్యాకేజీగా అనిపించి వుండొచ్చు. ఒక మాదిరి ముఖ పరిచయంగల ఆసామీ నన్ను చూసి నవ్వి, మంచినీళ్ళిచ్చి, దూరవాణిలో దగ్గర వాళ్ళెవరూ లేరా ? అని అడిగాడు. శూన్యంకేసి చూశాను. పోయింది పోగా, ఇప్పుడా డిపాజిట్ వస్తుందన్న నమ్మకం కూడా నాకు లేదు. నాముందు రెండే దార్లు వున్నాయి. అకస్మాత్తుగా ఆ శాఖలో ఒక బామ్మర్దిని సంపాయించడం, లేదా ప్రైవేటు సేవలకు మారిపోవడం. రెండవ మార్గమే గౌరవంగా అనిపించింది.

ఇంకొకసారి జరూరుగా బెంగుళూరు వెళ్ళాల్సి వచ్చి రైల్వే టిక్కెట్టుకోసం మెహదీపట్నం కౌంటరులో నుంచున్నాను. మొదటి రెండు తరగతులు దొరకలేదు. తక్షణ సేవలు (తత్కాల్ )అయితే వున్నాయట, సరేలే అనుకుని, ఆ టికెట్లు రెండు కొన్నాను. ఇంటికొచ్చి ఆన్‌లైన్లో చూస్తే అన్ని తరగతుల్లోనూ భారీగా టిక్కెట్లున్నాయని తెలిసింది. పోన్లే పాపం, రైల్వే ఆదాయానికి అదొక మార్గం అనుకున్నాను. తీరా రైలెక్కాక టి.సి. తనిఖీ చేస్తే తెలిసిందేమిటంటే, సదరు కౌంటరు వ్యక్తి నాకు కిందటి రోజు టిక్కెట్ ఇచ్చాడుట.. అది తెలిసి చేసిన తప్పు కాకపోవచ్చు. ఎక్కడో పొరబాటు జరిగింది. అప్పటికప్పుడు సూట్కేసులో డబ్బంతా పోగుచేసి కొత్తగా మళ్ళీ రెండు టిక్కెట్లూ, అపరాధ రుసుము, బెర్త్ కోసం అదనపు పైకం చెల్లించాను. అతను గట్టిగా

అరిచి గొడవచేసి రైలు దింపేలా వుంటే బహుశా పరువు, నిస్సహాయత కలగలిసిన ప్యాకేజీ సైతం చెల్లించి వుండేదాన్ని. అంతా అయ్యాక తోటి ప్రయాణీకుడెవడో చెప్పాడు. ముందురోజు టిక్కెట్టు ఇవ్వడం సిబ్బంది తప్పు. అనవసరంగా మీరు నష్టపోయారు. ఇప్పటికైనా పోయింది లేదు. మీరు ఏ రోజు టిక్కెట్ రిజర్వు చేశారో ఆరోజు కౌంటరులో అమ్ముడుపోయిన ఫారం వెతికిపట్టుకుని లేదా ఫీడ్ అయి వున్న లిస్ట్ పట్టుకుని, ఆ రోజు ప్రయాణం చేసిన ప్రయాణీకుల్లో మీరు లేరని, రైల్వే సేవలు వినియోగించుకోలేదని రుజువు చేసుకుంటే మీ డబ్బు మీకు వచ్చేస్తుంది అన్నాడు. కాశీ మజిలీ కథలా వుంది నాకు. న్యాయం జరగాలంటే నా ముందు రెండే దార్లు వున్నాయి. ఒకటి రైల్వే శాఖలో దూరపు బంధువు వున్నాడేమో చూడ్డం, లేదా నోరు మూసుకుని ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించడం. రెండోపని మాత్రమే నాకు చాతనవుతుంది.

అపార్టుమెంట్‌కీ, అపార్టుమెంట్‌కీ మధ్య వున్న ఈ చిన్న రోడ్డు అన్నిసార్లు ఎందుకు తవ్వి పూడ్చుతూ వుంటారో నాకు తెలీదు. చినుకు పడితే, వాన నీరు డ్రైనేజీ మురికితోబాటు, కారు పార్కింగుదాకా ప్రవహిస్తుంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పురపాలక సంస్థవారు ఎప్పుడూ పట్టించుకోరట. అంటే ఎనభైనాలుగు వాటాల్లో ఒకళ్ళకి కూడా రాజకీయ బావ లేడన్నమాటే. ఇప్పుడు నా ముందు రెండే దార్లున్నాయి. ఇంతమందిలో ఎవరికైనా రాజకీయ సంబంధం ఉందేమో చూడ్డం - ఇంటికో ఇరవై చొప్పున చందాలు పోగుచేసి దగ్గరుండి రోడ్డు పూడ్పించడం. రెండోదే సులువుగా వుంది.

మంత్రులు ఏ పార్టీవారయినా గానీ, ప్రభుత్వ శాఖల పని నాణ్యత మారకూడదు కదా. మా ఆటో బండి అశోక్ కూడా కేవలం తనకొక బండి మంజూరీ అవడానికి మంత్రిత్వం మారాలనుకోవడమేమిటీ? ఒబామా కరుణిస్తే తప్ప బతకలేనని మన పిల్లలు అనుకోవడం ఏమిటీ? సుఖ విరోచనం అవడం కోసం మా మామగారు తెలిసిన ఎమ్మెల్లే వుండి తాగునీరు ఇవ్వాలనుకోవడమేమిటి? ప్రజలకి అందాల్సిన కనీసపు సేవలకి, రాజకీయ బావలకీ ఇంత అక్రమ సంబంధం ఏమిటీ? దీన్ని భరించడానికి ప్రజలకి ఎంత పాతివ్రత్యం ఖర్చువుతోంది?

ఇప్పుడు మనముందు వున్నవి రెండే దారులు. ఒకటి నిరసన. రెండు రాజీ. చూడ్డానికి రెండోదే శాంతిగా అనిపిస్తుంది. కానీ అంతకంటే హింస ఈ జాతికి ఇంకోటి లేదు.

5.12.2009

# అబ్సెసివ్ ఎక్స్ సిండ్రోమ్

నా చిన్నప్పటి జ్ఞాపకాల్లో అర్థంకానిదీ, ఆలోచిస్తున్న కొద్దీ అవేదనకు గురిచేసేదీ అయిన పదం ఒకటి వుంది. దాని పేరు విడాకులు. ఈ మాట మొదటిసారి మామేనత్త నోటివెంట పరమ దుర్మార్గమైన వ్యాఖానంలో విన్నాను. అత్త మా యింటికి ఒక పెద్ద కారులో, గుళ్ళో దేవతలా బండెడు నగలు గలగల మోగించుకుంటూ వచ్చేది. కన్నతల్లితోనూ, అన్నతోనూ మాట్లాడుతున్నా సరే, డబ్బు వాసనే వేసేది. ఆవిడ డాబుకీ దర్పానికీ మా చిన్న పెంకుటిల్లూ, పక్కింట్లోంచి తెచ్చి వేసిన కుర్చీలూ వెల వెలబోతూ వుండేవి. ఆవిడ తాగే బ్రు కాఫీ దగ్గర్నించీ, నేతి బాదం హల్వా వరకూ అన్నీ ఘుమఘుమ లాడిపోవాల్సిందే. అంత మర్యాద మళ్ళీ మా చిన్నత్తకు వుండేది కాదు. ఎందుకంటే మాకు వరసయ్యే ఒక్క మగ నాకొడుకునీ ఆవిడ కనలేకపోయింది. పెద్ద ఆవిడకి మత్రమే అటువంటి భాగ్యం దక్కింది. తీరా ఇంత భాగ్యశాలీ తన ఆడపడుచును గురించి మాట్లాడే మాటలు పరమ యాబ్రాసిగా వుండేవి.

‘‘ఏం చెయ్యనురా చిన్నన్నయ్యా! పోషించలేక కాదు, పరువు కోసం చస్తున్నాననుకో. ఆడది అన్నాక మొగుడే దిక్కు కదా, మరి ఆ ముండకి (తన ఆడపడుచు మహాలక్ష్మి.) ఎంత చెప్పినా బుద్ధి రాదు. ఆ విడాకుల కేసు తెమిలి చావదు. మనోవర్తి అయినా వస్తే ఆ తల్లీ (తన అత్తగారు) కూతురూ ఏ చెట్టుకిందో వొండుకు తింటారు కదా వాడేం మనిషో గాని దీన్ని ఏలుకోడూ, విడాకులూ ఇవ్వడు.. ఇప్పటికి ఏడేళ్ళయింది.. మేనత్త ఇలాంటిదని తెలిస్తే అసలు ఈ జన్మలో దీనికి పెళ్ళవుతుందా చెప్పు’’ అంటు ఒళ్ళో కూచున్న ఎనిమిదో పిల్లని చరాచరా కిందకి ఈడ్చేది. ఏడాది వయసు కూడా లేని ఆ పిల్ల భవిష్యతులో తనకి రాబోయె ముప్పు గుర్తించినట్టు, దీనాతిదీనంగా. ఏడుస్తూ లాగులో ఉచ్చ పోసుకునేది. ఇంటిముందు ఆగివున్న కారుమీద ఇసక పోసి పారిపోయే మాకు ఈ సంభాషణ అర్ధమయ్యేది కాదు.. ఎంత తొందరగా చుట్టాలు వెళ్ళిపోతే అంత చప్పున మిగిలిన మిఠాయిలన్నీ డబ్బా బోర్లించుకుని తినచ్చు కదా అనుకుని పిల్లలమంతా ఆశగా ఎదురుచూసేవాళ్ళం..

తర్వాత తర్వాత.. నాకు కొంత బుద్ధీ జ్ఞానం వచ్చాకా అర్థమయింది ఏమిటంటే, మహాలక్ష్మి మొగుడు వరాహరావు పెద్ద శాడిస్టు. తను ఇంకో అమ్మాయితో తిరుగుతూ భార్యకు కాపలా కాసేవాడట. మ్యాట్నీ సినిమా నుంచి వస్తుంటే, ఒకసారి మోటారు బండి మీదికి తిప్పి హత్యా ప్రయత్నం కూడ చేశాడట. అటువంటి మొగుడితో ఆవిడ అన్యోన్య దాంపత్యం వెలిగించనందుకు విజయవాడ మహాపట్టణం గగ్గోలు పెడుతూ వుండేది.

పెళ్ళినీ, విడాకుల్నీ, తేలిగ్గా తీసుకునే అమెరికా మీద మనకి చాలా హేళన వుంది. మన బంధాల్లో వున్నమోత బరువు గురించి, హింస గురించి ఎప్పుడూ మాట్లాడుకోం. ఎవర్ని కదిలించినా సంస్కృతి, సంప్రదాయం అంటూ గంటలకొద్దీ ఉపన్యాసాలిస్తారు అవి తప్ప మానవహక్కులూ, ప్రాథమిక హక్కులు వుండవా?

లాయరు వనజా, నేను ఇలాటివారి సర్వే ఒకటి చేశాం.

విడిపోయిన తర్వాత కూడా వెంటాడి విసిగించే భర్తలకుండే జబ్బు పేరు "అబ్సెసివ్ ఎక్స్ సిండ్రోమ్" అంటార్ట. నిజానికి ఇది జబ్బు కాదు పర్సనాలిటీ డిజార్డర్. గృహ హింసకు తట్టుకోలేక విడాకులకు పిటీషన్ పెట్టుకుంటే, ప్రధాన మంత్రితో సహా ప్రతి అధికారి ముద్దాయికి మద్దత్తు ఇయ్యడానికి చూస్తాడని మనకెవరూ చెప్పనక్కర్లేదు.. గృహాల్లో ఎంత హింస పెడతారో, విడిపోయిన తర్వాత కూడా అంత హింస పెడతారని ప్రత్యక్షంగా చూశాక నా కళ్ళు బాగా తెరుచుకున్నాయి.

కనీసం ప్రజాస్వామికంగా మాట్లాడటం కూడా రాని ఒక సగటు భర్త, భార్యపై ఎన్ని అఘాయిత్యాలు చేస్తాడంటే? ఆ రకంగా ఈ ప్రపంచంలో ఇంకెవరితో ప్రవర్తించినా సున్నంలోకి ఎముక మిగలకుండా చావగొడతారు.

గృహహింస ఫిర్యాదుతో భార్య కేసు ఫైలు చేస్తే, భర్తగారు లక్షలయినా ఖర్చుపెట్టి దర్జాగా బైటికి రావచ్చు.

ప్రతిరోజూ వదలకుండా ఆఫీసుకొచ్చి గొడవ చేయచ్చు. నెలజీతం లాక్కోవచ్చు. స్కూలు నుంచి పిల్లల్ని ఎత్తుకుపోవచ్చు. తల్లి గురించి దుష్ప్రచారం చెయ్యడం దగ్గరనుంచి, హింస పెట్టడం, చివరికి చంపెయ్యడం దాకా తండ్రి పాత్రను రకరకాలుగా చెలామణీ చేయచ్చు. భార్య కుటుంబం మీద దాడులు చేయచ్చు. అసలు ఆ పిల్లలే తనకి పుట్టనేలేదనవచ్చు. కట్నం రూపంలో ఇచ్చిన ధన, వస్తు, కనకాలను దుర్వినియోగం చేస్తూ భార్యకు దక్కకుండా చేయచ్చు. అన్నిటికంటె ముఖ్యంగా, ఆమె ఇక ఈ జన్మలో స్థిరపడకుండా కాపలా కాయచ్చు.

నా కంటే ముందు తరంలో పుట్టిన మహాలక్ష్మికి జీవితం పట్ల ఎన్నో కలలు వుండే వుంటాయి. అవి తీరకుండా కుక్క కాపలా కాసిన వరాహరావు ఇంకా వున్నాడు. మహాలక్ష్మి పోయింది. సంతానమే లేదు కాబట్టి "గొడ్రాలు" అయిన ఆమె, మతి పోయిన తల్లిని పసిపిల్లలా సాకింది. వరాహరావు వున్నాడు, విడిపోయిన భార్య శీలం మీద అతడు చల్లిన బురద అలాగే వుంది. ఆడపిల్లకు ఆస్తి హక్కు దక్కకుండా మనోవర్తితో బతకమని నీతులు చెప్పిన మా మేనత్తలాంటి వాళ్ళూ వున్నారు. ఇది ద్వంద విలువలతో గబ్బు కంపు కొట్టే పుణ్య భూమి. ఇక్కడ ఈగలదీ, దోమలదే రాజ్యం. మనిషిగా పుట్టిన వాళ్ళు జీవితాల్ని కష్టంగా కట్టాల్సిందే. (30.6.2010)

# కంచుమోగినట్టు కాకి రెట్ట ఇక మోగదా?

చాలా ఏళ్ళ క్రితం అదేదో గ్రామంలో పిడుగు శబ్దానికి ఒక బధిరుడికి వినికిడి వచ్చిందనే వార్త చదివాను. పెద్ద ప్రాధాన్యత లేకుండా జిల్లా ఎడిషన్‌లో అంగుళం మేర వచ్చిన ఆ వార్త నన్ను సంతోషించాలో, విచారించాలో తెలీని స్థితిలో పడేసింది.

బంగారంలో ఇరీడియమ్ కలుస్తోందని అది చిమ్ముతున్న రేడియండ్వారా చర్మవ్యాధులనుంచి, బ్రెయిన్ ట్యూమర్ దాకా ఏదయినా సోకవచ్చువని నిన్న పొద్దున్న తెలిసిన సమాచారంతో మళ్ళీ అదే స్థితి గుర్తొచ్చింది.

ఒక పక్క తెరిపి, కనీసం ఇప్పటికైనా మనుషులకి పట్టిన బంగారం పిచ్చి తగ్గుతుందేమో అని ఆశ. ఇంకోపక్క ఆందోళన. ఎందుకంటే ఔషధాల్లో కలిసిపోయి ఎందరి రక్తంలో ఈ విషం చిందులేస్తోందో ఏమో అని

అయితే ఈ ప్రమాదమంతా, కొత్త బంగారానికేనట, పాత బంగారానికేం ఢోకా లేదట. ఓల్డ్ ఈజ్ ఆల్వేస్ గోల్డ్ అనేది ఇలా కూడా రుజువైంది. అవధులు మించి డిమాండు వున్నప్పుడే, కల్తీకి మార్గాలు వెతకడం మొదలవుతుందని మనకి తెలుసు. ఈనాటి యువతరం ధరిస్తున్న బంగారు నగలకు కోలారు గనులు చాలడం లేదేమో నగల వర్తకుల దృష్టి కల్తీ మీద పడింది. వచ్చే జన్మలో మంచి మొగుడు రావడం కోసం నూట పదహారు బంగారు పుష్పాలు కొనుక్కున్న మా వదిన, సువర్ణ సుందరి మనస్థితి ఎలా వుందో? వాటిని ప్రదర్శించడానికి ఊరంతటినీ పిలుచుకుని లక్ష వత్తుల నోము కూడా తలపెట్టింది కదా. వూరు దాటి పారిపోయినా సరే, చెప్పాపెట్టకుండా నా ఇంటికొచ్చేసి తలుపు తట్టి వాయనం ఇచ్చేసే అలవాటు తనకుంది.

హమ్మయ్య! ఇంక నేను ఆవిడ్ని దొంగ నవ్వులతో మెచ్చుకోలేక, మాడు మొహంతో గమ్మున వుండలేక రోత పడక్కర్లేదు. నీ ఇరీడియం గొలుసులు, గండ పెండేరాలూ ఎంత బావున్నాయబ్బా ఆహా ఓ హెూ..'' అనడం ద్వారా కక్ష తీర్చుకోవచ్చు.

మెళ్ళో గొలుసుని చూసి కూర్చోడానికి కుర్చీ వేసే హీన సంస్కృతి ఇకనయినా తగ్గుతుందేమో అన్ని సందర్భాలకీ పుత్తడి ముద్దల్నే కొనుక్కుంటూ, వొంటిని పిడకలు తట్టిన గోడలా మార్చుకున్న మా ప్రసూన ఏమయిపోతుందో? మతాంతర వివాహం చేసుకున్న ఎదురింటి మేరీని సతాయించడానికి వాళ్ళత్తకి ఒక కారణం తగ్గిపోతుందోమో..

క్షమించాలి. ఇది చాలా మంది అభిరుచులకీ, ప్రేమ ప్రకటనలకీ, ప్రపంచాలకీ సంబంధించిన అంశం కావచ్చు.

కానీ మైటాస్ రాజు కథలో ఏం జరిగింది? పట్టినదంతా బంగారం కావాలని ఆ రాజు కోరుకున్నాడా, లేదా? దాహానికి నీరందుకుంటే ద్రవబంగారం, ఆకలేసి అన్నం ముద్ద చేతిలోకి తీసుకుంటే అది ఘన బంగారం, కోరికతో భార్యని ముట్టుకుంటే అది బొమ్మ బంగారం, కడుపు నొప్పిచేసి టాయ్ లెట్స్ కి పరిగెడితే అక్కడ? అంతా బంగారమే

"బం..గా..రం..మీ..కోసం.." అంటూ నగల భోషాణంలా నడ్డితిప్పుతున్న అభినవ తారను చూసినప్పుడు, మనలో ఎంతమందికి కడుపులో గిర గిర తిప్పలేదు.

అతి ఏదయినా వికారమే.. అందుకు విరుగుడే ఈ వార్త.. నా సంతోషానికి కారణం ఇది కావచ్చు. ఇది ప్రకటించకుండా దాచుకోవడం నా వల్ల కాదు. కేవలం పదేళ్ళలో ఎంత మార్పు వచ్చింది. ఎంత భావ దారిద్రం పిల్లలకి పట్టుకుంది? యుద్దానికి వెడుతూ భార్యల మానానికి రాజులు బిగించిన ఇనుప కచ్చడాలే సిగ్గు బిళ్ళలుగా మారాయని మొత్తుకున్న తాపీ ధర్మారావు లేడు. బంగారాన్ని పశువుల సంకెళ్ళతో పోల్చిన నిరాడంబర సౌందర్యవతులు కనబడ్డం లేదు. నిరలంకారం మనిషి వ్యక్తిత్వంగా కాక కేవలం మతానికి పరిమితమై మిగిలిపోతుంటే, సాఫ్ట్ వేర్లూ, హార్డువేర్లు కూడా అత్తింటి ఆరళ్ళ నుంచి రక్షించుకోవడానికి బంగారాన్ని బుల్లెట్ ప్రూఫ్‌గా వాడుతుంటే జీవితం ఎన్ని బానిస స్వర్గాల మధ్య తెల్లారిపోతోందో. ఆ కడుపు మంటలోంచి వచ్చిన సంతోషం కావచ్చు. స్వరాజ్య నిధి కింద పుస్తెల తాడుతో సహా అర్పించిన కమ్యూనిస్టు ఇల్లాళ్ళ కడుపున పుట్టిన పిల్లల చేతుల మీద గజ్జి కురుపుల్లా సలపరిస్తున్న ఉంగరాల్ని చూశాక, ఆ వేదనలోంచి వచ్చిన సంతోషం కావచ్చు. ఏది ఏమయినా నాకొక సీక్రెట్ ప్లెజర్ (గుప్త సంతోషం అనాలా..) దొరికిపోయింది. పాపం బాలీవుడ్ తార కోరదంతం మీద అతకడానికి కల్తీలేని బంగారం ఎలా దొరుకుతుందో. తిరుపతి గోడల్ని పచ్చపరచడానికి ఎంత ఇరీడియం కావాలో అన్నీ సమస్యలే కదా. గుండె పగిలే సమస్యలు. వీటిని పరిష్కరించడానికి తప్పనిసరిగా మార్గం దొరుకుతుంది. ఎందుకంటే, ఇది జల కాలుష్యం కాదు. వాయు కాలుష్యం కాదు. నిర్లిప్తంగా వుండటానికి. పేదల మాన ప్రాణాలు అసలే కాదు. చంద్రహారాలకూ, సూర్యహారాలకూ సంబంధించిన సమస్య. ప్రజాధనంతో మట్టి విగ్రహాలకు భారీ ఎత్తున పెళ్ళిళ్ళు చేస్తూ, ముత్యాల తలంబ్రాలు అందించే ముఖ్యమంత్రి చిరునవ్వు సమస్య.

కల్తీ ఎప్పుడయినా కుట్రే. దాన్ని ఎవరూ స్వాగతించడం లేదే. ఇవ్వాళ బంగారంలో జరిగింది. మొన్న సారాయిలో కలిసింది. ఇంకో పక్క మానవ సంబంధాల్లో జరిగింది. దేనికి ఎంత స్పందించాలి అనేది, మన ప్రాధాన్యతలకి సంబంధించిన విషయం. విషాదం ఏమిటంటే, ఇవాళ మన ప్రాధాన్యతల్లోనే కల్తీ జరిగింది.

30.4.2010

# రాజుగారి బొటనవేలు

కాకులు దూరని కారడవిలో, చీమలు దూరని చిట్టడవిలో రాజు గారి బొటనవేలు దొరికింది. జరిగిన విధ్వంసాన్ని తలుచుకుని యావత్ ప్రజానీకం వొణికిపోయింది. నా వరకు నేను కూడా టి.వికి అతుక్కు పోయాను. రాజభక్తితో తల్లడిల్లుతూ నేను వొండిన బొగ్గుల కూరలో బంగాళాదుంపల ఆనవాళ్ళు వెతుక్కుని, పుల్ల మజ్జిగ కలుపుకుని (పెరుగు అపార్టుమెంట్ సెల్లార్‌లోనే దొరుకుతుంది. కానీ టి.వి వదిలి వెళ్ళేవారెవరు?) ఇంట్లో అంతా దాదాపు చావు భోజనమే చేశారు. పక్కింటి ఊర్మిళ తన మూడ్నెల్ల కొడుక్కి విటమిన్ డ్రాప్స్ వెయ్యడం మరిచిపోయి, ఆనక డాక్టరుతో చివాట్లు తింది. కొత్తగా కంటి ఆపరేషను చేయించుకున్న శేషగిరి మామయ్య ఉత్కంఠ కొద్దీ, ఒక్కంటితో వార్తలు చూసెయ్యడం వల్ల, తిక్క కుదిరేంత తల్నొప్పి వచ్చి పడింది. నెలలు నిండిన మా అక్క కూతురు అనంతకి రాక రాక ఈ టైములోనే ఎక్కడ కాన్పు వస్తుందో అని చుట్టాలంతా ఒకటే గొణుక్కు న్నారు. మిన్ను విరిగి మీద పడినా సరే, మృత్యుశకలాల నుంచి చూపు తిప్పడం ఎవరికీ సాధ్యం కాలేదు. వార్త విన్న తక్షణమే మూడు వందల నలభై మంది దాకా గుండె ఆగి మరణించారని మీడియా అదే పనిగా చెప్పింది. పనిలో పనిగా నష్టపరిహారాల ప్రకటన కూడా అయిపోయింది. వేలాది వేళ్ళు ప్రార్థనలు చేశాయి. వందలాది బొటనవేళ్ళు కెమెరాకి పనిచెప్పాయి. పదుల కొద్దీ బొటనవేళ్ళు తదనంతర పరిణామాల కోసం పావులు

కదిపాయి. ఇక లక్షలాది ప్రేక్షక బొటనవేళ్ళు రిమోట్ మీదే మూర్ఛ పోయాయి.

ఒకే ఒక బొటనవేలు మూగబోయిన కారణంగా "ప్రపంచం అంధకార బంధురమై పోయింది" తెగిపడ్డ శరీరాలు చూడ్డం మనకి కొత్త కాదు, ఏ ఛానల్ పెట్టినా ఒక దోసెడు రక్తం నట్టింట్లో కురుస్తుంది. కానీ అది రాజుగారి బొటనవేలు కదా!

కుర్చీలో వున్నప్పుడు, ప్రత్యర్థిని ఓడించి విజయ కేతనాలు ఎగరేసింది. పాద యాత్రల మధ్యలో మహోద్రతమైన ఉపన్యాసాలకి అభినయ విన్యాసంతో ఊగిపోయింది. చరి త్రని గిర గిర తిప్పే ఒప్పందాలమీద "తనదైన ముద్ర" వేసింది.

దురదృష్టవశాత్తూ సాంకేతిక లోపం కారణంగా ఇప్పుడది అడవి పాలైంది. లేక పోతే, ఇంకా ఎన్ని పథకాలు రచించేదో? అశేష ప్రజానీకం వన్సుమోర్ చెప్పిన ఆ పరిపాలన ఎన్ని మలుపులు తిప్పేదో.. ఇప్పుడు మాత్రం ఏం పోయింది? ఆయన రక్తం పంచుకుని పుట్టిన బొటనవేలే రాజరికాన్ని అనుభవించాలని ఆయన ఉప్పు తిన్న,, ఇంకా తిందామనుకున్న మంత్రివర్యులంతా ముక్తకంఠంతో కోరు కుంటున్నారు. ప్రజాస్వామ్యమంటే రాజుగారి గొడ్ల సావిడి అని, మంత్రి పదవి అంటే పెద్ద కోమటిశెట్టి దొడ్డికి వెళ్ళి వచ్చే లోపు దుకాణాన్ని కావలి కాసే చిన్న కోమటి చర్య- అని ఇలాంటప్పుడే కదా మనకి తెలిసేది. ప్రత్యేకించి రాజుగారి చిర్నవ్వు గురించి సంపాదకీయాలు వచ్చాయి. అవును దేశంలో ఎంత ఘోరం జరిగినా గానీ, "చట్టం దాని పని అది చేసుకుపోతోంద"ని చెబుతున్నపుడు ఎటువంటి చిర్నవ్వు అది? ముదిగొండ కాల్పులు, వాకపల్లి అత్యాచారాలు, వానల్లేక రైతాంగం అహోరించి పోతుంటే జలయజ్ఞం, వరదలో మునిగిన వారికి నష్టపరిహారం, పత్రికా స్వేచ్ఛ మీద దాడి- ఎప్పుడు అయినాగాని, చిరునవ్వు బీట వారిందా చెప్పండి! ఇంత క్రితం మనల్ని ఏలుకున్న చంద్రగిరి రారాజుది మాత్రం తక్కువ నవ్వా? మబ్బుల్లో దోబుచులాడిన నెలవంక కాదూ? నవ్వుల పోటీ పెట్టాలేగాని ఓడిపోయే వాళ్ళెవరూ లేరు.. ఆకలి చావులకి మాస్ హిస్టీరియా అని పేరు పెట్టినపుడు గానీ, ఇల్లు కూలడం ప్రభుత్వ నష్టపరిహారాల కోసం -- అని వెటకరించినప్పుడు గానీ, చీమంత తేడా వచ్చిందా? లేదు..రోమ్ నగరం తగలబడుతుంటే వీణ వాయించే కళాకౌశలం సామాన్యులకి చాతకాదు.

కానీ నేను అనుకుంటూ వుంటాను... ఏ రాజు అయినా సరే, ఒక్క ఇరవై నాలుగు గంటలు కిరీటాన్నీ. వంధిమాగధుల్ని పక్కన పెట్టి, ఒక కొండలోనో గుహలోనో అనామకంగా గడిపివస్తే, ఆకలి అంటే తెలుస్తుందేమో, వలస అంటే అర్థమవు తుందేమో, చట్టము, న్యాయమూ ఎంత దుర్భరంగా పనిచేస్తున్నాయో, ఒంటరి

ఆక్రందన ఎలా వుంటుందో. అవగతమవు తుందోమో.. అది తెలిసి మళ్ళీ ప్రజల్లోకి వచ్చాక అయినా వారి మనస్తత్వంలో ఏమయినా మార్పు కనబడుతుందోమో..అని, బహుశా నాది దురాశ కావచ్చు.. బాధితులందరూ ఇలా దురాశతో కూడిన కలలే కంటూ వుంటారు కావచ్చు..పగవాడికి కూడా రాకూడని మరణం ప్రభువులకి వచ్చి పడిందని, నిండు మనసుతో(?) ప్రతిపక్షాలు కూడా మొహం పెట్టాల్సి వచ్చింది.. ప్రజల ప్రాణాలంటే రాజులకున్నంత ఉదాసీనత, రాజుల బొటనవేళ్ళ పట్ల ప్రజలకుండదు కాబట్టి నెత్తిమీంచి ఏ హెలికాప్టరు ఎగిరినా, ప్రమాదంలో కూలినా పరిగెత్తుకు వెడతారు. సామ్రాజ్యనేతని అంత దగ్గరగా చూసిన తబ్బిబ్బుతో, తనకి తెల్సిన పసరు వైద్యం చెయ్యడానికే చూస్తారు. సంతాప దినాలు పూర్తవగానే, అదే మనుషుల్ని తరిమికొట్టి, అవే అడవుల్ని కుప్పలు చేసి, రేపు ఆ బొటనవేలుకి స్థూపం కట్టి పర్యాటక ప్రాంతంగా మార్చినా సరే, ప్రజలు ఏమీ చెయ్యలేకపోవచ్చు. భారత రత్న ఇవ్వడం కంటే ఇది పెద్ద దుశ్చర్య. రాజులు తల్చుకుంటే రాళ్ళ దెబ్బలు కొదవా? ఇప్పటికే సగం పర్యావరణం కాంక్రీటు దిబ్బ అయిపోయింది. పాదం మోపడానికి ప్రజల తలకాయలు తప్ప ఇంకెక్కడా చోటు లేదు.

మరి, పాపం అభాగ్య ప్రజలకి కూడా బొటనవేళ్ళు వున్నాయి కదా. నిశానీ వెయ్యడానికి అక్కరకొస్తున్నాయి కదా, ఎవరిగూట్లో వాళ్ళు వుండగానే అందరి ఓట్లూ ఉండేలు దెబ్బ తాకిన పిట్టల్లా ఒకే బుట్టలో పడుతుంటే నోరు మూసుకుని వూరుకున్నాయి కదా..

ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజలు ఎన్నుకున్న దాన్ని ప్రజాస్వామ్యమని తెలుసుకోవడం ముప్పైఅయిదు మార్కుల కోసం మాత్రమే అని అనేక సార్లు రుజువైపోయింది కదా, రాజుగారి బొటనవేలు ప్రజల కంట పడ్డానికి ఎంత సాంకేతిక అనర్థం కారణమో నాకు తెలీదుకానీ.. ప్రజల పీకలు తెగడానికి నేల విడిచి ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. ప్రజాస్వామ్యం చాలు. ప్రజాస్వామ్యంలో కనబడుతున్నంత సాంకేతికలోపం ఇంకెక్కడైనా వుందా..

5.11.2009

# గాయం ఒకరిది, ప్రయోజనం ఇంకొకరిది

చాలా రోజుల తర్వాత ఇవాళ యోగా ప్రాక్టిసు కి వెళ్ళాను. గ్రౌండులో వాళ్ళిద్దరూ కనిపించారు..

మీరు 'పర్వీనా బేగమ్ కదా' అడిగాను, అందులో ఒకర్ని గుర్తుపట్టి.... ( రెండో ఆవిడ పేరు ఏదో వుండాలి. వాళ్ళిద్దరూ తోటి కోడళ్లని మాత్రం తెలుసు. )

"ఔను" తలూపుతూ నవ్వింది పర్వీనా. సరిగ్గా నెల క్రితం అనుకుంటా ఇద్దరు మగవాళ్ళు వీళ్లని తీసుకొచ్చి. "ఇదిగో ఈ లావు తగ్గించడానికి ఏం చెయ్యాలో అవి నేర్పుతారా.." హిందీ లో అడిగారు.

"ప్రయత్నిద్దాం, రోజూ వచ్చేలా చూడండి, "మా గురువు. అలవాటుగా హామీ ఇచ్చాడు.

అప్పటి నుంచీ భర్తల వెంట రోజూ రావడం మొదలు పెట్టారు. మొదట్లో ఇద్దరూ చాలా ఆయాస పడుతూ వొంగలేక, కూచోలేక అవస్థ పడేవారు.. అభ్యాసము కూసు విద్య - కాబట్టి ఇప్పుడిప్పుడు కొద్దిగా నయంగా వున్నట్టు నాకు అనిపించింది. శ్వాసక్రియ సంబంధిత వ్యాయామాల్లో హసనం అని ఒక ప్రక్రియ వుంటుంది.. హసనం అంటే నవ్వడం అన్నమాట. పగలబడి గట్టిగా అందరూ ఒకేసారి నవ్వాలి.. . నవ్వడం వల్ల ముఖ కండరాలకు, కంఠనాళాలకు మెదడులోని కణజాలలానికి కావలసినంతవ్యాయామం జరుగుతుంది. కాబట్టి చాచా నెహ్రూ పార్కు దద్దరిల్లిపోయేలా అందరం నవ్వుని అభ్యసిస్తాం. వాళ్ళిద్దరూ అప్పుడు నవ్వరు.. ఏవో గుసగుసలు చెప్పుకుంటూ వుంటారు.. అన్నిటికంటే తేలికయిన. శవాసనం వేసినప్పుడు కూడా కాళ్ళూచేతులూ విశాలంగా చాపరు. శ్వాసమీద ధ్యాస పెట్టలేక, మూత పడిన రెప్పలవెనక కంటి పాపలు అసహనంగా కదులుతూ వుంటాయి. ఊపిరి వేగంగా పీల్చి వదిలే వ్యాయామం చేసేటప్పుడు మాత్రం ముఖానికున్న పరదా బుస కొడుతున్నట్టుగా కదులుతుంది. కళ్ల కోసం అమర్చిన కంతల్లోంచి చూపులెప్పుడూ అంతదూరాన క్రికెట్ ఆడుతున్న భర్తల వేపు పరిగెడుతూ వుంటాయి. అంటే వీళ్ళ శరీరాల్ని, హావభావాల్నీ రిమోట్ చేసే శక్తి అక్కడుందన్నమాట.. నిజానికి ఆ భర్తలు వీళ్లని కాపలా కాయడానికి రాకపోవచ్చు,. అయినా సరే ఇంట్లో చెలామణీ అయిన

అయిన అధికార సంబంధం రోడ్డుమీద కూడా నెత్తికెక్కి నోటికి తాళం వేస్తుంది. చిత్రమేమిటంటే చాలా మంది ఆడవాళ్ళు దీనికి సానుకూలంగా వాదిస్తారు... తమ భద్రత కోసమే కదా భర్తలు అంత బాధపడుతున్నది అనుకుంటారు. ఆ మాటకొస్తే వాళ్ల దృష్టిలో పొద్దున్నే పొయ్యి మీద రొట్టెలు కాల్చాల్సిన వాళ్లని ఆరుబయట వ్యాయామానికి తీసుకురావడమే పెద్ద విప్లవం.

మనకోసంలాగా కనబడుతున్న విప్లవాల్లో ప్రయోజనాలు మన కొంగుకే ముడిపడుతున్నాయా, అవతలివాళ్ల జేబులోకి వెడుతున్నాయా అనేది ఎలా తేల్చుకోవాలో మనకింకా చాతకావడం లేదు.. పర్వీనా బేగంనీ, ఆవిడ తోటీకోడల్నీ వాళ్ల భర్తలెందుకు అందరిలోకీ తెచ్చారు ?. వ్యాయామం చేయించడం ద్వారా సన్నబరచి అందంగా తయారు చేసుకుంటే పక్కన నడవడానికి బావుంటారు. ఇల్లులాగా, పొలంలాగా, కొత్త కారులాగా ఎవరికైనా చూపించుకోవడానికి బావుంటారు. పనిలోనూ, పడకలోనూ చురుకుగా వుంటారు. తమ అహంకారాన్ని అణకువతో పోషిస్తారు. కాదంటారా?

ఉదాహరణకి పరదా విషయమే చూద్దాం.. పరదా గురించి ఏ స్త్రీ మాట్లాడినా సరే, పలుగులూ పారలూ లేస్తున్నాయి. దానిమీద అటు మత పెద్దలో, ఇటు పారిశ్రామిక విప్లవ పెద్దలో మాత్రమే ఆలోచన చేయాలి. మనకసలు ఏ అర్హతా లేదు. 1935 లో ఇరాక్ ప్రభుత్వం ముస్లీం మహిళల ముఖాలమీద పరదా తీసెయ్యడం ద్వారా స్వేచ్ఛ విధించాలని నిర్ణయించుకుంది. ఎందుకంటే అప్పటికప్పుడు తమ కంపెనీలో చవగ్గా పని చెసే కార్మికులు కావాల్సి వచ్చారు. స్త్రీలకంటే ఓపికగా ఎవరు పనిచేస్తారు? అందుకని మత చాందస భావజాలంతో ఇళ్ళలో మగ్గిపోయేవారికి ఆటవిడుపు ఇచ్చినట్టూ వుంటుంది. ఆర్థిక స్థాయి పెంచినట్టుగానూ కనిపిస్తుంది. పొరుగు దేశమైన టర్కీ నాగరికతతో పోటీపడినట్టుగానూ వుంటుంది. ఒక దెబ్బకి అనేక పిట్టలు.. అని ఆలోచన చేసింది. రాత్రికి రాత్రి వచ్చిన ఈ ఆలోచన అమలులో పెట్టడానికి ఎంత హింస ప్రయోగించారో తెలుసుకుని తీరాలి. రోడ్డుమీద నడుస్తున్న మహిళల ముఖాలమీద పరదాల్ని పోలీసులు లాఠీ కొసలతో లాగి కింద పడేశారు. అదేమిటంటే "ముట్టుకుంటే వూరుకుంటారా మరి" అని వెటకరించారు. దీనివల్ల అనేక మంది ముఖాలకు గాయాలయ్యాయి.. కొందరికి కళ్ళు పోయాయి. అప్పుడు కుటుంబాలు ముల్లాలతో కూడి ఒక ఆలోచన చేశారు. అదేమిటంటే, "మా వస్త్ర ధారణ మాది. ఇందులో ప్రభుత్వ జోక్యం కనక వున్నట్టయితే ఆత్మాహుతికి కూడా వెనకాడం" అని నినాదాలు రాసి స్త్రీలతో నిరసన చేయించారు.. నాగరిక రాజ్యం విధించిన నిర్బంధ హింసా పూరిత స్వేచ్ఛ కంటే, తమ ఆత్మగౌరవాన్ని కాపాడటానికి నుంచున్న మతపెద్దలు ఎంతో దయార్ద్ర హృదయులు అని భావించిన స్రీలు పరదాల్ని కళ్లకద్దుకుని మళ్ళీ గర్వంగా ముఖాలకు తగిలించుకున్నారు. కానీ అదే ఫ్రాన్సు నాగరికతా ప్రభావంతో స్వేచ్ఛాయుత వస్త్రధారణకీ,

భావ ప్రకటనలకు అలవాటు పడుతున్న కొందరు కాలేజీ విద్యార్థినులు మాత్రం ఇందుకు ఎదురు తిరిగి మత పెద్దల కోపానికి గురయ్యారు. వీరిపై దుండగులు రాళ్ళు విసరడాలు, యాసిడ్ చల్లడాలు జరిగాయి. చివరికి గాయపడ్డ వారిలో పరదా లేని యువతులకి వైద్యం చెయ్యడానికి కూడా ఎవరూ ముందుకు రానంత ఉద్రిక్తత నడిచింది...

తల్లీ బిడ్డలు, అక్కాచెల్లెళ్ళు, అత్తాకోడళ్ళు, వదినా మరదళ్ళు,ఇరుగు పొరుగు వాళ్ళూ అందరూ పరదా కారణంగా విడిపోయారు.. మతం పేరిట రూప్ కన్వార్ని సతీసహగమనం చేయించినందుకు మహిళా సంఘాలు ఎదురు తిరిగితే, దేవరాల గ్రామంలోని చిన్నాపెద్దా ఆడవాళ్లందరూ ఏమని ఆందోళన చేశారో గుర్తుందికదా? "మా భర్తలతో బాటు తగలబడే హక్కు మాకుంది. మా హక్కుని కాలరాయకండి" అని కదా... కాబట్టి ఆడవాళ్ళు తమ కోసం చేసే హక్కుల ఉద్యమాల కంటే - అణచివేసుకోవడానికి పూనుకునే త్యాగపూరిత ఉన్మాద చర్యలద్వారానే బాగా అదరణ అందుకుంటారు.

పరదా అనేది. ముఖానికి తగిలించుకోవడం వల్ల ఏ దేశ గౌరవాన్ని, మతాన్ని, సంప్రదాయాన్ని తమ స్త్రీలు ఉద్ధరించాలని పౌరులందరూ భావిస్తారో, అదే చర్య వారిని ఇంకో చోట దేశ ద్రోహులుగా చూపెడుతోంది. ఇప్పుడు. ఫ్రాన్సులో జరుగుతున్నది అదే.

పాశ్చాత్య దేశాల్లో నివసిస్తున్న ఇమిగ్రెంట్ ముస్లీం మహిళలు పరదా ధరించడానికి వీల్లేదని, అది దేశ విభజనని గుర్తుకు తెస్తుందని, ఈ నిబంధన ఉల్లంఘించిన వారికి ఫ్రెంచి పౌరసత్వం రద్దుచేయబడుతుందని ప్రకటన ఒకటి గత ఏడాది వచ్చింది.. పార్లమెంటు నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరేనా అలా కనిపిస్తే, నూట యాభై యూరోల నష్టపరిహారం చెల్లించాలని, నాగరికత విలసిల్లే తమ ఫ్రెంచి దేశ చరిత్ర చదువుకుని,పరీక్షలు రాసి తప్పనిసరిగా ఉత్తీర్ణులు అవ్వాలని, తద్వారా మాత్రమే అక్షరాస్యులుగా గుర్తించబడతారని ఆజ్ఞ జారీ చెయబడింది. ఏమనిపిస్తోందిప్పుడు?

నాకు తోచిన సారాంశం ఏమిటంటే,. ఏ కొలతలతో వుండాలో అలా వుండలేకపోతున్నందుకు కుంగిపోయే శరీరాలు మనవి కావు. వాటిని ఎంత మేరకు కప్పాలో, ఏ గడ్డమీద అయితే విప్పాలో నిర్ణయించి పెట్టిన విలువలు మనవి కావు.. కరుడు కట్టిన షరియత్ నుంచి, రేటు కట్టిన అంగడి దాకా ఎటుచూసినా హింస, అవమానం, ఏం జరుగుతోందో తెలీని అయోమయం.. అవును అంతిమంగా ఇవే ఇక్కడ మిగిలాయి.

14.3.2007

# ఇంటిపేరు రాజకీయం

దాదాపు పదేళ్ళ తర్వాత, అనుకోకుండా బాగా దూరపు బంధువుల పెళ్ళి పందిట్లో సీతామహాలక్ష్మి కనిపించింది. అల్లో అల్లో చెన్నై డార్లింగ్- అరిచాను..

అంత బేజారెత్తే బాజాల మోతలోనూ బాగానే వినిపించినట్టుంది. కూల్డ్రింకు ట్రేతో బాటు గిరుక్కున వెనక్కి తిరిగి సంతోషంగా నవ్వింది.

“వామ్మో, గుర్తు పట్టేశావా. అస్సలు నన్ను మర్చిపోలేదా.. కొంచెం కూడా.” అడిగాను,

“భలే దానివే, ఎందుకు పట్టను, ఆపేరుతో నువ్వు తప్ప ఇంకెవ్వరూ పిలవరు కదా.” అంది.

గతం గుర్తొచ్చి ఇద్దరికీ నవ్వొచ్చింది చెన్నై డార్లింగు అంటే -- తమిళనాడు పిల్ల అని కాదు, చద్దినైవేద్యం అని అర్థం. విన్న వాళ్ళకు అర్థం కాకూడదని అలా ఓ పదం కనిపెట్టాను (నాక్కూడా తను వాల్ క్లాక్ అని పేరు పెట్టింది. గడియారంలో పెండ్యులంలా తల ఊపుతూ మాట్లాడుతానట)

సీతకి దాదాపు నా వయసే వుంటుంది.. నందిగామలో మా ఎదురింటిలో వుండేది. గుండమ్మ కథలో సావిత్రిలా ఇంటి పని, అత్తమామలకు సేవలూ చేసేది. అన్నిటికీ వంకలు పెట్టే మొగుడి పెత్తనం భరించేది.

“పిచ్చి మాలోకంలా అలా కనిపిస్తుంది గాని బ్యాంకులో ఎంత మంచి వర్కరో తెలుసా?” అంటాడు నాభర్త.

ఇంక వంకపెట్టడానికి నాలాంటి చుప్పనాతికి ఏం దొరుకుతుంది అనుకోకండి. దొరికింది, మరి! సీత ప్రతి వేసంగిలోనూ కొన్ని ఆదివారాల బాటు పొద్దున్నే ఒక కుక్కను వెతికి పట్టుకునేది. దానికి చద్ది అన్నంలో పెరుగు వేసి నైవేద్యం పెట్టేది. నైవేద్యానికి ముందు పసుపు కుంకాలు దాని మొహం కేసి రుద్ది, భారీ ఎత్తు పూజలు అవీ నిర్వహించేది. పాపం ఆ కుక్కకి నైవేద్యం ఆసక్తిగా వుండేది గాని మంత్రాలకు గుర్రుగా చూసేది.. ఒకసారి అలా గింజుకుని అరిచీ, అడ్డం వచ్చిన ఆమె భర్త శాస్త్రిని కరిచి పారిపోయింది. అప్పుడు కుక్కను వదిలి భర్తను బ్రతిమలాడుకుని బొడ్డు చుట్టూ సూదులు వేయించింది మా సీత. అక్కడితో అయిందా.. వారం తిరిగేసరికల్లా ఇంకోకుక్కను తెచ్చి కూచుంది. మొగుడు ప్రాణభయంతో దూరంగా వుండిపోయాడు.

ఎందుకిలా చేస్తున్నావని అడిగితే చెప్పింది. చద్ది నైవేద్యం కనక కుక్కకు పెడితే, పిల్లలకు అమ్మవారు (చికెన్ పాక్స్) రాదట. పిల్లలని అమ్మవారు ఆవహించినా ఆవహించకపోయినా, కుక్క కాటువల్ల ఇంటిల్లి పాదికీ సూదుల వైద్యం తప్పదు కదా. పైగా అది వీధి కుక్క, దానికి వాక్సిను ఎవరేస్తారు పాపం, అని చెప్పి చూశాను. విన్లేదు. చాల్లే తెలివి అన్నట్టుగా చూసి, "నీకేం తెలుసు, అమ్మవారు పట్టుకుంటే ఎంత కష్టమో? లాస్ట్ మార్చిలో అలా వదిలేసినందుకు బ్యాంకు సెలవంతా వేస్టయి పోయింది తెలుసా? ఆ డాక్టర్లే దీనికి మందు లేదన్నారు" అని తేల్చేసింది.

నేనింక నోర్మూసుకున్నాను. అది మొదలు నన్ను మార్చడానికి తను, తనకు నచ్చజెప్పడానికి నేనూ, ఎవరి శక్తి కొద్దీ వాళ్ళం ప్రయత్నాలు చేస్తూ వుండేవాళ్ళా.

అలాంటలాంటి చెన్నై అమ్మాళ్ అప్పట్లోనే నన్ను ఆశ్చర్యపెట్టే పనికూడా ఒకటి చేసింది.

ఆరోజు ఆదివారం, జోరున వాన, ఎదురింటిలో ఏదో గొడవ, సీతామహాలక్ష్మి ఏడుస్తూ గేటు తీసుకుని సూట్కేసుతో సహా తడుసుకుంటూ అందరి ప్రశ్నార్థకాల్లోంచి నడుచుకుంటూ వెళ్ళిపోయింది. కుతూహలం ఆగక నెత్తిన కొంగు కప్పుకుని పక్కింటి శారదగారు వాళ్ళని పలకరించి మరీ వచ్చి, సమాచారం అందించింది..

"ఏమీ లేదమ్మా వడ్ల గింజలో బియ్యపుగింజ. ఇంటి పేరు గోల ఒకటి వుంది కదా ఇద్దరికీ. ఆఫీసు రిజిస్టరులో ఇంటి పేరు మార్చుకుంటావా లేదా అంటాడు శాస్త్రి. ససేమిరా అంటుంది ఆ పిల్ల. అదే గొడవ, ఆ పళాన చెయ్యి చేసుకున్నాడులా వుంది, అంతే సీత కోపంతో పుట్టింటికి వెళ్ళిపోయింది పిల్లల్ని కూడా పట్టించుకోలేదు" అంది.

"అంతా కలికాలం..! కాకపోతే, ఏం పోయింది ఇంటి పేరు మార్చుకుంటే," అక్కడే కూచున్న మా మామగారు వత్తాసు పలికాడు..

“పోనీ ఏం పోయింది ఇంటిపేరు మార్చకపోతే?” నేను అందుకున్నాను.

శాస్త్రి కేమైనా పిచ్చా? పెళ్ళికి ముందునుంచీ అందరికీ అలవాటయిన పేరులో ఇప్పుడు మార్పు ఎందుకు? దానివల్ల అతనికేం లాభం? అతనికోసం వెల్లుల్లి మానేసినంత తేలిగ్గా, రెండు జెళ్ళు మానేసినంత తేలిగ్గా, ఇంటిపేరు ఎలా మార్చుకుంటుంది ?

నా మనసంతా రకరకాల ప్రశ్నలతో నిండిపోయింది. ఆ వారమే మేం బదిలీ అయి వచ్చేశాం.. సీతకోసం చూశాను. తను వూర్నించి రాలేదు.

ఇన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఇదే చూడ్డం. సీతతో మాట్లాడు తున్నంత సేపూ, కలిసి భోజనం చేస్తున్నంతసేపూ అదే గుర్తొచ్చింది.

“ఇంతకీ, ఇంటిపేరు సంగతి ఏమయింది? మార్చేసుకున్నావా మరి” ఆగలేక అడిగాను.

“చచ్చినట్టు.. మార్చాను. ఆఫీసులోనే కాదు, స్కూలుతో సహా అన్ని సర్టిఫికెట్స్ లోనూ చాలా ప్రయాసపడి మార్పించాడులే శాస్త్రి” అంది. తన మొహంలో ఇందాకటి వెలుగు లేదు.

“అవును గాని ఎందుకిష్టం లేదు నీకు, ఇంటిపేరు మార్చడం చెప్పు”, అన్నాను ఆసక్తిగా.

“వాళ్ళింటి పేరు ఏమిటో తెలుసా నీకు”, అడిగింది.

లేదన్నట్లు తల అడ్డంగా తిప్పాను.

“చెప్పనా..” అని కాస్సేపు సందేహించి, “పుల్ల పెంట..” అంది.

“ఓస్ అందుకని ఇష్టంలేదా.. నేను ఇంకేమిటో అనుకున్నాను. పోనీ మల్లెల వేళ- అనివుంటే అప్పుడు నచ్చేదా, అప్పుడు మార్చుకునేదానివా?” అడిగాను, హాస్యంగా.

“అలా ఏం కాదులే, పాతికేళ్ళ పాటు అలవాటయింది ఒక్కసారి మార్చడం అంటే ఎలా వుంటుంది? మా ఆఫీసులో అంతా ఏమనుకుంటారు. అనుకున్నాను అప్పటిలో ఇప్పుడింక అలవాటయిందిలే.. తప్పదు కదా” అంది.

అంటే శ్రీకంఠం సీతామహాలక్ష్మిని, పుల్లపెంట సీతామహా లక్ష్మిగా మార్చడానికి చాలా ఖర్చు పెట్టాడు శాస్త్రి. జీవితంలో ఇంక ఏ పనికీ అంత శ్రద్ధ వుండి వుండదు.

ఈ సందర్భంగా చాలా రోజుల క్రితం ఒక ఆంగ్ల దిన పత్రికలో బాంబే హైకోర్టు చేసిన ప్రకటన గుర్తొస్తోంది. విడాకులు తీసుకున్న మహిళ తప్పనిసరిగా భర్త ఇంటి పేరు వదిలి, తండ్రి ఇంటిపేరుతో చెలామణి కావాలట. ఇది ఒక ప్రత్యేకమైన కేసుకు సంబంధించి, అతని కోట్లాది రూపాయల ఆస్తి పాస్తులు లావాదేవీలు

దుర్వినియోగం కాకూడదనే ముందు జాగ్రత్త చర్య! అని ఫిర్యాది తరపున న్యాయవాదులు చెప్పారట. దీని ప్రకారం పెళ్ళి అవగానే, భర్త పేరు, అతడు వదిలెయ్యగానే తండ్రి పేరు వర్తిస్తుందన్న మాట. అయితే రాజకీయ లబ్ధి కోసం ఇది తారుమారు చేసే అధికారం కూడా మగవాడికే వుంది తెలుసా..! ఉదాహరణకి గత ఏడాది కాంగ్రెసు తరపున సాధారణ ఎన్నికలకి రాజ్యసభ సభ్యుడుగా నిలబడ్డ సునీల్‌దత్ కుమారుడు సంజయ్‌దత్. మరో పార్టీకి ప్రచారం చేస్తున్న తన సోదరి ప్రియాదత్‌కి తండ్రి రాజకీయ వారసత్వం వర్తింకూడదనే ఆలోచన కొద్దీ వివాహితులైన స్త్రీలెవరికీ పుట్టింటి పేరు వర్తించాల్సిన అవసరం లేదని వ్యాఖ్య చేశాడు. నిజానికిది ఉత్తర భారత సంప్రదాయానికే విరుద్ధమైన విషయం. అంటే ఇక్కడ సంప్రదాయం కంటే రాజకీయ లబ్ధి ముందుకొచ్చిందని మనం అర్థం చేసుకోవాలి. ఇవాళ కూడా ఇంకా, అబ్బాయి జన్మ నక్షత్రం ప్రకారం అమ్మాయి పేరు, జన్మ వివరాలు మార్చిపారేసిన కుటుంబాలు నాకు తెల్సు. ఇది మహారాష్ట్రలో మరీ ఎక్కువ. ఎక్కడిదాకానో ఎందుకు, ప్రేమకుమారి అనే పేరుతో వున్న మా చిన్నత్తయ్య సావిత్రిగా మారిపోయింది ఇలాగే.

ఎటొచ్చీ వాస్తు ప్రకారం వున్న గోడలు కూల్చి మళ్ళీ కట్టి నట్టు, అమ్మాయి కళ్ళూ ముక్కూ, నోరూ తలక్రిందులు చెయ్యగల సర్జరీ ఒక్కటే అభివృద్ధి కావాల్సి వుంది.

సామాజిక రంగాల్లో స్థిరపడి ఒక దశకు చేరిన మహిళలు తన అస్తిత్వం కొనసాగించడం కోసం ఇంటి పేరు మార్చక పోవడం చూస్తూనే వుంటాం. వివాహానికి పూర్వం వున్న పాస్‌పోర్ట్, బ్యాంక్ అక్కౌంట్, డ్రైవింగు లైసెన్స్ లాంటివి మార్చాల్సి రావడంలో వున్న ప్రయాస పడలేక కూడా, ఇలా చేస్తారు. ఇంత చిన్న సాంకేతిక సదుపాయం కోసం కూడా ఆ ఇల్లాళ్లు కుటుంబానికి ఎంతో జవాబు చెప్పుకోవాల్సి వుంటుంది. వారి ప్రేమాభిమానాలు, రాగ ద్వేషాలు తరచూ అనుమానించబడుతూ వుంటాయి. ఒకవేళ వారు పనిచేస్తున్న రంగాల వల్ల సమాజంలో కీర్తి, గుర్తింపు దక్కుతున్నట్టయితే దాని పట్ల అత్తింటి జనాభాకి ఒక రకమైన కినుక వుంటుంది. పుట్టింటి వాళ్ళకయితే మహా ఇరకాటంగా వుంటుంది. మరి ఈ పేరు మార్చుకోని ఇల్లాళ్ళ వల్ల ఒకవేళ అపకీర్తి వస్తుందనుకోండి. అప్పుడు అత్తింటి,పుట్టింటి వాళ్ళిద్దరూ ఆమెను తమ కుటుంబ వారసత్వానికి దూరంగా వుంచడానికే చూస్తారు. హెచ్.ఐ.వి. ఎయిడ్స్ బారిన పడ్డ స్త్రీలు ఇందుకు గట్టి ఉదాహరణ. సామాజిక, ప్రజా ఉద్యమాల్లో అయితే మనిషి పేర్లకు చివర వుండే మూర్తి, రెడ్డి, చౌదరి లాంటి తోకలు కులాన్ని సూచిస్తాయి. కనక ఆ ఇంటి కూతుళ్ళకూ, కోడళ్ళకూ రెండేసి, మూడేసి అక్షరాలున్న

చిట్టి పొట్టి పేర్లే వుంటాయి. అదే ప్రజాస్వామికమనే బోధన వింటూ వాళ్ళూ పెరుగుతారు.

ఇంటిపేరు పూర్తిగా రాయడం అనేది అనవసరం, అనాగరికమనుకునే ఒక దశలో అది ఆంగ్లంలో పొడి అక్షరాలుగా మారింది. అవే పొడి అక్షరాలు పూర్తిపేర్లుగా మారిపోయి ఇప్పటి ఆధునిక అస్తిత్వ ఉద్యమాల్లో పోరాట చిహ్నాలుగా తలెత్తాయి.

ఈ మొత్తం మార్పుల చేర్పుల పర్వంలో ఆడ వాసన గాని, ప్రమేయంగానీ ఎక్కడయినా వుందా? మనం ఆకాశంలోనే కాదు సొంత ఇంటిలో కూడా లేమని తెలీడం లేదూ..!

ఇంతలావు సంప్రదాయ, రాజకీయ, ఉద్యమ, అస్తిత్వ ఉద్యమకారుల ఇంట్లో అయినా సరే, ఏ ఇల్లాలయినా ఇంటిపేరు మార్చడానికి నిరాకరించడంతోబాటు, వాదనకు కూడా నిలిచిందనుకోండి. అప్పుడు వాళ్ళ కడుపున పుట్టిన పిల్లల సంగతి తెచ్చి వీళ్ళ అస్తిత్వమేమిటి అని ప్రశ్నిస్తారు. వీళ్ళు ఎవరి ఇంటిపేరు నిలబెట్టాలి, పోనీ చెడగొట్టాలి అని అడుగుతారు. పది అంకెలు లెక్కపెట్టేలోపు జవాబు చెప్పెయ్యాలి. చెప్పలేరూ అయితే, అందరూ దూకిన గంగలో వీరూ దూకక తప్పదు. వ్యక్తిత్వాన్ని బలి పెట్టక తప్పదు. ఒక పక్క పుట్టిన బిడ్డకి తల్లే సహజ గార్డియన్ అని తీర్పు వున్నా సరే, కాగితాలకీ జీవితానికీ మధ్య చాలా దూరముంది.

4.4.2010

# రుగ్మతలు మహత్యాలవుతున్నపుడు...

నిన్నగాక మొన్న కర్నాటకలోని కోలారు జిల్లా లో కిలాంగణి చంద్రశేఖర్ అనే ఇంటర్ విద్యార్థి పాతిక సార్లు మగధీర సినిమా చూసి, అందులోని హీరోలాగే పునర్జన్మకి ఎగరాలనుకున్నాడు. కాల యముడిని పూజించి(?) తన రక్తంతో జై మగధీర అని గోడ మీద రాసి, విషం తాగి మరణించాడు. ఇంత కిరాతక స్ఫూర్తి కలిగేలా సినిమా తీసిన వాళ్ళెవరూ చంద్రశేఖర్ మళ్ళీ పుట్టాడో లేడో చూసి, వచ్చి గుండె పగిలిన ఆ తల్లి దండ్రులకి చెప్పలేదు.

కర్నూలు, బండి ఆత్మకూరు నుంచి ఏడేళ్ళ పిల్ల శాంభవి తను పూర్వజన్మలో టిబెట్టు వాసి, బౌద్ధ గురువు దలైలామాకు సహచరినని, వారణాసిలో కలిసి సహజీవనం చేశామని చెబుతోంది. కర్పూర వసంతరాయలు, పోతులూరి వీరబ్రహ్మం మళ్ళీ పుడుతున్నారని చెప్పడమే కాకుండా బిత్తర చూపుల మధ్య అచ్చం పలుకులు నేర్చిన చిలకలాగా భారత్, చైనాల మధ్య కొన్ని అంతర్జాతీయ మార్పులు వచ్చేస్తాయని కూడా సూచనలు చేస్తోంది.

అదిలాబాద్ జిల్లాలో శివభక్తురాలయిన పదేళ్ళ బాలిక మంజునాధ సినిమా చూసి బొందితో సహా కైలాసానికి వెళ్ళడం కోసం వొళ్లు తగల బెట్టుకుని చనిపోయింది.

అనసూయ అనే సినిమాలో, చనిపోయి వైద్య కళాశాలలో భద్రపరచబడి వున్న ప్రేయసి శరీరంలోంచి ఎవరెవరికి ఏ అవయవాన్ని అమర్చారో వారందర్నీ చంపుతూ, ఆ భాగాల్ని తిరిగి సేకరించి జాడీల్లో దాచిపెట్టి, శవానికి అతుకుపెట్టి పునర్జన్మ దక్కించాలనే ప్రయత్నంతో ఒక సైకో ప్రేమికుడు కనబడతాడు. ఇందులో వున్న హింస జుగుప్స, సంబంధింత న్యాయ, చట్ట, గోప్య హక్కుల ఉల్లంఘనలు పక్కన పెడితే, నూటికి నూరుపాళ్ళు ఇది అవయవ దానానికి వ్యతిరేకత కలిగించే అంశమని ఒక డయాలిసిస్ బాధితురాలు ఇవ్వాళ టివి చాట్ షోలో విలపిస్తూ చెప్పింది.

ఇస్రో ఛైర్మన్ ఆకాశంలోకి రాకెట్ ఎగరెయ్యడానికి ముందు జుట్టుబాబా పాద తీర్థం అందుకుంటారని తెలుసు. వాస్తు భయంతో మంత్రులు అసెంబ్లీ నిర్మాణాలు మార్చడం కళ్ళారా చూసి వున్నాం. అది వేరే విషయం. ఇది భావ స్వేచ్ఛ పెక్కుటంగా వీచే ప్రజాస్వామ్యం. ఇక్కడ ఏం జరిగినా జరుగుతుంది. ప్రభుత్వం గురించి తప్ప ఏది మాట్లాడినా పండుతుంది. ఈ పంటకి కడుపు కోతలేదు. పుస్తెలమ్మి పురుగుల మందు కొనక్కర్లేదు ఎంచక్కా పండించినవాడూ, దళారీగాడూ అందరూ లబ్ధిదారులు అవుతారు.

ఇవాళ నేను నిద్ర మంచం మీంచి దుప్పటి ముసుగు తీసేలోపే కొన్ని ప్రశ్నలు వినిపించాయి. ఏమిటా అని అటు తొంగి చూశాను. మా అమ్మ ఒక ఛానల్ అత్యంత ఆసక్తిగా చూస్తోంది. "కార్తీక దీపారాధన ఆవు నేతితోనే ఎందుకు చెయ్యాలి? పడమటి దిక్కున నిద్రిస్తే శిరోభారం ఎలా వస్తుంది? పున్నామ నరకం కొడుకు ఎలా దాటించాలి? ఇంటి మీద కాకి అరిస్తే బంధువులు ఎందుకు వస్తారు? గడపమీద తుమ్మితే ఏమవుతుంది? అంటూ వివేక వంతులైన వీక్షకుల్ని ఉద్దేశించి అక్కడున్న పండితురాలు అద్భుతమైన స్వర గంభీర గమకాలతో కొన్ని ప్రశ్నల్ని సంధిస్తోంది. అటువంటి జీవన్మరణ సమస్యా పూరణాలు వదిలి మా అమ్మ ఇహ ఇవ్వాళ కాఫీ కలపదని నాకు అర్ధమైపోయింది అవును. మరి, సమస్యలంటే.. అవే కదా?

టూత్ పేస్ట్ ధరలు ఎందుకు తగ్గవు? నెలతిరక్కుండానే సిలిండరు ఎలా అయిపోతోంది? అందులో సగం ఇంధనమే నింపడానికి కారణమేమిటి? ఈ తిరగని మిక్సీకి మొన్న బజారులో ప్రకటించిన జీవిత కాలపు గ్యారంటీకి అర్ధమేమిటి? అది అమ్మిన వాడి జీవితమా, కొన్నవాడి జీవితమా, తయారీ దారుడి జీవితమా, పక్కింటి వాడి జీవితమా? సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు వేలు తగలేసినాగాని, తగ్గకుండా తిరగబెట్టిన మా అమ్మ దగ్గు, పచారీ దుకాణం వాడిచ్చిన చిటికెడు కరక్కాయ పొడితో ఎలా తగ్గింది? ఇలాంటి నేల బారు ప్రశ్నలకి జవాబు వెతకడంలో పస ఏముంది చెప్పండి? కాబట్టి పునర్జన్మ కోసం చేసుకునే ఏర్పాట్లు, కిందటి జన్మలో చేసిన ఘనకార్యాలు ఆకర్షణీయంగా వినిపిస్తాయి. దానాదీనా తేలిపోయినదేమిటంటే, ఈ జన్మ వదిలి కిందటి జన్మ అకౌంటులోనో, పై జన్మ అడ్వాన్సు మీదో బతకడం లాభదాయకమని ఖరారై పోయింది. జానపద అద్భుత కథలకి నేను వ్యతిరేకం కాదు. మూగ మనసులు చూసి ముక్కు చీదిన బాల్యం మర్చిపోలేదు. అయితే అవాస్తవికతలూ, అశాస్త్రీయతలూ నమ్మలేం కదా! బతుక్కి అన్వయించుకోలేం కదా! మైకేల్ జాక్సన్ ఆత్మ ప్యారడైజ్‌లో తిరుగుతోందని దృశ్యీకరిస్తే కళ్ళు పెద్దవి చేసి చూడ్డానికి బావుంటుంది. కానీ ఆ ఆత్మ విశాలంగా గాల్లో ఈదడానికి మన ఇంటినీ, బడినీ పడగొట్టి పిట్టగోడ కడతామంటే ఒప్పుకోలేం కదా? ఆ పనికి చట్టమూ న్యాయం వంత పాడితే అనుమానించాలి కదా! ఇవ్వాళ మన కళ్లముందు గారడీ చేస్తున్న ప్రాణాంతక, ఆధ్యాత్మిక, జన్మాంతర రాకెట్స్ అలాంటివే. ఈ జన్మలోనే ఇంకాసేపటికి ఏం జరుగుతుందో తెలీదు కానీ, వచ్చే జన్మకోసం, కిందటి జన్మ కోసం కన్నుకొట్టి, ఈల వేసుకుంటూ వన్స్ మోర్ అడిగితే అప్పుడింక చింత బరికె పుచ్చుకుంటే తప్ప లాభం లేదు. రుగ్మతలు మహత్యాలవుతున్నప్పుడు ప్రకృతి వైద్యం తప్పనిసరి అవుతుంది.

(8.12,2009)

# దేశంలో ప్రేమ కలక

మొన్న మా తమ్ముడి కూతురు కరుణశ్రీ ఫోన్ చేసింది తన సహ ఉద్యోగితో ప్రేమలో పడిందట. ముందు స్నేహమే అనుకున్నారట, కానీ ఎందుకో అలా జరిగిపోయిందిట. ఇప్పుడు ఇంక ఒక్క రోజు కూడా అతన్ని చూడకుండా ఉండలేకపోతుందిట. అతనైతే వీకెండు సెలవులో అయినా సరే, ఎక్కడికో అక్కడికి వచ్చి ఒక్కసారి కనిపించమంటాడట? పరిచయమై ఆర్నెల్లే అయినాగాని అదేమిటో ఆరు జన్మలనుంచి తెలుసున్నట్టుగా వుందట. భావోద్వేగంలో వున్నట్టుంది. అన్నీ తనే చెప్పేస్తోంది. ఇందులో నా పాత్ర ఏమిటో ఆలోచించే లోపు, అప్పుడు అంది.

''నువ్వు చాలా లిబరల్ కదా(?) అంటీ, అందుకని ముందుగా నీకు చెబుతున్నాను'' (?)

''మొత్తానికి సూపులో పడ్డావన్న మాట?'' (చెత్త ప్రశ్న వేశాను -- నేను అడగాల్సింది అది కాదు)

''సూపు లేదు పప్పుచారు లెదు, పెప్సీకోక్ అను'' అంటూ నవ్వింది. నాకు నవ్వు రాలేదు. తన నవ్వు వింటూ, టీవీలో కత్తి పోటు ప్రేమ వార్త చూస్తున్నాను.

''నేను లిబరల్‌గా వుంటానని నువ్వు ఎందుకు అనుకున్నావు. అంటే ముందరి కాళ్ళకి బంధం వేస్తున్నావా..దొంగా?'' అడిగాను. సాధ్యమయినంత మృదువుగా.

''అవును ఆంటీ సరళ అక్కకి నువ్వే రాయబారం నడిపావు. మోహన్ మామయ్య తరఫున నువ్వే పోట్లాడావు. ఎందురింటి మేరీ అక్కకి, నజీం భయ్యాకి నువ్వే రిజిస్టరు ఆఫీసులో సంతకం చేశావు. ఎవరికి ప్రాబ్లం వచ్చినా హెల్ప్ చేస్తావని తెలుసు'' (పర్లేదు, నా మేనకోడలు చాలా సమాచారం సేకరించింది).

''అవును కరుణా చేశాను. ఇద్దరిలో ప్రేమ వుంటే అది ప్రకటించడానికి సందేహిస్తున్న చోట, ఆ మూగ ప్రేమకి సపోర్టు చేశాను. ప్రేమించిన ప్రియురాలి కోసం త్యాగం చేసిన ప్రేమ నాకు తెలుసు. ప్రియురాలి భర్తకి నేత్రాలిచ్చిన ప్రేమ నాకు తెలుసు.. ప్రేమించిన వాడి కోసం సింహద్వారం బద్దలు కొట్టుకుని వచ్చిన దేవదాసు, పార్వతి ప్రేమ నాకు తెలుసు. ప్రేమించిన వాడితో వివాహం కాకపోయినా జీవితాంతం స్నేహంగా వున్న వాస్తవాలు నాకు తెలుసు. మనుషులుగా మనం అంతా ప్రేమని పంచాలి. ప్రేమించబడాలి. మరి నీదెలాంటి ప్రేమ?'' అడిగాను.

“చెబుతున్నా కదా అంటీ, మాది రియల్ లవ్.”

“రియల్ లవ్ అంటే ఏమిటి?”

“అంటే..ఒకరికోసం ఒకరు.. ఊ..... బిలీవ్ చేస్తూ అంటే లైట్ తీసుకోకుండా.. సిన్సియర్‌గా అతను కాకుండా ఇంకొక ఎక్స్, వై, జడ్‌తో బతకలేకపోవడం... నీడ్ ఫుల్ సపోర్టు ఇన్ మై కెరీర్ అండ్ ఫ్యామిలీ లైఫ్- అన్నమాట”.

(ఏ భాషలోనూ, ఒక్క వాక్యం కూడా పూర్తి చెయ్యలేకపోయినా ఫర్వాలేదు. కనీసం అంచనా సవ్యంగా వుందో లేదో అని నా ఆందోళన, అదే అడిగాను)

“కెరీర్ కోసమే అయితే, అమ్మానాన్న మాత్రం నీ కోసం తపించడం లేదా, అది ప్రేమ కాదా?” అడిగాను.

“అది వేరు- ఇది వేరు ఆంటీ, వాళ్ళు ఎంతకాలం అని నా కోసం స్ట్రెయిన్ అవుతారు. ఎప్పుడో ఎవరో ఒకర్ని ఫిక్స్ చేస్తారు కదా, ఆ పని నేనే చేస్తాను తప్పేమిటీ?”

“ఔను, ఎంత మాత్రం తప్పు లేదు. కానీ ఒక్క ప్రశ్న అతన్ని అడిగి చూడు.”

“ఏమని.. పెళ్ళి చేసుకుంటావా పారిపోతావా అనా..” గొల గొలగా నవ్వింది.

నవ్వు పూర్తయ్యేదాకా ఆగి అప్పుడు చెప్పాను.

“అడిగి చూడు కరుణా, పెళ్ళికి ఒప్పుకోకపోతే అతని రియాక్షను ఏమిటో అడిగిచూడు”

“అయ్యో ఎందుకలా”

“ఔను, అలాగే అడుగు. నిన్ను పెళ్ళి చేసుకోను. స్నేహంగా వుంటాను. జీవితాంతం ఒక మంచి స్నేహితుడిగా వుంటావా అని అడుగు.”

“అదేమిటి నువ్వు ఉల్టాగా మాట్లాడుతున్నావు.”

“ఔనమ్మా. అప్పుడప్పుడు మనం ఉల్టాగానే వుండాలి. ఎందుకంటే ఒక అమ్మాయితో జీవితాన్ని పంచుకునే బాధ్యత అతనిలో నాకు కనిపించలేదు. నువ్వు చెప్పిన వివరాల్ని బట్టే అతని మనఃస్థితి అంచనా వెయ్యి. బైక్ కొనడం ఆలస్యం అయినందుకు అలిగి ఇంట్లోంచి వెళ్ళిపోయాడన్నావు. అది అతని సున్నితమైన మనస్సు అని నువ్వు అనుకున్నావు. ర్యాగింగు చెయ్యడమే ఒక తప్పయితే అది జరిగిన మర్నాడు అందరితో పాటు తన జూనియర్‌కి సారీ చెప్పలేదన్నావు. దాన్ని గురించి నా అభిప్రాయం నాకు వచ్చింది. వాలంటేన్స్ డే నాడు నువ్వు రావడం ఆలస్యమయినందుకు పెప్సీ సీసా విసిరికొట్టాడన్నావు. అదంతా విరహమను కున్నావు. ఇందులో పూర్తి స్థాయి ఒళ్లు పొగరు నాకు కనిపించింది. అధికారం ప్రేమకి సంకేతం కాదు. మనిషి అనేవాడు

ఎదుటి వారి వైపు నుంచి ఆలోచించాలి కరుణా. అది అతనికి రాదు.'' ( నా మాటలు నచ్చనట్టు తెలిసి పోతుంది. అవతలివైపు నుంచి మౌనం)

''ఆఫ్‌కోర్స్, నేను కూడా అంతే కదా ఆంటీ, అది పట్టుదల అనుకోవచ్చుగా, ఎంట్రన్సులో సీటు కోసం మూడు సార్లయినా గానీ రాశాను, సాధించాను. అది వచ్చేదాకా నేను పిచ్చిదాన్నే అయ్యాను నీకు తెలుసుకదా, నాకే కాదు అమ్మకీ, నాన్నకీ కూడా వర్రీ పెరిగిపోయింది.''

''ఔను, మీ అమ్మానాన్నా పిచ్చివాళ్ళనేదే నా అభిప్రాయం. ''

''లవ్ అంటే నీకు కూడా ఇంత నెగిటివ్‌గా వుండడం నాకు ఆశ్చర్యంగా వుంది.'' తన గొంతులో నిష్టూరం.

''ఓ.కె. బై ఆంటీ.''

'' వద్దు, ఫోన్ పెట్టెయ్యకు కరుణా, ఆవేశపడకు, జాగ్రత్తగా ఆలోచించు.''

''లేదులే ఆంటీ, అసలు మా జనరేషన్ అంటేనే మీకు గౌరవం లేదు.''

''గౌరవం వుంది కరుణా. ప్రేమించు, ప్రేమించిన వాడితోనే జీవితం పంచుకో. అలా జరగని పక్షంలో స్నేహంగా వుండు. ఒకరి మీద ఒకరు పగ పెంచుకోవద్దు.'' నేనింకా పూర్తి చెయ్యలేదు.

కరుణ ఫోన్ పెట్టేసింది.

నా మనసులో కరుణతో సంభాషణ జరుగుతూనే వుంది. ఆస్పత్రిలో ప్రణీత, స్వప్నికలు గుర్తొస్తున్నారు. అనేక దౌర్జన్యాలు ప్రేమ పేరిట చలామణీ అవుతున్నాయి. ఇంకో పక్క వేట కుక్కలను చంపినట్లు ముగ్గురు కాలేజీ కుర్రాళ్ళని కాల్చి పడెయ్యటం గుర్తొస్తోంది. దాని పేరు ప్రజాస్వామ్య దౌర్జన్యం. బాధితులవి, నిందితులవి కలిపి ఐదుగురు తల్లుల కడుపుకోత. ఒక కడుపుకోతకు పరిష్కారంగా మరో కడుపుకోత పరిష్కారమే కాదు. అయినా మన జైళ్ళు నేరస్థుల్నిమనుషులుగా మార్చలేవు.. ఫలానా అమ్మాయిని ఎలాగైనా దక్కించుకోవాలని, కాదంటే హత్యో, ఆత్మహత్యో తప్పదని- దాని పేరేమిటి క్రూర ప్రేమ? ఈ దౌర్జన్యాలనుంచి తప్పించుకోడానికి ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలి. కారం పొట్లాలు తెచ్చుకోవాలి. అన్ని మతాలు ప్రార్ధనలు చెయ్యాలి. యంత్రాంగం ఏమీ చేయదు. కావాలంటే కన్నీళ్ళు కారుస్తుంది.. ప్రజాస్వామ్యమే ఒక అంధ నేత్రం. మానవ హక్కులు ఎవరికీ అర్థం కాని, అనుభవంలోకి రాని భేతాళ మంత్రాలు. మరి మా కరుణ లాంటి సరికొత్త ప్రేమికురాలికి ప్రేమికుడు ఎలా వుండాలో ఎవరు చెపుతారు?

26.2.2009

# ఈ సినిమా ఎన్ని రోజులు ఆడుతుందో?

ఇవ్వాళ పొద్దున్నే తలకి గోరింటాకు పెట్టుకోవడంవల్ల బైటికెటూ పారిపోలేక టీవీముందు కూచున్నాను.

అరగంటలో తల పండిపోయింది. గోరింటాకుతో కాదు. మెగా ఛానళ్లతో

ఒక మీట నొక్కగానే వెండి తెర వేలుపు నవ్వుతూ పలకరించాడు.

నవ్వుకీ నవ్వుకీ మధ్య, అతను దున్నేసిన 47 సినిమాల సామాజిక స్పృహ ముక్కలు ప్రసారం అవుతున్నాయి. పాతికేళ్ళ క్రితం కూడ ఇలాంటిదే సంచలనం రాముడు, కృష్ణుడు, దుర్యోధనుడు పాత్రలు వెలిగించిన పౌరాణిక హీరో, నడిరోడ్డు మీద నీళ్ళాడిన దీన బాంధవ దృశ్యం అన్ని పత్రికల నిండా వచ్చింది. అయినా గానీ అప్పుడు, ఇప్పుడున్నంత ప్రచార సామగ్రి లేదని, నిజం చెప్పాలంటే అసలు ఆ హీరో పుట్టడమే సామాజిక స్పృహతో పుట్టాడని, ఇప్పటి హీరో వ్యాపార విలువలతో నటించాడని ఒక వేదిక ఘోషిస్తోంది. ఛానల్ మార్చాను. అక్కడ నటశేఖరుడు అల్లూరి సీతారామ పాత్రని ఇరగదీస్తూ కనిపించాడు. ఇంకో చోట ఊర్వశి బిరుదు తెచ్చుకున్న నటీమణి పోలీసు వేషంలో గూండాల్ని ఎగిరెగిరి తంతోంది. ఇంకో చోట యాంగ్రీ హీరో ఒకరు ఆంధ్రదేశంలోని అక్క చెల్లెళ్ళ శీల రక్షణ బాధ్యతలో కన్నీరు మున్నీరవు తున్నాడు. మరో చోట తల్లి తెలంగాణా అంటే ఎవరో కాదు నేనే అంటోంది మరో నాయిక. అక్షరాలా తొంభై ఛానళ్ళూ.నొక్కి నొక్కి నా బోటన వేలు వాచి పోతోంది. ప్రజా సేవ కోసం ఒకర్ని తోసుకుంటు ఒకరు పీకల మీద కొచ్చేస్తున్నంత భ్రాంతి అక్కడితో అయిందా? అవలేదు. మరి పాపం వాళ్ళ కొడుకులు, కోడళ్ళూ, బామ్మరుదులు, వియ్యంకులు, వేలు విడిచిన వాళ్ళు, కాలు విడిచిన వాళ్ళకి మాత్రం మంత్రిత్వ శాఖలు కావద్దా? ఇంకో పక్క పుట్టడమే ప్రజాసేవ కాగా, నాలుగైదు తరాలనుంచి కిట కిట లాడుతున్న ప్రధాన, ప్రతిపక్ష పార్టీల, వామ పక్షాల తాలుకు కొడుకులు, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, బామ్మరుదులు.. గట్రా..గట్రా.. భావి భారత పౌరులు కారా? వాళ్ళకి మటుకు కుర్చీ ఎక్కి పాలించడం చేత కాదా?

వీళ్ళను చూస్తున్న సంబరంలో, నిన్న గాక మొన్న జరిగిన రైలు బాంబుదాడులు, కబ్జాలు, ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో పసిపిల్లల మీద జరిగిన గినియా పందులు ప్రయోగాలు, ఆయేషాలాంటి విద్యార్థినుల మీద జరిగిన హత్యలు అన్నీ.. అన్నీ వెనకబడ్డాయి. అఖండ ప్రేక్షకత్వం ముప్పాతిక జీవితాన్ని కళ్ళప్పగించి చూసేలా చేస్తోంది. తమిళనాడు జనాల ఉగ్ర ప్రేమ, కర్నాటక జనాల నిర్లిప్త వైఖరి రెండూ మనలో వరదలు కడుతున్నాయి. ఇవాళ హీరో వేషం కడితే, రేపు రాజకీయల్లోకి పనికొస్తుందనే అభిప్రాయం సర్వత్రా వ్యాపించి పోయింది. తెరమీద బొమ్మలకి మంచి రోజులొచ్చాయి. ఇన్‌కంటాక్సు కట్టకపోయినా సరే, రెండు ప్రాజెక్టుల్ని తలదన్నే పారితోషికాలు నిర్లజ్జగా పుచ్చు కుంటున్నా సరే. కట్టుకున్న ఇల్లాల్ని కాటికి పంపినా సరే, కట్టుకోని ఇల్లాళ్ళు వూరినిండా ఏడుస్తూ వున్నా సరే. అన్ని విలువల్నీ వదిలేసినా సరే, వాళ్ళని చూస్తే ఎందుకో గాని మనకి ఆనంద బాష్పాలొస్తాయి. పక్కన నిలబడి ఫోటో దిగాలనిపిస్తుంది.. ఈ ఒరవడిలో దుష్ట పాత్రలు, విదూషక పాత్రలు కట్టే వాళ్ళకి గిరాకీ లేదేమొ. ప్రచారానికి అయినా గాని, పనికి వస్తారో రారో. జూనియరు ఆర్టిస్టుల సంగతి సోదిలోకి రాదనుకోండి.. ఆరు దశాబ్దాల స్వతంత్ర భారత ప్రజా స్వామ్యపు వెండి తెర మీద ఎటువంటి సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రం ప్రసారమవు తుందో ఏమిటో అని జేబురుమాళ్ళతో సిద్ధంగా వుండాలి.

ప్రజాసేవ చెయ్యలనుకున్న వాళ్ళకి, రాజకీయ పదవి తప్ప ఇంకో మార్గం లేకపోవడం ఏమిటో నాకెప్పుడూ అర్థం కాదు. నిజాయితీ గల ప్రతి పక్షం అవసరం లేదా? ప్రతి పక్షంలో వున్న వాళ్ళెప్పుడూ ఎందుకంత ఏడుపు మొహాల్తో వుంటారో? ఇవాల్టి తెలుగు దేశంగానీ, నిన్నటి కాంగ్రెస్సు గానీ అవే పదవీ దుఃఖాలు..అవే ఆరోపణలు, రోత, అవినీతి, పేదరికం పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకుండా వీళ్ళే కాపలా కాస్తారు. తొమ్మిదేళ్ల పాటు ప్రజా స్వేచ్ఛని, పత్రికా హక్కుల్ని మంటకలపిన పాకిస్తాన్ అధ్యక్షుడు ముషారపు మొహంలోనూ అదే దుఃఖం. “నేను చాలా సామాన్యుణ్ని.. ప్రజాసేవలోనే బతికాను. నా మీద అభిశంశన ఎందుకో అర్థం కాదు”.

సామాన్యుడికీ అదే అర్థంకావడం లేదు. దేశాలు జేబులో వేసుకు తిరిగే నేతలు సామాన్యులైతే మరి తమని ఏమని పిలుస్తారోఅని, ఓటు హక్కుతో సహా అన్నిటా ప్రేక్షకులమే అయిన మనమీద ఇంకా ఎన్ని బొమ్మలు ఆటలు ఆడతాయో. ఆశగానే ఎదురు చూద్దాం. హీరో అనబడు వాడు సినిమా అయ్యేలోపు అయినా దుష్టులమీద చంపుడు పందెం వేసి గెలుస్తాడు కదా. హీరోయిన్ని రక్షిస్తాడు కదా. లేకపోతే వంద రోజులు ఆడించం కదా. ఇదీ అంతే.

15.8.2008

# పెయింటింగ్సే నా పిల్లలు

పనిమీద దిల్‌సుఖ్‌నగర్‌లో వున్న మా చెల్లెలు లీల ఇంటికొచ్చాను. పొద్దున్నే కాఫీ తాగుతూ మొగుడు గారిని ఫోన్లో వింటున్నాను.

అనారోగ్యాల మధ్య, ఆర్థిక బాధల మధ్య నెత్తి మీదకు జారిన నూరు వరహాల కొమ్మని గానీ, దాని మీదున్న నీలి పచ్చ పిట్టను కానీ పట్టించుకోలేదు. లీల అత్తగారు పిలిచి చూపించింది "అదిగో ఆ పిట్టని చూడుఅబ్బ ఎంత బావుందో నీలి పచ్చ మొహం, నల్లటి రెక్కల మీద ఆకుపచ్చ గీతలు అయ్యో, ఎగిరిపోతోంది.. ప్చ్! కాసేపు అలా కూచుంటే బావుండు. బొమ్మలు వేసి ఎంత కాలమయిందో" అని అంది.

ఆవిడ సంతోషాలూ, విచారాలూ ఇంట్లో వాళ్ళు పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే ఆవిడే కాదు అలాంటి కోరికలున్న ఆడది ఎవరైనాగానీ మంచి అత్త, అమ్మ, పిన్ని, వదినా కాగలిగిందా లేదా? రుచిగా వొండడం, సేవలు చేయడం చాతనవునా, కాదా అనేది మాత్రమే చర్చ అవుతుంది. మగవాడి కళా హృదయాన్ని, ప్రతిభని పట్టించుకుని గౌరవించినట్టుగా ఆడవాళ్ళని గుర్తించలేకపోతాం. నా వరకూ నేను కూడా ఇక్కడికి వచ్చినప్పుడల్లా ఆవిడ పెయింటింగ్సు చూసి అబ్బుర పడ్డమే తప్ప భూమిక పాఠకులకోసం పరిచయం చెయ్యలేకపోయాను. ప్రతిభకి జండర్ లేకపోవచ్చు కానీ గుర్తింపుకీ, ప్రచారానికి మాత్రం జండర్ వుంది. కాబట్టి నా కాలమ్‌లో ఈ సారి విజయలక్ష్మిని గురించి చెప్పదలుచుకున్నాను.

ఎనభైయ్యేళ్ళ గోపాలుని విజయలక్ష్మి అణిముత్యాల్లాంటి పెయింటింగ్సు వేస్తుంది. మీ గురించి రాస్తాను అనగానే "అయ్యో..వద్దు నేనంత గొప్పదాన్ని కాదు. సాధించాల్సింది ఇంకా చాలా వుంది" అంది మొహమాటంగా. చాలా సేపు ఏవేవో మాటల్లో పెట్టి వివరాలు సేకరించాల్సి వచ్చింది.

ఊహ తెలియని వయసులో పలక మీద ఓనమాలు కంటే బొమ్మలే ఎక్కువ వేసిందిట విజయలక్ష్మి. గుంటూరుజిల్లా నరసరావు పేటలో 1938లో పుట్టిన తను థర్డ్ ఫారం చదువుతూ వుండగానే మేనబావకు ఇల్లాలైంది. ఒక్కతే కూతురు అవడంతో భర్తతో కలిసి అమ్మ దగ్గరే వుండేది. నా కళకు కారణం అమ్మ, బావ అంటుంది తను నిజాయితీగా. ఇప్పుడు ఇద్దరూ లేరు. వాళ్ళ జ్ఞాపకాలుగా అనేక పెయింటింగ్సు వున్నాయి. పెళ్ళయిం తర్వాత తెలుగులో ఎమ్మే, హిందీ ప్రవీణ చేశారు. తెలుగు, హిందీ సంస్కృత భాషలో ఎన్నో గ్రంధాలు చదివారు.

విజయలక్ష్మిలో వున్న ఇంకో విశేషం ఏమిటంటే స్నేహగుణం. చిన్నప్పుడు చదువుకున్న నేస్తాలతో కలిసి ఇప్పటికీ వూళ్ళు తిరుగుతూ వుంటుంది. స్నేహాలు నిలుపు కోవడంలో నిస్సహాయులైన చాలామంది స్త్రీలు ఈవిడ్ని చూసి నేర్చుకోవాలి. ఎక్కడికి వెళ్లినా ఓ కాగితం పెన్సిలూ దగ్గరుంచుకుని అప్పటికప్పుడు స్కెచ్ గీసుకుని కలర్ కాంబినేషన్ నిర్ణయించుకునే అలవాటుంది. ఓ పక్క మధుమేహం, మరోపక్క గర్భసంచి కాన్సరు లాంటి సమస్యలు. మంచి ఆహారంతో, ధ్యానంతో, కళా తపస్సుతో అదుపులో పెట్టానని అంటారు. పిల్లలు లేని దిగులు పెయింటింగ్సుతో తీర్చుకున్నారట. ముప్పైయేళ్ళ వరకూ సొంతంగా తనకు తెలిసిన ధోరణిలో బొమ్మలు గీసిన విజయలక్ష్మి, కలర్ వండర్ సంస్థనుంచి పెయింటింగులోనూ, శంతన్ ఆర్ట్స్ ఆఫ్ మెడ్రాస్‌నుంచి వైవిధ్యంలోనూ మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. నిర్మల్, తంజావూర్, త్రీడి ఎఫెక్ట్ కనిపించే నైఫ్ పెయింటింగ్సు చాలా బాగా వేస్తుంది. వరంగల్ (1975) ప్రపంచ మహాసభల్లో "సప్తాశ్వర రథమారోథం"అనే తన పెయింటింగు చోటు చేసుకుందని చెబుతున్నప్పుడు ఆ కళ్ళలో చాలా సంతృప్తి కనిపించింది. దివాకర్ల వెంకటావధాని లాంటి సాహితీస్రష్టల నుంచి అప్పటి కలెక్టరు సముద్రాల కృష్ణమూర్తిదాకా ఈమె పెయింటింగ్సును డ్రాయింగు రూంలో అలంకరించుకున్నారు. ఈమె వేసిన రాజరాజేశ్వరిదేవి పెయింటింగును దివాకర్ల స్వయంగా ఆవిష్కరించారు.

సాహిత్యంలో మంచి అభిరుచి వుంది. సాక్షి వ్యాసాలు, విశ్వనాథ సత్యనారాయణ రచనలు, తులసీ రామాయణం, హరివంశరాయ్ బచ్చన్, మైదిలీ చరణ గుప్తా, పురాణ వైరి గ్రంథమాల, లత ఊహాగానం, శరత్ రచనా శైలి ఇష్టమని చెప్పారు. దేవనాగరీ భాషలో వున్న 'శ్రీవిద్యాసముచ్చయం' నాలుగు భాగాల గ్రంథాన్ని తన గురువు శ్రీ విద్యానందనాథతో కలిసి తెలుగులోకి అనువదించారు.

సంగీతం అంటే చాలా ఇష్టం. స్వయంగా వీణ నేర్చుకున్నారు. వయస్సు రీత్యా కొంచెం ఆత్మవిశ్వాసం తగ్గిందని 'రామకృష్ణ పరమహంస నిలువెత్తు చిత్రాన్ని వెయ్యాలనిపిస్తుందనీ కానీ మొదలు పెట్టాక ఆగకూడదు కదా అందుకే ఆలోచిస్తున్నాను" అంది.

మొత్తంగా తన జీవితకాలంలో "వంట చేసిన సందర్భాలు తక్కువ"ని చెప్పారు. వంట చెయ్యడంవల్ల ప్రతిభ కుంటుపడకపోవచ్చుకానీ, వొంటింటికి అంకితమైపోవడంవల్ల చేయాల్సిన చాలా పనులు మాత్రం ఆగిపోతాయి. అభిరుచి ఆవిరైపోతుంది. విజయలక్ష్మి కి అలా పొగచూరిపోవడం ఇష్టంలేదు. కాలాన్ని చక్కటి ఉదయసంధ్యా సమయాలుగా మలుచుకుని రంగుల మేళవింపుతో నింపుకుంది

9.8.2008

# చర్చలకీ చర్యలకి మధ్య అగాధంలో...

వరంగల్లు జిల్లా, పర్కాల మండలంలోని కంటాత్మకూరు గ్రామంలో చనిపోయిన రోహిణిది బాలింత మరణమా? సహజ మరణమా? అనే సందేహం అంగన్ వాడి కార్యకర్తలకి, సూపర్వైజర్లకి వచ్చింది. కారణం చనిపోయిన బాలింత గర్భం రాకముందు నుంచి గుండె జబ్బుతో బాధ పడింది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక హటాత్తుగా ఈ జబ్బు మొదలయిందిట. మూడవసారి ఖచ్చితంగా కొడుకుని కని ఇవ్వాలని భర్త గారి ఆన. అసలు గర్భం రావడమే మంచిది కాదని అది పెద్ద ప్రాణానికి ప్రమాదమని డాక్టరు మందలించింది. వారసుడి కంటే కోడలు ప్రాణం ఎక్కువా ఏమిటి? అనుకున్నారు అత్తింటి బంధువులు. పాపం రోహిణి చావుకి సిద్ధపడే గర్భాన్ని మోసింది. అంగనువాడి సెంటరు నుంచి ఇంజక్షన్లు, రేషను, వైద్య సలహాలు అందాయి. కాని డాక్టరు భయపడినట్టే రోహిణి చనిపోయింది. భర్త కూడా భయపడ్డాడు. ఆమె చనిపోయి నందుకు కాదు. మూడోసారి కూడా ఆడపిల్ల పుట్టినందుకు. కనక వారసుడి కోసం మళ్ళీ పెళ్ళి పీట ఎక్కాడు. ముగ్గురు పసిపిల్లలతో రోహిణి ఒంటరి తల్లి మిగిలిపోయింది. ఈ దేశంలో ఒక సగటు మగవాడు "సాధారణ" మూర్ఖత్వంతో ఇల్లాలి ప్రాణం తియ్యొచ్చు. పిల్లల్ని అనాధల్ని చెయ్యొచ్చు. ఆ

మూర్ఖత్వాన్ని కొనసాగించేందుకు మళ్ళీ పీటలు పరచి పెద్దలు ఆశీర్వదిస్తారు. ఇంకో గర్భసంచి ఇచ్చి వధువు మురిసిపోతుంది.

గర్భం వచ్చిన దగ్గర నుంచీ, కాన్పయి, బిడ్డకు పాలిస్తున్నంత కాలం బలమైన ఆహారం రోజుకి మూడునుంచి నాలుగు సార్లు తినాలని చెప్పడమే కాకుండా, ఇంజక్షన్లు ఇస్తూ, రేషను కూడా ఇస్తోంది ప్రభుత్వం. కానీ ఆ రేషను అందుకోవడానికి భర్తలూ, అత్తింటి బంధువులు వస్తారు. లబ్ధిదారిణి కూలిలోనో, వలసలోనో వుంటుంది. కార్యకర్తకి కంఠశోష మిగులు తుంది. వలస కారణంగా ఇమ్యూనైజేషను అందదు. ఫలితంగా బిడ్డ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. ఈ దేశంలో సమన్వయ లోపం కొన్ని తరాల పిల్లల అంగవైకల్యానికి కారణమవుతోంది.

పుట్టిన పాపకు ఏడు రోజుల్లోపు మరీ వేడినీళ్ళతో స్నానం చేయించరాదని దానివల్ల రక్షక కవచం లాంటి పై చర్మం దెబ్బ తింటుందని, కేవలం దూదితో తుడిచి పొడి బట్టతో చుట్టి తల్లి పొత్తిళ్ళలో వుంచాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మొత్తుకుంటోంది. అయితే ఏ ప్రైవేటు ఆస్పత్రికీ ఈ సూచనలు అందవు. దానికి తోడు పురుడు, ముట్టు, మైల లాంటివి బక్కెట్ల కొద్దీ నీళ్ళతో ప్రక్షాళన చెయ్యలనే ఒక బ్రాహ్మణీక భావజాలం, దాన్ని అనుసరించడమే నాగరికత అనుకునే అన్ని కులాల భావ దాస్యం వుంది.. మధ్య తరగతి పాటించని ఏ విధానమూ/విలువా, పేద కుటుంబాలు పాటించవు. కాబట్టి రిపోర్టులకీ, వాస్తవాలకీ చాలా తేడా వుంటుంది. ఈ దేశం రిపోర్టులు వదిలి అట్టడుగు వాడి మాట ఎప్పుడు నమ్ముతుందో తెలీదు.

కోట్లాది రూపాయలు ప్రచారానికి ఖర్చవుతూనే వుంటాయి. సగటు అంగనువాడి కార్యకర్త తన జీవితంలో కొన్ని వందల గర్భిణిలకి, బాలింతలకి సలహాల నిస్తూనే వుంటుంది. అదే సమయంలో ఇంటికొక టి.వి, ఫైవు స్టారు ఆస్పత్రుల్నీ, పాలపొడి డబ్బాల్ని, బిడ్డ మూత్రాన్ని కూడా హైజాక్ చెయ్యగల డైపర్సునీ (మూత్రపు సంచులు) కొంటావా లేదా అని కన్ను కొడుతూ వుంటుంది.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కావలసినంత మంది నర్సుల్ని ఎందుకు నియమించరో తెలీదు. దానివల్ల నర్సు వేయల్సిన ఎ విటమిను, కార్యకర్త వేయల్సి వస్తోంది. అస్సాంలో ఒకసారి మోతాదులో తేడా వచ్చి ఒక శిశువు చనిపోయింది. ఆ భయం అంతర్లీనంగా వుండిపోయి, తల్లులు విటమిను వేయించడానికి శంకిస్తున్నారు. ఈ దేశం ఇటు నిరుద్యోగుల్నీ, అటు నిధుల్ని ఒక చేత్తోనే దాచిపెడుతుంది.

కేవలం ఉప్మాబడి ఆకర్షణతోనే అంగన్ వాడి సెంటర్లకు పోవడం కష్టం. ఎందుకంటే ఆడుకునేందుకు బొమ్మలు, ఆకట్టుకు నేందుకు సంభాషణా నైపుణ్యం

సగటు ఉద్యోగిలో ఆశించే హక్కు మనకి లేదు. పిల్లల్ని కూచో పెట్టిన సెంటర్లే, పశువుల కొట్టాల మాదిరి వుంటున్నాయి. ఎంత నిరుపేద తల్లి అయినా, తన బిడ్డను ఈ కేంద్రానికి పంపడానికి సిద్ధపడటం లేదు. అడక్కుండా అప్పుల్లో ముంచెత్తే అనేక పథకాలుండగా, ఒకే తల ఎన్ని సార్లయినా తాకట్టు పెట్టుకోవచ్చు. సగటు తల్లీ బిడ్డల పరిస్థితిలో మార్పు సాధించడానికి అవినీతి, అలసత్వం పునాదులు కదిలితే తప్ప ప్రయెజనం వుండకపోవచ్చు.

ప్రచారం కోసం అంటించే వాల్ పోస్టరు పాటి చెయ్యని హీనమైన జీతాలిస్తూ, రేషను ఎందుకు కాజేశావనో, పది రకాల కూలి పనులు ఎందుకు చేస్తున్నావనో, రోజుకి ఇరవై గృహ సందర్శనలు ఎందుకు చెయ్యలేదనో ఒక బడుగు జీవిని అడగడానికి ముందు అసలు తల్లీ పిల్లల సంక్షేమం ఎన్ని దశాబ్దాలుగా ఎన్ని ప్రభుత్వాల/అధికారుల చేతుల్లో నలుగుతున్నదో రిపోర్టు తియ్యాలి. ఈ దేశం ప్రతి సంక్షేమ పథకాన్నీ పకడ్బందీగా రేవు దాటిస్తుంది.

ప్రతి మూడు సెకన్లకి ఒక శిశువు మరణిస్తోందని తాజా సమీకరణాలు చెబుతున్నాయి. అంటే నేను ఈ ఒక్క వాక్యం రాసేలోపు ఒక పసిమొగ్గ రాలిపోయిందని అర్థం.

అయిదేళ్ళకొక ప్రణాళిక పాము కుబుసంలా రాలుతుంది. కుబుసానికి పేరు నిర్ణయమవుతుంది. ఒక అంతర్జాతీయ కన్సల్టెంటు తెల్లతోలు కప్పుకుని కొన్ని లక్షల డాలర్ల హానరోరియం కోసం పేదరికం కొండ తవ్వి ఎలక (మౌసు) ని బయటికి తీస్తాడు. ఈ దేశంలోని ఏ కథా కంచికి వెళ్లదు. తల్లులూ పిల్లలూ ఇంకోసారి మోసపోవడాన్కి ఎదురు చూస్తారు. అలా ఎదురు చూసేలా మనం శిక్షణ కూడా ఇస్తాం.

6.3.2008

# గాంధారి లోకంలో శ్రీలేఖ పోరాటం

చాలా రోజుల నుంచీ మీకు శ్రీలేఖ గురించి చెప్పాలనుకుంటున్నాను.

దాదాపు పదిహేనేళ్ల క్రితం ''శావీ'' అనే ఆంగ్ల పత్రికలో ఆమె ఆత్మకథ చదివి దాచుకున్నాను. ఆవిడ ధైర్యం, ఆత్మవిశ్వాసం లాగే సంఘర్షణ కూడా నన్ను వెంటాడుతూ వుంటుంది. కేరళ పోలీసు శాఖలో మొదటి తరం మహిళా అధికారి శ్రీలేఖ. నేరస్థుల పాలిట సింహ స్వప్నంలా అవినీతినీ, అక్రమాల్నీ చీల్చి చెండాడినంత సులువుగా తన మీద అమలయిన వివక్షను జయించలేక పోయానని స్వయంగా చెప్పుకుంది.

శ్రీలేఖ అనుభవాల్ని ఆమె మాటల్లోనే..

''నాక్రింది అధికారి ఎవరైనా విజయం సాధించినపుడు ముక్తసరిగా, -మంచిది, బావుంది-అని వూరుకోవడం ఎందుకో ఇష్టం వుండదు. ప్రోత్సాహిస్తూ భుజం తట్టాలనిపిస్తుంది. అందులో వచ్చే ఆత్మసంతృప్తి అందుకున్న వాళ్ళకే తెలుస్తుంది. నా పై అధికారినుంచీ నేను అదే ఆశిస్తాను. కేవలం ఆడదాన్నవడంవల్ల అది పోగొట్టుకోవడం, అన్యాయంగా అనిపిస్తుంది. కరచాలనం కోసం చాచిన చెయ్యి తప్పు చేసినట్టు ముడుచుకుపోవడం అనేది ఏ పీనలు కోడ్ కీ అందని శిక్ష! బహుశా చెయ్యి ముట్టుకోకుండా నమస్క రించడంవల్ల స్త్రీలను గౌరవిస్తున్నామని కొందరు అనుకోవచ్చు.మనం ఆశిస్తున్న విలువలు ఇవి కాదు''. అంటుంది శ్రీలేఖ. ఇంకా చాలా విషయలు సూటిగా చెప్పింది.

''వొంటి మీద ఖాకీ యూనిఫారం తొడిగిన నాడే నేను ఆడదాన్నని మర్చిపోయాను. జండరు మర్చిపోవడమంటే నా ఆలోచనా పరిధి మరింతగా వికసించడమేనని మనసా వాచా నమ్మాను. అసలందుకే పోలీసుశాఖలో చేరాను. కానీ ఏం జరుగుతోంది? సాధారణ ఉద్యోగి నుంచి డైరక్టరు జనరల్ పోలీసు వరకూ అందరూ నన్ను హద్దుల్లో వుండమని చెప్పేవారే.

''ఆడవాళ్ళు అంత శ్రమ తట్టుకోలేరు''.

1987లో ట్రైనింగు ప్రోగ్రాం మీద లాల్ బహదూరు అకాడమీలో వున్నప్పుడు హిమాలయాలు ఎక్కాల్సి వచ్చింది. ఆ ప్రాంతమంతా ఎగుడు దిగుళ్ళతో పట్టు చిక్కకుండా వుంది. సిబ్బందితో పాటు పాకుతూ కొండ ఎక్కుతున్నాను. అందరికీ సలహాలు, సూచనలు ఇస్తున్న కోర్సు డైరక్టరు నన్ను మాత్రం దిగిపొమ్మని అది

చాలా ప్రమాదమని చెబుతూ "మీ ఆడవాళ్ళు అంత శ్రమ తట్టుకోలేరు." అన్నాడు. చాలా అవమానంగా అనిపించింది. కాదు, ఎలాగైనా ఎక్కుతానని చెప్పి ఒప్పించాను. అందరూ నా వైపే చూస్తున్నారు. పనికంటే వాళ్ళ పరిశీలన వల్ల, నాకు కాళ్ళు వణకడం మొదలయింది. పది రోజులు జరిగిన ఆ క్యాంపులో విజయం సాధించాను గానీ నన్ను ఆదర్శంగా చెబుతూ "చూడండి బ్రదర్స్.. ఆమె మహిళ అయివుండీ కూడా సాధించింది. మీరు ఆ మాత్రం ఎక్కలేరా" అంటున్నప్పుడు అదే అవమానం వెంటాడింది. మహిళగా పుట్టడం అంటే అంగ వైకల్యం కాదు కదా.

"ఆడదానికి సెల్యూట్ చెయ్యాలా?"

1991లో త్రిస్సూరు పోలీసుశాఖకు సూపరిండెంటుగా చేస్తున్నాను. ప్రతినెలా ఆఖరి శుక్రవారం పెరేడ్ తర్వాత సలహాలు హెచ్చరికలు ఇవ్వాల్సిన బాధ్యత వుంటుంది. టీంలో చాలామందికి జుట్టు పెరిగి పోయి, మాసిన గడ్డాలతో చాలా నిర్లక్ష్యంగా వున్నట్టు అనిపించింది. క్రాఫింగు, షేవింగు చేసుకోని వాళ్ళంతా గ్రౌండ్సునుంచి వెళ్ళిపొమ్మని అంటూ "ఫాలౌట్" అని అరిచాను. ఏ మాత్రం సిగ్గు పడకుండా అందరూ వెళ్ళిపోయరు. బ్రేక్ ఫాస్టు దగ్గర కూడా సారీ చెప్పడానికి ఎవరూ ప్రయత్నించలేదు. డి.ఐ.జి.నుంచి ఫోను మాత్రం వచ్చింది.

"పెరేడ్సు దగ్గర కటింగు ప్రస్తావన ఎందుకు తెచ్చారు? మీ ఉద్దేశ్యం ప్రకారం అందరూ బోడి గుండ్లతో రావాలనా? అనవసర విషయల్లో జోక్యం చేసుకోకండి" అని ఎగిరాడు. అప్పటివరకూ వున్న క్రమశిక్షణ కూడా నా హయాంలో ఎవరూ పాటించరని తెల్సి ఆశ్చర్య పోయను. ఇంకా పరాకాష్ట ఏమిటంటే అసలు నేను వస్తున్నట్టు తెలిసి ఒక ఆడదానికి సెల్యూట్ చెయ్యడం ఇష్టంలేని అక్కడి సి.ఐ. బదిలీ చేయించుకుని హడావుడిగా వెళ్ళిపోయాడట!

రాత్రిపూట ఇంకెందుకు ఫోను చేస్తారు?

త్రివేంద్రంలో వుండగా ఓ రాత్రి నాలుగ్గంటలపాటు కరెంటు లేదు. కరెంటాఫీసుకి ప్రయత్నించి విసుగేసి కనెక్షను కోసం కజహకుట్టం పోలీసుస్టేషనుకు ఫోను చేసి ఎస్సై వున్నాడా? అని అడిగాను. హటాత్తుగా గొంతు మార్చి చవకగా మాట్లాడ్డం మొదలుపెట్టాడు. "ఎవరితో మాట్లాడుతున్నావో అర్థమవుతోందా?" అని అరిచాను. "తెలుసు అర్థరాత్రి ఆడదానితో ఇంకేం మాటలుంటాయి" అని జవాబు చెప్పాడు. అతని ప్రవర్తన గురించి రిపోర్టు చేసినా ఫలితం లేకపోయింది. "ఆయన మంచివాడేనండీ ఆ రోజు తాగి వుంటాడు" అని ఒకరిద్దరు సమర్థించాలని చూశారు. ఇంకోసారి మతి పోయింది.

ప్రశ్నించడమే నా శీలానికి మచ్చ

చర్తాలా టౌనులో లిక్కరు షాపులు మూయించడానికి గూండాలతో కంటే అలపూజ పరిధిలోని తోటి అధికారితో ఎక్కువ యుద్ధం చెయ్యాల్సి వచ్చింది. నేను రైడ్స్ కు బయల్దేరే లోపు అతను వర్తమానం ఇచ్చేసి వాళ్ళని షాపులు మూయించేస్తూ వుండేవాడు. ఒకసారి నన్ను చెవులతో వినలేని భాషలో తిట్టాడు. నేను కిందకు ఈడ్చి కొట్టాను. అప్పుడు తావివరం అనే సాయంకాలం పత్రికలో నన్ను గురించి నానా కూతలు రాసి మా బంధువులందరికీ పోస్టు చేశాడు. ఇదంతా నేను పై అధికారికి రిపోర్టు చేశాను. అప్పుడు ఆయన ఒక టేపు రికార్డరు చేతికి ఇచ్చి లూజ్ టాక్స్ ఎవరు మాట్లాడినా రికార్డు చెయ్యమన్నాడు. అంటే ఆధారం లేకుండా నా మాట ఎవరూ నమ్మరని అర్థమయింది. యూనిఫాం జేబులో వేసుకుని ఎవరు ఏం వాగినా ఈడ్చి దవడ వాయగొట్టడానికి బదులు రికార్డవుతోందా లేదా అని ఎదురు చూడడం చాలా అసహ్యమనిపించేది.

అంతా దొంగలే!

త్రిస్సూరు నుంచి డిస్ట్రిక్టు క్రైం రికార్డు బ్యూరోలోకి నన్ను ఎస్పైగా వేశారు. అది ప్రమోషను అయిన పోస్టు కాక క్రియేటు చేసిన పోస్టు అవడం నా అధికారాన్ని తగ్గించడానికేనని తెలుసుకున్నాను. అప్పుడు నేను మూడు నెలల పాటు డెలివరీ లీవు తీసుకుని ప్రసవమైన తర్వాత వచ్చాను. నాకు యూనిఫారం బావులేదని పై అధికారి అనధికార సలహానట! అంతకు ముందు పొట్టతో వున్నప్పుడు అదే మాట అన్నారు. యూనిఫారం మీ అందరికీ బావుండాల్సిన అవసరమేమిటనే నా ప్రశ్నే ఎవరికీ అర్థం కాలేదు. ఈ విషయలు ఎవరికి ఫిర్యాదు చెయ్యలి? నా కోసమే రూల్సు సృష్టిస్తున్న వాళ్ళకా? నా ఫిర్యాదులు బుట్ట దాఖలు చేస్తున్న వాళ్ళకా? నా సర్వీసునీ క్రెడిటునీ ఆడదాన్ననే కారణం చేత పక్కన పెడుతున్న వాళ్ళకా? స్త్రీగా పుట్టడం ఒక అంగవైకల్యం అయినట్టు నన్ను మోడల్ గా చూపించి డిపార్టుమెంటు వాళ్ళు యువకులకి ధైర్యం చెబుతుంటే.. అదేదో తెలీని బాధ''

కరాటేవల్ల, పదవులవల్ల, అంతరిక్షం లోకి ఎగిరి రావడం వల్ల ఆడవాళ్ళకు అనేక శక్తులొస్తాయని మనం నమ్మేస్తాం. అందుకు కోచింగులు ఇప్పిస్తాం. ప్రపంచం సమర్థులైన ఆడవాళ్ళతో నిండిపోయింది. కానీ సమస్యలు తీరడమే లేదే! సమాజం భావశూన్యతతో తుప్పు పట్టేసింది. అభద్రతా భావంతో పిల్లి మొగ్గలు వేస్తోంది. కాబట్టే, ఒక పురుషుడు చేసే పని అతని కంటే సమర్థవంతంగా చేస్తూ కూడా అది గుర్తింప చేయడానికి సగటు స్త్రీ తన జీవితాన్ని ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

5.2.2008

# పతాక సన్నివేశం

ఈ మధ్య ఒక ఇల్లాలు మొగుడ్ని తెగనరికి, అతడి తలకాయ పోలీసుస్టేషనుకి సమర్పించి మరీ లొంగిపోయింది. అంతకంటే ముందు చాలా నెల్ల క్రితం మరో ఇల్లాలు భర్తను చంపి ఊరగాయ పెట్టిందని వార్త వచ్చింది.

కారణాలు ఎలాంటివైనా గానీ భారతదేశంలో భార్యలకు ఇంత నేరప్రవృత్తి ఎలా వచ్చిందా అని నాకూ చాలా బాధనిపించింది. కొన్ని వార్తలు జుగుప్స కలిగిస్తాయి, కొన్ని ఆశ్చర్యాన్నీ, భయాన్నీ కలిగిస్తాయి.

"మీ భార్యని చంపాలని మీకెప్పుడైనా అనిపించిందా?" అనే నినాదంతో మన ముందుకొచ్చిన " మధ్యాహ్నం హత్య" దాని మీద జరిగిన నిరసన వల్ల మరింత మంది చూసారు. అది విడుదలయిన కొత్తలో ఆ సినిమాలో చూపించిన పెద్ద సైజు సూట్కేసులు బాగా అమ్ముడు పోయాయని కోటీలో ఒక షాపు ఓనరు నాతో చెప్పాడు. అయిదున్నర అడుగుల మనిషిని, ఒక పెట్టెలో ఎంత కళాత్మకంగా ఇరికించవచ్చో ఆ దర్శకుడు చెప్పేదాకా మనకి తెలీదుకదా!

ఆ చేత్తో మొగుడ్ని ఊరగాయ పెట్టినట్టుగా అదే దర్శకుడితో ఒక డాక్యుమెంటరీ తీయిస్తే ఎలా వుంటుంది?

డెబ్బై కేజీల శ్రీవారికి ఎంత ఆవపిండి, ఉప్పు సరిపోతుందో? ఎన్నాళ్ళు ఊరబెట్టాలో, ఆవకాయ ఒక్కటే పెట్టాలా? మాగాయ, మెంతికాయ, తొక్కుడు పచ్చడి కూడా చేసి పడేస్తే ఒక పని అయిపోతుందంటారా? మా రోషిణి అడిగినట్టు "అప్పటికప్పుడు త్రీ మేంగోస్ కారం దొరుకుతుందో లేదో? తొక్కు తీసేందుకైనా పక్కింటావిడ రాదు కదా, ఒంటరిగానే శ్రమపడాలి" అంటూ ఆలోచనలు పురికొల్పామనుకోండి, అప్పుడు నేరం పక్కకి పోయి కథనం, చిత్రీకరణ మనసుకి హత్తుకుంటాయి. వికారంగా వుంది కదూ. నాక్కూడా అలాగే వుంది మరి. నేరాన్ని చిత్రీకరించడంలోనూ, వక్రీకరించడంలోనూ మన దృక్పథం కనిపిస్తుంది.

అత్యాచారాలు, హత్యలు స్త్రీలమీద జరిగినప్పుడు సినిమాలో చూపినంత ఆకర్షణీయంగానూ, తమాషాగానూ సమాజంలోనూ తీసుకుంటారు. ఎందుకు చెబుతున్నానంటే ఈ మధ్య జరిగిన వాకపల్లి, నందిగ్రామం అత్యాచార సంఘటనల్ని గురించి ఆన్లైన్లో ఒక మిత్రుడితో రాత సంభాషణ చేస్తున్నాను. అతగాడు పోలీసు, సరిహద్దు రక్షకులు, లారీడ్రైవర్లు లాంటి ఉద్యోగులు కుటుంబాలకి దూరంగా పడుతున్న అగచాట్లను గురించి, నిలవరించుకోలేని కోరికల వల్ల తగ్గుతున్న పని సామర్ధ్యం గురించి చెప్పడం మొదలుపెట్టాడు. చాలాసేపు నేనూ వాదిస్తూ వుండిపోయను. కోరిక పెద్దదా, జీవితం పెద్దదా? అయితే అందుకు మూల్యం ఎవరు చెల్లిస్తారు?

అమాయకమైన గ్రామీణ స్త్రీల మానవహక్కులకు అర్ధంలేదా?

సుముఖంగా లేనప్పుడు కట్టుకున్న భర్త అయినా సరే బలవంతం చెయ్యరాదని, అది నేరం అవుతుందని కోర్టు ఇచ్చిన తీర్పు తమాషాయేనా?

సరే అయితే, కోరిక అంత బలమయిన శక్తి ఇవ్వగల దినుసు అయినప్పుడు ఎటువంటి దారిలో అయినా అది తీరడం ప్రధానం అయినప్పుడు నర్సింగులాంటి కొన్ని ''పవిత్ర'' వృత్తుల్లో వున్నవాళ్ళకు కన్యాత్వ పరీక్షలెందుకు? మన సమాజంలో ఇప్పటికీ ఇంకా జరుగుతున్న బాల్య వివాహాల వల్ల పెరుగుతున్న వితంతువుల సంఖ్య, వారి తీరని కోరికల మాటేమిటి? వాళ్ళంతా గుంపులుగా వెళ్ళి ఎవరిమీదయినా దండయాత్రలు చేసిన సందర్భాలు మనకు తెలుసా?

ఈ దేశంలో భర్తలు తమ భార్యల్ని చేస్తున్న హత్యల్లో నూటికి 90 శాతం అనుమానం కారణంగా చేస్తున్నవేనని రిపోర్టులు చెబుతున్నాయి. మన సాంకేతిక పరిశోధనలన్నీ కూడా ఒక సగటు మగవాడి బలహీనతల్ని సమర్ధించడం కోసం ఏమైనా చేస్తాయి. దాని పేరే హైమనోప్లాస్టీ (కన్యాత్వపు పునర్నిర్మాణ చికిత్స). రు. 40,000 ఖర్చుపెట్టి ఇప్పుడు ఇల్లాళ్ళందరూ ఇంకోసారి కన్యలైపోవచ్చు. సమానత్వ విషయంలో, 33 శాతం రిజర్వేషన్ల విషయంలో ఏమీ సహకరించని ప్రభుత్వం ఇవాళ కోట్లాది రూపాయలతో పరిశోధనలు చేసి మనిషికొక కన్నెచెర అమర్చడానికి ముందుకొచ్చింది. చప్పట్లు కొడదామా?

4.11.2007

# గిరిజనులకి మన "నాగరికత అచ్చిరాలేద"ట

పాముల్ని పట్టడానికి కప్పల్ని ఎరవేస్తారని మనకు తెలుసు. దాని శరీరంలో మేకుల్ని దించి గోడకో బల్లకో బంధించినంత మాత్రాన కప్ప మన శత్రువు కాదు. మన గురి పాము మీద. పాముని పట్టడానికి కప్ప ఎర అయింది. పాము మాత్రం ఎందుకు శత్రువయింది? బుస కొట్టే స్వభావంవల్ల. కాబట్టి ముందు జాగ్రత్త చర్య కింద చంపి పారేస్తాం. అది రాజనీతి. గుడిసె కింద చమురు వున్నందుకో, ఖనిజం వున్నందుకో, రంగురాళ్ళు వున్నందుకో, విమానం దిగడానికి జాగా బావున్నందుకో బెదర గొట్టే పనిలో పనిగా అత్యాచారాలు జరుగుతున్నాయిట.. కారణాల అన్వేషణ జరుగుతున్న కొద్దీ నేరం మీద ప్రజాగ్రహం కాస్సేపు మరుగున పడుతుంది. మొన్న వాకపల్లి గిరిజన స్త్రీల తొడల మీద బూటు కాళ్ళతొక్కిడి నిజంకాదు. నిన్న నందిగ్రామం స్త్రీలలో ఒక బాలింత జననాంగంలో కర్ర పెట్టి హింసించడం నిజం కాదు. మతం కొలిమిలో గుజరాత్ మహిళని ముక్కలు చెయ్యడం నిజం కాదు. బోస్నియాలో సెర్బులు స్త్రీలను గర్భవతుల్ని చేసి, వాటిని కరిగించుకోనియ్యకుండా కుక్క కాపలా కాయడం నిజం కాదు. మృత శరీరాలకు సైతం కొన్ని మర్యాదలు పాటించాలని అన్ని మతాల చెబుతాయి కద! ఇప్పుడు ఇక్కడ స్త్రీలంటే శరీరం మాత్రమేనా అని విచారిస్తున్న సమయంలో శరీరం కూడా కాదని తెలిసిపోయింది. మనం కేవలం పదార్థాలం, ప్రేరకాలం.

మురికి మీద పడగానే నీళ్లతో కడిగి పారెయ్యడం ఒక అసంకల్పిత ప్రతీకార చర్య. కాగా అత్యాచారం మొదలు నేరస్తుడ్ని పట్టుకునే దాకా జరిగిన నాటకీయ సన్నివేశాలన్నీ పూర్తయ్యేదాకా సాక్ష్యం చూపించడం కోసం బాధితురాలు స్నానమే చెయ్యకూడదనడం ఒక అమానవ వాస్తవం. మన సాంకేతిక ప్రతిభ ఇంతకంటే ఎప్పటికీ పెరిగి చావదా? అదే ముఖ్యమంత్రి మీదో, ఎమ్మెల్యే మీదో దాడి జరిగితే

ఇరవై నాలుగ్గంటలలోగా ఊహా చిత్రాలు పూర్తవుతాయి. పోలికలున్న వాళ్ళందర్నీ పోలీసు ఠాణాకు లాక్కొస్తారు.

ఎందుకు జొరబడ్డారో, ఎందుకు తిడుతున్నారో, కొడుతున్నారో, హింస పెడుతున్నారో కారణమైనా తెలీకుండా, తమ కళ్ళతో తామే చూసుకోవడానికి సిగ్గుపడే శరీరాల్ని భర్తల ముందు, అమ్మనాన్నల ముందు, పిల్లల ముందు, అన్నదమ్ముల ముందు చీల్చి చెండాడుతుంటే ఆ ఇళ్ళు ఎంతగా తల్లడిల్లి పోయాయో, పసివాళ్ళ మనసులో అది ఎలాంటి ముద్ర వేస్తుందో, ఎన్ని పెళ్ళిళ్ళు ఆగిపోతాయో, ఎందరి గర్భాలు రక్తస్రావాలవుతాయో, ఎందరి కడుపులో ఆ కిరాతక ప్రతిబింబాలు నాటుకుంటాయో, హటాత్తుగా వారి చుట్టూ వున్న మానవ సంబంధాలు ఎంతగా దగా పడతాయో, "చెడిపోయింది" అనే ముద్రతో రోడ్డు మీద నడవడానికి ఎంత సహనం కావాలో ఎవరు ఊహించగలుగుతారు?

కుప్ప తొట్టెలో ఒక శిశువు దొరగ్గానే అది కన్నది "కసాయి ఆడద"ని తేల్చినంత తేలిక కాదు కదా? ఆనవాలు లేకుండా నేల కూలిన ఇళ్ళని, దోచుకు పోయిన ఆస్థుల్ని, ప్రాణాల్ని, పరువుల్ని, జీవితాలని కూడదీసుకోవడం అంటే, దొంగ పరిహారాలు ప్రకటించినంత బలుపూ కాదు కదా.

వాకపల్లి గిరిజన ఇల్లాళ్ళను శుద్ధి పూజ చేసి ఇంటికి తెచ్చుకున్నార్ట! బహుశ అదే సమయంలో మన చట్టాన్నీ, వైద్యాన్నీ, న్యాయాన్ని, మానవ హక్కుల్నీ, నాగరికతనీ నమ్మినందుకు కూడా ఒకేసారి తమని తాము శుద్ధి చేసుకుని వుంటారు. మనకి శుద్ధి పూజలు లేవు. నాగరికులం కదా. ఇవే అశుద్ధ (సారీ, సుద్ధి కాబడని అని నా అర్థం) మొహాలతో మళ్ళీ ఓట్ల కోసం వెడతారు. ఈస్తటిక్స్ పేరుతో రవికల్లేని వాళ్ళ చిత్ర పటాల్ని కార్యాలయల్లో తగిలించుకుంటారు.

వాళ్ళ తేనెలు చప్పరించి, నడుం పట్టుకుని నాలుగు స్టెప్పులేసి, గ్రామాలు ముంచెత్తే ప్రాజక్టులు కట్టడానికి, వాగుల్లో విషం కలపడానికి అనుమతి ఇమ్మని అడగడానికి వెడతారు.

గిరిజనులకి మన "నాగరికత అచ్చిరాలేద"ట. మన చట్టం చెయ్యలేని పని రేపు వాళ్ళ బరిసెలు, ఈటెలు చేస్తాయి. ఈ సారి అత్యాచారం పని మీద ఎవరొచ్చినా సరే, వేట జంతువును వొలిచినట్టు తోలు వొలిచి కర్రకు కట్టి దోరగా కాలుస్తూ, వెన్నెల నాట్యం చేస్తారు. నిజమే కదా. ఎక్కడ జరిగిన నేరానికి అక్కడే పరిష్కారం జరగాలి.

5.10.2007

# నా సంతోషం సొరకాయలో లేదు

వంట చెయ్యడమంటే నాకు పరమ చిరాకు.

దాన్నొక వృత్తిగా మలచి విశ్వవిద్యాలయాలు నడిపిస్తూ, ఏటేటా వేలాది మంది సంస్థాపరమైన పాకశాస్త్ర నిపుణుల్ని దిగుమతి చేస్తున్నా సరే అవి నాకేమాత్రం ఆసక్తిని కలిగించలేకపోయాయి. మూడు తరాల ఆడపిల్లలు కలలు కన్న ఎయిర్ హొస్టెస్ ఉద్యోగం కూడా వంటకి అనుబంధమైన వడ్డన వుండటం వల్లనే అనాకర్షణీయంగా కనిపిస్తుంది.

నా అభిప్రాయాలు నావి, అవి ఎవర్నైనా బాధిస్తే క్షమించాలి. ఆ మాటకొస్తే నన్ను నేనిలా క్షమించుకుంటూ, బాధించుకుంటూ గత పాతికేళ్ళుగా వొండి వారుస్తూనే వున్నాను. బహుశా ఒక మహా నగరానికి సరిపడినన్ని కూరలూ పచ్చళ్ళూ, సాంబార్లూ ఈ సుష్కమైన చేతుల్తో ఉడికించేసి వుంటాను.

వంటని ఇంతగా ద్వేషించే మీరు అందులో ఉన్న "శ్రమ జీవన సౌందర్యా"న్ని ఎలా గుర్తిస్తారనో, ఎవరూ వండకపోతే తిండి ఎలా తింటారనో నన్ను అడగచ్చు. అన్ని పనుల్లాగే వంట కూడా అభిరుచికీ, అవసరానికీ పరిమితమై వుండక ఒక జెండర్ జీవితాన్నే ఎందుకు కాల్చుకు తింటుందనేది నా ప్రశ్న."వంట బానే చేస్తావుగా కాస్త మొహం ప్రశాంతంగా వుంచుకుంటే ఏం పోయింది?" నీకేం కావాలో చెప్పు మిక్సీనా, కొత్త స్టవ్వా? అంటాడు మా ఆయిన. అడిగితే వంటావిడ్ని కూడా కొని పెడతాడు. అప్పుడు నేను వంటింటికి నటీమణి స్థాయినుంచి దర్శక స్థాయికి మారుతానే తప్ప ఆ గోడలు దాటి ఇవతలికి మాత్రం రాలేను. నేను అడుగుతున్నవి ప్రత్యామ్నాయ మార్గాలు కాదు. విధానంలో వున్న లోపాల్ని గురించి.

బతకడం కోసం తినాలి కాబట్టి, తిండికి వంట తప్ప, ఆ వండేందుకు నా చేతులు తప్ప ఇంకో దారి లేదు కాబట్టి నేను పుట్టకముందు నుంచి వంటింటికి లొంగిపోయాను.

ఈ మధ్య పన్నాల సుబ్రమణ్య భట్టు అనే పెద్దమనిషి, "నేనిప్పుడు ఇంటికెళ్ళి, మడి కట్టుకుని మా అమ్మకి వొండిపెడతాను తెలుసా? ఏమిటి మీ రచయిత్రులంతా

వంటిల్లు తవ్వేయడం మొదలెట్టారు? అన్నాడు విమల రాసిన "వంటిల్లు" కవితను ఉద్దేశించి, ఇందులో అనేక కోణాలు ఉన్నాయి.

వంట ఏమంత కష్టం, తల్చుకుంటే నాలాంటి మగధీరుడు కూడా వొండి పడేస్తాడు. అనేది ఒకటి. అయితే, అంతోటి ఆష్ట్రాల్ వంట, వాళ్ళమ్మ మంచంలో పడ్డాకా గానీ రుచి చూసే భాగ్యానికి నోచుకోలేదు. ఈ భాగ్యానికి ముందు ఆవిడ ఎన్ని టన్నుల మడి బట్టల్ని ఆరేసిందో, ఎన్ని ఎకరాల్ని ఉడికించిందో వడ్డించీందో, వండిన ప్రతి కూరకి ఎన్ని వంకలు పెట్టినా, ఎలా భరించిందో ఈ కొడుక్కే కాదు, అసలు ఏ కొడుక్కీ తెలీదు

వంటింటిని గురించి సగటు మగవాడి కబుర్లు భలే ఆసక్తిగా వుంటాయి.

"ప్చ్ ఏం ఉద్యోగాలో ఏం పాడో, ఆడాళ్ళ ప్రాణానికి సుఖం లేకుండా పోతోంది" అంటాడు మా మామగారు. సుఖంగా వుండటమంటే సొరకాయని ఆవపోసి, పులుసుపోసి, పాలుపోసి, పెరుగుపోసి, సెనగలు పోసి, గన్నేరు పప్పులు పోసి వండటమనేది ఆయన అభిప్రాయం కావచ్చు. మరెందుకో గాని నా సుఖం సొరకాయలో లేదు. అది సూర్యోదయంలో వుంది. వంట చింతలేని ఆకాశంలో, పొడిచిన సూర్యోదయం.

అందుకోసం నేను రాత్రే కూరలు తరుక్కుని కూచోవాలి. లేదా సూర్యోదయానికి ముందు ఇడ్లీ కుక్కర్ స్టవ్వు మీద విసిరి కొట్టి మేడమీదికి పారిపోవాలి. కుక్కరు ఈలేసినా వంటిల్లు కన్ను కొట్టినా వెనక్కి చూడకూడదు.

ఇడ్లీల కోసమే నిద్ర లేచిన వాళ్ళకోసం, సూర్యోదయం మీద ప్రేమవున్నవాళ్ళు ఆ ప్రేమంతా త్యాగం చేసి ఉడికిన పిండి ముద్దల్లోకి పచ్చడి నూరుతూ కూచోవాలి.. భలే బావుంది కదూ.

మగాడి హృదయానికి పొట్టలోంచి దారి వుంటుందిట. అంత చెత్త దారిలోంచి ప్రయాణించే అవసరం ఎవరికి రాకుండుగాక. మరి ఆడాళ్ళ హృదయానికి దారి ఎవరైనా కనిపెట్టారా? ఎదురుగుండా టి.వి లో "పెళ్ళాం ఊరెళితే" అనే సినిమా వస్తోంది. ఒకే ఒక ఆడదాని కోసం ఎంతమంది వెర్రి వెంగళాయిలైపోతున్నారో చూస్తున్నాను. మరి మొగుడు ఊరెడితే, ఆ సమయం ఎంత ఫలవంతంగా, ఆనందంగా వుంటుందో ఎన్నాళ్ళనుంచో వాయిదా పడ్డ పనులు ఎంత బాగా చేసుకోవచ్చో నేనది అనుభవిస్తున్నాను. ఇవాళ అన్నం వొండుకోలేదు. కాఫీతాగుతూ మీతో కబుర్లాడుతున్నాను.. నచ్చిన పాటలు వింటాను. నచ్చిన రాతలు రాస్తాను... ఆకలి వేస్తే బైటికి పోయి తింటాను. అది ఇంకొకరికి ఆదాయం అవుతుంది. ఇది స్వేచ్ఛ రుచి అభిరుచి పానీయం.

# నూరు శాతం విజయాల్లో నూటొక్క సందేహాలు

సెక్స్ వర్కర్ అనగానే స్త్రీలే గుర్తొస్తారు. కాబట్టి నీతులు, జాగ్రత్తలు, బాధ్యతలు, మందులు, అన్నీ త్రేతాయుగం నాటి దృక్పథంతోనే నడుస్తాయి.

సెక్స్ అంటే కనీసం ఇద్దరు ఇంకా ఎక్కువమంది పురుషులు భాగస్వాములుగా వుంటారని, రాకెట్ ఆధిపత్యం మొత్తం మెజారిటీ పురుషుల చేతిలోనే వుందని అలవాటుగా మర్చిపోతాం. కాబట్టి రబ్బరు తొడుగులతో సమస్య తీరడం లేదు.

నూరుశాతం విజయాలు సాధించినదని చెప్పబడుతున్న కండోమ్ పాలసీ గురించి నూటొక్క సందేహాల్ని ఇవాళ సెక్సువర్కర్స్ అడుగుతున్నారు. వాటిలో కొన్నిటినైనా మనం మానవతా దృక్పథంతో అర్థం చేసుకోవాల్సి వుంది.

నూరుశాతం కండోమ్ పాలసీ కస్టమర్స్ సంఖ్యని తగ్గించలేదు. సురక్షితంకాని పద్ధతుల్ని పట్టించుకోవడం లేదు. కండోమ్ లేకుండా రిస్క్ కు సిద్ధపడ్డ స్త్రీలకు ఎక్కువ సంపాదన వుంటోంది.

సెక్స్ వర్కర్ బైటికి వెళ్ళి కస్టమర్స్ ని వెతుక్కుంటున్నప్పుడు కనీసం 5 నుంచి 6 కండోమ్‌లు వరకు జాకెట్టులోనో పరికిణిలోనో దాచుకుని బయల్దేరుతుంది. కానీ పోలీసుల నిఘాలో దొరికినప్పుడు వాళ్ళు అవన్నీ లాక్కుంటారు. దానివల్ల సెక్స్ వర్క్ ఆగిపోదు. కండోమ్ లేకుండానే సెక్స్ జరుగుతుంది. తొడిగించడం అనే సామాజిక బాధ్యతను శిక్షణగా తీసుకున్న ఆమె నిస్సహాయురాలవుతుంది.

- పోలీసుల భయంతో సెక్స్ వర్కర్స్ కార్నర్ షాప్స్ వాళ్ళను బ్రతిమలాడో, కమీషన్ యిచ్చో కండోమ్‌లు దాచుకుంటారు. కస్టమర్ దొరికేలోపు షాపు మూసేసినట్టయితే ఇక కండోమ్ వాడకం సాధ్యపడదు.

- బ్రోతల్‌హౌస్ నిర్వహణే ఒక అనైతిక, చట్టవిరుద్ధ కార్యక్రమం కాబట్టి ఆస్పత్రిలో

వున్న వారి మానవహక్కులు చర్చించబడవు. ఒక స్త్రీ హెచ్.ఐ.వి పాజిటివ్ అని తెలియగానే బ్రోతల్ హౌస్‌లో వసతి కోల్పోతుంది. వారి బ్రతుకు రోడ్డున పడుతుంది.

- సెక్సువర్కర్స్ లో ఎక్కువశాతం స్థానికేతరులు అవడం వల్ల భాషా సమస్య తీవ్రంగా వుండి, ఆ ప్రాంతంలో జరుగు తున్న నిరోధక చర్యలు అర్థం చేసుకునే స్థాయిలో వుండరు.

- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు యిస్తున్న వైద్య, సమాచార సదుపాయం చేరాల్సి నంతగా చేరడం లేదు.

- ఎయిడ్స్ బారిన పడకుండా వుండడానికి సెక్స్ కి బదులు ఓరల్ సెక్స్ అంటూ కొన్ని పద్ధతుల్ని సెక్స్ వర్కర్స్‌కి శిక్షణ యిస్తున్నారు. దీనివల్ల గర్భధారణ, వ్యాధి రాకపోవచ్చు. కాని తీవ్రమైన అసౌకర్యం, చెప్పుకోలేని హింస వుంటున్నాయి. ఈ జాడ్యానికి పిల్లలు ఎక్కువమంది బలవుతున్నారు.

- సెక్స్ వర్క్ లోకి దిగిన స్త్రీలు దొరికిపోతున్నట్టుగా ఏజెంట్లూ, నిర్వాహకులూ, ఇతర పెద్దలూ దొరకడం లేదు.

- తరలించడం, నమ్మకద్రోహం, అమ్మడం, కొనడం, బంధించడం, లాంటి అనేక చర్యలు చేస్తున్నవాళ్ళందరినీ సెక్స్ వర్కర్స్ అనాలి కానీ ఆ పేరుని బాధిత స్త్రీలకు మాత్రమే ఉద్దేశిస్తున్నారు.

- ఈ సెక్స్ వర్క్ ని నిరోధించడం అంటే ప్రత్యామ్నాయ ఆదాయమార్గం అందించడం అనే దిశగా ఆలోచించాలి.

- ఒక యువతి తనంతట తాను అదే వృత్తిలో కొనసాగుతున్నదంటే, గౌరవంగా బతికే అవకాశం ఈ సమాజం ఇవ్వలేదనే అర్థం.

- మెహందీ స్త్రీల మానవ హక్కుల్ని గురించి మాట్లాడ్డమంటే ఆ వృత్తిని ప్రోత్సాహించటం కాదు. జైళ్ళలో నేరస్థుడు నేరం చేశాడనే కారణంగా కొట్టడం, తిండిలేకుండా మాడ్చడం, కోర్టుకు హాజరు పరచకపోవడం, ఎలాంటి నేరాలో, సెక్స్ వర్కర్స్ బ్రోతల్ హౌస్‌లోనూ, కస్టమర్స్ చేతుల్లోనూ ఎదుర్కొంటున్న హింసా అదే నేరం కింద పరిగణించాలి.

సెక్స్ వర్కర్‌ను అరెస్టు చేసే చట్టం పేరు 'సీత'. మహా పతివ్రత పేరు అవడం వల్ల అది 'పీత'గా మార్చబడింది. ఈ మార్పు యాదృచ్ఛికంగానే జరిగినా అది కరుడుగట్టిన దృక్పథాన్ని సూచిస్తోంది.

# తాళ్ళూ - తలవంపులూ

వాలంటైన్స్ డే వచ్చేస్తోంది. నగరాలు ప్రేమ జ్వరంతో వొణికిపోతున్నాయి. "ఐ లవ్యూ" చెప్పడానికి ఇది ఒక సందర్భంగా కొందరు ఎదురుచూస్తున్నార ఇప్పటికే అది ప్రకటించేసిన ఇంకొందరు ఇంట్లో వాళ్ల కళ్ళు కప్పి అయినా సరే బైట ఎక్కడో కలిసి గడపడంకోసం ప్లాన్స్ వేసేసుకున్నారు.

లవ్వర్స్ లేనివాళ్ళు, ఆ రోజులోగా ఎవరో ఒకర్ని సంపాయించుకోవాలని తొందర పడుతున్నారు. ఇంకో పక్క కిలోల కొద్దీ పసుపు తాళ్ళు, రాఖీ తాళ్ళూ పట్టుకుని, కనిపించిన ప్రతి అబ్బాయి చేతా పక్కనున్న అమ్మాయి మెడలో కట్టించడానికి భజరంగ దళ్ వాళ్ళు సిద్ధంగా వున్నారు నిజానికి ప్రేమికులకంటే వీళ్ళ తొందరే ఎక్కువగా వుంది. ఇలాంటి చర్యలవల్ల భారతీయతను రక్షించి తద్వారా దొంగ ప్రేమల పని పట్టాలని వాళ్ల ఉద్దేశ్యం కావచ్చు. ఈ ఉద్దేశ్యాన్ని నేను తప్పుపట్టదల్చలేదు. కానీ ఇప్పటివరకూ ఏం జరిగింది? పైగా ఈ కార్యక్రమాల వల్ల రెండు పొరబాట్లు జరుగుతాయి. ఎందుకంటే ఐ లవ్యూ అంటున్నవాడు ఒక తాడు కట్టగానే సోదరుడు అయిపోడు. పోలీసులకి భయపడి అలా నటించినా, అది ఆ ఒక్కరోజుకే పరిమితం.

కాగా తండ్రిలో పితృత్వం, సోదరుడిలో సోదరత్వం కూడా ప్రస్తుతం అనుమానాస్పదంగా మారాయి. ఒకవేళ ఇద్దరి ప్రేమలో నిజాయితీ వుంటే ఈ రాఖీ తెచ్చిన భావజాలం వారి భావోద్వేగాల మీద కొట్టిన దెబ్బ అవుతుంది. అదే విధంగా నిజాయితీలేని ప్రేమికులకి పసుపుతాడు కట్టించడం వల్ల భయపెట్టడమే జరుగుతుంది తప్ప, పరిష్కారం చూపదు.

ఇవేవీ కాకుండా, వారిద్దరూ కేవలం స్నేహితులే అయితే కలిసి జీవించాలో వద్దో తేల్చుకోవడానికి సమయం కోరుకుంటున్నవారే అయితే, అనవసరంగా ఈ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రదర్శించబడి వారి భావి జీవితం మరింత సుడిగుండంలో చిక్కుకుంటుంది. ప్రేమకయినా, పెళ్లికయినా ఒకటికి పది సార్లు ఆలోచించుకునే వెసులుబాటు వుండితీరాలి. పది సార్లు మాట్లాడుకోవాల్సిన అవసరం కూడా వుండచ్చు. అయితే వాళ్ళిద్దరూ ఎంత దూరంలో కూచోవాలి? ఏ సమయంలో మాత్రమే కూచోవాలి అనే సిలబస్ ఎవరిస్తారు? ప్రేమల నుంచి రక్షంచడానికి పెళ్ళి మంత్రాలు చదవడం ఎప్పటినుంచో వున్నదే. కానీ ఏదీ మానవ సంబంధాలను

సక్రమంగా నిలబెట్టడంలేదు. ఒకరినొకరు మనుషులుగా చూసుకోవాలా, చేజిక్కిన అవకాశాల్లాగా చూసుకోవాలా అనే విషయం అర్థం చేయించడానికి వాలంటేన్స్ డే ఒక్కటే సరిపోదు. చిన్నప్పటి నుంచీ నేర్పాలి. ఒకరి హక్కులు ఒకరు గుర్తించే చదువే లేనప్పుడు, ప్రపంచవ్యాప్తంగా శరీర వ్యాపారమే జరుగుతున్నప్పుడు, శరీరాల మీద పడి మార్కెట్ వ్యవస్థ అంతా నడుస్తున్నప్పుడు, ఏ సందర్భం వచ్చినా సరే మందూ మగువా సంస్కృతి డ్రైనేజీలా పొంగుతున్నప్పుడు, ఈ సంస్కృతి వెనక రాజకీయ నాయకులూ, మంత్రులూ వున్నప్పుడు ఇది తప్పనిసరిగా ఆలోచించాల్సిన విషయమే. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో నష్టపోతున్నది ఎక్కువగా స్త్రీలే.

ఆమెకు వున్న, ప్రాథమిక మానవ హక్కులన్నీ వట్టి కాయితం ముక్కలే. ఈ ప్రేమలోనూ, ప్రేమ కంటే హింస ఎక్కువగా వుంటోంది. సమానత్వం స్థానంలో యజమాని బానిస సంబంధాలే వుంటున్నాయి.

అసలు హజ్బెండ్ అనే పదానికి మాస్టర్ అనే అర్థమే తప్ప భాగస్వామి అని ఎక్కడా లేదని కమలా భసీన్ అనే స్త్రీ హక్కుల కర్యకర్తా, ప్రసిద్ధ రచయిత్రీ అంటున్నారు.

అయితే ఈ ఫిబ్రవరి 14, 2013న జరగబోయే వాలంటేన్స్ డేకి ఒక ప్రత్యేకత వుంది. దీన్ని స్త్రీ హక్కుల. ఉద్యమంగా తీర్చిదిద్దాలని అనేక మంది సంకల్పిస్తున్నారు. ఈ ప్రజా ఉద్యమంలో నూరు కోట్ల మంది. స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. ఇది ఏడు కోట్ల మంది స్త్రీ పురుషుల్ని ఉద్దేశించి చేస్తున్న సంభాషణ. ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరు ఇంటిలో, పనిలో, బహిరంగ ప్రదేశాల్లో హింసకు గురవుతున్నారు. అంటే నూరుకోట్ల మంది జీవితాల్లో హింస నిత్యకృత్యమైపోయిందన్నమాట. ఈ ధోరణిని ఆపడమే వీరి లక్ష్యం.

"బిలియన్ రైజింగ్ "సందర్భంగా ఒక వంద కోట్లమంది స్త్రీలు, బాలికలు పాల్గొంటున్నారు. నిశ్శబ్దాన్ని ఛేదించి ఇంత వరకు "జరిగింది చాలు, ఇక ముందు ఏ మాత్రం సహించం!" అంటూ ఎలుగెత్తి చాటుతారు. ఈ ఉద్యమంలో కొన్ని లక్షల మంది స్త్రీ పురుషులు పాల్గొంటారని తెలుస్తోంది.

ఇదంతా ప్రతి సంవత్సరం ఉత్సాహంగా జరుపుకునే ప్రేమికుల రోజును నిర్ణయించుకున్నారు. వాలెంటైన్స్ డే నాడు "న్యాయబద్ధమైన ప్రేమను, సమానత్వాన్ని ఎలుగెత్తి చాటే ప్రేమను, స్త్రీల పట్ల గౌరవంతో కూడిన ప్రేమను ప్రతీకగా నిలబెడతాం" "అంటూ నిరూపించ బోతున్నారు. ఇది నిజంగానే ఆహ్వానించదగ్గ పరిణామం.

20.12.12

# ఎడ్జస్టింగ్ మెంటాలిటీ

ఇప్పుడు ఒక పేరున్న సాఫ్ట్ వేర్ కంపెనీకి అధికారిగా వున్న నా కొడుక్కి చిన్నప్పుడు స్కూల్ ఫోబియో వుండేది. బడి బెంగతో బిక్కటిల్లిపోతున్నవాడిని బలవంతాన లాక్కెళ్ళి కాన్వెంటు గేటు లోపల పడేసి రావడానికి నా మనసు ఒప్పేది కాదు. అంచేత వాడు ఏ స్కూల్లో చేరితే అక్కడ టీచరుగా పని చెయ్యడానికి తయారయిపోయేదాన్ని. పిల్లలిద్దర్నీ దగ్గరుండి స్కూలుకి తీస్కెళ్లడం, టిఫిన్ బాక్సులు తినిపించడం, వెనక్కి తీసుకురావడం, మళ్ళీ హొమ్ వర్కులు చేయించడం లాంటి పనుల వల్ల ఇంట్లో అందరికీ నిశ్చింతగా వుండేది. ఇద్దరు పిల్లల ఫీజులతో బాటు బోనస్ గా జీతభత్యాలు పట్టించుకోని నాలాంటి పంతులమ్మ సేవలు యాజమాన్యానికి లాభసాటిగా వుండేవి. రోజుకొక ఇస్త్రీ చీర కట్టుకుని రోడ్డుమీదికి రావడమే సాధికారత అనుకుని నేనూ మురిసిపోయేదాన్ని. ఒకే ఒక్క సంఘటన వల్ల నేనెంత అల్పురాల్నో బాగా తెలిసి వచ్చింది.

ఆ రోజు క్వార్టర్లీ పరీక్ష జరుగుతోంది. మా అబ్బాయికి నాల్రోజులనుంచీ కాస్తున్న జ్వరం కాస్తంత తగ్గడంవల్ల ఇన్విజిలేషన్ డ్యూటీ చెయ్యడానికి వాడ్ని ఎత్తుకునే స్కూలుకి వచ్చాను. వెనక బెంచీలో పడుకోబెట్టి, ఫోర్తు క్లాస్ పిల్లలతో పరీక్ష రాయిస్తున్నాను. గంట కూడా గడవకుండానే వున్నట్టుండి వాడు పెద్దగా వాంతి చేసుకున్నాడు.

అది నేను ఊహించనిదే అయినా, తడబాటు కనబడనీయకుండా పిల్లలందర్నీ క్యూ కట్టించి వేరే క్లాసుకి పంపించీ రూమ్ శుభ్రం చేయడానికి పనివాడికి కబురుపెట్టాను. ఆ పని అవగానే ఇన్విజిలేషన్ బాధ్యత ఇంకో టీచరుకి అప్పగించి పిల్లవాడ్ని ఆస్పత్రికి తీసుకువెడదామని నా ఆలోచన. ఎంతసేపటికీ పనివాడు రాకపోతే విషయం అర్థకాక ప్రిన్సిపాల్ కి రిపోర్టు చేశాను.

“పనివాడెందుకు, వాంతి చేసుకున్నది మీ పిల్లవాడేగా క్లీన్ చేసెయ్యండి అదిగో అక్కడ నీళ్ళున్నాయి. ఇక్కడ చీపురుంది“అన్నాడాయన చాలా మామూలుగా.

తెల్లబోయాను. అవమానంతో మాట రాలేదు.

“పిల్లవాడ్ని తీసుకు రాకుండా వుండాల్సింది.”

“మీరే సెలవు పెట్టేస్తే సరిపోయేది....”.

“అయినా ఏమంత పెద్ద అవసరం మీకు ఈ ఉద్యోగం. ”

రక రకాల కామేంట్స్ వినిపిస్తున్నాయి. అందులో ఏ ఒక్కటీ కూడా నా సమస్యకు పరిస్కారం కాదు.

“ఇదేం పద్ధతి, మన స్కూల్లో టాయిలేట్ హాబిట్స్ చాతకాని పసిపిల్లలున్నారు కదా, పోచయ్య రోజూ చేస్తున్న పని ఈ రోజెందుకని చెయ్యలేదు” అని అడిగాను.

“వాళ్ళంతేనండి, పిల్లలున్న స్కూల్లో తల్లులున్నప్పుడు ఈ బాధ తప్పదు. లోగడ నాక్కూడా ఇలాంటి అనుభవం అయింది “అందొక టీచరు.

నాకో పక్క పిల్ల వాడ్ని గురించి ఆందోళన. మరోపక్క ఈ అవమానం. నోట మాట రాలేదు.

అంటే నేను ఆడదాన్నవడం వల్ల నాకన్నా పైస్థాయి ప్రిన్సిపాల్ అలసత్వానికి, క్రింది స్థాయి పనివాడి నిర్లక్ష్యానికీ గురయ్యాను.

నేనొక ఇల్లాల్ని అవడం వల్ల ఇల్లొదిలి ఎక్కడికెళ్ళినా గాని. చీపురు కట్టల నుంచీ, అంట గరిటెలనుంచీ, తప్పించు కోలేనిదాన్నయ్యాను.

నేనొక తల్లినవడం వల్ల మిగతా పిల్లలందరి చదువు, భద్రత, శుభ్రత లాంటి విషయాల్లో నా బిడ్డను మినహాయించడం గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించలేని దాన్నయ్యాను.

ఒకవేళ నా కొడుకు నా దగ్గర కాక అక్కడికి ఆమడ దూరంలో వాళ్ళ నాన్న పనిచేస్తున్న బ్యాంకులో వాంతి చేసుకుంటే ఏమయ్యేది?

“రూమ్ కడిగేసి శుభ్రం చెయ్యండి సార్, వాంతి చేసుకున్నది మీ పిల్లవాడేగా,

అదిగో చీపురు, ఇదిగో నీళ్ళు- అనే మాట అతని పైవాడు కానీ, కింది వాడు కానీ అనగలడా?

అంతేకాదు తమ పిల్లల్తో బాటు బడికొస్తున్న టీచర్లు, పాఠాలు చెప్పడంతో బాటు అప్పుడప్పుడు ఇలాంటి పారిశుధ్యం పనులు కూడా చేయడం వల్ల ఆ మేరకు పనివాళ్ళకి తగ్గించిన కూలి డబ్బులు తల్లులకిస్తున్నారా? ఇవ్వదల్చుకోకపోతే ఇది ఈ ఏ నిబంధనావళి కిందికి వస్తుంది? అని అడగడం చాతకాని ఒక ఉదాసీన వాతావరణంలో వున్నాను. అంచేత నాకళ్ళకి నీళ్లొచ్చాయి. వట్టి నీళ్ళు. వృథా నీళ్ళు. ఏదో తప్పు చేసినట్టు బిక్కమొహం పెట్టుకున్న నా బిడ్డ కళ్ళనుంచీ అలాంటివే నీళ్ళు.

ఇద్దరు పిల్లలున్న నేను నా ఇంట్లో అలాంటివి, అంతకంటే మురికివీ అనేక పనులు చేస్తూ వుండచ్చు. కానీ సమాజం పరిధిలోకి వచ్చేసరికి ఒక గౌరవప్రదమయిన టీచర్ని కదా. అటువంటప్పుడు వందమంది పిల్లలకి పాఠాలు చెప్పిన ఆ చోటే తల వంచుకుని చీపురు పట్టుకోవడమేలా? కానీ పట్టుకున్నాను. నా మనస్తితిని అర్ధంచేసుకున్న టెన్తు క్లాసు ఆడపిల్లలిద్దరు గబగబా పరీక్ష రాసి వారిస్తున్నా వినకుండా బక్కెట్లతో నీళ్ళు తెచ్చి పోశారు. ఫినాయిల్ చల్లి గదంతా శుభ్రంగా కడిగేశాను. పోచయ్య అంతదూరాన బీడీ కాలుస్తూ అలాగే నుంచున్నాడు. ప్రిన్సిపాల్ ఫోన్లో బిజీగానే వున్నాడు. ఆడ టీచర్లు సానుభూతిగా నవ్వి వెళ్ళిపోయారు. మగ టీచర్లు అసలు మోహమే ఇటు తిప్పలేదు. ఎందుకంటే ఆ స్కూల్లో నాకంటే సీనియర్ టీచర్లు తమ పిల్లల్తో చేరినప్పుడు ఈ పని చేసే వుంటారు.. అలాంటి దృశ్యాల్ని చూసి చూసి అక్కడ తర్ఫీదయిన ఆడపిల్లలు తల్లులై రేపు తమ పిల్లలు ఎక్కడ మురికి చేసినా ఎవరూ చూడకుండా పమిట చెంగుతో తుడిచి శుభ్రం చేసేస్తారు. అలా శుభ్రం చెయ్యడమే నిఖార్సాయిన తల్లితనం అని జనరల్ బాడీ మీటింగుల్లో కూడా చెబుతారు. ఇంత జరిగాక నేనింక అక్కడ పని చెయ్యలేకపోయాను.. ఆ మర్నాడే ఉద్యోగానికి రిజైన్ చేసి వచ్చేశాను. ఈ మాత్రానికేనా అని గొణుక్కున్నారు కొందరు. తర్వాత ఏదో ఫంక్షన్ లో ఆ ప్రిన్సిపాల్ నా భర్తని కలిసినప్పుడు ఒక కామెంట్ చేశాడ్ట. "నిర్మల గారు వర్క్ బానే చేస్తారు గానీండి, బొత్తిగా ఎడ్జస్టింగ్ మెంటాలిటీ లేదు" అని.

ఆనాటి నుంచీ ఇప్పటివరకూ అందర్నీ అడుగుతున్నాను. ఎడ్జస్టింగ్ మెంటాలీటి అంటే ఏమిటి? ఘన పదార్ధమా? ద్రవపదార్ధమా? లేక వాయు పదార్ధమా?

5.6.1987

# దేహాలు- దేవాలయాలు - కొన్ని సందేహాలు

మధ్యప్రదేశ్ లో ఏడేళ్ళ బాలికపై అత్యాచారానికి పాల్పడిన మదన్ లాల్, కోర్టులో శిక్ష ఖరారయన తర్వాత బాధితురాలి తల్లిదండ్రులతో రాజీ పడ్డాడు. దీంతో నిందితునికి విధించిన ఏడాది జైలు శిక్ష సరిపోతుందంటూ హైకోర్టు అతని విడుదలకు ఆదేశించింది. (నేరస్తుల పట్ల కోర్టులు ఎంత సహోదర ప్రేమతో వుంటాయో మనకి తెలుసు.). దీనిపై మధ్య ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు మాత్రం అత్యాచార కేసుల్లో రాజీ ఒప్పందాలు చెల్లవని, మెతక వైఖరిని ప్రదర్శించడం, నిందితులను రాజీకి అనుమతించడం తీవ్రమైన తప్పిదమని, అది మహిళల ఆత్మగౌరవాన్ని కించపరచడమే అని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఇంతవరకు బానే వుంది.. మధ్యప్రదేశ్ హైకోర్టు కంటే మన సుప్రీం కోర్టు కొంచెం విచక్షణతో వ్యవహరించింది అని సంతృప్తి కూడా కలిగింది.

ఎందుకంటే అవిచ్చినంగా నడుస్తున్న కాఫ్ పంచాయితీల దగ్గర నుంచి సుప్రీంకోర్టు దాకా అత్యాచార బాధితురాల్ని, ఆ నేరం చేసినవాడు లగ్గం చేసుకుంటే న్యాయం జరుగిపోయినట్టే భావిస్తాయి.. "గృహ ప్రవేశం" సినిమా ఇదే కధా వస్తువుతో 350 రోజులు ఆడింది. కర్తవ్యం లో ఒక పోలీసు ఆఫీసరు దగ్గరుండి బాధితురాలికి

నేరస్థుడితో పెళ్లి జరిపిస్తుంది. చివరికి ఆ పెళ్ళిలో కూడా నేరస్థుడూ అతని తండ్రీ కలిసి, బాధితురాలిపై హత్యా ప్రయత్నం చేస్తారు. అయినా ఆ ప్రయత్నాన్ని ఆ పోలీసు ఆఫీసరు తెలుసుకుని కాపాడి "కలకాలం కలిసి వుండ "మని ఆశీర్వదిస్తుంది. ఇలాంటివన్నీ జనం కళ్ళకి అసహజంగా కాకుండా ఆనందబాష్పాలతో తిలకించేలా చెయ్యడానికి ఒక భావజాలం వుంది. మధ్యయుగాలకు చెందినట్టు కనిపించే ఈ భావజాలాన్ని చదువూ వివేకం, సాంకేతిక పరిజ్ఞానం ఏవీ మార్చలేవు. అందుకు ఒక చిన్న ఉదాహరణగా పై కేసులో సంచలనాత్మక తీర్పు ఇచ్చిన న్యాయాకోవిదులు అత్యాచారాల గురించి ఇచ్చిన నిర్వచనాన్ని చెప్పుకోవచ్చు. ఏమిటా నిర్వచనం?

"అత్యాచారానికి పాల్పడటం అంటే దేహాన్ని దేవాలయంగా భావించే మహిళపై దాడి చేయడమే. దానివల్ల అత్యాచార బాధితులు మాన మర్యాదలు కోల్పోతారు. అది వారి ప్రాణాలను హరించడంతో సమానం. '

తీర్పు హేతు బద్ధంగానూ, నిర్వచనం దానికి భిన్నంగా వుండటానికి వెనకగల కారణం నాకు చాలా ఆసక్తి కలిగించింది. పై మాటలు స్త్రీలందరి దేహ దేవాలయాల శీల సంపదల గురించి న్యాయమూర్తులుంగారు అంటున్నప్పటికీ సందర్భం మాత్రం ఏడేళ్ళ పాప గురించే. అదృష్టవశాత్తూ అంత లావు భావజాలం ఆ పాపకెలాగూ అర్థంకాదు. ఆ మాటకొస్తే తన శరీర నిర్మాణమేమిటో, ఎవడు ఎందుకు దాడిచేశాడో, అసలు ఏం జరిగిందో తెలుసుకునేంత వయసుకూడా లేదు. తెల్సిందల్లా భయానకమైన దాడి, గాయాలు, రక్తస్రావం. మానసికంగా ఒక దిగ్భ్రాంతి. ఇలాంటప్పుడు తక్షణమే వైద్యం జరగాలి. వైద్యమంటే ఆస్పత్రిలో వుంచి కట్టుకట్టడం మాత్రమే కాదు. ఏ పరిసరాలు, సంఘటనలు, మనుషులు ఆమెని అంత భీతావహురాల్ని చేశాయో, దానికి దూరంగా వుంచడం,. కుటుంబం,సమాజం ఆమె పట్ల సానుభూతి కాకుండా, సహానుభూతి కలిగివుండటం,. క్రమక్రమంగా ఆమె మనసుని చదువు వైపు, ఆటలపాటలవైపు, ఆమె కిష్టమయిన మరో వ్యాపకం వైపు మళ్ళించడం- ఇవి కదా జరగాలి.. వీటివల్ల మాత్రమే బాధితురాలు కోలుకోవడానికి అవకాశం వుంది. అదే సమయంలో నేరస్థుడికి చట్టబద్ధంగా విచారణ, రిమాండ్, శిక్షలాంటివన్నీ జరగాలి. అంటే అటు ఆ పాపకి జరిగిన అన్యాయానికి, ఇటు నేరస్థుడి చర్యకీ చట్టం బాధ్యత వహించాలి. కానీ వాస్తవంలో ఏం జరుగుతోంది? అదే నేరస్థుడ్ని తెచ్చి బాధితురాలితో పెళ్ళి చెయ్యడం జరుగుతోంది. దీనివల్ల ఒకసారి అత్యాచారం చేసినవాడికి జీవితాంతమూ అత్యాచారం చెయ్యడానికి బోనస్ లాంటిది దొరుకడంలేదూ. తమ బిడ్డకు జరిగిన అన్యాయానికి పోరాటం చేయాల్సిన బాధిత కుటుంబానికి నేరస్థుడే మీసాలు తిప్పుతూ అల్లుడవుతాడు. ఎటువంటి శిక్షా, పరివర్తనా

లేకుండా అటువంటి నేర ప్రవృత్తి గలవాడిని ఇంటిలో పెట్టుకోవడం వల్ల ఆ కుటుంబంలో ఇతర బాలికలకు, స్త్రీలకు రక్షణ కరువయ్యే ప్రమాదం లేకపోలేదు.. బాధితురాలు సైతం అతన్ని ప్రేమిస్తూ, సేవలు చేస్తూ, వారసుల్ని కనివ్వాలి. ఇంత రోతను భరించినా సరే, ఆమె ప్రాణానికి రక్షణ వుందో లేదో తెలీదు. అప్పుడు గృహహింస బాధితురాలి చిట్టాలో ఆమె పేరు నమోదవుతుంది. ఇన్ని చట్ట విరుద్ధ, అప్రజాస్వామ్య, పౌరుష హీన చర్యలన్నిటికీ సదరు స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధతో అల్లిన భావజాలమే కారణం.

ప్రస్తావన కోసం మళ్ళీ నిర్వచనాన్ని ఒకసారి లోతుగా పరిశీలిద్దాం.

స్త్రీలు తమ శరీరాల్ని దేవాలయాలుగా భావిస్తారని సామాజం భావిస్తుందిట.. ముస్లిం స్త్రీలయితే మసీదులుగా, క్రైస్తవ స్త్రీలయితే చర్చీలుగా భావించుకోవచ్చు. పోనీ, కాస్సేపు నిరర్ధకమయిన ఈ పోలికతోనే ఆలోచిద్దాం. మామూలుగా దేవాలయాల్లో ఒక పశువు బురదకాళ్లతో అడుగుపెడితే ( రేపిస్టుని నోరులేని పశువుతో పోల్చడం కూడా నా కిష్టంలేదు) ఏం చేస్తారు? అప్పుడు ఆ ప్రాంతమంతా శుద్ధి చేసి సంప్రోక్షం చేస్తారు. దాంతో పవిత్రత తన్నుకుంటూ వచ్చి తీరుతుంది.. కానీ స్త్రీల విషయంలో ఒకసారి పోయిన పవిత్రత మళ్ళీ రాదు. కాబట్టి ఎవడైతే నేరం చేశాడో వాడే ఆమెని చేపట్టాలి. అలా చేపట్టేలోపు ఆమె మాన మర్యాదలు ప్లస్ ప్రాణం కూడా పోయినట్టే భావించుకోవాలి. ఎవడైనా చేపట్టిన తర్వాత అలా భావించనవసరం లేదు. తాళి కట్టిన తుచ్ఛుడే రక రకాలుగా భావిస్తాడు కనక.

అయ్యా, బాబూ, మేము మీ సాటి మానవులం, మీరు ఆపాదిస్తున్న దైవత్వాలూ, పవిత్రతలూ వద్దే వద్దు. రాజ్యాంగం మాకు ప్రసాదించిన హక్కుల మీద ఎవరైనా దాడి చేసినప్పుడు సకాలంలో స్పందించండి, చాలు- అని మహిళలు ఎప్పటినుంచో తల బాదుకుంటున్నారు. అది మాత్రం జరగడంలేదు.

# మాటల్లో కనిపించని మీటలున్నాయి

మాట్లాడే ప్రతిమాట వెనకా, మన దృక్పథం కనిపిస్తుంది. బాలు అని నాకో మంచి రచయిత మిత్రుడున్నాడు.

“ఏం సార్ ఏంటి సంగతులు” అని తన ధోరణిలో చాలా అభిమానంగా పలకరిస్తాడు. ఈ సార్ అనే పదానికి జండర్ లేదు. ఆడవాళ్ళని, మగవాళ్ళని, పిల్లల్ని, పెద్దల్ని అందరికీ సంబంధించిన ఉమ్మడి పిలుపు అది.

మేడమ్ అనే మాటగాని, పోనీ మనిషి పేరుగానీ, ఆయనకెప్పుడూ గుర్తుండవట! తనకి స్నేహితులుగా వుండదల్చుకున్నవారు ఈ నియమానికి లోబడే వుంటారు. ఒకసారి ఏదో పనుండి ఆంధ్రజ్యోతికెళ్ళి వస్తూ లక్డీకాపూల్ దగ్గర దిగి అక్కడ వున్న షాపుల్లో మా తమ్ముడి పుట్టిన్రోజు కానుకగా మంచి చొక్కాలాగూ కొనడం కోసం తిరుగుతున్నాను. అనుకోకుండా బాలూ కూడా షాపింగు పనిమీద అక్కడికి వచ్చాడు. షాపువాడు చూపించిన రంగులు నచ్చక గుట్టలకొద్దీ బట్టలు వెతుకుతున్నాను.

“ఏం సార్, మీ స్త్రీవాదులకు కూడా తమ్ముడంటే ఇంత ప్రేముంటుందా” అన్నాడు ఆశ్చర్యంగా. నేను దిగ్భ్రాంతిలో పడ్డాను.

“స్త్రీవాదులు తమ్ముళ్ళని ద్వేషిస్తారని ఎవరు చెప్పారు?” అనడిగాను.

“అహ, అలా అనుకున్నాను. అయితే మీరు వేరు మీ రచనలు వేరు” అని తీర్మానించాడు.

ఏ కారణంలేని ఈ రకం ఆరోపణలు తరచుగానే మనం ఎదుర్కోవాల్సి వస్తూ వుంటుంది.

ఏవాదులయినా మానవసంబంధాలు ధ్వంసం కావాలని ఎప్పుడూ కోరలేదు. మానవ సంబంధాల్లో వుండే అధికారాన్ని ప్రశ్నిస్తున్నారు.

కానీ మనల్ని “ఫెమినిస్టులుగా కాక మనుషులుగా చూళ్ళేరా” అనే ప్రశ్న అడుగుతామని, అడగాలని ఎక్కువమంది ఎదురుచూస్తారు. ఈ ప్రశ్న ఎంత

విసిగిపోయిన సందర్భంలోంచి వచ్చినా సరే, అది ఆశించిన వాడికి విజయమే అవుతుంది. ఫెమినిస్టులా చూడొద్దు అంటే మామూలు సంప్రదాయ పెత్తన పరిభాషలోనే చూడమని అర్థం.

"నన్ను భార్యగా తప్ప మనిషిగా చూడలేరా?"

"తల్లిగా తప్ప మనిషిగా చూడలేరా"

అని ఫెమినిజంతో సంబంధంలేని ఏ స్త్రీలయినా అడుగుతారు.. అంటే హక్కులూ, ఇష్టాయిష్టాలూ వున్న సాటిమనిషిగా చూడమనే అర్థం. సారాంశంలో ఫెమినిస్టులు అడుగుతున్నది అదే. ఆడవాళ్ళ గుంపుకి ప్రమీలా రాజ్యం, ఆగ్రహానికి అలక, కోరికకి కులుకు అంటూ జనం పెడుతున్న పేర్లు ప్రత్యేకమైన దృక్పధానికి సంబంధించినవే.

సాధారణంగా మనల్ని ఆఫీసులోనూ, బైటా, 'ఏమ్మా' అంటారు. పేరు చివర ' గారు' చేర్చి మనం వాళ్ళని మర్యాదగా పిలుస్తున్నప్పుడు ఇలా అమ్మ, బొమ్మా అనడం చిరాగ్గానే వుంటుంది. కానీ అది చెప్పలేకపోతాం.

'అమ్మా' అని మనం బైట ఎవర్ని అంటాం? మనకంటే వయసులో కానీ స్థాయిలో కానీ చిన్నవాళ్ళని మాత్రమే అనగలుగుతాం. సాధారణంగా పేరు పెట్టి పిలవడమే మర్యాదని మనకి తెలుసు. సాటి వాళ్ళని గాని పెద్దవాళ్ళని గాని పిలుస్తున్నప్పుడు ఆ పదాలు బావుండవు.. కానీ మనల్ని అన్ని స్థాయిల్లోనూ, వయసుల్లోనూ అమ్మా అనే పిలుస్తారు. అదే స్థాయి భాషలో తిరిగి మనకంటే పెద్ద స్థాయిగాని సమస్థాయిగాని మనిషిని 'అయ్యా' అనో 'అన్నా' అని పిలిచి చూడండి. నచ్చనట్టే మొహం పెడతారు. అంటే మగవాడెప్పుడూ బైట సాంఘిక స్థాయిలోనే గుర్తించబడాలని అనుకుంటాడు.

'అమ్మా' అనే పిలుపు ఒక భావజాలానికి సంబంధించినది మాత్రమే. ఈ పిలుపువల్ల యిచ్చామనుకుంటున్న గౌరవానికి, మనం ఆశిస్తున్న గౌరవానికి చాలా తేడా వుంది. వాస్తవంగా దక్కుతున్న హక్కులకి, సామాజిక హోదాకీ మధ్య చాలా అగాధం వుంటుంది. ఈ అగాధాల్లో మునకలు వేసే సహనం మనకింకా వుందా?

నవంబరు 1, 2006

# ప్రచురించిన రచనలు

**కవితా సంకలనాలు**

1. సందిగ్ధ సంధ్య 1988
2. నడిచే గాయాలు 1990
3. బాధా శప్తనది 1994
4. మల్టీనేషనల్ ముద్దు 2001
5. నివురు 2012
6. కొండేపూడి నిర్మల కవిత్వం 2012

**కథా సంకలనాలు**

1. శత్రుస్పర్శ 1998
2. తరగని దూరం 2018

**కాలమ్స్**

1. మృదంగం 2018

---

# అందుకున్న గౌరవాలు, పురస్కారాలు

తాపీ ధర్మారావు అవార్డు - 1988

ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు - 1989

నూతలపాటి గంగాధర అవార్డు - 1990

కుమారన్ ఆశాన్ నేషనల్ అవార్డు - 1990

దేవులపల్లి కృష్ణశాస్త్రి అవార్డు - 1993

బి.ఎన్. రెడ్డి సాహితీ అవార్డు - 1994

ఎస్.బి.ఆర్. అవార్డు - 1994

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యలయం అవార్డు - 1999

రంగవల్లి స్మారక అవార్డు ఫర్ బెస్ట్ జర్నలిస్ట్ - 2001

లాడ్లీ మీడియా బెస్ట్ జండర్ సెన్సిటివ్ అవార్డు - 2011